06-09Pg1exHMNWJQEV VJA_06-09Pg1exHMNWJQEV.qxd 9/6/2025 12:42 AM Page 1

సాహితీ గత వారం ఖుల్లా పై విన్యాస్
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ
epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
విజయవాడ

ఎన్డీయె కూటమిలో తేలని సర్దుబాట్లు
ముంబయి మహానగరానికి మానవ బాంబుల ముప్పు
9లో

: fb.com/vaartha Digital
Published from Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Khammam, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
6-9-2025 శనివారం సంపుటి: 31 సంచిక: 216 పేజీలు: 12వెల: 6.50



శుక్రవారం న్యూఢిల్లీలో ప్రధాని మోడీతో భేటీ అయిన మంత్రి లోకేష్

## ప్రధాని మోడీతో మంత్రి లోకేష్ భేటీ

### రాష్ట్రంలో పెట్టుబడుల సాధనకు సహకరించాలని వినతి

**విజయవాడ,సెప్టెంబరు5,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రధాని నరేంద్ర మోడీతో రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. రాష్ట్రంలో పెట్టుబడుల ఆకర్షణకు సహకారం అందించాలని కోరారు.ఏపీలో సెమీ కండక్టర్ యూనిట్ మంజూరు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు.రాష్ట్రంలో ఐటి,ఎలక్ట్రానిక్స్ పరిశ్రమల స్థాపనకు చేయూత అందించాలని >>2

## గురువు స్ఫూర్తితో ముందుకు

**విజయవాడ,సెప్టెంబరు5,ప్రభాతవార్తప్రతినిధి:** పిల్లల్లోవిజ్ఞాన జ్యోతులు వెలిగిస్తున్న వారందరికీ సీఎం చంద్రబాబు అభినందనలు తెలిపారు. విజయవాడ ఏ కన్వెన్షన్‌లో గురుపూజోత్సవ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్, సత్యకుమార్ యాదవ్ లతోపాటు ఇతర నేతలు పాల్గొన్నారు. విద్యాశాఖ ఏర్పాటు చేసిన ఎగ్జిబిట్ బెస్ట్ ప్రాక్టీసెస్ విధానాలను సీఎం పరిశీలించారు. పోటీ పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయాలని మంత్రి లోకేశ్ కు సీఎం సూచించారు. విద్యార్థులు జాతీయ విద్యాసంస్థల్లో అడ్మిషన్లు సాధించేలా తీర్చిదిద్దాలని సీఎం ఆదేశించారు. ఎన్ ఐఆర్ ఎఫ్ ర్యాంకింగ్‌లో ఆంధ్రవర్సిటీకి 4వ ర్యాంకు రావడం శుభపరిణామమన్నారు, ఇలాంటి ర్యాంకులు మరిన్ని రావాలని ఆకాంక్షించారు. అలానే మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ సందర్భంగా నెలకొల్పిన గిన్నిస్ రికార్డు సర్టిఫికెట్‌ను నిర్వాహకులు ముఖ్యమంత్రికి అందించారు. గురుపూజోత్సవం చాలా పవిత్రమైన కార్యక్రమమని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. విజయవాడలో ఏ సమావేశ ప్రాంగణంలో దివంగత భారత రాష్ట్రపతికి విగ్రహానికి నివాళి అర్పించారు.జ్యోతి ప్రజలన అనంతరం మాట్లాడుతూ తల్లిదండ్రుల తర్వాత మనం గుర్తు పెట్టుకునేది ఉపాధ్యాయులనే అని, అలాంటి వారిని జీవితంలో ఎప్పుడూ మరిచిపోలేమని అన్నారు. విద్యార్థి



శుక్రవారం విజయవాడలో జరిగిన ఉపాధ్యాయ దినోత్సవంలో ప్రసంగిస్తున్న చంద్రబాబు. చిత్రంలో మంత్రులు సత్యకుమార్, లోకేష్ తదితరులు

విజ్ఞానంతోపాటు లౌకికం కూడా పెంపొందించుకోవాలి

పిల్లలకు పుస్తకాల బరువు తగ్గించాం

ఆంధ్ర వర్సిటీకి 4వ ర్యాంక్ శుభపరిణామం

నేను నిత్యవిద్యార్థిని..రోజూ నేర్చుకుంటా: సిఎం చంద్రబాబు

దశలో పిల్లల్లో స్ఫూర్తిని కలిగించేది, అలానే మనలో ఉన్న నైపుణ్యాన్ని గుర్తించి బయటకు తీసేది గురువేనని తెలిపారు. భక్తవత్సలం అనే ఉపాధ్యాయుడు నా జీవితంలో స్ఫూర్తి నింపారని, నేను నిత్య విద్యార్థిని ప్రతిరోజు ఏదో ఒకటి నేర్చుకుంటానని సీఎం వివరించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవితం మనకు ఆదర్శప్రాయమని చెప్పారు. రాధాకృష్ణన్ రేణిగుంట పాఠశాలలో టీచర్‌గా, ఏయూలో ఆచార్యుడిగా పని చేశారని అన్నారు. గత ఏడాది బుడమేరు వరదల కారణంగా గురుపూజోత్సవం జరుపుకోలేక పోయామని ఆవేదన వ్యక్తం చేసారు. 175 మంది ఉపాధ్యాయులు ఇచ్చిన సూచన, సలహాలతో వారి ఫొటోలతో పుస్తకాన్ని ముద్రిస్తామని వెల్లడించారు. సాధారణంగా రాజకీయ నాయకుల పిల్లలు చదువుకోరు కాని మా ఇంట్లో లోకేశ్ చదువు గురించి నా భార్య భువనేశ్వరి చూసేవారన్నారు.ఈ విషయంలో ఆ క్రెడిట్ ఆవిడదేనని సీఎం అన్నారు.విద్యను రాజకీయాలకు దూరం >>2


## తురకపాలెం ఘటనపై ప్రభుత్వం సీరియస్

అధికారుల అలసత్వంపై సిఎం మండిపాటు

వారం రోజులపాటు బాధితులకు ఆహారం, నీరు సరఫరా

నేడు రక్త, నీటి నమూనాల సేకరణకు 50 బృందాల రాక

**గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి, సెప్టెంబరు 5:** గుంటూరు జిల్లా తురకపాలెంలో 5 నెలలుగా చోటుచేసుకుంటున్న మహమ్మారితో మృతులపై రాష్ట్ర ప్రభుత్వం అధికారులతో సీరియస్ అయ్యింది. అయిదు నెలలుగా మహమ్మారి వెంటాడుతున్నా ఎందుకు అలసత్వం వహించారంటూ జిల్లా వైద్యఅధికారులపై ప్రభుత్వం మండి పడినట్టు సమాచారం. పదుల సంఖ్యలో చనిపోయినా పట్టించుకోరా. అంటూ అధికారులను ప్రభుత్వం తీవ్రంగా హెచ్చరించినట్టు తెలిసింది. తురకపాలెం ఘటన నివేదికపై సమీక్షించిన సిఎం చంద్రబాబు ముమ్మర చర్యలకు ఆదేశాలు జారీ చేశారు. బాధితులందరికీ తాము ఉన్నామంటూ ధైర్యం చెప్పాలంటూ వైద్యఆరోగ్యశాఖ మంత్రి ఆ గ్రామానికి వెళ్లాలని సిఎం ఆదేశించటంతో శుక్రవారం తురకపాలెంలో మంత్రి సత్యకుమార్ యాదవ్ పర్యటించి ఘటనపై ఆరా తీశారు. ఊరులోని అన్నివీధుల్లో పర్యటించి బాధితుల అభిప్రాయాలను తెలుసుకున్నారు.మహమ్మారి కబళించిన బాధిత కుటుంబాలకు వెళ్లిన సత్యకుమార్ వారిని ఓదార్చి పరామర్శించారు. మహమ్మారి ప్రబలటంపై కారణంపై నివేదికలకు ఆదేశించామని, త్వరలో రానున్న >>2



శుక్రవారం తురకపాలెంలో స్థానికులతో మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్





## 18 నుంచి అసెంబ్లీ

### 14,15న తిరుపతిలో మహిళా ఎమ్మెల్యేల జాతీయ సదస్సు

**విజయవాడ,సెప్టెంబరు 5,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీసమావేశాలు ఈ నెల 18వ తేదీ నుంచి జరుగబోతున్నాయి. ఈ మేరకు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చారు.అసెంబ్లీ సమావేశాలు18వతేదీ ఉదయం 9గంటలకు, కౌన్సిల్ సమావేశాలు ఉదయం 10గంటలకు మొదలవుతాయి. మొదటి రోజుసమావేశం అనంతరం ఉభయ సభల బిఏసిసమావేశాలు జరుగుతాయి. >>2

## సిట్ విచారణలో వైఎస్ అనిల్ రెడ్డి పిఎ

**విజయవాడ, సెప్టెంబరు 5,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ మద్యం కుంభకోణం కేసులో ప్రత్యేక దర్యాప్తు సంస్థ ( సిట్) శుక్రవారం కీలక పురోగతి సాధించింది. వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ సోదరుడు, ఆయనకు అత్యంత సన్నిహితు వైఎస్ అనిల్ రెడ్డి వద్ద పీఏగా విధులు నిర్వహిస్తున్న దేవరాజులను ఉన్నతాధికారులు శుక్రవారం సిట్ కార్యాలయానికి పిలిపించారు. మద్యం కుంభకోణం వ్యవహారంలో పలువురి పాత్రపై ఆయనకు ప్రశ్నలు సంధించి.. అతని నుంచి జవాబులు రాబడుతున్నట్లు తెలుస్తోంది. ఈ విచారణలో అతడు ఇచ్చే సమాచారం ఆధారంగా ఈ కేసు కీలక పురోగతి సాధిస్తుందని సిట్ అధికారులు భావిస్తున్నారు. అయితే ఈ మద్యం కుంభకోణంలో ఇప్పటి వరకు పలువురిని సిట్ అధికారులు విచారించారు. ఆ క్రమంలో 12 మందిని అరెస్ట్ చేసిన విషయం విదితమే. ఇక ఇదే కేసులో జగన్ ప్రభుత్వంలో డిప్యూటీ సీఎం, మంత్రిగా పని చేసిన నారాయణ స్వామిని సైతం సిట్ అధికారులు విచారించారు. ఈ సందర్భంగా ఆయన స్టేట్‌మెంట్‌ను వారు రికార్డు చేసుకున్నారు.జగన్ ప్రభుత్వం హయాంలో మద్యం విక్రయాల లావాదేవిలన్ని నేరుగా జరిగాయి. అంటే ఎక్కడ డిజిటల్ చెల్లింపులు అనేవి జరగలేదు. ఈ ప్రభుత్వంలో జే బ్రాండ్ మద్యం విక్రయాలకు తెర తీశారు. ఈ మద్యం తాగడం వల్ల అనేక మంది మృత్యువాత పడ్డారు. అలాగే పలువురు అనారోగ్యానికి గురయ్యారు. అంతేకాకుండా.. ఈ మద్యం విక్రయాల్లో భారీగా అవినీతి చోటు చేసుకుందంటూ ఆరోపణలు సైతం వెల్లువెత్తాయి. అసెంబ్లీ ఎన్నికల్లో కూటమికి ఓటరు పట్టం కట్టాడు. దీంతో చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం కొలువు తీరింది. అనంతరం మద్యం కుంభకోణంపై సిట్‌ను ఏర్పాటు చేసింది. ఈ కేసులో కీలక నిందితుడు రాజ్ కసిరెడ్డిను సిట్ అధికారులు అరెస్ట్ చేసి.. విచారించారు. అతడు ఇచ్చిన సమాచారం ఆధారంగా విశ్రాంత ఐఏఎస్ అధికారి ధనుంజయ్ రెడ్డి, వైఎస్ జగన్ ఓఎస్డీ కృష్ణమోహన్ రెడ్డితోపాటు బాలాజీ గోవిందప్ప తదితరులను అరెస్ట్ చేశారు. వీరికి బెయిల్ కోసం కోర్టులను ఆశ్రయిస్తున్నారు. కానీ వీరికి కోర్టు మాత్రం బెయిల్ మంజూరు చేయడం లేదు. దాదాపు రూ 3,500 కోట్ల మద్యం కుంభకోణం జరిగినట్లు తెలుస్తోంది. అదీకాక.. ఈ కేసు విచారణలో భాగంగా హైదరాబాద్ శంషాబాద్‌లో రూ. 11 కోట్ల నగదును స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఈ మద్యం కుంభకోణం ద్వారా సంపాదించిన నగదుతో హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో రాజ్ కసిరెడ్డి పలు ఆస్తులు కొనుగోలు చేసినట్లు గుర్తించి.. వారిని సైతం సిట్ అధికారులు జప్తు చేసింది.

## పెట్టుబడులకు మరింత ప్రోత్సాహం

**విజయవాడ,సెప్టెంబరు5,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో ఉపాధి,ఉద్యోగ అవకాశాల కల్పన కీలకంగా ప్రభుత్వం పెట్టుబడులకు ముందస్తు ప్రోత్సాహకాలు అందిస్తుందని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేసారు.నాయుడుపేటలో ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డు, కాపర్ క్లాడ్ లామినెట్ ప్లాంట్, ఈఎంఎస్ ప్లాంట్ ఏర్పాటు చేయనున్నారు. దీని కోసం సిర్మా ఎస్‌జీఎస్ టెక్నాలజీ లిమిటెడ్, దాని సంయుక్త వెంచర్లకు 26.70 ఎకరాల కేటాయించారు. రూ.1,595 కోట్ల ప్రతిపాదిత పెట్టుబడి పెడుతున్నారు. దీంతో 2,168 మందికి ఉద్యోగాలు లభించనున్నాయి. ఇంటిగ్రేటెడ్ అల్యూమినియం ఎక్స్‌ట్రూషన్ ఫెసిలిటీని ఏర్పాటు చేసేందుకు హిండాల్కో ఇండస్ట్రీస్ చేసిన ప్రతిపాదనకు తాజా మంత్రి మండలి సమావేశంలో ఆ మేరకు కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ నెలలోనే జరుగునున్న అసెంబ్లీ సమావేశాల్లో మంత్రిమండలిలో ఆమోదించిన పథకాలన్ని చట్టపరమైన ఆమోదం నిమిత్తం ప్రతిపాదిస్తున్నట్లు తెలిపారు.శుక్రవారం సీఎంవో ద్వారా అందించిన సమాచారంలో పెట్టుబడికి ముందస్తు ప్రోత్సాహకాలుగా రూ.586 కోట్ల అందచేయడం ద్వారా 613 మందికి ఉద్యోగాలు లభించనున్నాయని సీఎం చంద్రబాబు స్పష్టం చేసారు. ఈ సౌకర్యం ఆపిల్‌తో సహా ప్రపంచ సాంకేతిక సంస్థలకు నాణ్యత కలిగిన అల్యూమినియం ఉత్పత్తులను తయారు చేస్తుంది. తిరుపతి మండలం సెట్టిపల్లి గ్రామంలోని అందరికీ ఇళ్లు విధానం ప్రకారం ప్రతి ఫ్లాట్ యజమానికి కనీసం 2 సెంట్లు కేటాయించేందుకు 2019లో రెవెన్యూ శాఖ చేసిన సవరణ ఆమోదించారు. ఎక్సైజ్ చట్టాన్ని సవరిస్తూ కుష్ఠు వ్యాధి లేదా ఏదైనా ఇతర అనే పదాలను తొలగించేందుకు ఉద్దేశించి ముసాయిదా బిల్లుకు ఆమోదం.

ఉపాధి, ఉద్యోగావకాశాలే లక్ష్యం: సిఎం చంద్రబాబు

భవనాల గరిష్ఠ ఎత్తు 24 మీటర్లకు పెంపు

నాయుడుపేటలో ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డు ఏర్పాటు





రాష్ట్రంలోని 16 జిల్లాల్లోని ఏజెన్సీ ప్రాంతాల్లో నివసిస్తున్న వారికి దీపం2 పథకం ద్వారా 5 కిలోల ఎల్‌పీజీ సిలిండర్లు ఇస్తున్నారు. అయితే ఇక పై వీరికి 14.2 కిలోల గ్యాస్ సిలిండర్లు ఇచ్చేందుకు రాష్ట్ర మంత్రి మండలి నిర్ణయించింది. 5 కిలోల సిలిండర్లు ఉన్న లబ్ధిదారులకు ఇప్పటివరకూ 14.2 కిలోల సిలిండర్లకు ఇచ్చే రాయితీ అందలేదు. దీనిపై తాజాగా మంత్రిమండలి నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు.. దీని ద్వారా ఏజెన్సీ ప్రాంతాల్లోని 23,912 మందికి ప్రయోజనం కలుగుతుంది.ఏపీలో భవనాల గరిష్ఠ ఎత్తు పరిమితిని 18 మీటర్ల నుంచి 24 మీటర్లకు పెంచనున్నారు. ఈ మేరకు శాసనసభలో బిల్లు ప్రవేశపెడతారు. మంత్రిమండలిలో తీసుకున్న నిర్ణయాలను సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి విలేకరుల సమావేశంలో వెల్లడించారు. అందులో ముఖ్యమైనవి ఇలా ఉన్నాయి.

2025 జనవరి 1 లేదా ఆ తర్వాత రాజధాని అమరావతిలో విద్యా ఆరోగ్య సంరక్షణ సంస్థలకు భూమిని కేటాయించారు. అయితే వీటి అమ్మకం లేదా లీజు డీడ్ ఒప్పందాలను అమలు చేసే సందర్భంలో రీయింబర్స్‌మెంట్ ప్రాతిపదికన స్టాంపు డ్యూటీ చెల్లింపు నుంచి మినహాయింపు ఇచ్చే ప్రతిపాదన ఆమోదించారు. పారిశ్రామికాభివృద్ధి విధానం 2024- 29లోని ఎర్లీబర్డ్ పథకం కింద అదానీ విల్మర్ లిమిటెడ్, రామ్ షీ బయో ప్రైవేట్ లిమిటెడ్, బాలాజీ యాక్షన్ బిల్డ్‌వెల్, టైరోమర్ టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్, పట్టాభి ఆగ్రోఫుడ్స్‌లకు ప్రోత్సాహకాలు అందించేందుకు గతంలో చేసిన సిఫార్సులను ఎస్ఐపీబీ ఆమోదించింది.

స్పేస్ సిటీకి సంబంధించి తదుపరి నాలుగు ప్రధాన తయారీ ప్రతిపాదనలకు ఎకరానికి రూ.5లక్షలు కేటాయించారు. ఎర్త్ స్టోరబుల్ ఇంజిన్ టెస్ట్ ఫెసిలిటీ, క్రయోజనిక్ ఇంజిన్ టెస్ట్ ఫెసిలిటీ, క్రయోజనిక్ ఇంజిన్ టెస్ట్ ఫెసిలిటీ2 సదుపాయాలను ఈ స్పేస్ సిటీలో కల్పించనున్నారు. రూ.427 కోట్ల పెట్టుబడితో మదర్ డైరీ ఫ్రూట్, వెజిటెబుల్ ప్రైవేట్ లిమిటెడ్ ఏర్పాటు చేస్తారు. దీని ద్వారా 180 మందికి ఉద్యోగాలు లభించనున్నాయి.



## 9.5 లక్షల మె.ట ఎరువుల కేటాయింపు

### రబీసీజన్‌కు ఎలాంటి కొరతలేదు: మంత్రి అచ్చెన్నాయుడు

**విజయవాడ,సెప్టెంబరు5,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో యూరియాకు ఎటువంటి కొరత లేదని ఈ విషయంలో ఎటువంటి దుష్ప్రచారం నమ్మవద్దని ఏపీ వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేసారు.రాష్ట్రంలో యూరియా నిల్వలు, పంపిణీ, సరఫరాలపై క్రిష్ణా, ఎన్టీఆర్, శ్రీకాకుళం, బాపట్ల, విజయనగరం, కడప, ఏలూరు,శ్రీసత్యసాయి జిల్లాల కలెక్టర్లు, ఈ.ఓ స్పెషల్ సిఎస్ రాజశేఖర్, డైరెక్టర్ ఢిల్లీరావులతో టెలీ కాన్ఫరెన్స్ వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు నిర్వహించారు. యూరియా సరఫరా సమస్యలపై కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించి సమస్యలను అధిగమించాలని సూచించిన మంత్రి అచ్చెన్నాయుడు.భవిష్యత్ అవసరాల కోసం రబీ సీజన్ కు 9.5 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు ఇప్పటికే రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం కేటాయించిదని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్న మంత్రి అచ్చెన్నాయుడుఅధికారిక లెక్కలకు, గ్రౌండ్ లెవల్ లో ఉన్నటువంటి యూరియా నిల్వలకు తేడా లేకుండా పర్యవేక్షణ చేయాలని ఉన్నతాధికారులను ఆదేశించిన మంత్రి అచ్చెన్నాయుడు.జిల్లాలో ఉన్నటువంటి యూరియా నిల్వల గురించిన వివరాలను అత్యవసరంగా అందచేయాలని కలెక్టర్లను ఆదేశించిన మంత్రి అచ్చెన్నాయుడు..కిష్ణా, బాపట్ల, కడప, జిల్లాల్లో ఇబ్బందులు ఎక్కువగా వస్తున్నాయని వీటిపై త్వరితగతిన స్పందించి కలెక్టర్లు సమస్యలను పరిష్కరించాలని ఆదేశించిన మంత్రి అచ్చెన్నాయుడు.యూరియా నిల్వలు ఎక్కువగా ఉన్నటువంటి ప్రాంతాల నుండి డిమాండ్ ఎక్కువగా ఉన్న ప్రాంతాలకు యూరియా సరఫరా చేసే విధంగా కలెక్టర్లు చర్యలు చేపట్టాలి, రవాణా ఖర్చులను ప్రభుత్వం భరించేలా చర్యలు తీసుకుంటామన్న మంత్రి అచ్చెన్నాయుడు..గంగవరం, కాకినాడ పోర్టుల నుండి రాష్ట్రానికి రావలసిన 53 వేల మెట్రిక్ టన్నుల యూరియా సకాలంలో రాష్ట్రానికి చేరుకునే విధంగా పోర్ట్ అధికారులు, రైల్వే అధికారులతో రాష్ట్ర అధికారులు సమన్వయం చేసుకొని అనుకున్న సమయానికి యూరియా అందే విధంగా సమన్వయం చేసుకోవాలని తెలిపిన మంత్రి అచ్చెన్నాయుడు.సోషల్ మీడియాలో, వార్తా పత్రికల్లో వచ్చే తప్పుడు కథనాలపై స్పందించాలని, ప్రతిరోజు వాస్తవికత విషయాలను, యూరియా నిల్వల గురించి కలక్టర్లు మీడియాకు వివరించాలని ఆదేశించిన మంత్రి అచ్చెన్నాయుడు.



## సిఎం చంద్రబాబుకు కొత్త హెలికాప్టర్

**విజయవాడ,సెప్టెంబరు 5,ప్రభాతవార్తప్రతినిధి:** సీఎం చంద్రబాబు భద్రత దృష్ట్యా కొత్త హెలికాప్టర్‌ను వినియోగిస్తున్నారు. రెండు వారాలుగా ఇందులోనే జిల్లాల పర్యటనలకు వెళ్తున్నారు. ఇటీవలి వరకు వాడిన బెల్ తయారీ ఛాపర్ పాతది కావడంతో అధునాతన ఫీచర్లతో కూడిన ఎయిర్‌బస్ హెచ్160 మోడల్ హెలికాప్టర్‌కు మారారు. ప్రతికూల పరిస్థితుల్లోనూ ప్రయాణాలకు అనువుగా ఉంటుందని నిపుణులు దీన్ని ఎంపిక చేశారు. పాత ఛాపర్ ఎక్కువ దూరం ప్రయాణానికి పనికొచ్చేది కాదు. సీఎం ఏదైనా జిల్లాకు వెళ్లాలంటే ఉండవల్లి నివాసంలోని హెలిప్యాడ్ నుంచి ఛాపర్‌లో గన్నవరం విమానాశ్రయానికి చేరుకుని, అక్కడి నుంచి ప్రత్యేక విమానంలో వెళ్లాల్సిన ప్రాంతానికి సమీపంలోని ఎయిర్‌పోర్టుకు వెళ్లేవారు.

## రూ.65వేల కోట్లతో కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్లు

### అవసరమైన భూములు రిలయన్స్‌కు కేటాయించాలి: సిఎస్ విజయానంద్



**విజయవాడ,సెప్టెంబరు5,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో రిలయన్స్ ఆధ్వర్యంలో రూ.65 వేల కోట్లతో కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్లు ఏర్పాటుకు అవసరమైన భూములు త్వరితగతిన అప్పగించాలని జిల్లా కలెక్టర్లను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఆదేశించారు. సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ.. రిలయన్స్ సంస్థకు 9 జిల్లాల్లో 2.34 లక్షల ఎకరాల భూమిని అప్పగించాలన్నారు. వృధాగా పోతున్న వర్షపు నీటిని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకుని అన్ని చెరువులను పూర్తిగా నింపేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వర్షపు నీటి సంరక్షణ భూగర్భ జలాలు పెంపును కలెక్టర్లు బాధ్యతగా తీసుకోవాలని చెప్పారు. యూరియా, పరిశ్రమలు, గురుకులాలు, కెజిబివిలు తదితర అంశాలపై ఈ సమావేశంలో కలెక్టర్లకు సూచనలు ఇచ్చారు. రాష్ట్రంలో ప్రస్తుతం సరిపడి యూరియా అందుబాటులో ఉందని రైతులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ రైతులకు విజ్ఞప్తి చేశారు..మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు,భుగర్భ జలాలు,పియం కుసుమ్,కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్లాంట్లకు భూమి అప్పగించుట,స్వచ్ఛాంధ్ర అవార్డులు తదితర అంశాలపై గురువారం రాష్ట్ర సచివాలయం నుండి ఆయన జిల్లా కలెక్టర్లతో వీడియో సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా సిఎస్ మాట్లాడుతూ రాష్ట్రంలో రిలయెన్స్ సంస్థ ద్వారా ఏర్పాటు చేయనున్నకంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్లకు సంబంధించి మొదటి దశ కింద 9 జిల్లాల్లో 2లక్షల 34 వేల ఎకరాల భూమిని గుర్తించడం జరిగిందని ఆయా భూములను త్వరిత గతిన అప్పగించాలని కలక్టర్లను ఆదేశించారు.అనంతరం మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు,భూగర్భ జలాల పెంపు అంశాలపై మాట్లాడుతూ వృధాగా పోతున్న వర్షపు నీటిని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకునేందుకు అన్ని మైనర్ ఇరిగేషన్ ట్యాంకులను పూర్తిగా నింపేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు.

06-09pg2exHMWNJQE 2ND_06-09pg2exHMWNJQE.qxd 9/6/2025 12:40 AM Page 1



# ఈజ్ ఆఫ్ జస్టిస్ వ్యవస్థతోనే సత్వర న్యాయం

## మీడియేషన్, ఆర్బిట్రేషన్‌లతో వివాదాలకు పరిష్కారం

## విశాఖలో ఎడిఆర్ సెంటర్ ఏర్పాటుకు సిద్ధం



శుక్రవారం విశాఖలో జరిగిన ఇంటర్నేషనల్ మీడియేషన్ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ముఖ్యమంత్రి చంద్రబాబు

**విశాఖపట్నం, సెప్టెంబరు 5 ప్రభాతవార్త:** ఈజ్ ఆఫ్ జస్టిస్ వ్యవస్థతోనే సత్వర న్యాయం అందుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. ఈ వ్యవస్థలో మీడియేషన్, ఆర్బిట్రేషన్ ప్రక్రియలే ముఖ్య భూమిక పోషిస్తాయని అన్నారు. శుక్రవారం విశాఖలో జరిగిన ఇంటర్నేషనల్ మీడియేషన్ కాన్ఫరెన్సుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆల్టర్నేటివ్ డిస్ప్యూట్ రిజల్యూషన్ ద్వారా న్యాయం అందరికీ అందుబాటులోకి రావటంతో పాటు వేగంగా సమర్థవంతంగా చేరుతుందన్నారు. మీడియేషన్ అంశం భారత్ కు కొత్తకాదని తరాలుగా మనకు అందుబాటులో ఉందని తెలిపారు. పురాణాల్లో శ్రీకృష్ణుడు ఓ సమర్థవంతమైన మీడియేటర్ గా వ్యవహరించారని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. గతంలో మన పూర్వీకులు, గ్రామపెద్దలు సమర్థంగా మీడియేషన్ ప్రక్రియను నిర్వహించేవారని తెలిపారు. ముఖ్యమంత్రి మాట్లాడుతూ విశాఖపట్నంలో జ్యుడీషియల్, మధ్యవర్తిత్వ రంగాలపై చారిత్రాత్మక కాన్ఫరెన్స్ నిర్వహించటం సంతోషదాయకమని ప్రజాస్వామ్యంలో భారతీయ న్యాయవ్యవస్థ ఓ మూల స్తంభంలాంటిదన్నారు. రాజ్యాంగపరమైన హక్కుల్ని, చట్టాన్ని కాపాడే అత్యంత కీలకమైన వ్యవస్థ. నిబద్ధతకు, నిష్పాక్షి కతకు, పారదర్శకతకు పెట్టింది పేరు. కొన్ని సమయాల్లో కాస్త ఆలస్యమైనా న్యాయం దక్కుతుందనే నమ్మకం ప్రతీపౌరుడికీ ఉంది. భారత్ అత్యంత వేగంగా సంస్క రణల్ని అమలు చేస్తోందేన్నారు. గత ఏడాదిగా ఏపీలో వంద బిలియన్ డాలర్ల పెట్టుబడులు వస్తున్నాయి. ప్రతిష్టాత్మక సంస్థలు తమ కార్యకలాపాలు ఏర్పాటు చేస్తున్నాయి. కంపెనీలు, వ్యవస్థలు వస్తున్న నేపథ్యంలో వివాదాల పరిష్కారానికి మీడియేషన్ లాంటి ప్రత్యామ్నాయ న్యాయ వ్యవస్థలు అందుబాటులోకి రావాలి. ఆల్టర్నేటివ్ డిస్ప్యూట్ రిజల్యూషన్ సిస్టం రావాలి. సులభంగా ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు టెక్నాలజీని కూడా అందిపుచ్చుకోవాలి." అని అన్నారు. విశాఖలో ఏడీఆర్ ఎకో సిస్టం ఏర్పాటుకు సిద్ధంవిశాఖలో ఆల్టర్నేటివ్ డిస్ప్యూట్ రిజల్యూషన్ ఎకో సిస్టం ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి అన్నారు. పెరిగిపోతున్న వివాదాలు, కేసుల పరిష్కారానికి కొత్తగా కోర్టులు ఏర్పాటు చేయటంతో పాటు మీడియేషన్, ఆర్బిట్రేషన్ కు కొత్త వ్యవస్థలు రావాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇప్పటికీ చాలా మంది పౌరులు కేసులు దాఖలు చేసి కోర్టులకు వెళ్లటం అవమానంగా భావిస్తారని దీన్ని మీడియేషన్ ప్రక్రియ చక్కని పరిష్కారమని అన్నారు. దేశం అమలు చేస్తున్న సంస్కరణలు, కొత్త వ్యవస్థలు అందుబాటులోకి వస్తున్న నేపథ్యంలో వివాదాలు తగ్గించుకోవటమే ఆర్థిక వ్యవస్థకు కీలకం అని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. దానికి అనుగుణంగా వివాదాల పరిష్కారానికి ప్రత్యామ్నాయ వ్యవస్థలను రూపొం దించుకోవాల్సి ఉందన్నారు. ఈజ్ ఆఫ్ జస్టిస్ ప్రక్రియలో భాగంగా వర్చువల్ హియరింగ్స్, ఈఫైలింగ్, మొబైల్ అప్‌డేట్స్ లాంటి సాంకేతికతను అమలు చేయాల్సి ఉందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

ఏపిలో ఈ ప్రక్రియ చాలా అవసరంప్రస్తుతం ఏపీలో 650 మంది జడ్జిలు ఉన్నారు. కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు మరో 800 మంది న్యాయమూర్తులు అవసరముందని ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి దీరజ్ సింగ్ ఠాగూర్ అభిప్రాయపడ్డారు.ప్రస్తుతం మీడియేషన్ ప్రక్రియ చాలా అవసరం . మీడియేషన్ నిపుణులను తయారు చేసేందుకు 40 గంటల ట్రైనింగ్ అవసరం అవుతుందన్నారుమీడియేషన్ చేసే వారికి చాలా నైపుణ్యం ఉండాలి. దానిని కొలిచేందుకు ఓ ప్రత్యేకమైన సర్టిఫికేషన్ ఉండాలి ఆర్బిట్రేషన్ రంగంలోకి విశ్రాంత న్యాయమూర్తులు, బ్యూరోక్రాట్లు వస్తున్నారు. హానెస్ట్, డిస్హానెస్ట్ ఆర్బిట్రేటర్లు కూడా ఉన్నారు. దీనికో ప్రత్యేకమైన యంత్రాంగం ఉండాలని భావిస్తున్నారు. ఈ కార్యక్రమానికి సుప్రీం కోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ పీఎస్ నరసింహ, ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, ఇతర న్యాయమూర్తులు, న్యాయ నిపుణులు హాజరయ్యారు.

# 18 నుంచి అసెంబ్లీ

>> ఆ రోజు సమావేశాల ఏజెండా, ఎన్ని రోజులు సభలు జరగాలి అనే అంశంపై నిర్ణయం తీసుకుంటారు. ఈ సారి కూడా అసెంబ్లీ సమావేశాలకు హజరు కాబోమని ఇప్పటికే వైసీపీ అధినేత జగన్ చెప్పారు. అయితే, వరుసగా 60 అసెంబ్లీ పని దినాలు హజరుకానిపక్షంలో అనర్హత వేటు పడుతుందని ఇప్పటికే డిప్యూటి స్పీకర్ రఘురామకృష్ణంరాజు వైసీపీ నేతల్ని హెచ్చరించారు. తిరుపతిలో సెప్టెంబరు 14, 15 తేదీల్లో మహిళా ఎమ్మెల్యేలకు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఈ సమావేశానికి దేశంలోని అన్ని రాష్ట్రాల పరిధిలో ఉన్న వివిధ పార్టీలకు చెందిన సుమారు 300 మంది మహిళా ఎమ్మెల్యేలు సదస్సుకు హాజరు కాను న్నట్టు ఏపీ శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలో విలేకరులతో మాట్లాడుతూ వెల్లడించిన సంగతి తెలిసిందే.ఈ కార్యక్రమానికి తొలిరోజు సీఎం చంద్రబాబు, లోక్‌సభ స్పీకర్ హాజరవుతారు. సమావేశాల ముగింపు రోజున గవర్నర్ హాజరుకానున్నారని ఏపీ స్పీకర్ తెలిపారు. సదస్సుకు హాజరయ్యే ఎమ్మెల్యేలకు శ్రీవారి దర్శనం కల్పించించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సెప్టెంబరు 18 నుంచి శాసనసభ సమావేశాలు జరగుతాయని, ఎమ్మెల్యేలకు సమాచారం పంపించినట్టు అయ్యన్న పేర్కొన్నారు.

# అలిపిరి మెట్ల మార్గంలో 'కంచె' అవశ్యం

## హైకోర్టు ఆదేశాలతో నడకదారి భక్తుల భద్రతకోసం టిటిడి చర్యలకు అడుగులు



**తిరుమల,సెప్టెంబరు 5ప్రభాతవార్తప్రతినిధి:** "ఏడుకొండలవాడ గోవిందా...తిరుమలవాసా గోవింద"నామస్మరణతో భక్తితో కాలినడకన అలిపిరి మెట్లమార్గంలో తిరుమలకు చేరుకునే భక్తులకు పూర్తిస్థాయిలో రక్షణకల్పించాలని హైకోర్టు ఆదేశాలతో ఇప్పుడు తక్షణకర్తవ్యంపై టిటిడి ఆలోచన చేయాల్సిన అవసరం వచ్చింది. నడకమార్గంలో ఇరువైపులా ఇనుప "కంచె"ఏర్పాటుకు మూడునెలల్లో చర్యలు చేపట్టాలని స్పష్టం చేసింది. ఇందుకు జెఎసి కూడా ఏర్పాటుచేసుకుని తగిన విధంగా స్పందించాలని న్యాయస్థానం ఆదేశాలతో టిటిడి అధికారులు ,అటవీశాఖ వన్యప్రాణిసంరక్షణవిభాగం సంయుక్తంగా కంచె పై నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఈనెలలో ఏడుకొండల వేంకటేశ్వరస్వామి సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలు జరగనుండటం, 24వతేదీ సిఎం చంద్రబాబునాయుడు తిరుమలకు వస్తుండటంతో హైకోర్టు ఆదేశాలపై టిటిడి ధర్మకర్తలమండలి, అధికారులు చర్చించి తదుపరి కంచె ఏర్పాటుకు ఉపక్రమించనున్నారనేది తెలుస్తోంది. రెండుసంవత్సరాల క్రిందట అలిపిరి మెట్లమార్గంలో ఓ చిన్నారిని చిరుతపులి లాక్కెళ్ళి చంపితినిన దారుణ విషాద ఘటన తరువాత అలిపిరి నడకమార్గంలో కంచె శరణ్యమని భక్తులు,నిపుణులు సూచనలు చేశారు. అయితే అప్పటి టిటిడి పాలకమండలి అందుకు చర్యలు తీసుకునే దిశగా కార్యాచరణ సిద్దంచేసినా చివరకు వన్యప్రాణిచట్టం అంగీకరించకపోవడంతో ఆలోచనకు బ్రేక్ పడింది. ఇప్పుడు మళ్ళీ నడకమార్గంలో చిరుతపులులు, ఏనుగులు, ఎలుగుబంట్లు సంచారంతో భక్తులు భయపడుతున్నారు. భక్తులను చిరుతపులి గాయపరిచిన ఘటనలు ఉన్నాయి.దీంతో కాలినడక మార్గానికి ఇరువైపులా కంచె ఏర్పాటుచేయాలని హైకోర్టు న్యాయస్థానం ఆదేశాలతో టిటిడి ముందుకు కదలనుంది.

శేషాచలం అటవీప్రాంతంలో కొండలను విడదీసి కొన్ని ఏళ్ళక్రిందట నడకమార్గాలను ఏర్పాటుచేసిన టిటిడి ఇరువైపులా రక్షణకంచె విషయం అప్పట్లో అవసరం లేకపోయింది. ఇప్పుడు వన్యప్రాణులు యధేచ్ఛగా అడవులను వదలి జనసంచారంలోకి వస్తుండటంతో భక్తుల భద్రతపై పునరాలోచన చేయాల్సివస్తోంది. తిరుమలకు ఎంతో పవిత్రంగా,భక్తితో కాలినడకన వచ్చే భక్తులకు నడకమార్గాల్లో క్రూరమృగాల నుంచి పూర్తి రక్షణ కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలని హైకోర్టు ఆదేశించింది. సుమారు 8కిలోమీటర్లు దూరం దట్టమైన కొండల మధ్య ఉన్న అలిపిరి కాలినడక మార్గం మెట్లదారికిరువైపులా అటవీప్రాంతమే. మెట్లమార్గానికి రెండువైపులా ఎత్తయిన రక్షణ గోడలు లేకపోవడం, అడవికి ఆనుకునే ఉండటంతో ఎటువైపు నుండి ఎప్పుడు,ఎక్కడ ఎలా చిరుతలు, ఎలుగుబంట్లు భక్తులపై దాడిచేస్తాయో తెలియని భయం. ఈ నేపధ్యంలో భక్తుల రక్షణకు మెట్లమార్గంలో బలమైన ఇనుప"కంచే" ఏర్పాటుచేయాలనే ప్రతిపాదన హైకోర్టు ఆదేశాలతో ఆచరణకు రానుంది. గతంలో 2023లో చిన్నారిని చిరుతపులి చంపి తినడంతో భక్తుల రక్షణకు ప్రాధమికంగా చేతులకు "ఊతకర్రలు"ఇచ్చి పంపారు. తిరుమలకొండలు రిజర్వుఫారెస్టు ప్రాంతంలో ఉన్న కాలినడక మార్గాల్లో వన్యప్రాణుల సంచారం యధేచ్ఛగా ఉండేలా చూడటం అటవీశాఖ చట్టంలోని అంశం. అయితే అందుకు భిన్నంగా ప్రసిద్ద పుణ్యక్షేత్రం తిరుమలకొండకు దారులు పూర్తిగా దట్టమైన అడవిని చీల్చి మధ్యలో ఏర్పాటుచేసినవేకావడం విశేషం. దేవునిపై విశ్వాసంతో సాధారణరోజుల్లో 20వేలమంది వరకు భక్తులు నడకమార్గంలో తిరుమలకు వస్తున్నారు. తరచూ చిరుతలు కాలినడక మార్గాల్లో, ఘాట్‌రోడ్లలో భక్తులను వెంబడించడం, దాడిచేయడం,గాయాలతో విడిచిపెట్టడం జరుగుతున్నాయి. కంచే ఏర్పాటు చేస్తే భక్తులకు రక్షణ కల్పించవచ్చనేది హైకోర్టు ఆదేశాలు. శేషాచలంఅడవిలో వందకుపైగా చిరుతలు సంచరిస్తున్నా దాదాపు 10వరకు చిరుతలు ఇటు ఘాట్‌రోడ్లలో,కాలినడక మార్గాల్లో సంచరిస్తున్నాయనేది ఇటీవల తెలిసిన విషయం. అయితే నడకమార్గాల్లో పూర్తిస్థాయిలో ఏర్పాటుచేసిన ట్రాప్ సిసికెమెరాల నిఘాతో నాలుగు చిరుతలు మాత్రమే అడవిలో ఇటు ఘాట్‌రోడ్లు, అటు నడకమార్గాల వైపు సంచరిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికీ నడకమార్గంలో భక్తులకు భద్రత సిబ్బంది తోడుగా రక్షణకల్పిస్తున్నారు. భక్తులను గుంపులుగా అనుమతినిస్తున్నారు.

# గురువు స్ఫూర్తితో ముందుకు

>> గా ఉంచాం. గురువులు చూపించిన దారిలో నడవడం వల్లే తాను స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీలో చదువుకోగలిగానని మంత్రి నారా లోకేశ్ అన్నారు. పిల్లల జీవితాలను తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేనని, విద్యాశాఖలో ఏడాదిలో అనేక సంస్కరణలు తీసుకొచ్చామని తెలిపారు. అందరం కలిసి కట్టుగా ఆంధ్రా మోడల్ విద్యా వ్యవస్థను ప్రపంచానికి చాటుదామని మంత్రి స్పష్టం చేశారు. ప్రభుత్వ విద్యలో రాజకీయాలను దూరం పెట్టాలని సూచించారు. లీప్ మోడల్‌ను అందరం కచ్చితంగా అమలు



ఉత్తమ ఉపాధ్యాయురాలికి అవార్డు అందచేస్తున్న సిఎం చంద్రబాబు, మంత్రి లోకేష్

చేయాలని సూచించారు. అలానే మెగా పేరెంట్‌టీచర్ సమావేశాలు ఏర్పాటు చేశామని ఇంకా పిల్లలను యోగా, క్రీడలు, ఎన్‌సీసీ వైపు ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. అలానే కొన్ని పథకాలకి సర్వేపల్లి రాధాకృష్ణన్, డొక్కా సీతమ్మ పేర్లు పెట్టామని తెలిపారు. భారత మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవితం అందరికి ఆదర్శప్రాయమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. ప్రతి రోజు తాను ఏదో ఒకటి నేర్చుకుంటూనే ఉంటానన్నారు. విజయవాడలో ఏర్పాటు చేసిన గురుపూజోత్సవంలో ఆయన పాల్గొని ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు అందజేశారు. టీచర్లను జీవితంలో ఎప్పుడూ మరచిపోలేమన్నారు. తాను కూడా టీచర్ కావాల్సిందన్నారు. లెక్చరర్‌గా చేరాలని యూనివర్సిటీ వీసీ తనను కోరారని తెలిపారు. లెక్చరర్‌గా కాదు ఎమ్మెల్యేగా పోటీ చేస్తానని ఆయనకు తెలిపానని చెప్పారు. హైదరాబాద్‌ను నెంబర్‌వన్‌గా చేసేందుకు తాను ఎంతో కష్టపడ్డానని పేర్కొన్నారు. ప్రపంచంలో తెలుగు వారు నెంబర్ వన్‌గా ఉండాలన్నదే తన కోరిక అని తెలిపారు. ఐఐటీ కోచింగ్ విషయంలో చుక్కా రామయ్య కచ్చితంగా ఉండేవారన్నారు. సీఎం సిఫార్సు చేసినా సీటు ఇవ్వబోనని ఆయన నిక్కచ్చిగా చెప్పేవారని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేసుకున్నారు. అందుకే చుక్కా రామయ్య అంటే తనకు ఎంతో గౌరవం పెరిగిందని చెప్పారు. 10 వేలమంది దరఖాస్తు చేస్తే 100 మందికే ఐఐటీ శిక్షణ ఇచ్చేవారని.. అలా వందకు వంద మందినీ ఐఐటీకి ఆయన పంపేవారంటూ చుక్కా రామయ్యలోని విశిష్ట లక్షణాలను ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు సోదాహరణగా వివరించారు. ఇక రాష్ట్ర విభజన కంటే కూడా గత పాలకుల వల్లే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఎక్కువ నష్టం కలిగిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లలకు ఆస్తులు ఇవ్వడం కన్నా చదివిస్తే ఊహించనంత ఎత్తుకు ఎదుగుతారు. 2014-19 మధ్య రాష్ట్రం కోసం కష్టపడ్డాను.. కానీ ఆ తర్వాత రకరకాల కారణాల వల్ల ఓడిపోయాను.నేను రాజకీయాలపై ఫోకస్ పెట్టిన ప్రతిసారీ గెలిచాను. ఉద్యోగులు, టీచర్లు ఈ ప్రభుత్వం నుంచి ఏం ఆశిస్తున్నారో... అవన్నీ రానున్న రోజుల్లో అందించే బాధ్యత తీసుకుంటాం. రాష్ట్రాన్ని నెంబర్1గా చేసేందుకు అవసరమైన వసతులు కల్పించే బాధ్యత నాది... దాన్ని అందిపుచ్చుకునే బాధ్యత టీచర్లది. జీఎస్టీ సంస్కరణలతో ప్రజల జీవితాల్లో కేంద్రం మార్పులు తెచ్చిందని హర్షం వ్యక్తం చేశారు. 2047 నాటికి ప్రపంచంలోనే భారత్ నెంబర్ వన్ అవుతుందని సీఎం చంద్రబాబు విశ్వాసం వ్యక్తం చేశారు. దేశంలోనే ఏపీ నెంబర్‌వన్‌గా మారాలనేదే తన లక్ష్యమన్నారు. రానున్న 22 ఏళ్ల పాటు మనమంతా దృష్టి పెడితే ఇది సాధ్యమే అవుతుందని సీఎం చంద్రబాబు నాయుడు చెప్పారు.

# తురకపాలెం ఘటనపై ప్రభుత్వం సీరియస్

>> నమూనా ఫలితాల ఆదారంగా నివారణ చర్యలు చేపడతామని బాధితులకు భరోసా నిచ్చారు. అయితే సిఎం ఆదేశాలతో అధికార యంత్రాంగం ఆగ్రామంలో ముమ్మర చర్యలకు శ్రీకారం చుట్టింది. సిఎం చంద్రబాబునాయుడు తురకపాలెంలో పూర్తిగా మహమ్మారి అదుపులోకి వచ్చేంతవరకు నిత్యం వైద్యాధికారులు, ఇతర అధికారులు ఏరోజుకు ఆరోజు ఆగ్రామంలో పర్యటించి పరిస్థితిని సమీక్షిస్తూ బాధితులకు ధైర్యం చెప్పాలని కోరారు. బాధిత కుటుంబాలకు వారం రోజులపాటు రాష్ట్ర ప్రభుత్వమే ఆహారం మంచినీరు సరఫరా చేసేందుకు సన్నాహాలు చేస్తోంది. రక్త, నీటి నమూనాల ఫలితాలు వచ్చేంతవరకు బాధిత కుటుంబాలందరికీ ప్రభుత్వమే ఆహారం, మంచినీటి సరఫరా చేసేందుకు కసరత్తు చేస్తోంది. ఏ బాధిత కుటుంబం కూడా ఆహారం తయారు చేసుకోకుండా, ప్రభుత్వమే వారికి ఈ సౌకర్యం కల్పించేందుకు చర్యలు చేపట్టింది. వీధుల్లోని పారిశుద్ధ్య పనులను కూడా ముమ్మరం చేశారు. జిల్లా పంచాతీయ అధికారి సాయికుమార్ నేతృత్వంలో పారిశుద్ధ్య సిబ్బంది తురకపాలెంలో ప్రతివీధిలో పారిశుద్ధ్యం పనులను ముమ్మరం చేశారు. ఈ పనులు పూర్తిస్థాయిలో పూర్తయ్యేంతవరకు సిబ్బంది అక్కడే తిష్టవేసి దోమలు, బ్యాక్టీరియా నివారణకు బ్లీచింగ్, ఫినాయిల్ , కిరోసిన్ వంటి ద్రవాలతో నిర్మూలనా చర్యలు చేపడుతున్నారు. నీటి నిల్వలు, మురికి కుంటలను పూర్తిగా లేకుండా చేస్తూ బ్లీచింగ్, ఫినాయిల్‌తో పారిశుద్ధ్య పనులు ముమ్మరం చేశారు. అంతుచిక్కని ఈ మహమ్మారి ప్రబలటానికి వైద్యబృందం అన్వేషణ మొదలుపెట్టింది. రక్త, నీటి నమూనాలు సేకరణకు 50 వైద్యబృందాలు ప్రభుత్వ ఆదేశాల మేరకు నేడు తురకపలెం రానున్నాయి. ఈ వైద్యబృందాలు ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసి ప్రజల నుంచి రక్త నమూనాల సేకరణతోపాటు, మంచినీటి పథకాల నీటిని కూడా సేకరించే పనిలో నిమగ్నం కానున్నాయి. ఏది ఏమైనా పూర్తిస్థాయిలో ఈ మహమ్మారిని నిర్మూలించేవరకు అధికార యంత్రాంగం ముమ్మరంగా చర్యలు చేపట్టాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి నేతృత్వంలో అధికారులదరూ ఆ గ్రామంలో చర్యలు చేపట్టారు. ఈ గ్రామంలో ఒకరికి జ్వరం రావటం కాళ్లు, ఒళ్లునొప్పులు రావటం అకస్మాత్తుగా అనారోగ్యానికి గురవుతూ అయిదు నెలల కాలంలో 45 మంది మృత్యువాత పడినట్టు సమాచారం. ఈ మహమ్మారి బారినపడి మరో 300 మంది కోలుకుంటున్నారు. ఈ యొక్క మహమ్మారి ఎక్కువ దళితకాలనీలోనే ఎక్కువ మందిని పొట్టనపెట్టుకుంది. నీరు కలుషితం అయ్యిందని, నీరు తాగటం వల్లే దద్దర్లు, అనారోగ్యం ఏర్పడుతుందని గత ఏడాది అక్టోబర్‌లోనే గ్రామ ప్రజలు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసుకున్నా... ఫలితం శూన్యమైంది. కాలువ నుంచి వచ్చే మంచినీటిని సమీపంలోని క్వారీ గుంతల్లోకి తరలించి ఇక్కడ నుంచి ట్యాంకుల ఎక్కించి సరఫరా చేయటం జరిగింది. ఈ క్వారీ గుంత నాచుపట్టి పూర్తిగా కలుషితమై ఉన్నప్పటికీ అధికారులు ఆ నీటినే సరఫరా చేయటం వల్ల ఎక్కువ మందిని కోల్పోవాల్సి వచ్చిందంటూ గ్రామప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామం చుట్టూ వాటర్ ప్లాంట్‌లు ఉన్నా ధనికులకే ఆ నీరు సాధ్యమైందని, తాము డబ్బులు లేక కొనలేక ఈ నీటిపైనే ఆధారపడి తమ వారిని కోల్పోవాల్సి వచ్చిందంటూ బాధితులు 'ప్రభాతవార్త' ఎదుట కన్నీటి పర్యంతమయ్యారు. ఒకవైపు కలుషిత నీరు మరోవైపు పడకేసిన పారిశుద్ధ్యంతో ప్రబలిన మహమ్మారి తమకు తీరని అన్యాయం చేసిందని బాధిత కుటుంబాలు వాపోతున్నారు. ప్రభుత్వాధికారులు సకాలంలో స్పందించి ఉంటే తమకు ఈ దుస్థితి వచ్చేది కాదని ఆవేదన వ్యక్తం చేశారు. తమవారిని కోల్పోయిన తర్వాత ప్రభుత్వం స్పందించి పెద్దఎత్తున 3 రోజులుగా ముమ్మర చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు. తాము ఫిర్యాదు చేసిన నాడే అధికారులు స్పందించి ఉంటే ఇంత ఘోరం జరిగేది కాదని విలపించారు. ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా సత్వర చర్యటు చేపట్టాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి పర్యవేక్షణలో తురకపాలెంలో ముమ్మర చర్యలు కొనసాగుతున్నాయి.

# మేం సిద్ధంగా ఉన్నాం.. వైద్య సేవలు పొందండి

## తురకపాలెంవాసులకు ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ భరోసా

**గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి, సెప్టెంబరు 5:** రాష్ట్ర ఆరోగ్య , కుటుంబ సంక్షేమం , వైద్య విద్యా శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ , ఆరోగ్య , కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీర పాండ్యన్ , జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి, ప్రత్తిపాడు శాసన సభ్యులు బూర్ల రామాంజనేయులతో కలసి శుక్రవారం మధ్యాహ్నం గుంటూరు రూరల్ మండలం తురకపాలెం గ్రామంలో పర్యటించారు. అక్కడి వైద్యశిబిరానికి వెళ్లి అక్కడ ఇప్పటివరకు జరిగిన పరీక్షల నిర్వహణ వివరాలను వైద్యులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ, గుంటూరు జిల్లా డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి ఇప్పటి వరకు స్థానికులకు అందించిన వైద్య సేవల్ని మంత్రికి వివరించారు. శిబిరం వద్ద పరీక్షల కోసం వేచి ఉన్న స్థానికులతోను మాట్లాడారు. మీకు అండగా ప్రభుత్వం ఉంది. వైద్యుల ద్వారా చికిత్స పొందాలని, ఆందోళన చెందొద్దు అని వైద్యారోగ్య శాఖామంత్రి సత్యకుమార్ యాదవ్ తురకపాలెం గ్రామవాసులకు ధైర్యం చెప్పారు. స్వల్పంగా అనారోగ్యం ఉన్నప్పటికీ ఆసుపత్రుల్లో చికిత్స పొందేందుకు స్థానికులు సంశయిస్తున్న విషయాన్ని

గుర్తించిన మంత్రి సత్యకుమార్ నేరుగా ఓ ఇంటికి వెళ్లి భార్యాభర్తలకు నచ్చచెప్పారు. ఈ సందర్భంగా స్థానికులు ఆసుపత్రుల్లో ఉండి చికిత్స పొందేందుకు వెనకాడుతున్నారని, సాధారణ వైద్యంతో సరిపెడుతున్నారని మంత్రి గమనించారు. తానే స్వయంగా వైద్య శిబిరానికి అరకిలో మీటరు దూరంలో ఉన్న దంపతులు జి.శ్రీనివాసరావు, విజయకుమారి ఇంటికి మంత్రి సత్యకుమార్ నడుచుకుంటూ వెళ్లారు.

ఈ సందర్భంగా అనారోగ్యంతో ఉండి కోలుకుంటున్నానని చెప్పిన విజయకుమారితో గుంటూరు జీజీహెచ్ కు వెళ్లేందుకు ఏర్పాట్లు చేస్తామని, అధైర్యపడొద్దని భరోసా ఇచ్చారు. రక్త పరీక్షలతో పాటు అవసరమైతే స్కానింగ్ వంటి పరీక్షల్ని ఉచితంగా చేస్తారని, సంశయించవద్దని మంత్రి కోరారు. తురకపాలెం గ్రామ వాసులకోసం గుంటూరు జీజీహెచ్‌లో ప్రత్యేకంగా ఒక వార్డును ఏర్పాటు చేశామని తెలిపారు. ఇదే సమయంలో అక్కడున్న ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమీషనర్ వీరపాండియన్, జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి , ప్రజారోగ్య శాఖ సంచాలకులు డాక్టర్ పద్మావతి, శాసన సభ్యులు బూర్ల రామాంజనేయులు కూడా ఆసుపత్రిలో చికిత్స పొందాలని నచ్చచెప్పారు. గుంటూరు జీజీహెచ్ లో మరణించిన వారి కేస్ షీట్లను వైద్య నిపుణులతో పరిశీలన చేయించాలని డిఎంఇ డాక్టర్ రఘునందన్‌ను వైద్యారోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు ఆదేశించారు. టెలీకాన్ఫరెన్స్ ద్వారా శుక్రవారం ఆయన మాట్లాడారు.

# తురకపాలెం మరణాల సమాచారలోపంపై సమగ్ర విచారణ

## డిఎస్‌హెచ్ డాక్టర్ సిరి నేతృత్వంలో కమిటీ ఏర్పాటు

## బాధ్యులపై చర్యలు తప్పవు: మంత్రి సత్యకుమార్ యాదవ్

**గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి, సెప్టెంబరు 5:** శుక్రవారం మధ్యాహ్నం రాష్ట్ర ఆరోగ్య , కుటుంబ సంక్షేమం , వైద్య విద్యా శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ , ఆరోగ్య , కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీర పాండ్యన్ , జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మీ , ప్రత్తిపాడు శాసన సభ్యులు బూర్ల రామాంజనేయులతో కలసి గుంటూరు రూరల్ మండలం తురకపాలెం గ్రామంలో పర్యటించారు. తొలుత గ్రామంలో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంప్ ను పరిశీలించి అక్కడ బాధితులకు అందిస్తున్న వైద్య సేవలను , పరీక్షల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రాష్ట్ర ఆరోగ్య , కుటుంబ సంక్షేమం , వైద్య విద్యా శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ మెడియాతో మాట్లాడుతూ తురకపాలెం మరణాల వివరాల సమాచార లోపం జరగడంపై సమగ్ర విచారణ చేపట్టడం జరుగుతుందన్నారు. డియస్‌హెచ్ డాక్టర్ సిరి నేతృత్వంలో కమిటీ ఏర్పాటు బాధ్యులపై చర్యలు తప్పవన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూస్తామన్నారు. గుంటూరు రూరల్ మండలం తురకపాలెం గ్రామంలో అధికంగా నమోదైన మరణాల గురించిన వివరాలను ఉన్నతాధికారుల దృష్టికి వెంటనే తీసుకురావడంలో జరిగిన వైఫల్యాలు గుర్తించేందుకు, భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలన్నదానిపై ప్రభుత్వానికి సిఫారసు చేసేందుకు ఐఎఎస్ అధికారి డాక్టర్ అట్టాడ సిరి నేతృత్వంలో ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసినట్లు వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. ఈ కమిటీ నివేదిక ఆధారంగా విధుల నిర్వహణలో విఫలం చెందిన వైద్యారోగ్య సిబ్బందిపై శాఖాపరంగా చర్యలుంటాయని స్పష్టం చేశారు. విధుల నిర్వహణలో అలక్ష్యాన్ని ప్రదర్శించిన అన్ని స్థాయిల్లో ఉన్నవారిపై తప్పకుండా చర్యలుంటాయన్నారు. డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ గా ఉన్న(డియస్‌హెచ్) డాక్టర్ సిరి కమిటీ వారంలోగా ప్రభుత్వానికి నివేదిక అందిస్తుందని మంత్రి చెప్పారు. సాధారణ స్థాయిలో కంటే మరణాలు అధికంగా ఉన్నప్పుడు అన్ని స్థాయిల్లోని అధికారులకు వెంటనే సమాచారం అందేలా అధునాతన సాంకేతికతను వినియోగించుకోవడంపై కూడా ఈ కమిటీ ప్రభుత్వానికి సూచనలిస్తుందని చెప్పారు.

మరణాలకు దారితీసిన కారణాలపై లోతుగా విశ్లేషణ గుంటూరు రూరల్ మండలం తురకపాలెం గ్రామంలో శుక్రవారం నాడు మంత్రి సత్యకుమార్ యాదవ్ పర్యటించారు. ఉచిత వైద్య శిబిరంలో స్థానికులకు అందుతున్న వైద్య సేవలను నేరుగా పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ ఈఏడాది జులై నుంచి సెప్టెంబర్ తొలి వారం వరకు 23 మరణాలు జరిగాయి. అయినప్పటికీ క్షేత్రస్థాయి వైద్య సిబ్బంది ఉన్నతాధికారుల్ని అప్రమత్తం చేయకపోవడం దురదృష్టకరమన్నారు. మరణించిన వారిలో ఏడుగురు 70 ఏళ్లు దాటినవారున్నారు. మిగతా వారి వయసు సగటున 55 ఏళ్లవరకు ఉంది. మరణాలకు గల కారణాలపై లోతుగా విశ్లేషిస్తున్నామని, 14 రకాల వైద్య బృందాలు ఏర్పాటు చేశారని, వైద్య శిబిరాలు కొనసాగుతున్నాయని మంత్రి తెలిపారు. అందరి రక్త నమూనాలతో పాటు నీరు, మట్టి నమూనాలు కూడా తీసుకున్నారని చెప్పారు. జ్వరంబారిని పడినవారందరికీ రక్త పరీక్షలు చేస్తున్నారన్నారు. మైలోడియోసిస్‌పై సమాచారం లేదు మైలోడియోసిస్ బ్యాక్టీరియా ఉన్నట్లు వార్తలొచ్చాయని, అయితే ఇప్పటివరకు అందిన రక్తనమూనాల పరీక్షల ఫలితాల్లో అటువంటిది కనిపించలేదన్నారు. ఎలాంటి బ్యాక్టీరియా అనేది ఇంతవరకు అంతుచిక్కలేదన్నారు. కెమికల్, బయోలాజికల్ పరీక్షలు కూడా చేయిస్తున్నామన్నారు. బాధితులకు గుంటూరు జీజీహెచ్‌లో పూర్తిస్థాయిలో చికిత్స అందిస్తున్నామన్నారు. మరణాలకు రకరకాల కారణాలు చెబుతున్నారని అపరిశుభ్రత, కలుషిత నీరు వంటి కారణాలు చెబుతున్నారని మంత్రి పేర్కొన్నారు.

# ప్రధాని మోడీతో మంత్రి లోకేష్ భేటీ

>> విజ్ఞప్తి చేశారు. విద్యాప్రమాణాల మెరుగుదలకు రాష్ట్ర విద్యారంగంలో అనేక సంస్కరణలు అమలు చేస్తున్నాం, ఉన్నతవిద్యలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు మీ సహకారం, మార్గదర్శనం కావాలని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత 15నెలలుగా మీ సహకారంతో పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నాం, మీ నేతృత్వంలో వికసిత్ భారత్ 2047లో భాగస్వాములం అవుతామని అన్నారు. జీఎస్టీ సంస్కరణల ద్వారా దేశంలోని కోట్లాది పేద, మధ్య తరగతి ప్రజలకు ఉపశమనం కలిగించిన ప్రధాని మోదీజీకి మంత్రి లోకేష్ కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు సహకారం అందిస్తున్న ప్రధానికి ప్రత్యేకంగా ధన్యవాదాలు చెప్పారు. రాష్ట్రంలో గత కొంతకాలంగా నెలకొన్న వివిధ పరిణామాలను మంత్రి లోకేష్ వివరించారు. ప్రధాని మోడీ స్పం దిస్తూ రాష్ట్రాభివృద్ధికి అన్నివిధాలా సహకారం అందిస్తామని చెప్పారు. యోగాంధ్ర నిర్వహణపై రూపొందించిన కాఫీ టేబుల్ బుక్‌ను ఈ సందర్భంగా ప్రధానికి లోకేష్ బహుకరించారు.

## వారం - వర్జ్యం

06-09-2025, శనివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
భాద్రపద మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, శుక్లపక్షం
చతుర్దశి రా. 1.38
ధనిష్ఠ రా. 10.52
వర్జ్యం : తె.5.41-ఉ.7.12
దు.తె.5.56-ఉ.7.33
రాహుకాలం - ఉ.9.00-10.30

## వార్తాఫలం

**మేషం :** భూముల విషయంలో ఏర్పడిన వివాదాలు పరిష్కార దశకు చేరుకుంటాయి.

**వృషభం :** ఆరోగ్యం వాహనాల విషయంలో మెలుకువ అవసరం. సోదరుల కలయిక.

**మిథునం:** సంతాన విద్యా విషయంలో నూతన బాధ్యతలు చేపడతారు. శుభవార్తలు.

**కర్కాటకం :** సోదరి, సోదరులతో విభేదాలు తలెత్తుతాయి. వృత్తి, వ్యాపారాలు విస్తరిస్తారు.

**సింహం:** చిన్ననాటి మిత్రుల ద్వారా కీలక సమాచారం తెలుసుకుంటారు. వాహనసౌఖ్యం.

**కన్య :** పలుకుబడి కలిగిన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడతాయి. ప్రయాణాలు.

**తుల :** గృహం కొనుగోలు యత్నాలు ఫలిస్తాయి. సంఘంలో ఓ ప్రత్యేక గౌరవం పొందుతారు.

**వృశ్చికం:** ప్రముఖులతో పరిచయాలు ఏర్పడతాయి. కొత్త పెట్టుబడులకు అనుకూల సమయం.

**ధనుస్సు:** కోర్టు కేసులు పరిష్కారమవుతాయి. శుభకార్యాలలో బంధు మిత్రులను కలిసి ఆనందంగా గడుపుతారు.

**మకరం:** రాజకీయ, కళా రంగాల వారికి ప్రభుత్వం నుండి ఆహ్వానాలు అందుతాయి.

**కుంభం:** భూముల విషయంలో నూతన అగ్రిమెంట్లు చేసుకుంటారు. ఋణాలు తీరుస్తారు.

**మీనం :** కొన్ని అవకాశాలు అప్రయత్నంగా లాభిస్తాయి. భాగస్వామ్య వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# ఉపాధ్యాయుల్ని సత్కరించిన 'కోలా'



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్‌కుమార్

**శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 5 ప్రభాతవార్త :** శ్రీకాళహస్తిలోని బిజెపి కార్యాలయంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్‌కుమార్ శుక్రవారం గురుపూజోత్సవం సందర్భంగా ఉపాధ్యాయుల్ని సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిలో జీవనం ప్రారంభించిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ భారత దేశ రాష్ట్రపతి అయ్యారని ఉపాధ్యాయ వృత్తి ప్రధాన్యతను దేశ నలుమూలల చాటారని వివరించారు. అంతటి మహోన్నతమైన వ్యక్తి అన్నారు. సమాజంలో ఉపాధ్యాయులు ఎందరో మహోన్నత వ్యక్తులను తీర్చి దిద్దుతున్నారని వివరించారు. నేడు మనం ఉపాధ్యాయ దినోత్సవం జరుపుకుంటున్నామంటే అది ఉపాధ్యాయులకు ఇచ్చే గౌరవం అన్నారు. మన భవిష్యత్తును తీర్చి దిద్దే మొదటి వారు గురువులే అన్నారు. తల్లి దండ్రులు కలలు కంటే ఆ కలలను సాకారం దిశగా ప్రయత్నించే మహామహులు ఉపాధ్యాయులు అన్నారు. విద్యార్థిలోని ప్రతిభను గుర్తించి తీర్చిదిద్దే వారు ఉపాధ్యాయులన్నారు. ఒక నాడు విద్యకోసం మన పూర్వికులు ఆశ్రమాలకు వెళ్లె వారని నేడు ప్రభుత్వాలు ఎన్నో సదుపాయాలు కల్పిస్తుందన్నారు. విదేశీ విద్యకు నేడు ఎన్నో సదుపాయాలు కల్పి స్తున్నట్లు తెలిపారు. కాబట్టి మన జీవితంలో మొదటి స్థానం గురువులకు ఇవ్వాలని తెలిపారు. గురువు కృషి వెలకట్టలేనిదన్నారు. మన సంప్రదాయాలు, సంస్కృతిని, సంప్రదాయాలను తీర్చిదిద్దే గురువును విస్మరించరాదన్నారు. ఉపాధ్యాయులు సుబ్రమణ్యంరెడ్డి, మునీంద్ర, జయచంద్రాంరెడ్డి, రమేష్, సుబ్బు, శర్మలను సత్కరించారు. ఈ కార్యక్రమాల్లో బిజెపి నాయకులు కొండేటి గోపాల్, గరికపాటి రమేష్‌బాబు, ఇమిడిశెట్టి మోహన్, కోనేటి అయ్యప్ప, నరేంద్ర, చందురాయల్, సిద్దు రాయల్, సజ్జా హరిష్, భరత్‌నాయుడు, చోటు తులసి, కుమార్, గిరిధర్‌సాయి. మారి తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ శుభాకాంక్షలు



**విజయ వాడ, సెప్టెంబరు5, ప్రభాతవార్త ప్రతి నిధి:** ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు సోషల్ మీడియా మాధ్యమం ఎక్స్ వేదికగా పవన్ కల్యాణ్ పోస్టు చేశారు. "శిష్యుల ఉన్నతిలోనే తమ విజయాన్ని చూసుకొని ఉపాధ్యాయులు సంతోషిస్తారు. తల్లితండ్రులతో పాటు విద్యాబుద్ధులు నేర్పే గురువును దైవంతో సమానంగా పూజించే సంస్కృతి మనది. నేడు గురుపూజోత్సవం సందర్భంగా ఉపాధ్యాయి అధ్యాపకులు, ఆచార్యులకు శుభాకాంక్షలు తెలియచేస్తున్నాను. పాఠశాల దశ నుంచే విద్యార్థులకు అకడమిక్ సంబంధిత అంశాలతోపాటు నైతిక విలువలు కూడా నేర్పించాలని ఉపాధ్యాయులను కోరుతున్నాను. ఎన్నికల్లో ఇచ్చిన హామీని అమలు చేస్తూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక డీఎస్సీ నిర్వహించి ఉపాధ్యాయ నియామకం చేపట్టింది. డీఎస్సీ నియామకంతో విధుల్లోకి రాబోతున్న ఉపాధ్యాయులకు అభినందనలు తెలియచేస్తున్నాన్ను అని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు వ్యాలీ మండలంలో గల మదగడ గిరిజన గ్రామంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పర్యటన రద్దు అయింది. ప్రభుత్వం పరంగా కార్యక్రమాలు, సమావేశాలతో బిజీగా ఉండటంతో తన పర్యటనను వాయిదా వేసుకున్నారు. మదగడ గిరిజన గ్రామాన్ని శుక్రవారం సందర్శిస్తానని ఇటీవల పవన్ కల్యాణ్ ప్రకటించిన విషయం తెలిసిందే.

# తిరుమల సమాచారం

## 24నుండి శ్రీవారి సేవకు ట్రైనర్ల శిక్షణ

### - 8 అంశాలలో నైపుణ్యం



**తిరుమల,సెప్టెంబర్ 5ప్రభాత వార్తప్రతి నిధి:** శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనార్థం తిరుమలకు వస్తున్న అశేషసంఖ్య భక్తులకు అన్ని విభాగాల్లో ఇతోధిక సేవలందిస్తున్న శ్రీవారిసేవకులకు మరింత నైపుణ్యం కలిగించేందుకు ట్రైనర్లకు శిక్షణాతరగతులు నిర్వహిస్తున్నారు. మొదటివిడత శిక్షణను ఈనెల 24వతేదీ నుండి అమలుచేసే దిశగా టిటిడి ఇఒ జె.శ్యామలరావు అధికారులను ఆదేశించారు. గ్రూప్‌పర్యవేక్షకులు, సేవకుల ట్రైనర్ల శిక్షణ మాడ్యూల్‌పై ప్లానింగ్ విభాగానికి చెందిన నలుగురు నిపుణులుపవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. శ్రీవారిసేవకులకు సంబంధించి గ్రూప్ పర్యవేక్షకులు, ట్రైనర్ల శిక్షణ మాడ్యూల్‌పై శుక్రవారం సాయంత్రం టిటిడి పరిపాలన భవనంలో టిటిడి జెఇఒ వీరబ్రహ్మం, రాష్ట్ర ప్లానింగ్ విభాగం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకటేశ్వరరావుతో కలసి వర్చువల్‌గా ఐఐఎం అహమ్మదాబాద్ నుండి ఆచార్యులు విశ్వనాథ్, రామమోహన్, టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరిలతో ఇఒ శ్యామలరావు సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇఒ మాట్లాడుతూ సిఎం చంద్రబాబునాయుడు సూచనలతో శ్రీవారిసేవకుల ప్రమాణాలను పెంపొందించాలనే ఉన్నతమైన సంకల్పంతో తగ కొద్దికాలంగా పలు సంస్కరణలు చేపట్టామన్నారు. ఇందులో భాగంగా గ్రూప్ సూపర్‌వైజర్లు, సేవకుల ట్రైనర్‌ల రిజిస్ట్రేషన్ కోసం ప్రత్యేక యాప్‌ను ప్రారంభించామన్నారు. శ్రీవారిసేవకుల ట్రైనర్లకు ప్రత్యేక శిక్షణనిచ్చేందుకు మరింత పటిష్ట ప్రణాళికలు, బోధన పాఠ్యాంశాలను రూపొందించాలని సూచించారు. శిక్షణ పొందిన ట్రైనర్లు, సూపర్‌వైజర్లు సేవకులకు శిక్షణ ఇస్తారని తెలిపారు. మొదటివిడతగా ఈనెల 24వతేదీ శిక్షణ ప్రారంభించి మూడురోజులు కొనసాగుతుందన్నారు. ఉదయంవిధానపరమైన అంశాలపై, మధ్యాహ్నం వివిధ సేవా కేంద్రాల్లో క్షేత్రస్థాయి సందర్శనకు వెళ్ళి పరిశీలించేలా రూపొందించాలన్నారు. పటిష్టసేవ అందించేందుకు నైపుణ్యాలు, స్ఫూర్తిదాయకమైన నాయకత్వం, సులభపద్దతిలో అందరికీ అర్థమయ్యేలా ఆదర్శసేవకుడి లక్షణాలు ,పలుభాషలలో ప్రాథమిక నైపుణ్యం తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఇఒ సూచించారు. ఈ సమావేశంలో టిటిడి సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవి, డిఎఫ్ఒ,ఐటి ఇన్‌ఛార్జి జిఎం ఫణికుమార్‌నాయుడు, శ్వేతడైరెక్టర్ రాజగోపాల్, పిఆర్ఒ నీలిమ పాల్గొన్నారు.

## ఎస్టీ కౌన్సిల్ తీసుకున్న నిర్ణయం చరిత్రాత్మకం

### - మంత్రి కందుల దుర్గేష్

**విజయవాడ,సెప్టెంబరు 5,ప్రభాత వార్తప్రతినిధి:** దేశంలో పన్ను వ్యవస్థను సులభతరం చేయడం కోసం జీఎస్టీ కౌన్సిల్ తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమైనదనిమంత్రి కందుల దుర్గేష్ అన్నారు. జీఎస్టీ స్లాబుల సరళీకరణ - పర్యాటక, సినిమా రంగాలకు ఊతమన్నారు. జీఎస్టీ సంస్కరణలతో తక్కువ ధరల్లో వినోదం అన్నారు. పర్యాటక, సినిమా రంగాల బలోపేతానికి దోహదమవుతుందన్నారు. బడ్జెట్ ట్రావెలర్, డొమెస్టిక్ టూరిజంలకు ప్రోత్సాహం లభిస్తుందన్నారు. 18 శ్లాబ్ పరిధిలోకి సినిమా ప్రొడక్షన్ సేవలు..తద్వారా నిర్మాతలకు ఆర్థికంగా మేలు అన్నారు. ట్యాక్స్ లు తగ్గితే సినిమా, పర్యాటక రంగాల్లో ఉపాధి పెరుగుతుంది. స్థానిక ఆర్థిక వ్యవస్థ బలపడుతుందన్నారు. హోటల్ రూమ్ టారిఫ్‌లు రూ.7,500 లోపు ఉన్న వాటిపై పన్ను 12 నుండి 5 కు తగ్గింపు ఉంటుందన్నారు. రెస్టారెంట్ బిల్లులపై పన్ను కూడా 12-18 నుండి 5 కి తగ్గించబడుతుందన్నారు..సినిమా టికెట్లు రూ.100 లోపు ఉంటే 12 జీఎస్టీ, రూ.100 పైగా ఉంటే 18 జీఎస్టీ కొనసాగుతుంది: మంత్రి దుర్గేష్.. జీఎస్టీ సంస్కరణలు తెచ్చిన ప్రధాని మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ప్రత్యేక అభినందనలు తెలిపిన మంత్రి కందుల దుర్గేష్.

## దొంగిలించిన హుండీ సొమ్ము తిరిగి అమ్మవారికి

### అనారోగ్యంపాలైన కుటుంబసభ్యులు



హుండీని లెక్కపెడుతున్న గ్రామస్తులు

**బుక్కరాయసముద్రం సెప్టెంబర్ 5 ప్రభాతవార్త** బుక్కరాయసముద్రం మండల కేంద్రంలో ఎంతో ప్రతిభగల అమ్మవారు శ్రీ ముసలమ్మతల్లి దేవాలయం గ్రామ సమీపంలో ఉన్నది. బుక్కరాయసముద్రంతోపాటు అనంతపురం ఇతర జిల్లాల నుండి అధిక సంఖ్యలో భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకుంటూఉంటారు. ముఖ్యంగ చెప్పాలంటేనే బుక్కరాయసముద్రం గ్రామ ప్రజలు సుభిక్షంగా ఉన్నారంటే అది ఒక ముసలమ్మ తల్లి అనుగ్రహమే నని చెప్పవచ్చు.గ్రామ సమీపంలో ఉన్న చెరువు కట్ట అను నిత్యం తెగిపోతాఉంటే ప్రజలు ఇబ్బంది పడుతున్నారని గ్రామానికి చెందిన తిరుమలరెడ్డి కుటుంబీలైన శ్రీ ముసలమ్మ తల్లి చెరువుకట్టకు బలిహారం కావడంతో చెరువుకట్ట తెగిపోకుండ నిలబడినాదని చరిత్ర చెప్పుతుంది. భక్తుల కోరిన కోర్కెలు తీర్చు శ్రీ ముసలమ్మ తల్లి దేవాలయంలో 22.7.2025 న కొందరు గుర్తు తెలియని దుండగులు సీసీకెమరాలను ధ్వంసంచేసి గుడిలోకి చొరబడి గుడిలో ఉన్న హుండీని గొంగలించారు. ఈ విషయం పై ఆలయ ధర్మకర్త సుశీలమ్మ పోలీస్టేషన్ ల్లో ఫిర్యాదుచేయగా పోలీసులు కేసునమోదుచేసి దర్యాప్తుచేసున్నారు. శుక్రవారం హుడిని దొంగలించిన దుండగులు తిరిగి అమ్మవారి ఆలయ ప్రాంగనంలో పడేసి పోయారు. వాటిని గమనించిన ఆలయకమిటీ ధర్మకర్త సుశీలమ్మ పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసుల సమక్షంలో హుండీని తెరవగా అందులో ఒక లేఖను రాసి పెట్టారు ఆ లేఖలో అమ్మవారి హుండీని నలుగురం చోరిచేశామని చోరిచేసినప్పటినుండి తమ ఇండ్లలో పిల్లల అనారోగ్యం తో బాధపడుతున్నారు. తెలియక అమ్మవారి సొమ్ము దొంగలించామని అందులో కొంతవాడుకున్నామని రాసి సంచిలో పెట్టి వెల్లిపోయారు. అనంతరం పోలీసుల సమక్షంలో హుండీని లెక్కించగా అందులో 1,86,486 రూపాయలు ఉన్నట్లు తెలిపారు.

## ఉపాధ్యాయులకు వైఎస్సార్సీ అధినేత జగన్ శుభాకాంక్షలు

**విజయవాడ,సెప్టెంబరు5,ప్రభాతవార్తప్రతినిధి:** ఉపాధ్యాయులందరికీ వైసిపి అధినేత జగన్ శుభాంకాంక్షలు తెలిపారు. ఈ మేరకు వైఎస్ జగన్ శుక్రవారం ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. ఆ ట్వీట్‌లో.."మాజీ రాష్ట్రపతి, భారతరత్న, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఆయన దేశానికి అందించిన సేవలను స్మరించుకుంటూ మనస్ఫూర్తిగా నివాళులు. నేడు ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉపాధ్యాయులందరికీ శుభాకాంక్షలు" అని పేర్కొన్నారు.

## శ్రీవారిసేవలో పాట్నా హైకోర్ట్ జడ్జి అనుపమ చక్రవర్తి



**తిరుమల,సెప్టెంబర్ 5ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవేంకటేశ్వరస్వామిని శుక్రవారం ఉదయం విఐపి బ్రేక్‌లో కుటుంబంతో కలసి పాట్నా హైకోర్ట్ జడ్జి జస్టీస్ అనుపమ చక్రవర్తి దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి స్వామి వారి దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు. దేవదేవుని దర్శనం బాగా జరిగిందని తెలిపారు.

# కాణిపాకంలో కన్నుల పండువగా త్రిశూలస్నానం



స్వామివారి ఆయుధం త్రిశూలానికి కలశాలలోని పవిత్రజలం, పాలతో అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

**కాణిపాకం, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త:** కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాలో భాగంగా నవరాత్రి ఉత్సవాల చివరిరోజు శుక్రవారం త్రిశూలస్నానం కన్నుల పండువగా జరిగింది. ఆలయంలో గత నెల 28 నుండి ప్రారంభమైన స్వామివారి నవరాత్రి ఉత్సవాలు శుక్రవారం జరిగిన ధ్వజావరోహణం, వడాయత్తు ఉత్సవం, ఏకాంతసేవతో ముగిసింది. నవరాత్రి ఉత్సవాల అంకురార్పణ సందర్భంగా ప్రధాన ఆలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన యాగశాలలో నవదాన్యాలను మొలకపోసి, అష్టోత్తర కలశాలను ఏర్పాటు చేసి ప్రతిరోజూ ఉదయం సాయంత్రం వేళల్లో యాగశాల పూజలు నిర్వహిస్తున్నారు. అదేవిధంగా స్వామివారి ఆయుధమైన త్రిశూలాన్ని స్వామివారు వాహనసేవల్లో ఊరేగే కాణిపాకం పురవీధుల్లో ప్రతిరోజూ ఉదయం ఊరేగిస్తుంటారు. స్వామివారి నవరాత్రి ఉత్సవాలు ముగిసినందున త్రిశూల స్నానం గావించారు. తిరుమల చక్రస్నానం తరహాలో కాణిపాకంలో త్రిశూల స్నానం ఘట్టం జరిగింది. ఈసందర్భంగా ముందుగా యాగశాలలో యాగమూర్తికి పూజలు నిర్వహించి పూర్ణాహుతి అనంతరం త్రిశూలాన్ని కాణిపాకం పురవీధుల్లో ఘనంగా ఊరేగించారు. అనంతరం ఆలయం పవిత్ర పుష్కరిణి వద్దకు తీసుకువచ్చి ప్రత్యేకపూజలు నిర్వహించిన అనంతరం పుష్కరిణిలోని నీటిలో త్రిశూలస్నానం గావించారు. ఈసందర్భంగా యాగశాలలోని అష్టోత్తర కలశాలలోని పవిత్రజలంతో త్రిశూలానికి అభిషేకం గావించారు. అలాగే అంకురార్పణ రోజున మొలకపోసిన నవదాన్యాలను పుష్కరిణిలో నిమజ్జనం చేశారు. ఈకార్యక్రమంలో ఈఓ పెంచల కిషోర్, డిప్యూటీ ఈఓ సాగర్‌బాబు, ఏఈఓలు ఎస్వీ.కృష్ణారెడ్డి, విద్యాసాగర్‌రెడ్డి, రవీంద్రబాబు, ధనపాల్, హరిమాధవరెడ్డి, సూపరెండెంట్‌లు శ్రీధర్‌బాబు, కోదండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్‌లు బాలాజినాయుడు, చిట్టిబాబు,స్థానిక సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డి, ఎంపీటీసీ లీలా సుధీర్‌లతో పాటు ఆలయ, ఉత్సవ ఉభయదారులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

## అంధ విద్యార్థులకూ సైన్స్ కోర్సులు : ప్రభుత్వం ఉత్తర్వుజారీ

**విజయవాడ,సెప్టెంబరు5,ప్రభాతవార్తప్రతినిధి:** అంధ విద్యార్థులు ఇంటర్మీడియట్‌లో సైన్స్ కోర్సులు చదివేందుకు రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఇందుకు సంబంధించిన జిఒ 278ను పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ గురువారం విడుదల చేశారు. ఈ విద్యాసంవత్సరం నుంచి అంధ విద్యార్థులు ఇంటర్మీడియట్‌లో ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, మేథమేటిక్స్ వంటి కోర్సుల్లో చదువుకోవచ్చునని పేర్కొన్నారు. ప్రాక్టికల్స్ స్థానంలో విద్యార్థులకు బహుళ ఎంపిక ప్రశ్నాపత్రం అందిస్తామని పేర్కొన్నారు. దృష్టిలోపం విద్యార్థుల భవిష్యత్తుకు అడ్డు కాకూడదని, మిగిలిన విద్యార్థులతో వీరికి సమానంగా అవకాశాలు కల్పించడానికి మంత్రి నారా లోకేష్ ప్రత్యేక చొరవ చూపారని మంత్రి కార్యాలయం గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. సైన్స్ కోర్సుల్లో అవకాశం కల్పించాలని విద్యార్థులు కోరడంతో మంత్రి ఈమేరకు చొరవ తీసుకున్నారని పేర్కొంది.

## బాలాజీ ఆరోగ్యవరప్రసాదినికి అజ్ఞాతభక్తుడు రూ.కోటిన్నర విరాళం

**తిరుమల,సెప్టెంబర్ 5ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి బాలాజీ ఆరోగ్యవరప్రసాదిని ట్రస్ట్‌కు ఓ అజ్ఞాతభక్తుడు భారీ విరాళం అందించాడు. బెంగుళూరుకు చెందిన ఓ అజ్ఞాతదాత 1.50కోట్ల రూపాయలు విరాళాలను శుక్రవారం టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడును కలసి ఆందజేశారు. శ్రీవేంకటేశ్వరస్వామిపై భక్తివిశ్వాసాలతో ఈ విరాళమిచ్చినట్లు ఆ భక్తుడు తెలిపాడు.

## భగవంతుని ఆశీర్వాదం అందరిపై ఉండాలి

### - ఎన్‌హెచ్‌ఆర్సీ ఛైర్మన్ జస్టిస్ రామసుబ్రమణ్యం



**తిరుమల,సెప్టెంబర్ 5ప్రభాతవార్తప్రతినిధి:** భగవంతుని ఆశీర్వాదంతోనే ప్రజలందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లుతారని, భగవన్నామస్మరణతోనే మంచి జరుగుతుందని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి, ఎన్‌హెచ్‌ఆర్‌సి ఛైర్మన్ జస్టీస్ రామసుబ్రమణ్యం తెలిపారు. శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో లోకం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. శుక్రవారం ఉదయం నైవేద్యవిరామ సమయంలో ఆలయంలోనికి చేరుకుని స్వామివారి దర్శనానంతరం ఆశీస్సులందుకున్నారు. ఆలయ అధికారులు, అర్చకులు స్వామివారి దర్శనం చేయించి వేదాశీర్వచనం అందించారు. టిటిడి రిసెప్షన్ ఓఎస్‌డి సత్రానాయక్ స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## గణేశ్ నిమజ్జనంలో అపశ్రుతి

### మంటపం వద్ద పేలుడు

### ఇరువురికి గాయాలు

**కోవూరు,(నెల్లూరు) సెప్టెంబర్ 5 ప్రభాతవార్త :** శుక్రవారం తెల్లవారుజామున కోవూరులోని సత్రం వీధి ప్రాంతంలో గణేష్ నిమజ్జనం ఊరేగింపు సందర్భంగా టపాసులు కాల్చే సమయంలో అపశృతి జరిగి తృటితో భారీ ప్రమాదం తప్పింది. కోవూరు ఎస్సై రంగనాథ్ గౌడ్ సమాచారం మేరకు కోవూరులోని సత్రంవీధి ప్రాంతంలో యథావిధిగా వినాయకచవితి ఉత్సవాల ముగింపు సందర్భంగా గురువారం రాత్రి అక్కడి నుంచి ఊరేగింపుగా విగ్రహం బయలుదేరింది. ఈ నేపథ్యంలో సత్రంవీధి ప్రాంతంకు వచ్చే సరికి సాయిబాబా మెడికల్స్ షాపు పక్కనే ఉన్న స్థలంలో ఈ గణేష్ ఉత్సవ నిర్వాహకులు మెట్ల ప్రాంతంలో పేలుడు సామగ్రిని నిల్వ ఉంచారు. ఈ నేపథ్యంలో రహదారిలో టపాసులు కాలుస్తుండగా అందులో ఉన్న నిప్పు రవ్వలు నిల్వ ఉన్న టపాసులపై పడి భారీ స్థాయిలో పేలుడు సంభవించింది. ఈ సంఘటనలో ఆ ప్రాంతంలో ఉన్న ఎలక్ట్రికల్ స్కూటీ కూడా పేలిపోయింది. ఈ సంఘటనలో సాయిబాబా మెడికల్ షాపు యజమాని బ్రహ్మయ్య సతీమణి లక్ష్మి(45) తీవ్రగాయాలయ్యాయి. అదే ప్రాంతంలో ఉన్న రామ్‌దేవ్‌బాబాకు గాయాలు కావడంతో 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

సంఘటనా స్థలాన్ని కోవూరు ఎస్సై రంగనాథ్ గౌడ్ సిబ్బందితో వెళ్లి నిశిత పరిశీలన చేపట్టారు. ఈ పేలుడు సందర్భంగా షాప్ షట్టర్ దెబ్బతినంద, షాపులో ఉన్న మెడికల్ వస్తువులు కూడా కింద పడిపోవడం జరిగింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# మహమ్మద్ ప్రవక్తలా నిరాడంబర జీవితాన్ని అలవాటు చేసుకోవాలి

### ఆదర్శాలకు స్వస్తి: దారితప్పుతున్న జీవన గమనం:హాఫీజే ఖుర్ ఆన్ రేహాన్ సాహెబ్

**శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 5 ప్రభాతవార్త** మహమ్మద్ ప్రవక్త ఆచరించిన నిరాడంబర జీవన విధానాన్ని అలవాటు చేసుకోవాలని హాఫీజే ఖుర్ ఆన్ రేహాన్ సాహెబ్ పిలుపు నిచ్చారు. శుక్రవారం జామియా మస్‌జిద్‌లో రేహాన్, నూర్‌ఏమస్‌జిద్‌లో మౌలానా మహమ్మద్‌ఆలీ సాహెబ్‌లు దివ్యఖుర్ ఆన్ పఠనానికి సంబంధించి చైతన్య పరచారు. జామియా మస్‌జిద్‌లో రేహాన్ మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్త జన్మదిన సందర్భంగా సంబరాలు జరిపించుకోవటం కాదు. అది మన సంప్రదాయం, సంస్కృతి కాదన్నారు. ఆయన తను జన్మించిన సోమవారం, గురువారం ఉపవాస దీక్షలు పాటించేవారు అన్నారు. ఆయన నిరాడంబర జీవితాన్ని అనుభవిస్తూ భావి తరాలకు మార్గదర్శకులయ్యారన్నారు. నేడు మనం జన్మదినం అంటే సంబరాలుమిన్నుముట్టుతున్నాయన్నారు. మనం నిత్యం అల్లాహ్ మార్గాలను విడనాడి మనం స్వర్గం ప్రాప్తించాలని కోరుకోవటం కరెక్టు కాదన్నారు. మనం దివ్యఖుర్‌ఆన్‌తో సంబంధం లేకుండా జీవనం గడుపుతున్నామని దాని వల్ల నిత్యం దుఃఖంలో మునిగి తెలుతున్నామన్నారు. మనం ఎంత సంపాదించిన ఒదుగు కనబడటం లేదన్నారు. ఆయన శుక్రవారం నూర్‌ఏ మస్‌జిద్‌లో దివ్యఖుర్ ఆన్ పఠనానికి సంబందించి దిశ దెశ నిర్దేశం చేసారు. మనం ఇస్లాం మతంలో పుట్టి ముస్లింలుగా నటిస్తున్నాము తప్ప నాడు మన ప్రవక్త ఆచరించిన విధానాలు, ఆచారాలు, సంప్రదాయాలను తుంగలో తొక్కుతూ స్వర్గస్తులు కావాలని కోరుకోవటం సరికాదన్నారు. ప్రవక్త జీవితం మనకు మార్గదర్శకం కావాల్సి ఉండగా ఆచారాలకుతుంగలో తొక్కి కట్టుబొట్టు అన్ని మార్చుకున్నామన్నారు. మనం కలియుగం అంతంతో ఉన్నామన్నారు. అల్లాహ్ ఆదేశాలను మన ప్రవక్త ద్వారా అందించారని అయితే మనం కనీసం ఐదుపూటల్లా నమాజును కూడా ఆచరించలేని దీన స్థితిలో ఉన్నామన్నారు. ఈ నిర్లక్ష్యం నుంచి బయట పడాలన్నారు. ప్రవక్త ఆచరించిన మార్గాన్ని ఆచరిస్తూ యుగాంతంలో స్వర్గస్తులు కావాలని సూచించారు. జన్మదినాలంటే సంబరాలు జరుపుకోటం కాదు. ఆయన ఆచరించిన విధానాలను, జీవిత మార్గాలను ఆచరిస్తూ సన్మార్గంలో పయనించాలన్నారు.

## వైభవంగా గణనాధుని ధ్వజారోహణం

**కాణిపాకం, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త:** కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాల నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చివరిరోజు శుక్రవారం ధ్వజావరోహణం, వడాయత్తు ఉత్సవం, ఏకాంతసేవ అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. గత నెల 27 నుండి ఆలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు జరుగుతున్న విషయం విదితమే. ఇందులో భాగంగా 28న ధ్వజారోహణంతో ప్రారంభమైన నవరాత్రి బ్రహ్మోత్సవాలు శుక్రవారం జరిగిన ధ్వజావరోహణంతో ముగిసింది. ముందుగా ఉదయం ఆలయంలో త్రిశూల స్నానం, వసంతోత్సవం కార్యక్రమంను కన్నుల పండువగా నిర్వహించారు. అలాగే రాత్రి ధ్వజావరోహణం కార్యక్రమంను నిర్వహించారు. ఈమేరకు నవరాత్రి ఉత్సవాలు దిగ్విజయంగా నిర్వహించేందుకు ముక్కోటి దేవతలను ఆహ్వానిస్తూ గత నెల 28న ధ్వజారోహణం కార్యక్రమాన్ని నిర్వహించగా, తొమ్మిది రోజులు అనంతరం శుక్రవారం ధ్వజావరోహణం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఉభయదారులచే స్వామివారి మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలను నిర్వహించిన అనంతరం ప్రధాన ఆలయంలోని బంగారు ధ్వజస్థంభంపై ఎగుర వేసిన మూషికపటాన్ని శాస్త్రోక్తంగా పూజల అనంతరం అవతనం గావించారు. ఈసందర్భంగా మూషిక పటానికి పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి వడాయత్తు ఉత్సవంను నిర్వహించారు. ఈసందర్భంగా స్వామివారికి ప్రత్యేకపూజలు నిర్వహించి వడలతో మాలవేసి, పెసరు పప్పు పాయసాన్ని నైవేద్యంగా సమర్పించారు.

## తెలంగాణ సస్యశ్యామలంగా అభివృద్ధి చెందాలి

**తిరుమల,సెప్టెంబర్ 5ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో తెలంగాణ సస్యశ్యామలంగా అభివృద్ధిచెందాలని ఆరాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు ఆకాంక్షించారు. స్వామివారి ఆశీస్సులతో తెలుగుప్రజలందరికీ మంచి జరగాలని కోరుకున్నారు. శుక్రవారం ఉదయం నైవేద్యవిరామసమయంలో కుటుంబంతో కలసి ఆయన ఆలయంలోనికి చేరుకున్నారు. టిటిడి అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లుచేశారు. శ్రీవారిని దర్శించుకుని ఆశీస్సులందుకున్నారు. టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## సబ్ రిజిస్ట్రార్ రమణరావు సస్పెన్షన్

**అనంతపురం న్యూటౌన్, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త** అనంతపురం అర్బన్ సబ్ రిజిస్టర్ కార్యాలయంలో పనిచేస్తున్న జాయింట్ వన్ సబ్ రిజిస్టర్ రమణరావు ను సస్పెన్షన్ చేస్తూ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ డిఐజి విజయలక్ష్మి బుధవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేసింది. సబ్ రిజిస్టర్ రమణరావు ఇటీవల డబల్ రిజిస్టర్లు చేయడంతో ఫిర్యాదులు వచ్చాయి.

దీనిపైన విచారణ చేసి సస్పెన్షన్ చేయడం జరిగిందన్నారు. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు, ఉద్యోగులు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని సూచించారు.


**హీరో హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్**

HeroHousing Finance

సంప్రదించు చిరునామా: A-6, మూడవ అంతస్తు, సెక్టార్-4, నొయిడా-201301
రిజిస్టర్డ్ ఆఫీస్: 09, కమ్యూనిటీ సెంటర్, బసంత్ లోక్, వసంత్ విహార్, న్యూఢిల్లీ-110057
ఫోన్: 011 49267000, టోల్ ఫ్రీ నం: 1800 212 8800, ఇ-మెయిల్: customer.care@herohfl.com
వెబ్‌సైట్ : www.herohousingfinance.com | CIN: U65192DL2016PLC30148

**డిమాండ్ నోటీస్**

సెక్యూరిటైజేషన్ మరియు రికన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ చట్టం, 2002 ("చట్టం") సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు, 2002 ("నిబంధనలు") యొక్క నిబంధన 3తో చదువబడే దాని యొక్క 13(2) సెక్షన్ క్రింద

ఇది ఇలా ఉండగా హీరో హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (HHFL) యొక్క అధీకృత అధికారి అయినందున దిగువ సంతకందారు చట్టం క్రింద మరియు నిబంధనల యొక్క నిబంధన 3తో చదువబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించబడిన అధికారాలను వినియోగిస్తూ చట్టం యొక్క 13(2) సెక్షన్ క్రింద, క్రింద తేదీగల సవివరమైన డిమాండ్ నోటీస్‌లు రుణగ్రహీత(లు), సహ-రుణగ్రహీత(లు), గ్యారెంటర్(లు) (అందరూ ఒకటిగా లేదా కలిసి "అబ్లిగార్(లు)"గా రిఫర్ చేయబడుదురు) చట్టవారసుడు(లు) చట్టప్రతినిధి(లు) ఈ క్రింద జాబితాలోని వారికి, సంబంధిత డిమాండ్ నోటీస్/లు పేర్కొనబడిన సొమ్ములను సంబంధిత నోటీస్/లు యొక్క తేదీ నుండి 60 రోజులలోపుగా క్రింద ఇవ్వబడిన వివరాల ప్రకారం చెల్లించవలసినదిగా సవివర డిమాండ్ నోటీస్‌లు ఇప్పటికే జారీ చేసారు. సదరు నోటీస్‌ల యొక్క కాపీలు రిజిస్టర్డ్ పోస్ట్ A.D. చే అందచేయబడినవి మరియు దిగువ సంతకందారుని వద్ద అందుబాటులో ఉన్నవి మరియు సదరు అబ్లిగార్(లు)/చట్టవారసు(లు)/చట్టప్రతినిధి(లు) వారికి కోరిక కలిగి ఉంటే దిగువ సంతకందారుని నుండి సాధారణ కార్యాలయ వేళలలో ఏ పని రోజునైనా సంబంధిత కాపీని సేకరించుకోవచ్చును.

పై విషయానికి సంబంధించి, సదరు అబ్లిగార్(లు)/చట్టవారసు(లు)/చట్టప్రతినిధి(లు)కు మళ్లీ ఒకసారి ఇందుమూలముగా సదరు అబ్లిగార్(లు)చే ఎగ్జిక్యూట్ చేయబడిన ఏదైనా ఇతర డాక్యుమెంట్‌లు/రాతపత్రాలు మరియు రుణ ఒప్పందంతో చదువబడేవి, చెల్లింపు యొక్క తేదీ మరియు/లేదా రియలైజేషన్ వరకు కాలమ్ (d)లో క్రింద పేర్కొనబడిన సంబంధిత తేదీల నుండి క్రింద వివరింపబడిన విధంగా తదుపరి వడ్డీతో కలిపి సంబంధిత పేర్ల వారి ఎదురుగా క్రింద టేబుల్‌లో సూచింపబడిన సొమ్ము మొత్తాలను సంబంధిత నోటీస్/లు యొక్క తేదీ నుండి 60 రోజులలోపుగా HHFLకు చెల్లించవలసినదిగా ఇందుమూలముగా నోటీస్ మళ్లీ ఒకసారి ఇవ్వబడింది. రుణ బకాయి యొక్క తిరిగి చెల్లింపుకు సెక్యూరిటీగా, ఈ క్రింద పేర్కొనబడిన సెక్యూర్డ్ ఆస్తి(లు) సంబంధిత సదరు అబ్లిగార్(లు)చే HHFLకు తనఖా పెట్టబడినవి.

| రుణ ఖాతా నం. | అబ్లిగార్(లు)/చట్టవారసుడు(లు) చట్టప్రతినిధి(లు) యొక్క పేరు | క్రింది తేదీల నాటికి మొత్తం బకాయి రూ. | డిమాండ్ నోటీస్ తేది | NPA తేది |
|---|---|---|---|---|
| HHFVIJLAP 24000052599 | చిలుకూరి పవన్ కుమార్, చిలుకూరి మహా లక్ష్మి | రూ.28,78,775/- 19.08.2025 నాటికి | 30-08-2025 | 04-08-2025 |

సెక్యూర్డ్ ఆస్తులు/స్థిరాస్తులు/తనఖాపెట్టబడిన ఆస్తులు యొక్క వివరణ:- N.T.R. జిల్లా, విజయవాడ సబ్ రిజిస్ట్రార్ యొక్క కార్యాలయం, విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ ఏరియా, విజయవాడ, ముత్యాలంపాడు, దేవీ నగర్ రెవెన్యూ వార్డ్ నం.53, R.S. నం.36-13, మునిసిపల్ వార్డ్ నం.17, పాత అసెస్‌మెంట్ నం.30173h/112, కొత్త అసెస్‌మెంట్ నం.150689, ప్రస్తుత అసెస్‌మెంట్ నం.1073066813, పాత ఇ.నం.42-2/1-176, ప్రస్తుత ఇ.నం.42-2/1-164 కలిగిన 100 చ.గ. యొక్క విస్తీర్ణం యొక్క మొత్తం అదంతా. సరిహద్దులు: ఉత్తరం: ఆనసూత్రం పానకాలు, దక్షిణం: కస్తూరి హనుమంతరావు, తూర్పు: ఓం శాంతి రెసిడెన్సీ, పడమర: Roa

సదరు సంబంధిత పైన పేర్కొన్న తేదీగల డిమాండ్ నోటీస్‌లో ప్రత్యేకంగా పేర్కొనబడిన విధంగా ఆ రేట్ వద్ద తదుపరి వడ్డీ, అదనపు వడ్డీకోసహా, ఇన్సిడెంటల్ ఖర్చులు, ధరలు, ఛార్జీలు, వగైరా రియలైజేషన్ లేదా/మరియు చెల్లింపు యొక్క తేదీ వరకు అయినవి. సదరు అబ్లిగార్(లు) ముందు పేర్కొనబడిన విధంగా HHFLకు చెల్లింపు చేయడంలో విఫలమైతే, HHFL సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద, పై సెక్యూర్డ్ ఆస్తి(లు)/స్థిరాస్తి(లు) వ్యతిరేకంగా చర్యకు ఉపక్రమిస్తుందని ఇందుమూలముగా తెలియజేయడమైనది. మరియు వర్తించే నిబంధనలు అన్నీ సదరు అబ్లిగార్(లు)/చట్టవారసు(లు)/ చట్టప్రతినిధి(లు) ధరలు మరియు పరిణామాలన్నింటినీ మొత్తం రిస్క్‌పై భరించవలసి ఉంటుందని తెలియజేయడమైనది.

సదరు అబ్లిగార్(లు)/చట్టవారసు(లు)/చట్టప్రతినిధి(లు) సదరు చట్టప్రకారం పైన పేర్కొనబడిన సెక్యూర్డ్ ఆస్తి(లు) స్థిరాస్తి బదిలీ చేయడం/విక్రయం, లీజ్ లేదా ఏ విధంగానైనా, HHFL రాతపూర్వకంగా ముందస్తు అనుమతి లేకుండా చేయడానికి నిషేధింపబడినారు. ఏవ్యక్తి అయినా దీనికి విరుద్ధంగా వ్యవహరించినా లేదా చట్టం లేదా దానిలోని నిబంధనల ఏర్పాట్లను ఉల్లంఘించినా, ప్రోత్సహించినా చట్టం క్రింద ఏర్పాటు చేయబడిన విధంగా జైలు శిక్ష మరియు/లేదా పెనాల్టీ పొందడానికి బాధ్యులవుతారని తెలియజేయడమైనది.

తేది : 06.09.2025,
ప్రదేశం : విజయవాడ

సం/- అధీకృత అధికారి
హీరో హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ తరపున

వార్త

మన భవిష్యత్తు మనం పుట్టిన ఘడియలు బట్టిగాని, మరింకా దేనిమీదనో గాని ఆధారపడి లేదు. అది కేవలం మన స్వశక్తిపై ఆధారపడి ఉంది.

-రాజాజీ

# ఆశావహ సంస్కరణలు!


నిత్యావసర వస్తువుల కొనుగోలుదారుల్లో, వాణిజ్య వ్యాపార రంగాల వారికి తాజాగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన జిఎస్టీ2.0 సంస్కరణలు కొత్త ఆశలు మొలకెత్తింప చేశాయి. ఆశయాల మాటెలా ఉన్నా ప్రతిపాదనలు బేషుగ్గా ఉన్నాయి. నాలుగు శ్లాబుల పన్ను రేటు నుంచి కేవలం రెండే శ్లాబులను, అదీ మునుపటి కన్నా తక్కువగా నిర్ణయించడమంటే ఇది భారతీయుల విజయం కిందనే లెక్క. అదీగాక దీపావళి నుంచి అమల్లోకి వస్తాయనుకున్న పన్ను రేట్లు ఈ నెల 22 నుంచే తగ్గుతాయంటే జనంలో ఆనందోత్సాహాలు వెల్లివిరుస్తున్నాయి. ఈ తగ్గింపుల కారణంగా సామాన్య మధ్య తరగతి ప్రజానీకానికి ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ప్రయోజనాలను అందించేవే. ఇప్పటివరకు వేధించిన 12 శాతం, 28శాతం పన్నులు ఇక ఉండబోవని కేంద్ర ఆర్థిక శాఖామంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించడంతో సామాన్యులకు ఎన్నో సడలింపులు కలుగుతాయి. తద్వారా వారు కొనుగోలు చేసే ప్రతి వస్తువుపైనా ధరల సర్దుబాట్లు జరిగి వినిమయ వస్తువులధరల్లో తగ్గింపు కనపడుతుంది. 56వ జిఎస్టి మండలి నిర్ణయాలకు అశేష భారతీయ జనావళి స్వాగతిస్తూ జేజేలు పలికారు. కాని వస్తుసేవల పన్ను విషయంలో కేంద్ర ప్రభుత్వం సంస్కరణల కోసం ఎనిమిదేళ్లు అవసరమా అంటూ విపక్షాలు దుయ్యబట్టడమొక్కటే మిగిలింది. 2017 తర్వాత ఇన్నాళ్లకు జిఎస్టీ వలన సాధారణ వర్తకులు కార్పొరేట్ వాణిజ్యవేత్తలు ముక్తకంఠంతో సంతోషం వ్యక్తంచేశారు. కారణమేదైనా జిఎస్టీ శ్లాబుల సవరింపు బేషుగ్గా ఉంది. మందగమనంలో ఆర్థిక వృద్ధి, పొదుపు సంస్కరణలు, కుటుంబ రుణాల విస్తృతి,సామాన్యుడి నెత్తిన పడుతున్న ఆర్థిక భారాలు, జిఎస్టీ పన్ను, సంస్కరణలకు దారితీసి ఉంటాయని అంచనా. విపక్షాలు తమ వంతు విమర్శగా బీహారు ఎన్నికలు, అమెరికా టారిఫ్‌ల ఒత్తిడి కారణంగానే జిఎస్టీ పన్నుల విషయంలో ముందస్తు ప్రకటన చేసి ఉంటారంటున్నారు. తమ పార్టీ ఎన్నో ఏళ్లుగా జిఎస్టీ సంస్కరణ కోసం పట్టుబడుతున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదని, ఇంతవరకు జిఎస్టీలో 64శాతం పేద, మధ్యతరతగతి నుంచే వస్తుండగా కుబేరుల వంతు మూడు శాతమేనని, కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే వ్యాఖ్యానించారు. సంక్లిష్టంగా ఉన్న జిఎస్టీ నిబంధనలను సరళతరం చేయడంతోపాటు ఎంఎస్‌ఎంఇ రంగానికి ప్రయోజనం కలిగించే నిర్ణయాలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. ఆరోగ్య బీమాకు పన్నులు ఉపసంహరించడాన్ని విశ్లేషకులు ఎంతో ఉత్తమమైన సంస్కరణగా భావిస్తున్నారు. నిన్నమొన్నటి స్వాతంత్ర్య దినోత్సవం రోజున ప్రధాని నరేంద్రమోడీ ఎర్రకోట నుంచి తన ప్రసంగంలో ప్రస్తావించిన జిఎస్టీ 2.0 సంస్కరణల కోసం ఎదురు చూసిన సామాన్యునికి ఈ రోజున మనసు కాస్తంత తేలికపడింది. వాటి ఫలాలు అంది ధరల భారం నుంచి గట్టెక్కిన నాడు నిజంగా స్వాతంత్ర్య దినోత్సవ ఫలితాలను అందుకున్నట్లే సంబరపడతాడు. జేబులు కత్తిరించే జిఎస్టీ విధానమని హుంకరించిన ప్రతిపక్షాలు సైతం జేబులు నింపే సంస్కరణలు చూడగలుతున్న ఏకైక సంస్కరణ విధానం భారతదేశంలో తొలిసారిగా ఆవిష్కరింపబడిందంటే నమ్మాలి మరి! వస్తుసేవల పన్ను అనగానే ఎంతోఆందోళన చెందిన ప్రజలకు, దేశాభివృద్ధికి 'డబుల్ డోస్' మద్దతుగా ప్రధాని నరేంద్ర మోడీ పేర్కొన్నారంటేనే ఈ సంస్కరణల ప్రయోజనాలు అర్థమౌతాయి. పన్నుల వ్యవస్థను సంస్కరించటానికి చాన్నాళ్లు పట్టిందన్న విమర్శ తప్పితే అన్నివర్గాలు తృప్తి చెందాయి. సాధారణ ప్రజలకు డబ్బు ఆదా కావడంతోపాటు దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతమవడం జిఎస్టీ సంస్కరణలను కేంద్ర ప్రభుత్వం సంకల్పించింది. ప్రధానంగా మానవ జీవితానికి అవసరమైన ఆరోగ్యబీమా 18 శాతం జిఎస్టీ రేటు నుంచి మినహాయింపునివ్వటమే నేటి జిఎస్టీలో చారిత్రక నిర్ణయమని బీమాదారులు నమ్ముతున్నారు. వైద్యసంబంధిత ద్రవ్యోల్బణం పెరుగుతున్న తరుణంలో సామాన్య కుటుంబాలకు కూడా వైద్యబీమా కల్పించగల శక్తి ఏర్పడ్తుంది. అందుకే ఈనాటి పన్ను సంస్కరణలు స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత జరిగిన అందరికీ నచ్చే సంస్కరణలుగా పారిశ్రామిక వర్గాలు సైతం భావిస్తున్నాయి. రైతులనుంచి ఎంఎస్‌ఎంఈల వరకు ఫార్మా రంగమే కాకుండా దాని అనుబంధ రంగాలకు, తద్వారా వినియోగదారులకు గణనీయ లబ్ది చేకూరగలదు. వ్యవసాయ సంబంధిత సాగు పరికరాలు,వస్తువులపై 12 శాతం నుంచి జిఎస్టీ 5 శాతానికి తగ్గింది. సిమెంటుపై 28 శాతం నుంచి 18 శాతానికి మార్చడం గృహ నిర్మాణానికి సాను కూల సంకేతం, టీవీలు, ఎసిలు, ఎలక్ట్రానిక్ వస్తువులు 28 శాతం నుంచి 18 శాతానికి మారనుండగా, హానికర వస్తువులపై పన్ను స్థాయి 40 శాతానికి పెరుగుతుంది. అంటే వ్యవసాయానికి నిర్మాణరంగానికి పన్ను సడలింపులు వస్తుండగా, పొగాకు ఉత్పత్తులపై భారం ఎక్కువ పడుతోంది. వీటిపై పన్నులు పెంచడం ద్వారా వినియోగ దారులను నిరుత్సాహపరచడం మంచి ఆలోచన. అయితే ధరాభారంతో దుర్వ్యసనాలను దూరం చేయాలనుకోవడం ఆహ్వానించదగిన పరిణామం. జిఎస్టీ రేట్లను తగ్గిస్తూ తీసుకున్న నిర్ణయాలతో ఆయా రాష్ట్రాల వస్తుసేవల పన్ను వసూళ్లలో వచ్చే నష్టాన్ని భర్తీ చేసేందుకు కేంద్రం అంగీకరించింది. అయితే ఐదేళ్లపాటు రాష్ట్రాలను ఆదుకుంటే తప్ప అవి నిలదొక్కుకోలేవు. ఈ విధంగా వెసులుబాటు కల్పించగలిగితే జిఎస్టీ సంస్కరణలు అఖిల పక్షాలకు ఆశాభావమే!

పగతీర్చుకుంటే ఆ రోజు మాత్రమే ఆనందం కలుగుతుంది. ఒక రోజు ఆనందం కోసం చిరకాలం కలిగే ఆనందాన్ని బలిపెట్టకూడదు.



తిరువళ్లువర్

మనిషికి మనసును మించిన మహాశత్రువు వేరొకరు లేరు. అందుకే మనస్సును జయిస్తే ప్రపంచాన్ని జయించవచ్చు.



గురునానక్

## ప్రజావాక్కు



### క్యాష్‌లెస్ స్కీమ్

మన దేశంలో రోడ్డు ప్రమాదాలు, కాలిన గాయాలు, విష ప్రయోగాలు,నేరదాడులురోజురోజుకూ పెరుగుతున్నాయి. ఇలాంటి అత్యవసర సందర్భాల్లో బాధితుడికి వెంటనే వైద్యసహాయం అందకపోతే ప్రాణాలుకోల్పోవాల్సి వస్తుంది. అయితే ప్రైవేట్ ఆసుపత్రులలో చాలా చోట్ల ముందస్తు డబ్బుఅడగడం, లేకపోతే బెడ్‌లేదు అంటూ తిరస్కరించడం సాధారణమైపోయింది. బాధితులు అంబులెన్స్‌లలోనే ప్రాణాలు వదిలే ఘటనలు మన కళ్లముందే జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో కర్ణాటక ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన ఆదేశం ప్రశంసనీయం. 2007 ప్రైవేట్ మెడికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ యాక్ట్, 2016 గుడ్ సమారిటన్ యాక్ట్ మోటార్ వెహికల్స్ యాక్ట్‌ప్రకారం, ప్రతి ఆసుపత్రి ముందస్తు చెల్లింపు లేకుండా దుర్ఘటన బాధితులను వెంటనే చికిత్స చేయాల్సిందేనని మళ్లీ గుర్తు చేసింది.

- సి.హెచ్. ప్రతాప్, శ్రీకాకుళం

### భక్తిశ్రద్ధలతో పూజిద్దాం..

ఐకమత్యానొదిలి పోటీతత్వం షురూ జేస్తున్నారు. ప్రకృతిని పరిరక్షించే మట్టి ప్రతిమలనొదిలి రంగు రంగుల ప్రతిమలను కొనేందుకు ఎగబడుతున్నారు. వికృత చేష్టలతో చిందులేస్తూ వినాయకుడినే అపవిత్రం చేస్తున్నారు. భక్తిశ్రద్ధలతో పాడే కీర్తనలు మరిసి సౌండ్‌బాక్సులల్లా పెట్టుకొని పూజిస్తున్నారు. భజన నృత్యాలతో సాగేఊరేగింపు భక్తికి విరుద్ధమైన పాటలు పెట్టీ ఎగురుతున్నారు. భగవంతుని భక్తిశ్రద్ధలతో కొలవాలే గాని భారీ విగ్రహం పెట్టామనే పొగడ్తల కోసం కాదు. భారీ ప్రతిమలతో కాదు భక్తి శ్రద్ధలతో పూజిద్దాం.

- కాల్వ నిఖిత, సిద్దిపేట

### పరిశోధకుల టీంలను ఏర్పాటు చేయాలి

తెలంగాణరాష్ట్రంలోని పాఠశాలల్లోనూ,జూనియర్ కళాశాలల్లోనూ, డిగ్రీకళాశాలల్లోనూ, పోస్ట్‌గ్రాడ్యుయేట్ పబ్లిక్ స్కూల్లోనూ,గురుకులాలతో పాటువిశ్వవిద్యాలయాలలో నూతన సంస్కరణలు ప్రవేశపెట్టాలి. వివిధ యూనివర్సిటీల నుండి డాక్టరేట్ పట్టా పొందిన లెక్చరర్సును ఎంపిక చేసి ఇతర రాష్ట్రాలు,ఇతరదేశాలలో విద్యావ్యవస్థలో ఉన్న సంస్కరణ మన రాష్ట్రంలో ప్రవేశపెట్టడానికి గాను టీంగా పరిశోధకుల టీంలను ఏర్పాటు చేయాలి. వీరి సలహాలు, సూచనలను ప్రభుత్వం విద్యాశాఖ అనుసరించాలి.

- ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్ జిల్లా

### బ్యాంకుల్లో సొమ్ము జాగ్రత్త

ఈ మధ్య క్రిమినల్స్ ఇతరుల బ్యాంక్ ఖాతాల్లోకి జొరబడి కొంత సొమ్మును జమ చేయడం ఇది సైబర్ క్రైమ్‌కు సంబంధించినదని బ్యాంకు వారికి సమాచారం ఇవ్వడంతో బ్యాంకు వారు వెంటనే స్పందించి ఖాతాలను స్తంభింపచేయటం జరుగుతున్నది. ఎ.టి.ఎమ్.లో డబ్బుతీసుకుందామని వెడితే మీ ఖాతా తిరస్కరించబడినది. అనే మెసేజ్ రాగా, సైబర్ క్రైమ్ నంబరు 1930 ను సంప్రదిస్తే సమస్యను పరిష్కరించడానికి బదులు వారు దగ్గరనున్న పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయమని సలహాయిచ్చారు. ఈడబ్బును ఎవరు జమచేసారో వాళ్లను స్వయంగా సంప్రదించమన్నారు. ఆ డబ్బు ఇతరరాష్ట్రాల నుండి వచ్చిందని తెలిపారు. బ్యాంకుకు వెళ్ళిఅడుగగా వారు పరిష్కారం చేయడం జరిగింది. ఇది జరిగిన వారం తరువాత మరల ఎవరో కొంత సొమ్మును పంపి ఇది సైబర్‌క్రైమ్‌కు సంబంధించినదనిమెసేజ్. ఇలా ఎందుకు జరుగుతోంది? ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లేదా? ఇలాంటి ఉదంతం సికింద్రాబాద్‌లో నున్న యూనియన్ బ్యాంక్, అల్వాల్ బ్రాంచిలో ఓఖాతాదారునికి ఇలాగే జరిగింది.

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### మహిళా న్యాయమూర్తులను నియమించాలి

కోర్టులలో మహిళ న్యాయమూర్తులను నియమించడం తగ్గిపోయింది. ముఖ్యంగా మైనారిటీల నియామకం ఏ మాత్రం లేదు. దేశం లోమహిళ సమానత్వం గురించి చర్చ జరుగుతున్నప్పుడు ఉన్నత స్థానాలలోవాటా దక్కాలికదా మరిఎందుకు అలా జరగడం లేదు అనేది పెద్ద ప్రశ్న. ఒక్క నాగరత్న తప్ప ఇప్పుడు సుప్రీం కోర్టులో ఒక్క మహిళ న్యాయమూర్తి లేరు అంటే అతిశయోక్తి లేదు. ఒక్క ఎన్వీ రమణ ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న సమయంలో ఎక్కువమహిళ న్యాయమూర్తులనీ నియమించగా అది మొత్తం న్యాయమూర్తులలో 10 శాతం దాటలేదు అనే నిష్ఠుర సత్యం తీర్గం వేసుకోవాల్సి రావడమే విచారం.

-భారత అవినాష్, జనగామ

### ఉపాధి హామీ కల్పించాలి

తెలంగాణలో పెరిగిన నీటి వనరులు భూమి అభివృద్ధి కార్యక్రమాలను ఉపాధి హామీ కింద చేపించడం హామీ ఇవ్వన్నాయి. ఒకప్పుడు మురికి తుమ్మలు మొలిచిన నేలలు నేడు సాగు యోగ్యంగా మారడానికి ఉపాధి హామీ హామీ పడుతుంది. చిన్నచిన్న గూడెంలో కూడా ఎక్కువలో ఎక్కువగా 10 నుండి 15ఎకరాలలో మాత్రమే పాడుబడ్డ భూములున్నాయి.

-కె.రామారావు, నల్గొండ

మీ వ్యాసం ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# ప్రజాస్వామ్య లీల.. ప్రహసన హేల!

**చంద్రశేఖర్ ప్రధాన మంత్రిగా ఉన్నప్పుడు ఎన్నికల కమిషనర్‌గా శేషన్ నియామకం జరిగిన తర్వాత కమిషన్‌కు ఎక్కడలేని గుర్తింపు ప్రాముఖ్యత వచ్చాయి. ఒక్కమాటల్లో చెప్పాలంటే ఎన్నికల కమిషన్ అంటూ ఒకటి ఉందని, దానికి నియమావళి ఉందనే విషయం సాధారణ పౌరులకు అప్పుడే తెలిసింది.రాజకీయ ఒత్తిడిలకు లొంగకుండా నీతీ,నిజాయితీతో వ్యవహరిస్తే ఉన్నచట్టాలతో ఎంత వరకు చేయవచ్చునో ఆయన చేతల్లోచేసి చూపించారు.కొమ్ములు తిరిగిన నాయకులకు కూడా చెమటలుపట్టించారు. కరెంటు స్తంభాలకు జెండాలు కట్టాలన్నా, గోడల మీద రాయాలన్నా వెనుకా ముందు ఆలోచించాల్సిన పరిస్థితులు కల్పించారు. ఏ తప్పు చేస్తే ఏ మూల నుంచి కనిపెట్టి చర్యలకు ఒడిగడతారోననే భయం అభ్యర్థుల్లోనే కాదు వారిని బలపరుస్తున్న అనుచరుల్లోకూడా తెప్పించారు. కానీ ఆయన తర్వాత ఎన్నికల కమిషన్ అంతటి సమర్థత చూపలేకపోతున్నది.**

దామెర్ల సాయిబాబ

ఎలాంటి అవకతవకలకు, అవినీతికి, అన్యాయాలకు పాల్పడకుండా సంఘంలో నీతి,నిజాయితిలతో ఆదర్శనీయంగా, అనుకరణీయంగా జీవనం సాగించి మంచివారుగా బతకాలని కొందరు త్రికరణశుద్ధిగా భావిస్తున్నా, పరిస్థితుల, వూహించని సంఘటనలు పరిస్థితిలు ప్రభావంతో మారి చెడ్డవారిగా ముద్ర వేయించుకొంటుంటారు. మరికొందరు ఎప్పుడెప్పుడు పరులను మోసం చేద్దామా? అమాయకులను దగా చేసి, రాత్రికి రాత్రే లక్ష్మీపుత్రులు కావాలనే ఆరాటంలో చేయరాని, చేయకూడని పనులు చేయాలనీ తహతహలాడుతున్నా అవకాశాలు రాక మంచివారుగా మిగిలిపోతున్నారు.. గతంలో ఎన్నికల సంగ్రామం ప్రారంభమైనపుడు మాత్రమే గెలుపే ధ్యేయంగా అక్రమాలకు పాల్పడేందుకు సిద్ధపడేవారు. తాము చేసే అక్రమాలు వెలుగుచూస్తే సమాజం ముందు తలవంచుకొనే పరిస్థితులు దాపురిస్తాయనే భయభక్తులుండేవి. ఇప్పుడా పరిస్థితులులేవు. ఎన్నికలు ముగిసిన మరుసటి రోజు నుండే పత్యర్థులను రాజకీయంగా సమాధి చేయాలనే వ్యూహాలు పన్నుతున్నారు. ప్రత్యర్థుల,వారి సానుభూతిపరులు ఓట్లు తొలగించడం, తమకు అనుకూలమైన వారి ఓట్లతో జాబితా నింపడం పరిపాటిగా మారిపోతున్నది. బీహార్ ఎన్నికలు మరో రెండు నెలల్లో జరగనున్నాయి. ఇప్పటి నుంచే హోరాహోరీగా పోరాటం మొదలైంది. లక్షల సంఖ్యలో బోగస్ ఓట్లు చేర్చారని ఆరోపణలు వస్తున్నాయి. అధికారంలో ఏ పార్టీ ఉన్నా అవకతవకలకు ఒక్క అడుగు ముందే ఉంటున్నట్లు గతంలో జరిగిన ఎన్నికలు చెప్పకనే చెబుతున్నాయి. అధికారంలో ఉన్న పెద్దల సేవలో తరించి పోవాలనే తపన ఉన్న అధికారులు పెరిగిపోతుండంతో ఈ ఎన్నికల నిర్వహణలో ఈ దురదృష్ట పరిస్థితులు దాపురిస్తున్నాయి. ఇక వరాల వర్షం గూర్చి చెప్పాల్సిన పనిలేదు. ప్రజలు అడిగిన పనులే కాదు అడగని వరాలు కూడా గుప్పిస్తుంటారు. ఎన్నికల సమయంలో తప్ప తాము అడిగినపనులు నేతలు చేయరనే భావన గట్టిగా పట్టుబట్టి తమ కోరికలను తీర్చిన వారికే తమ ఓట్లని చెబుతున్నారు. గతంలో కూడా ఇదే ధోరణి ఉన్నా, గుడిగోపురాలు, కమ్యూనిటీ హాలు గురించి అడిగేవారు. ఇప్పుడీ పరిస్థితులు కూడా మారిపోయాయి. ఓటు వేస్తే తమకు ఏపాటి లాభమనే ఆలోచనవైపు మొగ్గు చూపుతున్నారు. ఫలితంగా ఎన్నికల వ్యయం పెరిగిపోతున్నది. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ఖర్చు చేయాల్సినదాని కన్నా ఇరవై,ముప్పైరెట్లు అధికంగాఖర్చు పెట్టాల్సి వస్తున్నది. అంతటి ఆర్థిక, అంగబలం ఉన్నవారే ఎన్నికల బరిలోకి దిగుతున్నారు. పార్టీలు కూడా టిక్కెట్ కేటాయించే ముందు ఈ అర్హతలనే పరిగణనలోకి తీసుకుంటున్నాయి. ఫలితంగా ప్రజా సేవచేయాలనే తపన ఉన్నవారు అంతో ఇంతో నిజాయితీగా వ్యవహరించేవారు ఈ వ్యయాన్ని భరించలేక ఎన్నికలకు దూరమవుతున్నారు. కోట్లాది రూపాయలు ఖర్చుపెడుతున్న వారికి తమపెట్టుబడిని తిరిగి రాబట్టుకోవాలని ఉండటం సహజం. అందుకే రాజకీయాల్లో అవినీతి ఒక భాగమైపోయింది. అవినీతి పెరగడానికి పరోక్షంగా నేర చరితులు, అవినీతిపరులు అందలం ఎక్కడంతో ప్రజల పాత్ర కీలకమని వాదించేవారు ఉన్నారు. ఇకపోతే గతంలో నాయకులు ఎంతో నీతినియమబద్ధంగా తమ ప్రవర్తన వ్యవహారశైలి, నడక, నడవడిక, క్రమశిక్షణే కాదు వేష భాషల పట్ల కూడా ఎంతో జాగ్రత్తలు తీసుకునేవారు. తమను ప్రతినిత్యం వెయ్యికళ్లు గమనిస్తుంటాయనే జంకు, భయం వారిలో ఉండేది. అందుకే రాజకీయాల్లో ప్రవేశించి మరింత ఎత్తుకు ఎదగాలనుకునేవారు ప్రతి అడుగు అంతో

ఒక్క మాట

ఇంతో ఆచితూచి వేసేవారు. అవినీతి, ఆశ్రితపక్షపాతం వీటన్నింటినిమించిన ప్రవర్తన పట్ల ఎన్నో జాగ్రత్తలు తీసుకునేవారు. గ్రామసర్పం చులుగా రాజకీయ ప్రవేశం చేసిన వారు అంచెలంచెలుగా ఆనాటి సమితి అధ్యక్షులుగా,శాసనసభ్యులుగా, పార్లమెంటు సభ్యులుగా,రాష్ట్ర మంత్రులుగా, ముఖ్యమంత్రులుగా, కేంద్ర మంత్రులుగా పెరిగిన వారెందరో ఉన్నారు. నేరచరితులు పెరిగిపోతున్నారు. దీన్ని అడ్డుకునేందుకు చేస్తున్న ప్రయత్నాలు అంతగా ఫలించడం లేదు. గత ఇరవైయేళ్లుగా ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు విజయం సాధించిన వారిలో లెక్కలు పరిశీలిస్తే ఎన్నికల ఎన్నికలకు నేరచరితుల సంఖ్య పెరిగి పోతున్న విషయంస్పష్టమవుతున్నది. రానురాను ఈ సంస్కృతి పెరిగిపోతుందనడానికి ఆ అంకెలే అద్దం పడుతున్నాయి. ఈ పార్టీ, ఆపార్టీ అనికాదు. ఏదోకొద్ది మంది కొన్ని పార్టీలు తప్ప అన్నిపార్టీలు అదేబాటలో పయనిస్తున్నాయి. ఏమిచేసి అయినా అధికారాన్ని కైవసం చేసు కోవాలనే ఆరాటంలో నైతిక విలువలకు లోదకాలిస్తున్నాయి. ఈ ఆరాటపోరాటంలో చేయకూడని, చేయరాని పనులు కూడా చేస్తున్నారు. ఎన్ని చట్టాలు చేసినా,మరెంత పకడ్బం దీగా ఏర్పాటు చేసినా పోలింగ్‌లో కొన్నిప్రాంతాల్లో రిగ్గింగ్‌ను, దౌర్జన్యాన్ని నిరోధించలేకపోతున్నారు. రాజకీయ పార్టీలు విరాళాల పేరుతో నల్లధనస్వాముల నుంచి నిధులు పోగేసు కుంటున్నాయి. ఎన్నికల్లో విచ్చలవిడిగా డబ్బును వెదజల్లు తున్నారు. చట్టంలో లొసుగులను అడ్డం పెట్టుకొని కొన్ని పార్టీలు ధనసేకరణకు పెద్దఎత్తున పాల్పడుతున్నాయి. ఇది ఇప్పటికిప్పుడు కొత్తగా పుట్టింది కాకపోయినా రాను రాను పెరిగిపోతున్నది.కొన్ని రాజకీయ పార్టీలు విరాళాల రూపేణ నల్లధనాన్ని మార్చుకు నేందుకు ఉద్భవించాయనే ఆరోపణల ను తోసిపుచ్చలేం. గ్రామస్థాయి నుండి సాధారణ శాసనసభ, లోక్‌సభ, ఒక్కటే మిటి ఏ ఎన్నికలు జరిగినా కోట్లాదిధనం నీరులా ప్రవహిం పచేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. అయితే వీటిని నియంత్రించేందుకు ఏనాటి నుంచో చట్టాలు న్నాయి. మరెన్నో నిబంధనలున్నాయి. వాటిని అమలు చేయాల్సిన అధికారుల్లో చిత్తశుద్ధి లేదేమోననిపిస్తున్నది. భారతదేశంలో లోక్‌సభ నియోజకవర్గాలకు కానీ,శాసనసభ లకు పోటీపడుతున్న అభ్యర్థులు గరిష్టంగా ఎంతఖర్చుచేయ వచ్చో పటిష్టమైన చట్టం, నిబంధలు ఏర్పా టుచేశారు. ఇవి ఎంతవరకు అమలు అవుతున్నాయో అందరికి తెలుసు. ఓటర్లను ప్రభావితం చేసేందుకు చేస్తున్న ఖర్చు గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. కొన్నిరాష్ట్రాల్లో డబ్బులు, చీరలు, ముక్కు పుడకలు, కమ్మలు ఒక్క టేమిటి ఏమి ఇస్తే తమకు ఓట్లు వేస్తారోననే తర్జనభర్జనలు చేసి ఎంతో ముందుగానే నిలవచేసుకుంటున్నారు. ప్రతిఎన్నికల్లో పోలీసులకు పట్టుబడుతూనే ఉన్నాయి. ఆ ఎన్నికలకు ఎన్నికల కమిషనే ఊపిరి. అందుకే భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని రాజకీయ ఒత్తిడిలకు లొంగకుండా రాగద్వేషాలకు అతీతంగా వ్యవహరించగలిగే స్వతంత్ర ప్రతిపత్తి హోదాతో దేశంలోని చట్టసభలకు ఎన్నికలు నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల కమిషన్‌ను ఏర్పాటు చేశారు. 1952నుంచి లోక్‌సభ, రాజ్యసభ, శాసనసభ ఎన్నికలు ఈ ఎన్నికల కమిషన్ పర్యవేక్షణలోనే జరుగుతున్నాయి. రాష్ట్ర పతి,ఉపరాష్ట్రపతి ఎన్నికలుకూడా కమిషన్ పరిధిలోకే వస్తాయి. మొదట్లో ఏకసభ్య కమిషన్ ఏర్పడిన తర్వాత త్రిసభ్య కమిషన్‌గా రూపాంతరం చెందింది. ఎన్నికల్లో ఎంత ఖర్చు పెట్టాలి?సభలు, సమావేశాలు ఏ సమయం వరకు నిర్వహించుకోవచ్చు?ఎన్ని వాహనాలు వాడాలి? తదితర విషయాల్లో స్పష్టమైన నిబంధనలతో ఎన్నికల నియమావళిని రూపొందించారు. ఈ నియమని బంధనలన్నింటినీ చాలాకాలం ఫైళ్లల్లోనే నిద్రపుచ్చారు. చంద్రశేఖర్ ప్రధాన మంత్రిగా ఉన్నప్పుడు ఎన్నికల కమిషనర్‌గా శేషన్ నియామకం జరిగిన తర్వాత కమిషన్‌కు ఎక్కడలేని గుర్తింపు ప్రాముఖ్యత వచ్చాయి.ఒక్క మాటల్లో చెప్పాలంటే ఎన్నికల కమిషన్ అంటూ ఒకటి ఉందని, దానికి నియమావళి ఉందనే విషయం సాధారణ పౌరులకు అప్పుడే తెలిసింది. రాజకీయ ఒత్తిడిలకు లొంగకుండా నీతి,నిజాయితీతో వ్యవహరిస్తే ఉన్నచట్టాలతోఎంత వరకు చేయవచ్చునో ఆయన చేతల్లోచేసి చూపించారు.కొమ్ములు తిరిగిన నాయకులకు కూడా చెమటలుపట్టించారు.కరెంటు స్తంభాలకు జెండాలు కట్టాలన్నా, గోడల మీద రాయాలన్నా వెనుకా ముందు ఆలోచించాల్సిన పరిస్థితులు కల్పించారు. ఏ తప్పు చేస్తే ఏ మూల నుంచి కనిపెట్టి చర్యలకు ఒడిగడతారోననే భయం అభ్యర్థుల్లోనే కాదు వారిని బలపరుస్తున్న అనుచరుల్లోనూ తెప్పించారు. కానీ ఆయన తర్వాత ఎన్నికల కమిషన్ అంతటి సమర్థత చూపలేకపోతున్నది. ఇదేపరిస్థితి కొనసాగితే ప్రజాసేవకే అర్థం మారిపోవడంఖాయం.ఎన్నికల కమిషన్ రాజ కీయాలకు, రాగద్వేషాలకు అతీతంగా నిష్పాక్షికత, విశ్వసనీయతే ఊపిరిగా పనిచేయాలి. సవరణలు కొత్త చట్టాలు మాటఅటుంచి ఉన్నచట్టాలను త్రికరణశుద్ధిగా అమలు చేసేందుకు కమిషన్ కృషిచేయాలి. పరిస్థితులు ఇలాగే కొనసాగితే ప్రజాస్వామ్యం ప్రహసనంగా మారక తప్పదు. •

# వర్ష వైపరీత్యాలకు ముందస్తు జాగ్రత్తలు అవసరమే


దాడిశెట్టి శ్యామ్ కుమార్

వర్షాకాలంలో తరచుగా సంభవిస్తున్న వాతావరణ మార్పులు అల్పపీడన ద్రోని ప్రభావం ప్రకృతి వైపరీత్యాల కారణంగా కురుస్తున్న మోతాదుకు మించిన వర్షాలు ఈదురుగాలులతో కూడి వాన బీభత్సం సృష్టిస్తుంటే పట్టణాలు గ్రామీణ ప్రాంతాలలో ప్రజల జీవన విధానం అస్తవ్యస్తమవుతుంది. పట్టణాలు గ్రామాలు జలదిగ్బంధానికి అడపాదడప గురవుతూ జలదారలుగా ప్రవహిస్తున్న వర్షపు నీటితో జనజీవనం స్తంభించిపోతుంది. పట్టణాల్లో ఎక్కడ పడితే అక్కడ ప్రణాళిక బద్ధంగా లేని కట్టడాలు ఎక్కువ అవుతుండడం, జల ప్రవాహం సాఫీగా పోయే ప్రాంతాల్లో అడ్డుకట్టాలుగా నిర్మించిన కట్టడాలు, ప్రకృతి వైపరీత్యాలలో సంభవించే వరద తాకిడికి పరిసర ప్రాంతాలలోని ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతుండటం సర్వసాధారణం అయిపోతుంది. పట్టణ ప్రాంతాల్లో కొంత మేరకు చెరువుల సమీపంలో బఫర్ జోన్లు ఫుల్ ట్యాంక్‌జోన్లు పరిధిలో నాలాలుపై క్రమబద్ధీకరించబడని అక్రమ కట్టడాలతో పట్టణ పరిసర ప్రాంతాల్లో అకాల వర్షాలతో వర్ష బీభత్సంతోపట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతుండటమే కాకుండా అధికారులకు కూడా ఇలాంటి కట్టడాలతో వరద నీరును మళ్లించే ప్రయత్నంలో తీవ్రమైన ఇబ్బందులు పడవలసి వస్తున్నది. నీటి ప్రవాహం వెళ్లే దారులు మూసుకోవడంతో ప్రతికూల ప్రభావంతో వర్షాకాలంలో పట్టణం జలదిగ్బంధంగా మారిపోతూ దినచర్యలో అంతరాయం కలుగుతుంది. పట్టణాల్లో నిర్దిష్టమైన ప్రణాళికలతో సంబంధిత అధికారులుముమ్మందు రాబోయే ఇలాంటి ప్రకృతి వైపరీత్యాలను తట్టుకోవడానికి వరద నీరు అధికంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి వాటికి అనుగుణమైనటువంటి మార్గాలను అనుసరించవలసిన విధానాలను చట్టపరమైన రీతిలో అవలంబించవలసిన ఆవశ్యకత మరింత ఉందేమో. నిపుణులు అధికారులు ముందు చూపుతో సమాజంలో ఉన్న ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రజల సహకారంతో పట్టణాలను సురక్షిత జోన్లుగా ఉండే విధంగా పట్టణాలను, గ్రామాలను సైతం ప్రగతి పథంలోకి తీసుకుపోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మరోవైపు అధిక వర్షపాతంతో గ్రామీణ ప్రాంతాల్లో చెరువులు మత్తడి పోస్తూ చెరువు కట్టలు తెగిపోతుండడంతో పంటలు నీట మునిగిపోతూ రైతులు తలడిల్లి పోతున్నారు. అకస్మాత్తుగా వస్తున్న వాతావరణ మార్పులతో అన్నదాత రైతన్న పంటలను కోల్పోయి పెట్టిన పెట్టుబడి చేతికందకుండా దిగుబడి పూర్తిగా కోల్పోయి నష్టాల ఒడిలో కూరుకుపోయి నేలకొరిగిన పంటలను చూస్తూ కన్నీటి పర్యంతం అవుతున్న రైతన్నల ఆవేదన వర్ణాతీతమే. వ్యవసాయాన్ని కష్టాన్ని నమ్ముకుని కుటుంబాన్ని పోషించుకునే రైతాంగం తరచుగా వర్షాకాలంలో మోతాదుకు మించి పడుతున్న వర్షాలతో వ్యవసాయరంగంలోని భిన్న పరిస్థితులతో అనేక సమస్యలతో సతమతం అవుతుండడం మరో ఎత్తు అవుతుంది. దేశానికి వెన్నెముక అన్నంపెట్టే రైతన్న పొలాన్ని దుక్కిదున్ని పంట పండించిస్తే అల్పపీడన ద్రోణి ప్రభావంతో అధిక వర్షాలతో చేతికి వస్తుందని అనుకున్న పంట కనుల ముందే చూస్తుండగానే మొత్తం భూమిపాలై నష్టపోవడంతో పంటలు కోల్పోయిన రైతన్న కళ్లల్లో కన్నీళ్లు తిరుగుతుండటం సహజమే. భూమిని నమ్ముకుని బతుకుతున్న రైతన్నలు చాలా ఎకరాలలో సాగుచేసిన మొక్కజొన్న పత్తి,వరి,పసుపులాంటి పంటలు ఎదుగుతున్న తరుణంలో అధిక వర్షాల ప్రభావంతో పంట మొత్తం నేలకు ఒరిగిపోతే అన్నదాత దిగులుగా నష్టపోయిన పంటను చూస్తూ ఎవరోవస్తారని ఏదైన సహాయం చేస్తారేమోనని ఆశతో అల్లాడిపోతున్న రైతులకు ప్రభుత్వాలు మరింతగా భరోసా కల్పించేలా నష్టపోయిన పంటకు పరిహారంచెల్లించేలా సహాయ సహకారాలు అందించాలి. •

# నయా వలసవాదం అంటే ట్రంప్ విధానాలే కదా!


డాక్టర్ ఎనుగొండ నాగరాజ నాయుడు

అంతర్జాతీయ వాణిజ్యవిధానాలను అమెరికా తన గుప్పెట్లోకి తీసుకొని ప్రపంచంలోనే అత్యధికంగా మన దేశంపై 50 శాతం పైగా దిగుమతి సుంకాలను విధించింది. పెట్టుబడిదారీ దేశాలకు లాభోద్దేశం తప్పవేరే ఆలోచన ఉండదు. ప్రపంచంలో భారత్, అమెరికా పెద్దప్రజాస్వామ్య దేశాలు. వీరి మధ్య నడుస్తున్న వాణిజ్యయుద్ధాలు ప్రజలను తీవ్ర సంక్షోభంలోకి నెట్టివేస్తున్నాయి. భారత్లో ఆనాటి బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీనే మించిపోయింది ఈనాటి అమెరికా సామ్రాజ్యవాదం. మన దేశాభివృద్ధికి మన పాలకులు అనుసరించే ఆర్థిక అభివృద్ధి,వివిధ రంగాల సంరక్షణ విధానాలను ప్రశ్నించేందుకు, ఎదిరించేందుకు అమెరికా ప్రెసిడెంట్ ఎవరు? వ్యవసాయం,పాడిపరిశ్రమ, మత్స్య పరిశ్రమ మొదలైన ప్రాథమిక రంగాల నుంచి పారిశ్రామిక రక్షణరంగాల వరకు మనం చేపట్టే విధానాలను ఎప్పుడు వ్యతిరేకించడమేనా అమెరికా పని. ఏమైతేనేం తాజా సుంకాల భారం మన దేశంనుంచి పోయే 66ఎగుమతులపై తీవ్ర ప్రభావమే చూపగలదని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇందువల్ల ఈ ఏడాది వచ్చే ఏడాది మన వృద్ధిపై 0.8కోత పడవచ్చును అంటున్నారు. రత్నాభరణములు, దుస్తులు,వాహనాల విడిభాగాలు,స్టీలు,రొయ్యలు,తోలు ఉత్పత్తులు మొదలైన ఎగుమతులపై ప్రతికూల ప్రభావం ఉంటుందని ఈ రంగాలలో అనిశ్చితి ఏర్పడుతుందని అంచనా. ఈ రంగాలలో పనిచేసే లక్షలాది కార్మికులు ఉద్యోగాలు కోల్పోవలసి వస్తుంది. అమెరికా తమ డైరీ ఉత్పత్తులను జన్యు మార్పిడి ఆహార ఉత్పత్తులను మనకు ఎగుమతి చేయాలని ఒత్తిడినీ అంగీకరించపోవడం ట్రంపు కడుపు మంటకు కారణం. కానీ రష్యా నుంచి దిగుమతి చేసుకునే ముడిచమురు కారణంగా చెబుతున్నారు. భారత్లో 46శాతం మంది సాగు రంగంపై ఆధారపడుతున్నారు. అమెరికాలో ఇది ఒక్క శాతం మాత్రమే. మన దేశ జనాభాలో సగం మంది ఆధారపడే సాగు రంగాన్ని నిర్వీర్యం చేయాలట. అమెరికాలో ఆ ఒక్క శాతం జనాభా చేసే డైరీ ఉత్పత్తులను జన్యు మార్పిడి ఆహార ఉత్పత్తులను మనము దిగుమతి చేసుకోవాలట. భారతదేశ వివిధ కారణాల వల్ల గత పాతిక సంవత్సరాలుగా అమెరికన్ శిబిరానికి సన్నిహితంగాఉంటూ వచ్చింది. ఇటీవల కాలంలో బలహీనపడుతున్న అమెరికాకు మన దేశం పట్ల ప్రపంచం పట్ల దృష్టి మారి గతం కన్నా భిన్నమైన విధానాలను రూపొందించుకుంటున్నది. ఈ కొత్త పరిస్థితి భారతదేశానికి ఒక పరీక్షగా మారింది అన్నది గుర్తించవలసిన విషయం. అమెరికా విధానాలలోని మార్పులవల్ల వాణిజ్య ఒప్పందపు చర్చల రూపంలో ఇతరత్రా కూడా




ఎదురవుతున్న ఆర్థికరంగ సమస్యలు కనిపిస్తున్నావే. ప్రపంచంలో భారత్ మూడవ అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా ఎదుగుతున్న వేళ అమెరికా తన నయా వలస పాలన బహిర్గతమవుతున్నది. అమెరికాలో 50 లక్షల మంది ఇండియన్ అమెరికన్లు ఆ దేశ ఆర్థిక అభివృద్ధికి తోడ్పడుతున్నారని తరచూ అభినందిస్తూ ఉంటారు. వీరు పెద్ద టెక్ సంస్థలైన గూగుల్ మైక్రోసాఫ్ట్, ఫైనాన్షియల్ సంస్థలను నడుపుతున్నారు. విద్యా విధాన నిర్ణయానక సంస్థల్లో కీలక పదవుల్లో ఉన్నారు. యుఎస్ ప్రెసిడెంట్ ట్రంప్ రెండవసారి అధికారంలోకి రావడానికి భారతీయులు ఎంతోకృషిచేసినారు. యుఎస్ సెకండ్ లేడీ అయినా ఉష బాల చిలుకూరి సుప్రసిద్ధ అమెరికన్ లాయర్ కూడా భారతీయురాలే. ఇండియా పట్ల అమెరికా వ్యవహరిస్తున్న తీరు చూసి వారికి విచారం వేయడం నిజమేకదా. అమెరికా తాను ఆపాదించుకున్న ప్రపంచ పెద్దన్న పెద్దరికంతో తాను విశ్వసనీయ భాగస్వామిగాగుర్తించాలంటే అమెరికా కనుసన్నల్లో ఉండడమేనా? వ్యతిరేకిస్తే నియంతగా వ్యవహరిస్తారా? భారతదేశపు మార్కెట్ చాలా పెద్దదని అమెరికాకు తెలుసు. అమెరికాతో మనం శాస్త్రసాంకేతిక రంగాలలో పోటీ పడుతున్నామని కూడా తెలుసు. మన మానవ వనరులు అమెరికా దేశాభివృద్ధికి ఎలా తోడ్పడుతున్నాయో తెలుసు. మన ప్రతిభావంతులైన శాస్త్రవేత్తలు, విద్యావంతులు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్స్ డాక్టర్స్ ఇతర సేవారంగాలు అమెరికా శాస్త్రసాంకేతిక రంగాలలోతోడ్పడుతున్నారు. మార్కెట్ రీత్యా గాని మానవ వనరుల అభివృద్ధి పరంగా గాని భారతదేశం అతి పెద్ద ఆర్థికవ్యవస్థ. అయితే పటిష్టవంతమైన ఆర్థిక విధానాలు,ప్రభుత్వ నియంత్రణ లేనందున స్వయం పోషకత్వంలో చైనా లాగా మనం నిలదొక్కు లేకపోతున్నాం. సామ్యవాద తరహా సమాజ నుంచి పెట్టుబడిదారి సమాజం వైపు అడుగులు వేసాం. దీనివలన ప్రపంచ పెట్టుబడిదారీ దేశాల కనుసన్నల్లో ముఖ్యంగా అమెరికావిధానాలకు లోబడిపోయే పరిస్థితి ఏర్పడింది. 79 సంవత్సరాలుగా అనేక సందర్భాలలో అమెరికన్ సామ్రాజ్యవాద ఇండియాను తన ఆదేశాలను పాటించాలని బెదిరిస్తుంది. బ్రిటిష్ రాజ్యం నుంచి బిలియనీర్ల రాజ్యం వైపుగా భారత్ ఇప్పటికే పునాదులు వేసుకున్నది. ఎందుకంటే మన పెట్టుబడిదారీ వర్గం ఇప్పటికే అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడితో మమేకమైపోయింది. బడా బుర్జువావర్గ ప్రయోజనాలను నెరవేరుస్తున్న ప్రభుత్వం తన సొంత ప్రయోజనాలను దేశాభివృద్ధిని ఆర్థిక వ్యవస్థ స్వయం పోషకత్వాన్ని పెంపొందించుకోగలదా? అగ్రరాజ్యమని చెప్పుకునే అమెరికా తమ పెట్టుబడిదారులను ప్రోత్సహించి ప్రపంచ పెట్టుబడిదారులను నియంత్రించే పరిస్థితి ఉన్నది నేడు. ప్రభుత్వపాలన పెట్టుబడిదారీ కనుసన్నల్లో కాకుండా ప్రజలను శాస్త్ర సాంకేతిక రంగాలలోమమేకం చేసి వస్తు ఉత్పత్తి చేస్తే ఎవరికి ఏమీ మనము తీసిపోము. జరగాలి. స్వాలంబనకు భారత్ ఇప్పుడు తీవ్రమైనసవాలను ఎదుర్కొంటుంది. ఎందుకంటే మన పెట్టుబడిదారీ వర్గంఇప్పటికే అంతర్జాతీయ ద్రవ్యపెట్టుబడితో మమేకమైపోయింది. ప్రభుత్వాలు చేపట్టే మేక్ ఇన్ ఇండియా లాంటి పథకాలు విజయవంతం కావడంలేదు. ఆ అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి సామ్రాజ్యవాద పెత్తనం నుండి దేశం బయటపడాలి. •

అమరావతి వార్త





# తురకపాలెం ఘటనపై ప్రభుత్వం సీరియస్

గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి, సెప్టెంబర్ 5: గుంటూరు జిల్లా తురకపాలెంలో 5 నెలలుగా చోటుచేసుకుంటున్న మహమ్మారితో మృతులపై రాష్ట్ర ప్రభుత్వం అధికారులతో సీరియస్ అయ్యింది. అయిదు నెలలుగా మహమ్మారి వెంటాడుతున్నా ఎందుకు అలసత్వం వహించారంటూ జిల్లా వైద్యఅధికారులపై ప్రభుత్వం మండిపడినట్టు సమాచారం. పదుల సంఖ్యలో చనిపోయినా

**అధికారుల అలసత్వంపై సిఎం మండిపాటు**
**-సిఎం ఆదేశాలతో ముమ్మర చర్యలు**
**-వారం రోజులపాటు బాధితులకు ఆహారం,నీరు సరఫరా**
**-నేడు రక్త,నీటి నమూనాల సేకరణకు 50 బృందాల రాక**

పట్టించుకోరా. అంటూ అధికారులను ప్రభుత్వం తీవ్రంగా హెచ్చరించినట్టు తెలిసింది. తురకపాలెం ఘటన నివేదికపై సమీక్షించిన సిఎం చంద్రబాబు ముమ్మర చర్యలకు ఆదేశాలు జారీ చేశారు. బాధితులందరికీ తాము ఉన్నామంటూ ధైర్యం చెప్పాలంటూ వైద్యఆరోగ్యశాఖ మంత్రి ఆ గ్రామానికి వెళ్లాలని సిఎం ఆదేశించటంతో శుక్రవారం తురకపాలెంలో మంత్రి సత్యకుమార్ యాదవ్ పర్యటించి ఘటనపై ఆరా తీశారు. ఊరులోని అన్నివీధుల్లో పర్యటించి బాధితుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. మహమ్మారి కబళించిన బాధిత కుటుంబాలకు వెళ్లిన సత్యకుమార్ వారిని ఓదార్చి పరామర్శించారు. మహమ్మారి ప్రబలటంపై కారణంపై నివేదికలకు ఆదేశించామని, త్వరలో రానున్న నమూనా ఫలితాల ఆదారంగా నివారణ చర్యలు చేపడతామని బాధితులకు భరోసా నిచ్చారు. అయితే సిఎం ఆదేశాలతో అధికార యంత్రాంగం ఆగ్రామంలో ముమ్మర చర్యలకు శ్రీకారం చుట్టింది. సిఎం చంద్రబాబునాయుడు తురకపాలెంలో పూర్తిగా మహమ్మారి అదుపులోకి వచ్చేంతవరకు నిత్యం



శుక్రవారం మధ్యాహ్నం గుంటూరు జిల్లా తురకపాలెంలో పర్యటించిన మంత్రి సత్యకుమార్ యాదవ్

## మేం సిద్ధంగా ఉన్నాం.. వైద్య సేవలు పొందండి

**-తురకపాలెంవాసులకు ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ భరోసా**

మెయిన్‌లో

వైద్యాధికారులు, ఇతర అధికారులు ఏరోజుకు ఆరోజు ఆగ్రామంలో పర్యటించి పరిస్థితిని సమీక్షిస్తూ బాధితులకు ధైర్యం చెప్పాలని కోరారు. బాధిత కుటుంబాలకు వారం రోజులపాటు రాష్ట్ర ప్రభుత్వమే ఆహారం మంచినీరు సరఫరా చేసేందుకు సన్నాహాలు చేస్తోంది. రక్త, నీటి నమూనాల ఫలితాలు వచ్చేంతవరకు బాధిత కుటుంబాలందరికీ ప్రభుత్వమే ఆహారం, మంచినీటి సరఫరా చేసేందుకు కసరత్తు చేస్తోంది. ఏ బాధిత కుటుంబం కూడా ఆహారం తయారు చేసుకోకుండా, ప్రభుత్వమే వారికి




ఈ సౌకర్యం కల్పించేందుకు చర్యలు చేపట్టింది. వీధుల్లోని పారిశుద్ధ్య పనులను కూడా ముమ్మరం చేశారు. జిల్లా పంచాతీయ అధికారి సాయికుమార్ నేతృత్వంలో పారిశుద్ధ్య సిబ్బంది తురకపాలెంలో ప్రతివీధిలో పారిశుద్ధ్యం పనులను ముమ్మరం చేశారు. ఈ పనులు పూర్తిస్థాయిలో పూర్తయ్యేంతవరకు సిబ్బంది అక్కడే తిష్టవేసి దోమలు, బ్యాక్టీరియా నివారణకు బ్లీచింగ్, ఫినాయిల్ , కిరోసిన్ వంటి ద్రవాలతో నిర్మూలనా చర్యలు చేపడుతున్నారు. నీటి నిల్వలు, మురికి కుంటలను పూర్తిగా లేకుండా చేస్తూ బ్లీచింగ్, ఫినాయిల్‌తో పారిశుద్ధ్య పనులు ముమ్మరం చేశారు. అంతుచిక్కని ఈ మహమ్మారి ప్రబలటానికి వైద్యబృందం అన్వేషణ మొదలుపెట్టింది. రక్త, నీటి నమూనాలు సేకరణకు 50 వైద్యబృందాలు ప్రభుత్వ ఆదేశాల మేరకు నేడు తురకపలెం రానున్నాయి. ఈ వైద్యబృందాలు ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసి ప్రజల నుంచి రక్త నమూనాల సేకరణతోపాటు, మంచినీటి పథకాల నీటిని కూడా సేకరించే పనిలో నిమగ్నం కానున్నాయి. ఏది ఏమైనా పూర్తిస్థాయిలో ఈ మహమ్మారిని నిర్మూలించేవరకు అధికార యంత్రాంగం ముమ్మరంగా చర్యలు చేపట్టాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి నేతృత్వంలో అధికారులదరూ ఆ గ్రామంలో చర్యలు చేపట్టారు. ఈ గ్రామంలో ఒకరికి జ్వరం రావటం కాళ్లు, ఒళ్లునొప్పులు రావటం అకస్మాత్తుగా అనారోగ్యానికి గురవుతూ అయిదు నెలల కాలంలో 45 మంది మృత్యువాత పడినట్టు సమాచారం. ఈ మహమ్మారి బారినపడి మరో 300 మంది కోలుకుంటున్నారు. ఈ యొక్క మహమ్మారి ఎక్కువ దళితకాలనీలోనే ఎక్కువ మందిని పొట్టనపెట్టుకుంది. నీరు కలుషితం అయ్యిందని, నీరు తాగటం వల్లే దద్దర్లు, అనారోగ్యం ఏర్పడుతుందని గత ఏడాది అక్టోబర్‌లోనే గ్రామ ప్రజలు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసుకున్నా... ఫలితం శూన్యమైంది. కాలువ నుంచి వచ్చే మంచినీటిని సమీపంలోని క్వారీ గుంతల్లోకి తరలించి ఇక్కడ నుంచి ట్యాంకుల ఎక్కించి సరఫరా చేయటం జరిగింది. ఈ క్వారీ గుంత నాచుపట్టి పూర్తిగా కలుషితమై ఉన్నప్పటికీ అధికారులు ఆ నీటినే సరఫరా చేయటం వల్ల ఎక్కువ మందిని కోల్పోవాల్సి వచ్చిందంటూ గ్రామప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామం చుట్టూ వాటర్ ప్లాంట్‌లు ఉన్నా ధనికులకే ఆ నీరు సాధ్యమైందని, తాము డబ్బులు లేక కొనలేక ఈ నీటిపైనే ఆధారపడి తమ వారిని కోల్పోవాల్సి వచ్చిందంటూ బాధితులు 'ప్రభాతవార్త' ఎదుట కన్నీటి పర్యంతమయ్యారు. ఒకవైపు కలుషిత నీరు మరోవైపు పడకేసిన పారిశుద్ధ్యంతో ప్రబలిన మహమ్మారి తమకు తీరని అన్యాయం చేసిందని బాధిత కుటుంబాలు వాపోతున్నారు. ప్రభుత్వాధికారులు సకాలంలో స్పందించి ఉంటే తమకు ఈ దుస్థితి వచ్చేది కాదని ఆవేదన వ్యక్తం చేశారు. తమవారిని కోల్పోయిన తర్వాత ప్రభుత్వం స్పందించి పెద్దఎత్తున 3 రోజులుగా ముమ్మర చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు. తాము ఫిర్యాదు చేసిన నాడే అధికారులు స్పందించి ఉంటే ఇంత ఘోరం జరిగేది కాదని విలపించారు. అధికారుల అలసత్వం కారణంగా జరిగిన తప్పిదంపై ప్రభుత్వం తీవ్రంగా స్పందించి బాధితులకు భరోసాగా నిలిచింది. వారి కష్టాలను తెలుసుకునేందుకు గ్రామాన్ని సందర్శించిన మంత్రి సత్యకుమార్ యాదవ్ వాస్తవ పరిస్థితులు తెలుసుకుని సిఎంకు నివేదించారు.

### ఆర్థిక నేరాల్లో ఆరితేరి, రియల్ ఎస్టేట్ ముసుగులో మోసాలకు పాల్పడుతున్న

## తల్లి , కొడుకును అరెస్ట్ చేసిన నగరంపాలెం పోలీసులు

గుంటూరు క్రైమ్, సెప్టెంబర్5, ప్రభాతవార్త: నగరంపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని కన్నా వారి తోటలో ఒక ఆస్తిని సుమారు నాలుగు కోట్ల 50 లక్షలకు అమ్ముతామని 2015 సంవత్సరంలో పచ్చిపులుసు.రామనాదం వయస్సు 63 సం.రాలు, రామాలయం దేవాలయం వద్ద, పిడుగురాళ్ల పట్టణం, పల్నాడు జిల్లా అనే వ్యక్తిని నమ్మించి నకిలీ ఆస్తి ధ్రువపత్రాలు సృష్టించి, బాధితుల పేరు మీద రిజిస్ట్రేషన్ కూడా చేయించి, బాధితుల నుండి పలు దఫాలుగా ఆస్తి విక్రయానికి సంబంధించి నగదు తీసుకోవడం జరిగింది. రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయిన తర్వాత బాధితులు ఆస్తిని స్వాధీనం పరుచుకోవడానికి వెళ్ళినపుడు ఆ ఆస్తి గడ్డం పాల్వాయి. ప్రసన్నలక్ష్మి, పాల్వాయి. జయకృష్ణ అను



వారిది కాదని, వారు మోసం చేశారని తెలుసుకున్న బాధితులు తమ డబ్బులు తిరిగి ఇవ్వాలని నిందితులను కోరగా ఇస్తామని చెపుతూ మాటలు దాట వేస్తూ రావడం జరిగింది. విసిగిపోయిన బాధితులు నిందితులను గట్టిగా నిలదీయగా మీకు చేతనైనది చేసుకోండి, మీ డబ్బులు మేము ఇవ్వము, మిమ్మల్ని ఏదైనా చేస్తాము అని బెదిరించగా బాధితులు నగరంపాలెం పోలీస్ స్టేషన్లో ఈ మోసానికి సంబంధించి ఫిర్యాదు ఇవ్వడం జరిగింది.

బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఆదేశాల మేరకు గుంటూరు వెస్ట్ డి.ఎస్.పి అరవింద్ పర్యవేక్షణలో నగరంపాలెం సిఐ నజీర్ బేగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి, నిందితులను అరెస్ట్ చేయడం జరిగింది. దర్యాప్తులో నిందితులు రియల్ ఎస్టేట్ ముసుగులో పలు ఆర్థిక నేరాలకు పాల్పడి, పలువురిని మోసం చేశారని, వీరిపై కేసులు కూడా నమోదై జైలు కూడా వెళ్లి వచ్చినారని తెలిసినది. ఈ కేసులో తదుపరి దర్యాప్తు జరిపి నిందితులుగా ఉన్న వారిని త్వరలో అరెస్ట్ చేస్తామని వెస్ట్ డిఎస్పీ కే.అరవింద్ తెలిపారు.





గురుపూజోత్సవం సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించి అవార్డులు ప్రదానం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు , మంత్రి నారా లోకేష్

## టెడ్ ఎక్స్ వేదికపై చరిత్ర సృష్టించిన పశ్చిమ ఎమ్మెల్యే మాధవి

గుంటూరు క్రైమ్, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త : స్థానిక పశ్చిమ ఎమ్యెల్యే గళ్ళా మాధవి మరోసారి తన ప్రత్యేకతను చాటుకున్నారు. హైదరాబాదులోని సింబియోసిస్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీలో జరిగిన ప్రతిష్టాత్మక టెడ్ ఎక్స్ కార్యక్రమంలో ప్రసంగించి చరిత్ర సృష్టించారు. ఏపి నుంచి ఈ వేదికపై



మాట్లాడిన తొలి రాజకీయ నాయకురాలిగా నిలిచారు. సానుకూల మనస్థత్వం సమాజాన్ని మార్చగలదు. సమస్యలను దాటుకొని ముందుకు సాగేందుకు ప్రతి ఒక్కరి లోపలే శక్తి ఉంది, అని ఎమ్మెల్యే తన ప్రసంగంలో స ్పష్టం చేశారు. సమాజాన్ని సమగ్రంగా, సమానత్వంతో ముందుకు తీసుకెళ్ళడం మన అందరి భాద్యత అని, మార్పు మనలో నుంచే మొదలవ్వాలి, అంటూ ప్రేక్షకులను ఉత్సాహపరిచాచు. ఈ ప్రసంగం టెడ్ ఎక్స్ నిరా ్వహకులు, విద్యార్థులు, పాల్గొన్న ప్రతిభావంతులను ఆకట్టుకుంది. రాజకీయ నాయకురాలిగా మాత్రమే కాకుండా ఒక మోటివేషనల్ స్పీకర్‌గా గళ్ళా మాధవి తన ముద్ర వేసిన సందర్భం గుంటూరు పశ్చిమ నియోజకవర్గానికి గర్వకారణంగా నిలిచారు.

## వినాయక మండపాలను సందర్శించిన ఎమ్మెల్యే

గుంటూరు క్రైమ్, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త : పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి శుక్రవారం నియోజకవర ్గంలోని పలు వినాయక మండపాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వినాయక చవితి మహోత్సవాల్లో భాగంగా జరుగుతున్న అన్నదాన కార్యక్రమాలను ఎమ్మెల్యే స్వయంగా ప్రారంభించి, భక్తులకు స్వయంగా అన్నం వడి ్డంచి ప్రజలతో



మమేకమయ్యారు. స్థానిక శ్రీనివాసరావుపేట 1వ లైన్, నల్లచెరువు 15వ లైన్, విద్యానగర్ 3వ లైన్ మండపాలను సందర్శించిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి స్థానిక భక్తులతో మాట్లాడి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. వినాయక చవితి పండుగ మన అందరికీ ఐక్యత, శాంతి, సౌభ్రాతృత్వం అనే సందేశాన్ని ఇస్తుంది. ఈ పండుగ సందర్భంగా నియోజవర్గంలోని ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో ఉండాలని గణపతిని ప్రార్థిస్తున్నాను. గుంటూరు పశ్చిమ అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్నాను. ప్రజల ఆశలు నెరవేర్చడం, ప్రతి ఒక ్కరి జీవితంలో సంతోషం తీసుకురావడం నా లక్ష్యమని, అన్నదానం అనేది అత్యుత్తమ దానం అని, ఈ తరహా సేవా కార్యక్రమాల్లో ప్రజలంతా కలసి ముందుకు రావాలని పిలుపు నిచ్చారు. గణపతి ఆశీస్సులతో నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందాలని, ప్రతి ఇంటిలో ఆనందం నిండాలని కోరుకుంటున్నట్లు ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు.

## ఘనంగా దేగల ప్రభాకర్ జన్మదిన వేడుకలు

గుంటూరు క్రైమ్, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త : ఏపి ఇండ స్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దేగల ప్రభాకర్ జన్మదిన వేడుకలు అట్టహాసంగా జరిగాయి. ఆంధ్రప్రైమ్ హాస్పటల్ నందు జరిపిన దేగల ప్రభాకర్ జన్మదిన వేడుకలు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, యువత, కూటమి నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని దేగల జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా దేగలయూత్ మరియు మిత్రమండలి ఆధ్వర్యంలో గత వారం రోజులుగా వారోత్సవాలు నిర్వహించి అనేక సేవా (వృద్ధులకు చీరలు, విద్యార్థులకు పుస్తకాలు ,అన్నదానం) కార్యక్ర మాలు చేపట్టడం జరిగింది. సుమారు 600మందికి అన్నదానం, అంధుల పాఠశాల్లోని విద్యార్థులకు బ్రెడ్లు, పండ్లు, పంపిణీ చేశారు. సుమారు 70మంది యువత రక్తదానం చేయడం జరిగింది. అనంతరం హాస్పటల్ డాక్టర్లు అభిమానులతో కలసి కేక్ కట్ చేశారు. తొలుత నాజ్‌సెంటర్ లోని శ్రీ ఆంజేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. యువత నాజ్ సెంటర్‌లో భారీగా బాణాసంచా కాల్చి సంబరాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశయాలను, పార్టీ సిద్ధాంతాను బలోపేతం చేయడంలో ప్రభాకర్ నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. ప్రజా సేవలో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, ఆరోగ్యంగా, దీర్ఘాయుష్షుతో ఉండాలని, టిడిపి కుటుంబ సభ్యులు ఆకాంక్షిస్తున్నారన్నారు. చైర్మన్ దేగల ప్రభాకర్ మాట్లాడుతూ నాలాంటి యువతకు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ నామినేటెడ్ పదవులు ఇచ్చి మమ్మలి ్ని ప్రోత్సహిస్తున్నారు. పార్టీకోసం అహర్నిశలు పనిచేసిన మాలాంటి వారికి తగిన గుర్తింపు నిచ్చింది పార్టీ అని కొనియాడారు. చంద్రబాబు, లోకేష్ నాయకత్వంలో పనిచేయడం చాలా అధృష్టంగా భావిస్తున్నామని అన్నారు. నన్ను ఇంతగా అభిమానిస్తున ్న నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు, యువతకు ప్రతి ఒక్కరికి పేరు పేరున కృతజ్ఞతలు

## ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవాలు

వత్సవాయి, సెప్టెంబరు 5, ప్రభాతవార్త : వత్సవాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు భారత మాజీ రాష్ట్రపతి బహుముఖ ప్రజ్ఞాశాలి విద్యావేత్త సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఆ క్రమంలోజాతీయ ఉపాధ్యాయ దినోత్సవంగా ఘనంగా నిర్వహించారు. ప్రతి విద్యార్థి ఆయన్ని



ఆదర్శంగా తీసుకోవాలని, ఆయన జీవిత చరిత్రను వివరించి, రాష్ట్ర ప్రభుత్వం శ్రీ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర ఎస్ఆర్‌కెవిఎం పేరుతో విద్యార్థులకు కిట్ అందచేస్తున్న విషయాన్ని తెలియపరిచారు. ఆక్రమంలో ఉత్తమ ఉపాధ్యాయురాలిగా వి పద్మావతిని సన్మానించి, వారిసేవలను కొనియడారు. ఆ క్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎన్ అనిత ఉపాధ్యాయులు కెవి శ్రీనివాసరావు మరియు స్టాఫ్ సెక్రటరీ ఎ సుధాకర్ ఉపాధ్యాయ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

## జ్యోతిరావుపూలే గురుకుల విద్యాలయానికి స్టీల్‌సింక్ బహుకరణ

వత్సవాయి, సెప్టెంబరు 5, ప్రభాతవార్త : వత్సవాయి జ్యోతిరావు పూలే గురుకుల విద్యాలయానికి ఎన్‌టిఆర్ జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు బొగ్గవరపు వెంకట రాజారావు తమ పొట్టి శ్రీరాములు



సేవా ట్రస్ట్ ఆర్థిక సహాయంతో మినరల్ వాటర్ ప్లాంట్‌కు సంబంధించినటువంటి 35వేల రూపాయల విలువ చేసే స్టీల్‌సింక్‌ను తహశీల్దార్ వెంకటేశ్వరరావు ప్రారంబించారు. కార్యక్రమంలో ఎన్‌టిఆర్ జిల్లా ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి నాళ్ల చిన్న సత్యంబాబు, మహిళా సంఘం అధ్యఓఉరాలు మోటమర్రి లక్ష్మి వత్సవాయి మండల సంఘ అధ్యక్షులు పోలా పూర్ణచంద్రరావు, ఉపాధ్యాయులు, డిటి కొంకిమళ్ల ప్రభు కుమర్ తదితరులు పాల్గొన్నారు.

## అవగాహన..లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

గుంటూరు కల్చరల్, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త : అవగాహన సంస్థ ఆధ్వర్యంలో సంస్థ కార్యాలయంలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేడుకకు జీవన సంధ్య సంస్థ అధ్యక్షుడు సిరసవల్లి కృష్ణారావు అధ్యక్షత వహించారు. సభలో విద్యావేత్త, విశ్లేషకులు ఎస్.రవిబాబు మాట్లాడుతూ స్వయంకృషితో గురువై, ఉత్తమ గురువై అంచెలంచెలుగా ఉపరాష్ట్రపతిగా, రాష్ట్రపతిగా ప్రధమ పౌరుని స్థానానికి ఎదిగి కీర్తి శిఖరాయమానుడ సర్వేపల్లి రాధాకృష్ణన్ అని ఆయన జన్మదినం రోజు ప్రతి ఏటా ఉపాధ్యాయ దినోత్సవం జరుపుకోవడం ఉపాధ్యాయులందరికీ గర్వకారణమన్నారు. విశ్లేషకులు ఆర్.వి.సింగరయ్య మాట్లాడుతూ తరగతి గదుల్లోనే భావి భారతపౌరుల భవిష్యత్తు తీర్చిదిద్ద బడుతుందని, విద్యార్థుల భవితకు రూపకల్పన చేయడం ఒక్క గురువుకే సాధ్యపడుతుందన్నారు. అనంతరం అధ్యాపకుడిగా విశిష్ట సేవలందించిన విశ్రాంత ప్రిన్సిపాల్ ఎస్.రవిబాబు ని అవగాహన సంస్థ సభ్యులు సత్కరించారు.

## భారత్ ఉజ్జ్వల భవిత యువత భుజస్కంధాలపై ఉంది

### భాష్యం మెడెక్స్ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో మంత్రి సత్యకుమార్ యాదవ్

గుంటూరు విద్య, ప్రభాతవార్త: భారత్ ఉజ్జ్వల భవిత యువత భుజస్కంధాలపై ఉందని ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. శుక్రవారం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని భాష్యం మెడెక్స్ ఆధ్వర్యంలో స్థానిక ఏటుకూరు రోడ్డులోని వివాహ కన్వెన్షన్ సెంటర్లో జరిగిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ నలంద, తక్షశిల వంటి విశ్వ విద్యాలయాల ద్వారా ప్రపంచ





మానవాళికి జ్ఞానమందించిన ఘనమైన మన భారత సంస్కృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. రాబోవు రోజుల్లో విద్యావ్యవస్థలో సంస్కరణల ద్వారా పెను మార్పులను ప్రతి ఒక్క విద్యార్థి ఆకళింపు చేసుకుంటూ వికసిత్ భారత్ నిర్మాణానికి కృషి చేయాలన్నారు. దేవుడి పట్ల ఎంత భక్తి, గౌరవం ఉంటాయో జ్ఞానాన్ని అందించే గురువుపై కూడా అంతే శ్రద్ధాభక్తులు ఉండాలన్నారు. నాణ్యమైన విద్యనందించేందుకు ప్రభుత్వం సంసిద్ధంగా ఉందని ఈ అవకాశాన్ని ప్రతి ఒక్క విద్యార్థి అందిపుచ్చుకుని ఉత్తమైన వైద్యులుగా రాణించాలని ఆకాంక్షి ంచారు. మరో అతిథి ఆస్టర్ రమేష్ హాస్పటల్స్ అధినేత, కార్డియోలజిస్ట్ డాక్టర్ పోతినేని రమేష్ బాబు మాట్లాడుతూ మనం నేర్చుకున్న జ్ఞానం, నైపుణ్యాలను సరైన మార్గంలో నడింపిచేవారే గురువు అన్నారు. నేడు వైద్యరంగంలో కృత్రిమ మేధ ద్వారా సంభవిస్తున్న అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని నేటి యువత అందిపుచ్చుకుని అవగాహన చేసుకుని నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలన్నారు. జిజిహెచ్ నాట్కో క్యాన్సర్ సెంటర్ అంకాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నల్లబోతు మురళి మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైనదని, ఏ వృత్తిలో రాణించాలన్న గురువుల పాత్ర అమూల్యమైనదన్నారు. దేశ నిర్మాణంలో ఎంతో మంది ఇంజినీర్లను, వైద్యులను అందించిన ఘనత భాష్యం విద్యాసంస్థలకే దక్కుతుందన్నారు. భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థినీ, విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపేందుకు జీవితంలో ఎంతో సాధించిన ప్రేరణాత్మకమైన వ్యక్తులను మీకు పరిచయం చేయడం జరుగుతుందన్నారు. వారి అనుభవసారాన్ని వినమ్రంగా గ్రహించి మీ లక్ష ్యసాధనకు కృషిచేయాలని విద్యార్థులకు సూచించారు. సభకు భాష్యం మెడెక్స్ ప్రిన్సిపాల్ హరిబాబు అధ్యక్షత వహించారు. తొలుత అతిథుల చేతులమీదుగా జ్యోతిప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభమైంది. అనంతరం భాష్యం చైర్మన్ భాష్యం రామకృష్ణ చేతులమీదుగా మంత్రి సత్యకుమార్ యాదవ్, డాక్టర్ రమేష్, డాక్టర్ మురళీలను దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. విద్యార్థినీ, విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతుల్ని అలరించాయి. విద్యార్థుల చేతుల మీదుగా ఆధ్యాపకులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో భాష్యం విద్యాసంస్థల వైస్ చైర్మన్ భాష్యం హనుమంతరావు, మేనేజింగ్ డైరెక్టర్ భాష్యం సాకేత్ రామ్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా భాష్యం టైటానిక్, గరుడ, సమత మమత, వశిష్ఠ, మైత్రివనం, ఆదిత్య, టెన్త్ క్యాంపస్, భాష్యం అన్ని శాఖలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి.

## తురకపాలెంను సందర్శించిన డాక్టర్ పెమ్మసాని,ఎమ్మెల్యే రామాంజనేయులు

గుంటూరు క్రైమ్, సెప్టెంబర్ 5, ప్రభాత వార్త : తురకపాలెంలో స్థితిగతులను, రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన హెల్త్ క్యాంప్ ను గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ కేంద్ర సహాయమంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, స్థానిక ఎమ్మెల్యే రామాంజనేయులు కలసి శుక్రవారం పరిశీలించారు .హెల్త్ క్యా ంపు ద్వారా అందుబాటులో ఉంచిన మెడిసిన్స్, పరీక్షా యంత్రాలు



తదితరాల గురించి వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానికులతో మాట్లాడి అక్కడి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఇటీవల మరణించిన వారి కుటుంబ సభ్యులను స్థానిక ఎమ్మెల్యే బి.రామాంజనేయులు తో కలసి డాక్టర్ పెమ్మసాని పరామర్శించారు. తాగునీరు వల్ల ఈ వా ్యధి వస్తుంది అనడం అనేది కరెక్ట్‌కాదు. ఇవన్నీ పూర్తిగా అపోహలు, వీటిని నమ్మవద్దు, అరుదైన వ్యాధి కావడం ఎవరికి సరైన అవగాహన లేకపోవడం, తెలుసుకునేందుకు కొంత సమయం పట్టడం వల్ల ఇలాంటి అపోహలు వ్యాప్తి చెందాయే తప్ప ఇందులో నిజం లేదు. ఇది కామన్ డిసీజ్ కాదు, నేను డాక్టర్‌గా ప్రాక్టీస్ చేసిన సమయంలో కూడా ఇలాంటి డిసీజ్ చూడలేదు. ఇది సవివరమైన పరీక్షలు పూర్తయిన తర్వాత మాత్రమే తేల్చి చెప ్పగలం. ఇక్కడున్న వైరస్ మెలియాయిడోసిస్ అనేది రెండు రకాలుగా సంభవిస్తుంది. వాతావరణంలో తేమ శాతంలో వచ్చినమార్పుల వల్ల ఈ బ్యాక్టీరియా వ్యాప్తి చెందుతుంది. విపరీతమైన వర్షాలు కూడా ఇందుకు ఒక కారణం కావచ్చు, స్కిన్ దా ్వరా ఊపిరి పీల్చుకోవడం ద్వారా వ్యాప్తి చెందుతుంది. ఎవరిలో అయితే రోగ నిరోధక శక్తి తక్కువగా ఉంటుందో వారిలో ఈ వ్యాధి ఎక్కువగా వ్యాప్తి చెందుతుంది. ఎక్కువగా ఆల్కాహాల్ తీసుకోవడం లేదా కిడ్నీ, హార్ట్ సమస్యలున్న వ్యక్తులకు ఎక్కువగా ఈ వ్యాధి ప్రభావం చూపుతుంది. ఈ వ్యాధికి నాలుగు రకాల యాంటీబయోటిక్స్ ఎక్కువగా ఉపయోగపడతాయి. ఈ ప్రాంతంలో ఎవరెవరైతే ఇబ్బంది పడుతున్నారో, వారికి మళ్ళీ బ్లడ్ కల్చర్ తీసి సవివరమైన రికార్డులు సేకరించి, అవసరమైన వారిని హాస్పటల్లో అడ్మిట్ చేసి జాగ్రత్తలు తీసుకోవడం మా బాధ్యతగా తీసుకుంటాము. మరణించిన వారి కుటుంబాలకు ఏ విధంగా ఆర్థిక సాయం చేయాలనేది ప్రభుత్వంతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామన్నారు. ఆరోగ్యశాఖ మంత్రి ఉదయం వచ్చి ముఖ్యమంత్రి చంద్రబాబు తో ఆ విషయంపై చర్చిస్తున్నారు. నేను, ఎమ్మెల్యే కలసి సీఎంఆర్ఎఫ్ ద్వారా మృతిచెందిన వారి కుటుంబాలకు ఆర్థిక సాయానికి సంబంధించి ప్రయతి ్నస్తా మన్నారు.

## కెఎల్ డీమ్డ్ టుబి యూనివర్శిటీలో జునిపర్ ఏఐ డ్రివెన్ క్యాంపస్- సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ప్రారంభం

విజయవాడ, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త : కెఎల్ డీమ్డ్ టుబి యూనివర్శిటీలో జునిపర్ ఏఐ డ్రివెన్ క్యాంపస్- సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ను జునిపర్ అకాడమి గ్లోబల్ హెడ్ అర్చన యాదవ్ ప్రారంబించారు. డిజిటల్ రంగంలో మార్గదర్శకంగా అడుగులు వేస్తూ ఏఐ డ్రివెన్ నెట్వర్కింగ్‌లో ప్రపంచనాయకుడైన జునిపర్ నెట్వర్క్ సహకారంతో సా ్థపించిన ఈ కేంద్రం, బారతదేశంలో ఎంటర్‌ప్రైజ్ గ్రేడ్, ఏఐ ఆధారిత డిజిటల్ మౌలిక సదుపాయాలను విద్యావ్యవస్థలోకి తేవడానికి చొరవను సూచిస్తుంది. కార్యక్రమంలో ఎడ్యుస్కిల్స్ సిఇఓ శుభజిత్ జగదేవ్ గౌరవ అతిథిగా పాల్గొన్నారు. యూనివర్శిటీ చాన్సలర్ ఎర్ కోనేరు సత్యనారాయణ ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏఐ ఆదారిత నెట్వర్కింగ్‌ను తమ విద్యార్దులకు అందించి నూతన ఆవిష్కరణలు, నాయకత్వం వహించడానికి డిజిటల్ నాయకులుగా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో ప్రొ వైస్ చాన్సలర్ డా కె రాజశేఖరరావు, డీన్ స్కిల్లింగ్ డా ఏ శ్రీనాథ్, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డా వి రాజేష్ ఎస్‌పిఓసి ప్రిన్సిపల్ డా రాధిక రాణి చింతల తదితరులు పాల్గొన్నారు.

## బిగ్‌బాస్ తెలుగు భాగస్వామిగా హైయర్ ఇండియా

విజయవాడ, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త :స్టార్ మా, జియో హాట్‌స్టార్లో ప్రసారమయ్యే బిగ్‌బాస్ సీజన్9 కు తాము అసోసియేట్ స్పాన్సర్‌గా వుంటామని హైయర్ అప్లయెన్సెస్ ఇండియా అధ్యక్షుడు ఎన్ఎస్ సతీష్ తెలిపారు.

# యూరియా కోసం.....రైతన్నల పడిగాపులు!

## -అధికారుల మాటలకు పొంతన లేదంటున్న అన్నదాతలు

పొన్నూరు, సెప్టెంబరు 5,ప్రభాతవార్త: వ్యవసాయ సీజన్ ప్రారంభమైన నాటి నుండి అన్నదాతలకు ఏదో ఒక రూపంలో నష్టం వాటిల్లుతూనే ఉంది. రెండు పర్యాయాలు వరి వెద సాగు చేసిన రైతులకు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వరి పైరు పూర్తిగా దెబ్బతిని పోయింది. ఎకరాకు సుమారు రూ.15వేలు వరకు నష్టాన్ని చవిచూడాల్సి వచ్చింది. ముచ్చటగా మూడోసారి వరినాటు వేశారు కొందరు. ప్రస్తుతం వరిపైరుకు యూరియా, డిఏపి ఎరువు వేయాల్సి ఉంది. యూరియా కోసం రైతులు షాపుల చుట్టూ, సొసైటీల చుట్టూ తిరుగుతున్నారు.





అయితే ఎరువులు మాత్రం లభించడం లేదంటున్నారు రైతులు, అధికారులు ఎరువుల కొరత లేదంటున్నారు......అన్ని రైతు సేవా కేంద్రాలల్లో ఉన్నాయంటున్నారు....అయితే ఎక్కడా కూడా ఎరువులు అందుబాటులో లేవంటున్నారు రైతులు. మండల పరిధిలోని చింతలపూడి సొసైటీకి యూరియా లోడు వస్తుందని తెలిసిన రైతన్నలు హుటాహుటిన పట్టాదారు పాసుపుస్తకాలు, ఆధార్‌కార్డులు తీసుకొని వెళ్ళారు. అయితే వచ్చిన లోడు వచ్చినట్లు ముందు వారు తీసుకెళ్ళడంతో.... వెనుకవచ్చినవారు మళ్ళీ లోడు కోసం నిరీక్షించాల్సి వస్తుందని రైతులు చెప్తున్నారు. ఇప్పటికైనా వ్యవసాయాధికారులు ఎరువులను సక్రమంగా అందేవిధంగా చూడాలని రైతన్నలు కోరుతున్నారు. సొసైటీల వద్ద, షాపుల వద్ద నిరీక్షించినా ఫలితం లేదంటున్నారు అన్నదాతలు. అధికారులు ప్రతి ఒక్కరికి ఎరువులు అందేవిధంగా చూడాలని కోరుతున్నారు. అవసరాన్ని బట్టి ఎరువులు తెప్పిస్తామని చెప్తున్న అధికారులు ఆ దిశగా అడుగులు వేయడం లేదని రైతన్నలు చెప్తున్నారు.

## మిట్టపల్లి కళాశాలలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

యడ్లపాడు, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త : మండల పరిధిలోని బోయపాలెం గ్రామ సమీపంలోని మిట్టపల్లి ఇంజనీరింగ్ కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. భారత మాజీ రాష్ట్రపతి గొప్ప తత్వవేత్త, విద్యావేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినాన్ని పురస్కరించుకొని కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఉపాధ్యాయుల ప్రాముఖ్యత, సమాజ నిర్మాణంలో వారి పాత్ర గురించి విశదీకరించారు. అధ్యాపకులు విద్యార్థులకు కేవలం పాఠాలు చెప్పడమే కాకుండా, జీవన విలువలు, క్రమశిక్షణ, స్ఫూర్తిని అందజేస్తారని గుర్తుచేశారు. విద్యార్థులు ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపి, సాంస్కృతిక కార్యక్రమాలతో వారిని సత్కరించారు. ఉపాధ్యాయులు తమ అనుభవాలను పంచుకుంటూ విద్యర్దులు జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అశీర్వదించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ గోపి కృష్ణ, ఎవో సిహెచ్ శ్రీనివాస్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపక బృంధం, విద్యార్దులు పాల్గొన్నారు.



## ఫౌండేషన్ అధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

యడ్లపాడు, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త : డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ గారి యొక్క సిద్దాంతం విద్య అనేది సమాజాన్ని తీర్చిదిద్దటంలోనే ఒక వ్యక్తి ఒక మనిషిని తయారు చేయటమే కాకుండా భౌతిక ప్రపంచంతో పాటు అంతర్గత సత్యాన్ని కూడా కనుగొనడం విద్యనే లక్ష్యంగా అని అయన నమ్మేవారు, అయన విశ్వాసం ఉపాధ్యాయులు దేశంలో అత్యంత విలువైన అలోచనలు గలవారు అని భావించారని నరేంద్ర సువర్ణకుమారి ఫౌండేషన్ నిర్వాహకురాలు నరేంద్ర సువర్ణకుమారి పేర్కొన్నారు. గురు పూజోత్సవం సందర్భంగా మండల పరిధిలోని తిమ్మాపురం గ్రామంలోని పాఠశాలలో కార్యక్రమాలను నిర్వహించి ఉపాధ్యాయులకు జ్ఞాపికలను అందజేసారు. గురుపూజోత్సవ విశిష్టతలను వివరించారు. కార్యక్రమంలో అయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్దులు, ఫౌండేషన్ నిర్వాహకులు, ఉప అధ్యక్షుడు ఎందేటి ప్రసాద్ రావు తదితరులు పాల్గొన్నారు.



## పోలీసుల అదుపులో కోతముక్క నిర్వాహకులు

యడ్లపాడు, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త : మండల పరిధిలోని సంగం గోపాల పురం గ్రామంలోని లేఔట్‌లో కోత ముక్క అడుతున్న వారిపై దాడులు నిర్వహించటం జరిగిందని ఎస్సై టి శివరామకృష్ణ తెలిపారు. అయన వివరిస్తూ ముందస్తు సమాచారంతో సిబ్బందితో కలసి రాత్రి సమయంలో దాడులు నిర్వహించటం జరిగిందని, ఇందులో కోత ముక్క అడుతున్న అరుగురిని అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుండి 7540రూపాయల నగదును స్వాధీనం పర్చుకోవటం జరిగిందన్నారు. వీరందరిపై కేసులు నమోదు చేయటం జరిగిందన్నారు.



## కన్నెగంటికి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం

ప్రత్తిపాడు, సెప్టెంబర్ 5(ప్రభాతవార్త): మండలంలోని యనమదల గ్రామ నివాసి అయినటువంటి కన్నెగంటి శ్రీనివాసరావు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడుగా అవార్డు అందుకోవటం జరిగింది. వివరాల్లోకి వెళితే ఎస్ జి టి గా ఉపాధ్యాయ వృత్తి ప్రారంభించి నాలుగు సంవత్సరాల పాటు పెదనందిపాడు మండలం కొప్పర్రు గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహించి విద్యావరంగా ఏడవ తరగతి కామన్ పరీక్ష నూటికి నూరు శాతం ఫలితాలు అందించి బదిలీపై 2002 నుండి 2011 వరకు గుంటూరు రూరల్ మండలంలోని చౌడవరం చెక్క మండల పరిషత్ పాఠశాలలో పలు కార్యక్రమాలను చేపట్టి పిల్లలకు ఉచిత పుస్తకాలు యూనిఫాములను కల్పించి హాజరును గణనీయంగా పెంచారు.2011 నుండి 2015 వరకు లాల్పురం నేతాజీ నగర్ నందు వివిధ అభివృద్ధి కార్యక్రమాలను దాతల ద్వారా చేపట్టారు. పదోన్నతిపై ఎస్ బి పురం నరసరావుపేటలో నందు పనిచేసి తిరిగి 2017 నుండి ప్రస్తుతం వరకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఏటుకూరులో పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా జిల్లా విద్యాశాఖాధికారిణి,గుంటూరు కమిషనర్,జిల్లా పరిషత్ చైర్పర్సన్ చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయునిగా అవార్డు అందుకున్నారు.2017లో ఏటుకూరులో 60 మంది పిల్లలతో ఉన్న పాఠశాలను నేడు 170 మందితో అభివృద్ధి పథంలో నడపటం లో ముఖ్యపాత్ర వహించారు.



## ఘనంగా ముగిసిన గణపతి నవరాత్రుల వేడుకలు

పెదనందిపాడు సెప్టెంబర్ 5. (ప్రభాతవార్త) పెదనందిపాడు శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత శ్రీ సోమేశ్వర స్వామి దేవాలయంలో గీత ప్రార్ధనా సంఘం అధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణపతి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. తొమ్మిది రోజులు పాటు ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అత్యంత వైభవంగా జరిగాయి. శుక్రవారం గణపతి విగ్రహాన్ని గ్రామ వీధులలో ఊరేగించి జల నిమజ్జనం తరలించారు. ఈ కార్యక్రమంలో సకల వీరేంద్ర గుప్తా. చాగంటి సత్య హర్ష,తడవర్తి సురేష్ బాబు. కొత్త శ్రీధర్. రావిపూడి అర్జున్ రావు. వీర బ్రహ్మచారి. నాగేశ్వరరావు. సుబ్రహ్మణ్యం. శ్రీనివాసరావు. తదితరులు పాల్గొన్నారు.





## జైపూర్ రగ్ ఉత్సవం ప్రారంభం

విజయవాడ, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త :జైపూర్ రగ్ ఉత్సవ్ విజయవాడలో ప్రారంభించామని జైపూర్ రగ్స్ డైరెక్టర్ యోగేష్ చౌదరి తెలిపారు. ఈ ఉత్సవ్ లో చేతితో నేసిన 14వేలకు పైగా రగ్గులను ప్రదర్శనలో వుంచుతున్నారు. ఆలం, జెనెసిస్, సహనా, కన్వర్జెన్, దాహాస్, ఫుంధర్ కమ్మర్, కాలిడో, క్లాస్, బేసిస్, లాకునా, ఎర్తే, ఇండస్‌బార్, నోమాడిక్ ట్రెడ్స్, అకార్, కాంటూర్ వంటి సిగ్నేచర్ కలెక్షన్లున్నాయి.

## బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షునిగా పారేపల్లి మహేష్

మంగళగిరి ,సెప్టెంబర్ 5, ప్రభాతవార్త : నేటి యువత దురభ్యాసాలు దురలవాట్లతో నిర్వీర్యమవుతున్న తరుణంలో, వారిని సన్మార్గంలో నడిపించే బాధ్యతను తీసుకోవాలని, ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు తమ యువజన విభాగాన్ని ఉద్దేశించి హితవు పలికారు. శుక్రవారం స్థానిక మంగళగిరి రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర యువజన నూతన అధ్యక్షులుగా ఎంపికైన పారేపల్లి మహేష్ కు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కేసన మాట్లాడుతూ పారేపల్లి నాయకత్వంలోని రాష్ట్ర కమిటీ అన్ని జిల్లాలునియోజకవర్గాలు మండలాలలో యువజన కమిటీలను ఏర్పరిచి, యువజనులను చైతన్య పరుస్తూ,గ్రామ గ్రామాన బీసీ జెండాలు ఎగిరేలా కృషి చేయాలన్నారు.ప్రతి గ్రామంవార్డుడివిజన్లలో బీసీల జెండాలు ఎగిరేలాసంఘం ఏజెండాను ప్రతి బీసీ గుండెకు చేర్చేలా,రాష్ట్ర యువజన విభాగం కృషి చేయాలన్నారు. రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు కుమ్మర క్రాంతి కుమార్ మాట్లాడుతూ, యువజన విభాగం తమ యువజనుల అవసరాలు ఆకాంక్షలు నెరవేర్చేందుకు కృషి చేస్తూనే, బీసీ 139 కులాల ప్రజలందరి సంక్షేమంఅభివృద్ధి కోసం కృషి చేయాలన్నారు. రాష్ట్ర కోశాధికారి కన్నా మాస్టారు మాట్లాడుతూ చట్టసభలలో రిజర్వేషన్ల కోసం, మహిళా రిజర్వేషన్ల లో ఓబీసీ మహిళలకు సబ్ కోటా కోసం, కేంద్రంలో ఓబీసీ ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు కోసం పోరాటాలన్నారు. ఉద్యోగ విభాగ రాష్ట్ర అధ్యక్షులు ఎం వి వి ఎస్ ఎన్ మూర్తి మాట్లాడుతూ, జాతీయరాష్ట్ర కమిటీల పిలుపులకు స్పందిస్తూ,అన్ని జిల్లాలలో ఉద్యమ కార్యాచరణను రూపొందింపజేసి పోరాటాలకు సిద్ధపడాలన్నారు. ఈ సందర్భంగా పలువురు బీసీ నాయకులు నూతన యువజన అధ్యక్షుడు పారేపల్లి మహేష్ ను ఘనంగా సన్మానించుకున్నారు. ఈ సందర్భంగా నూతన రాష్ట్ర యువజన అధ్యక్షులు మహేష్ మాట్లాడుతూ సంఘ నిర్మాణ సూత్రాలకు అనుగుణంగా, యువజన విభాగ నిర్మాణవిస్తృతలతో పాటు,సంఘ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. అన్ని జిల్లాలు నియోజకవర్గాలుమండలాలలో యువజన కమిటీలను ఏర్పాటు చేసి,బీసీ జెండాలు గ్రామ గ్రామాన ఎగిరేలా కృషి చేస్తానన్నారు. ఇంకా ఈ సమావేశంలో మంగళగిరి నియోజకవర్గ అధ్యక్షులు ఆలా శివాజీ,కార్యదర్శి నల్లబోతు సుబ్బారావు,సిహెచ్ గోపి, ఎనుముల నరసింహారావు, తిరువీధుల కిరణ్, మంద్రు సత్యనారాయణ, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొని,నూతన అధ్యక్షులకు శుభాకాంక్షలు తెలిపి ఘనంగా సన్మానించుకున్నారు.



## అమరావతిలో జుమ్మ మసీద్ నిర్మాణానికి 100 ఎకరాలు కేటాయించాలి

మంగళగిరి, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త: రాష్ట్ర రాజధాని అమరావతిలో జుమ్మ మసీద్ నిర్మాణానికి 100 ఎకరాల భూమిని కేటాయించాలని నవరంగ్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు షేక్ జలీల్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం జలీల్‌మీడియాతో మాట్లాడుతూవిజయవాడ నగరంలో గాలిబ్ షాహిద్ దర్గా భూములు సర్వే నెంబర్ 600, 63, 10 లలో ఖాళీగా ఉన్న భూములను నిరుపేద ముస్లింలకు ఇల్లు కట్టుకోవటం కోసం ప్రభుత్వం అనుమతి ఇవ్వాలని, విద్య , ఉద్యోగ రంగాలలో ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్ కల్పించాలనిఆయన ప్రభుత్వాన్ని కోరారు. అదేవిధంగా ముస్లిం మహిళలకు పెళ్ళికి దుల్హాన్ పథకం క్రింద లక్ష రూపాయిలు కేటాయించాలి,మస్జిద్ లో ప్రార్ధన చేసే ఇమామ్ మోజన్ లకు సొంత ఇల్లు మంజూరు చేసే విధంగా ప్రభుత్వం జీవో విడుదల చేయాలన్నారు.ముస్లింలలో ఉన్న వితంతువు, వయో వృద్ధులకు పెన్షన్, సొంత ఇల్లు నిర్మాణం కొరకు రుణాలు కేటాయించాలి. జుమ్మ మసీదు నిర్మాణానికి వెయ్యి కోట్లు నిధులను విడుదల చేసి, దాని బాధ్యతలు ముస్లిం ఐక్యవేదిక అంజుమన్ ఇస్లామిక్ కమిటి వారికి అప్పగించాలని షేక్ జలీల్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అమరావతి హజ్ హౌస్ నిర్మాణం చేప్పటి దానికి 500 కోట్ల రూపాయిలు నిధులు కేటాయించి, మైనారిటీ కార్పొరేషన్ లో ముస్లింలకు రుణాలు ఇవ్వాలని జాతీయ రహదారులపై ముస్లింలకు నమాజ్ కొరకు మస్జిద్ నిర్మాణములు చేప్పట్టాలనిఆయన కోరారు.వక్ఫ్ బోర్డు భూములలో అన అన్య మతస్థులను ఖాళీ చేసి ముస్లిం లకు ఇచ్చేవిధంగా ప్రభుత్వం జీవో విడుదల చేయాలన్నారు.ముస్లిం అభివృద్ధి కొరకు రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వ ఇస్తున్నాము ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని ముస్లిం సంఘాలు, జేఏసీ అధికారులు అందరూ హాజరు కావాలని షేక్ జలీల్ విజ్ఞప్తి చేశారు .



## ఘనంగా గౌస్ జన్మదిన వేడుక



సత్తెనపల్లి ,సెప్టెంబర్ 5, ప్రభాతవార్త: సత్తెనపల్లి పట్టణం మన్నెం రెసిడెన్సీ లో శుక్రవారం టిడిపి యువనేత గౌస్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా జరిగినకార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణపాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వివిధ హోదాల్లో వున్న రాష్ట్ర జిల్లా నియోజకవర్గ పట్టణ వార్డు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## డాక్టర్ సర్వేపల్లికి గజ్జల ఘననివాళి

సత్తెనపల్లి, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త: భారతరత్న మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్‌కు ఘనంగా నివాళులర్పించారు. శుక్రవారం రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని సత్తెనపల్లి నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సత్తెనపల్లి నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ రెడ్డి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



## జిల్లా విద్యాశాఖ అధికారి నిరంకుశ వైఖరిని ఖండిస్తున్నాం. : ఫ్యాప్టో గుంటూరు జిల్లా

గుంటూరు విద్య, ప్రభాతవార్త: జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డుల ప్రధానోత్సవం సందర్భంగా గుర్తింపు పొందిన ఉపాధ్యాయ సంఘాలకు కనీసం తెలియజేయకపోవడం ఉపాధ్యాయ సంఘాలను అవమానించడమే అని గుంటూరు జిల్లా ఫ్యాప్టో చైర్మన్ మరియు ఏపీటీఎఫ్ 1938 జిల్లా ప్రధాన కార్యదర్శి కె. నరసింహారావు తెలియజేశారు. గతంలో జిల్లాలో పనిచేసిన విద్యాశాఖ అధికారులు ఉపాధ్యాయ సంఘాలను గౌరవించేవారని, అనేక సందర్భాలలో ఉపాధ్యాయ సంఘాలతో కోఆర్డినేషన్ మీటింగ్ ఏర్పాటు చేసే వారని తెలియజేశారు. ప్రస్తుత జిల్లా విద్యాశాఖ అధికారిని ఒక కోటరీ ఏర్పాటు చేసుకొని, ఉపాధ్యాయ సంఘాలతో కనీసం ఏ విషయంలో సంప్రదించకుండా ఇష్టరాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు . ఇప్పటికైనా డిఈవో తమ వైఖరిని మార్చుకోవాలని సంఘ నాయకులు డిమాండ్ చేశారు.

## విద్యతోనే..వ్యక్తి అభివృద్ధి

గుంటూరు విద్య, ప్రభాతవార్త: వివిధ వృత్తుల వారు సమాజంలో అభివృద్ధికి దోహదం చేస్తున్నారు. అందుకు ప్రధాన కారణం గురువులే అని మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు అన్నారు. ఆయన మాట్లాడుతూ -"సమాజంలో ఏ వర్గం వారు అయినా అభివృద్ధి చెందాలంటే విద్య తప్పనిసరి. ఆ విద్యకు ప్రధాన కారణం ఉపాధ్యాయులే" అని పేర్కొన్నారు. స్థానిక విద్యానగర్‌లోని ఆదిత్రి ఎగ్జోటికా అపార్ట్మెంట్స్ లో గణేష్ నవరాత్రి ఉత్సవాల భాగంగా నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ సభలో ఆయన ప్రసంగించారు. సభకు హిందూ కళాశాల విశ్రాంత అధ్యక్షులు డా. అంబరాజు రాజశేఖర్ అధ్యక్షత వహించారు."ఉపాధ్యాయ వృత్తి ఒక పవిత్రమైన, ఉన్నతమైన వృత్తిగా భావించి పనిచేస్తున్న ఉపాధ్యాయులు అభినందనీయులు" అని లక్ష్మణరావు ప్రశంసించారు. ఈ సందర్భంలో ఉపాధ్యాయ వృత్తిలో నిరంతరం కృషి చేస్తున్న వారిని ఆయన సన్మానించారుఅనేక సంవత్సరాలుగా ఈ వృత్తిలో విద్యార్థులను తీర్చిదిద్దిన ఉపాధ్యాయులైన డా. రాజశేఖర్, కృష్ణవేణి, టి .రామాదేవి, ఎన్.వి. సుశీల, పి. జెసుడియాన్ బాబు, దీపక్ పంత్, రమణి, సరళ, డా. అరుణ్ కుమార్, పి. పూర్ణ చంద్రరావు, అరుణ ఎం. సుబ్రహ్మణ్యం, ఎం. శివకుమారి లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులు మానం శ్రీనివాసరావు,ఎం. సుధాకర్ , ఆర్. కోటేశ్వరరావు , ఎం. అశోక్ పాల్గొన్నారు.



## సుమేధలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

గుంటూరు విద్య, ప్రభాతవార్త: స్థానిక ఎన్జీ జీవో కాలనీలోని సుమేధ హైస్కూల్లో శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు అత్యంత ఘనంగా ఆహ్లాదకరంగా జరిగాయి. ఈ సందర్భంగా స్కూల్ డైరెక్టర్ మున్నంగి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఆధునిక సమాజంలో ఉపాధ్యాయుని పాత్ర ఎంతో ముఖ్యమైనదని పేర్కొన్నారు. సమాజ నిర్మాణంలోనూ దేశ ప్రగతిలోనూ విద్యకు ఉన్నత స్థానం ఉందన్నారు అలాంటి విద్యను ఉన్నత విలువలతో విద్యార్థులకు అందించే ఉపాధ్యాయుడు సమాజానికి అద్దం లాంటివాడని ఆయన ప్రశంసించారు. తల్లిదండ్రులు పిల్లవానికి జన్మనిస్తే గురువు మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థి తన ఆలోచనలు మార్చుకునే విధంగా ప్రోత్సహించాలని చంద్రశేఖర్ రెడ్డి వివరించారు. కార్యక్రమంలో మున్నంగి చంద్రశేఖర్ రెడ్డి ఇతర ఉపాధ్యాయుల బృందం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు .అనంతరం ప్రతి ఉపాధ్యాయుడిని ఉపాధ్యాయురాలని పేరుపేరునా పిలిచి శాలువాతో సత్కరించి మెమొంటోలను అందించారు. కార్యక్రమంలో హెడ్ మాస్టర్ కె .రాంబాబు ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## మారుతి యూత్ గణపతి మండపం వద్ద వైభవంగా సామూహిక కుంకుమార్చన

జగ్గయ్యపేట, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త :జగ్గయ్యపేట పట్టణ శివారులోని తొర్రగుంటపాలెంలో మారుతి యూత్ ఏర్పాటుచేసిన గణపతి మండపం వద్ద శుక్రవారం సామూహిక కుంకుమార్చన, స్వామివారి ఆరాధన, అర్చన కార్యక్రమాలు వైభవంగా జరిగింది. పెద్ద సంఖ్యలో మహిళా భక్తులు



పాల్గొని భక్తిప్రపత్తులతో పూజలుచేశారు.పట్టణంలోని బంగారం కొట్ల కూడలిలో గల స్వయంభూ విఘ్నేశ్వరస్వామి ఆలయం సిద్ధి-బుద్ధి విఘ్నేశ్వరస్వామి కళ్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించిన భక్తులు శుక్రవారం స్వామివారి పవళింపు సేవను శాస్త్రోక్తంగా నిర్వహించారు. పలు రకాల పుష్పాలతో స్వామివారిని, దేవేర్లను దివ్యంగా అలంకరించారు.

## జగ్గయ్యపేట పట్టణంలో మిలాద్ ఉన్ నబి జన్మదిన వేడుక ర్యాలీ

జగ్గయ్యపేట, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త :జగ్గయ్యపేట పట్టణంలో శుక్రవారం ముస్లింలు మిలాద్ ఉన్ నబి (మహ్మద్ ప్రవక్త) జన్మదిన వేడుక ర్యాలీని ఘనంగా నిర్వహించారు. మహ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకను భక్తిశ్రద్ధలతో జరుపుకుంటున్న ముస్లింలకు తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ సమన్వయకమిటి




సభ్యులు శ్రీరాం ధనుంజ, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి తన్నీరు నాగేశ్వరరావు వేర్వేరుగా శుభాకాంక్షలు తెలిపారు. నేతలిరువురూ ఈప్రత్యేక ర్యాలీలో పాల్గొన్నారు. అలాగే వైఎస్ఆర్‌సిపి నేతలు పఠాన్ ఫిరోజ్‌ఖాన్, షేక్ ఖాదర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేద కుటుంబాలు, చిన్నారులు, వృద్ధులకు వితరణతో పౌష్టికాహారం పంపిణీ

జగ్గయ్యపేట, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త : జగ్గయ్యపేట పట్టణంలోని కాకానినగర్‌లోగల కర్లపాటి చారిటబుల్ ట్రస్టు కార్యాలయంలో శుక్రవారం ట్రస్టు వ్యవస్థాపకుడు, ప్రముఖ సామాజికవేత్త కర్లపాటి వెంకటశ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిరుపేద కుటుంబాలు, రక్తహీనతతో బాధపడుతున్న చిన్నారులు, వృద్ధులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. పదివేల విలువైన పౌష్టికాహారాన్ని అందించామని, గత ఆరు సంవత్సరాలుగా ప్రతి నెలా క్రమం తప్పకుండా ఈసేవా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమానికి దేసు రామచందర్ సహకారాన్ని అందించగా శ్రేయస్సు సిబ్బంది లక్ష్మి, ట్రస్టు ప్రతినిధి రాయపూడి వెంకటేశ్వరరావు, కోటేశ్వరరావు, ఎన్‌టిఆర్‌జిల్లా రెడ్‌క్రాస్ నిర్వహణ కమిటి సభ్యులు పాల్గొన్నట్లు చెప్పారు.



## తన రథసారథి బ్రహ్మం మృతిపట్ల నెట్టెం రఘురామ్ విషవన్నదనం

జగ్గయ్యపేట, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త :విశ్వాసం, నిబద్ధత, కష్టపడే తత్వాన్ని కలిగి ఉండి 25 ఏండ్లపాటు తన కారు డ్రైవర్‌గా పనిచేసిన రాయల బ్రహ్మం అనారోగ్యంతో హఠాన్మరణం చెందగా కెడిసిసి బ్యాంక్ ఛైర్మన్ నెట్టెం రఘురామ్ చలించిపోయారు. విషవన్నదనంతో దుఃఖితుల య్యారు. శుక్రవారం తొర్రగుంటపాలెంలోని ఆయన నివాసంలో రఘురామ్-స్వర్ణకుమారి దంపతులు బ్రహ్మం భౌతికకాయంపై పూలమాలవేసి నివాళులర్పించారు. ఎంతో విశ్వాసపాత్రుడిని కోల్పోయానని రఘురామ్ తీవ్ర విచారం వ్యక్తంచేశారు. బ్రహ్మం కుటుంబ సభ్యులను ఓదార్చి తన ప్రగాఢ సంతాపం తెలిపారు.



## జగత్ ప్రవక్త బోధనలు ప్రతి ఒక్కరికి అనుసరణీయం

### - ఘనంగా మిలాద్ ఉన్ నబీ వేడుకలు

ఎ కొండూరు, సెప్టెంబరు 5, ప్రభాతవార్త : ఎన్‌టిఆర్ జిల్లా ఎ కొండూరు మండలంలో జగత్ ప్రవక్త హజరత్ ముహమ్మద్ ముస్తఫా సల్లాల్లాహు అలైహివ సల్లం జష్నే ఈద్ మిలాద్ ఉన్ నబీ వేడుకలను ముస్లీం సోదరులు గురువారం రాత్రి శుక్రవారం అత్యంత భక్తిశ్రద్దలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చీమలపాడు కృష్ణారావుపాలెం తదితర గ్రామాల్లో మస్జీద్‌ల్లో మత గురువుల ఆధ్వర్యంలో ప్రత్యేక ధార్మిక ఉపన్యాసాలు, ప్రార్ధనలు నిర్వహించి తెల్లవార్లు జాగారం చేశారు. ఈ సందర్భంగా






శాంతి ధర్మం సమానత్వం ఇరుగు పొరుగు వారిపట్ల ఎలా ప్రవర్తించాలనే జగత్ ప్రవక్త బోధనలను తెలియచేశారు. ముస్లీంలకు ఆధ్యాత్మిక చింతన దైవభీతి వైపు నడిపించామని అల్లా మార్గం అనుసరణీయమని ప్రవక్త ప్రపంచానికి చాటి చెప్పారని ప్రతి ఒక్కరు 5పూటల నమాజ్ చేయాలని అలాగే ధనికులు పేదలను ఆదుకోవాలని అలాగే జకాత్ హజ్ రంజాన్ రోజులు పాటించే విధానంపై ప్రతి ఒక్కరు తు.చ తప్పక పాటించినప్పుడే జగత్‌ప్రవక్తకు నిజమైన నివాళి అని మత గురువులు పేర్కొన్నారు. ఇంకా ఈ మిలాద్ ఉన్ నబీ సందర్భంగా శుక్రవారం ప్రార్ధనల అనంతరం ప్రపంచ శాంతి కోరుతూ ముస్లీంలు గ్రామంలో (జులూస్) ర్యాలీ జరిపి జగత్ ప్రవక్తకు ఘనంగా నివాళులర్పించారు. ప్రపంచ శాంతి వర్ధిల్లాలి ఇస్లాం జిందాబాద్ హిందూ ముస్లీం క్రైస్తవ సోదరులు భాయ్ భాయ్ అంటూ నినదించారు.

## బాధిత కుటుబానికి మట్టిఖర్చులు అందజేత

ఎ కొండూరు, సెప్టెంబరు 5, ప్రభాతవార్త : ఎన్‌టిఆర్ జిల్లా ఎ కొండూరు మండలం చీమలపాడు గ్రామానికి చెందిన ఎస్‌కె బాబు సాహెబ్ భార్య మాబున్నిసా అనారోగ్యంతో మృతి చెందగా విజయవాడ పట్టణానికి చెందిన ప్రవాసాంధ్రుడు (ఎన్నారై-లండన్) బొప్పన మహీనాద్ చౌదరి రూ.5వేలు స్థానిక టిడిపి శ్రేణుల ద్వారా బాధితుడికి మట్టిఖర్చుల నిమిత్తం అందచేసి, తన మానవతావాదాన్ని చాటిచెప్పారు. ఆ క్రమంలో బాబూసాహెబ్ కుటుంబానికి చరవాణి ద్వారా సానుభూతి వ్యక్తం చేస్తూ తీవ్ర సంతాపం తెలియచేశారు. మాతృభూమిపై ఉన్న మమకారంతో ప్రవాసాంధ్రుడు మహీనాద్ చీమలపాడు గ్రామానికి చెందిన పేద ముస్లీం రిక్షా కార్మికుడి జీవన పరిస్థితులు స్థానిక తెదేపా నేతల ద్వారా తెలుసుకుని బాబు సాహెబ్‌కు మట్టి ఖర్చులు అందించడం ఎన్నారై మహీనాద్ సేవాబావం ఉదార స్వభావం మతం కన్నా మానవత్వ గొప్పదనే నానుడిని ఆచరణలో పెట్టి తిరువూరు నియోజకవర్గ ప్రాంతంలో ఈ విధమైన సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఎన్నారై మహీనాద్ మానవీయ కోణాన్ని నియోజకవర్గ ప్రాంత ఎస్సీ ఎస్టీ బిసి మైనార్టీ వర్గాల పేద ప్రజలు ప్రశంసించారు.



# గ్రామాభివృద్ధి..ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం: మంత్రి నాదెండ్ల

కొల్లిపర,సెప్టెంబరు 5 ప్రభాతవార్త: గ్రామాభివృద్ధి..ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు.శుక్రవారం మండల కేంద్రం కొల్లిపరలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.తొలుత మనోహర్ కు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు.మనోహర్ నాయకులను..గ్రామస్తులను బాగున్నారా అంటూ ఆప్యాయంగా పలకరించారు.గ్రామంలో పర్యటించిన మనోహర్ మహిళలకు స్మార్ట్ రేషన్ కార్డులను ఇంటింటికీ తిరిగి పంపిణీ చేస్తూ ధీపం పథకం ద్వారా గ్యాస్ పొందారా..ఇప్పటికి ఎన్ని సిలిండర్లు పొందారు..తల్లికి వందనం అందిందా...అంటూ ప్రభుత్వ పథకాలపై అడిగి తెలుసుకున్నారు.అనంతరం తహశీల్దార్ గుమ్మడి సిద్దార్థ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంత్రి మనోహర్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా కోటి 46 లక్షల మంది లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్‌కార్డులు అందించామన్నారు.తెనాలి నియోజకవర్గంలో 48 వేల కుటుంబాలకు..జిల్లాలో 5 లక్షల 85 వేల మందికి క్యూఆర్‌కోడ్ ద్వారా స్మార్ట్ రేషన్‌కార్డులు అందించామన్నారు.రాష్ట్రంలో 29 వేల 762 చౌక దుణాకాలు ఏర్పాటు చేసామన్నారు.స్మార్ట్ రేషన్‌కార్డు ద్వారా రాష్ట్రంలో ఎక్కడ నుండి అయినా రేషన్ తీసుకోవచ్చన్నారు.వృద్ధులకు ఇంటి వద్దకు వచ్చి సరుకులు అందించటం జరుగుతుందన్నారు.గత ఏడాది ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యాన్ని కొనుగోలు చేసిన వారికి 48 గంటల లోపు వారి ఖాతాలో నగదు జమచేయటం జరిగిందన్నారు.అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతుల ఖాతాల్లో నగదు జమచేయటం జరిగిందన్నారు.కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పిల్లి రాధిక,ఎంపీపీ భీమవరపు పద్మావతి,నాయకులు అడపా నారాయణరెడ్డి,యర్రు వెంకయ్యనాయుడు,భీమవరపు కిషోర్‌రెడ్డి,కట్టా శ్రీహరిరెడ్డి,అద్దంకి వేణుగోపాల్,చౌడేశ్వరరావు,వివిధ శాఖాధికారులు తదితరులు పాల్గొన్నారు.






## రైలు క్రింద పడి వ్యక్తి ఆత్మహత్య

తెనాలి, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త : కొలకలూరు రైల్వే స్టేషన్ సమీపంలో రైలు క్రింద పడి 45-50సంవత్సరాల గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు. శుక్రవారం పట్టాల వెంబడి మృతదేహం ఉన్నట్లు సమాచారం అందడంతో జీఆర్‌పి, ఆర్‌పిఎఫ్ పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతుడు లేత ఆకుపచ్చ రంగు చొక్కా, తెలుగు రంగుపై ఎరుపు, నలుపు గళ్ళ లుంగీ టవల్ ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి మార్చురీకి తరలించారు. వివరాలు తెలిసిన తెనాలి జీఆర్‌పిఎస్‌ఐ 9440627554ను సంప్రదించగలరు.

## గురువుల ప్రేరణతోనే విజయాలు

పొన్నూరు, సెప్టెంబరు 5,ప్రభాతవార్త: గురువుల ప్రేరణ లేకుండా జీవితంలో విజయాలు సాధించడం కష్టసాధ్యమని ఎన్ఎన్‌టి హై స్కూల్ డైరెక్టర్ కొలిపర్తి శివనాగేశ్వరరావు అన్నారు. స్థానిక సాయినగర్‌లోని ఎన్ఎన్‌టి హైస్కూల్‌లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివనాగేశ్వరరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులు జ్ఞానం, విలువలు, మంచి జీవన మార్గాన్ని చూపిస్తారన్నారు. ఒక మంచి ఉపాధ్యాయుడు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, ధైర్యాన్ని పెంపొందిస్తాడన్నారు. ఉపాధ్యాయుల పట్ల కృతజ్ఞత చూపడం ప్రతి విద్యార్థి యొక్క ధర్మమన్నారు. ప్రతి విద్యార్థి ఉపాధ్యాయుల వద్ద సంపూర్ణమైన, పరిపూర్ణమైన విజ్ఞానాన్ని పొందే విధంగా ఆలోచన చేయాలన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్తు నిర్దేశకులన్నారు. తల్లిదండ్రులను, గురువులను గౌరవించాల్సిన బాధ్యత ప్రతి విద్యార్థిపై ఉందన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినోత్సవాన్నే ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకొంటున్నామన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ గొప్ప తత్వవేత్త, ఉపాధ్యాయుడు, భారతదేశ మాజీ రాష్ట్రపతిగా ఆయన విశేషమైన సేవలందించారన్నారు. తొలుత డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పలువురు విద్యార్థులు ఉపాధ్యాయ దినోత్సవంపై ప్రసంగించారు. విద్యార్థులచే నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి వెలనాటి రామదాసు, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.





## ప్రజాపంపిణీ వ్యవస్థలో సంస్కరణలకు శ్రీకారం -ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్

పొన్నూరు, సెప్టెంబరు 5,ప్రభాతవార్త: ప్రజా పంపిణీ వ్యవస్థలో సంస్కరణలకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ అన్నారు. మండల పరిధిలోని పచ్చలతాడిపర్రు గ్రామంలో శుక్రవారం స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధూళిపాళ్ల మాట్లాడుతూ పేదల బియ్యాన్ని పేదలకే చెందేవిధంగా కూటమి ప్రభుత్వం వివిధ సంస్కరణలను తీసుకొస్తుందన్నారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో బియ్యం మాఫియా రాజ్యమేలిందన్నారు. పేదలకు బియ్యాన్ని దక్కనీయలేదన్నారు. వైకాపా హయాంలో వేళ్ళూనుకొని పోయిన రేషన్ మాఫియాను కూకటి వేళ్ళతో పెకలించేందుకు కూటమి ప్రభుత్వం ఎంతో శ్రమించాల్సి వస్తుందన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో రేషన్ మాఫియాపై రెవెన్యూ, పోలీసుశాఖలను ఉక్కుపాదం మోపారన్నారు. రానున్న కాలంలో ఇంకా పగడ్బందీగా చర్యలు తీసుకోవాలని ఇప్పటికే అధికారులకు ఆదేశాలిచ్చామన్నారు. కార్డుదారులందరూ రేషన్‌ను సకాలంలో తీసుకొని ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గత ప్రభుత్వ హయాంలో ఒక్క రేషన్‌కార్డును ఇవ్వలేకపోయారన్నారు. కూటమి ప్రభుత్వంవచ్చాక పాత కార్డుల స్థానంలో స్మార్ట్‌కార్డులను ఇవ్వడంతోపాటు కార్డులేని వారికి కొత్త కార్డులు కూడా ఇస్తున్నామన్నారు. నూతన రేషన్‌కార్డులకు అర్హులైనవారు సచివాలయంలో దరఖాస్తు చేసుకొంటే వారి దరఖాస్తులను విచారణ చేసి అర్హత ఉంటే తప్పని సరిగా నిర్ణీత సమయంలో కార్డు అందజేయడం జరుగుతుందన్నారు. మీ ఇంటి వద్దకు అధికారులు వచ్చి కార్డులను అందజేస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో జనసేనపార్టీ నియోజకవర్గ నాయకుడు వడ్రాణం మార్కండేయబాబు, దేశంశెట్టి సూర్య, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## పౌష్టికాహారంతోనే సంపూర్ణమైన ఆరోగ్యం

పొన్నూరు, సెప్టెంబరు 5,ప్రభాతవార్త: పౌష్టికాహారంతోనే సంపూర్ణమైన, పరిపూర్ణమైన ఆరోగ్యాన్ని పొందవచ్చని లయన్స్‌క్లబ్ స్వర్ణపురి మహిళ అధ్యక్షురాలు బేతాళ ఝాన్సీ రాణి అన్నారు. న్యూట్రిషన్ డే వేడుకల్లో భాగంగా విద్యానగర్‌లోని వృద్ధాశ్రమంలోని వృద్దులకు పండ్లు, రొట్టెలు, నువ్వు ఉండలు, అరటిపండ్లు తదితరాలను అందజేశారు. ఈ సందర్భంగా ఝాన్సీ రాణి మాట్లాడుతూ వృద్ధాశ్రమాలు లేని సమాజస్థాపన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. వృద్ధాశ్రమంలోని వృద్ధులను ఆదుకొనేందుకు దాతలు ముందుకు రావాల్సిన అవసరాన్ని ఆమె గుర్తు చేశారు. లయన్స్‌క్లబ్ రీజియన్ ఛైర్మన్ పరాశరం రంగవల్లి మాట్లాడుతూ పౌష్టికాహార లోపంతో ఎవరూ ఎలాంటి ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతోనే అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిరు ధాన్యాలతో తయారు చేసిన పౌష్టికాహారాన్ని ప్రభుత్వం అందజేస్తుందన్నారు. ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు కూడా ముందుకు వచ్చి పేదలను ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షురాలు మన్నవ అనసూయాదేవి, క్లబ్ కార్యదర్శి శోభ కలూష, కోశాధికారి పి.నిర్మలాదేవి, జి.కృష్ణకుమారి, పరాశరం శేషకుమారి, పి.ఉమాకుమారి, ఎన్‌వి పద్మావతి, బి.నాగమంజరి, కె.విజయలక్ష్మి, టి.శ్రీలక్ష్మి, పి.మోహనలక్ష్మి, విమలకుమారి తదితరులు పాల్గొన్నారు.



## పార్కులను పరిశుభ్రంగా ఉంచాలి

పొన్నూరు, సెప్టెంబరు 5,ప్రభాతవార్త: మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు శుక్రవారం పట్టణంలోని పలు పార్కులను ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. పాత పొన్నూరులోని అంబేద్కర్ పార్కు, నిడుబ్రోలులోని పెద్దన్న చెరువు పార్కులను సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రజలు పార్కులకు కేవలం కాలక్షేపం కోసమే కాకుండా, కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా గడపడానికి వస్తారన్నారు. అలాంటి వారికి పార్కుల్లో ఎలాంటి అసౌకర్యం కలుగకుండాచూడాల్సిన బాధ్యత మునిసిపల్ అధికారులు, సిబ్బందిపై ఉందన్నారు. పార్కుల్లో శారీరక వ్యాయామం చేసేందుకు, స్వచ్ఛమైన గాలి పీల్చుకునేందుకు, మానసిక ఉల్లాసానికి ప్రజలు వస్తారన్నారు. అందువల్ల పార్కుల్లో ఎప్పటికప్పుడు పరిశుభ్రత పాటించే విధంగా చూడాలన్నారు. ప్రజలకు ప్రశాంతవాతావరణాన్ని కల్గించేవిధంగా చూడాలన్నారు. కమిషనర్ వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇత్తడి శ్రీనివాసులు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.



# బాపట్ల జిల్లా వార్త



## సామాజిక,ఆర్థిక,ప్రాంతీయ అసమానతలను విద్యతోనే రూపుమాపగలం
### జిల్లా కలెక్టర్ వెంకటమురళీ

బాపట్ల,సెప్టెంబర్ 5,ప్రభాతవార్త: సామాజిక, ఆర్థిక, ప్రాంతీయ అసమానతలన్ని విద్యతోనే రూపుమాపగలమని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి అన్నారు. గురుపూజోత్సవ కార్యక్రమాన్ని విద్యాశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక కాపు కళ్యాణ మండపంలో నిర్వహించారు.తొలుత జ ్యోతి వెలిగించి ఉపాధ్యాయుల దినోత్సవాన్ని కలెక్టర్ ప్రారంభించారు. 33 మంది ఉపాధ్యాయుని,




ఉపాధ్యాయులకు పురస్కారాలతో పాటు సన్మానం చేశారు. ఉపాధ్యాయుల ప్రాముఖ్యతను వివరిస్తూ వివిధ పాఠశాలల విద్యార్థినీలు చేసిన నృత్య ప్రదర్శనలు ఎంతగానో ఆలరించాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వెంకటమురళీ మాట్లాడుతూ సమాజాన్ని తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు చేస్తున్న కృషిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ప్రభుత్వ పాఠశాలలో మానవ వనరులు పుష్కలంగా ఉన్నాయన్నారు. నైపుణ్యం, విద్యావంతులైన ఉపాధ్యాయులు ఉండడంతోనే ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు నడుస్తున్నాయన్నారు. విద్య జీవన స్థాయిని మార్చేస్తుందన్నారు. వివిధ పథకాలు, సంక్షేమ కార్యక్రమాలతో విద్యారంగం అభివృద్ధికి ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తుందన్నారు. సమాజంలో విద్యకు ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. ఉపాధ్యాయ వృత్తి నుంచి భారత రాష్ట్రపతిగా ఎదిగిన సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యారంగం అభివృద్ధికి కృషి చేశారన్నారు. రాజ్యాంగ నిర్మాణ సభలోనూ ఉపాధ్యాయుడైన రాధాకృష్ణన్ రాష్ట్రపతి హోదాలో ఉండి ఆమోదించడంలో కీలక పాత్ర పోషించారన్నారు. ఆయన స్ఫూర్తితో నేటి ఉపాధ్యాయులు ముందుకు సాగాలన్నారు. నిరంతరం నేర్చుకునే ఉపాధ్యాయులే విద్యార్థుల జీవితాలను చక్కగా తీర్చిదిద్దగలరని అభివర్ణించారు. ఉపాధ్యాయుల సేవలను ఆయన ప్రత్యేకంగా కొనాయాడారు. ఉపాధ్యాయులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. బాపట్ల పార్లమెంట్ సభ్యులు, పానెల్ స్పీకర్, హోం వ్యవహారాల స్టాండింగ్ కమిటీ సభ్యులు తెన్నేటి కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థుల బంగారు భవిష్యత్తు ఉపాధ్యాయులపై ఆధారపడి ఉందన్నారు. విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలని తల్లిదండ్రుల కంటే అహర్నిశలు కృషి చేసే వ్యక్తులే ఉపాధ్యాయులన్నారు. అలాంటి విద్యారంగానికి విలువ తెచ్చిన గొప్ప వ్యక్తిగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. విద్యార్థుల సామర్థ్యాన్ని చూసి వారి భవిష్యత్తుకు బాటలు వేసేది ఉపాధ్యాయులేనన్నారు. విద్యార్థుల కొరకు విభిన్న పాత్రలతో చివరి బెంచీలో ఉన్న వారిని సైతం ప్రయోజకులనుగా చేయగల సత్తా ఉపాధ్యాయులకే ఉందన్నారు. ఎమ్మెల్సీ పోతుల సునీత మాట్లాడుతూ నవ సమాజాన్ని నిర్మించే నిర్మాణకులు ఉపాధ్యాయులేనన్నారు. దేశ అభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన సంఘసంస్కర్తలైన మహనీయులను తీర్చిదిద్దిన వారు ఉపాధ్యాయులేనన్నారు. ఆంగ్ల విద్యతో విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని ఆ దిశగా విద్యాబోధన చేయాలన్నారు. బాపట్ల శాసనసభ్యులు వేగేశననరేంద్రవర్మ మాట్లాడుతూ పిల్లలకు విద్యాబుద్ధులతో పాటు ప్రయోజకులను చేసే గొప్ప బాధ్యత ఉపాధ్యాయులదేనన్నారు. వినూత్నమైన ఆలోచనలతో విద్యాబుద్ధులు అందించి దేశానికి సంపదను కూర్చేది ఉపాధ్యాయులేనన్నారు. రాష్ట్రపతిగా పనిచేసిన సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉపాధ్యాయ వృత్తికి వన్నెతెచ్చారని, నేటి విద్యార్థులకు ఆదర్శప్రాయుడన్నారు. దేశ భవిష్యత్తులో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. చిన్నపిల్లలకు క్రమశిక్షణ, పట్టుదల, నిజాయితీ, సామాజిక స్పృహ వంటి అంశాలపై అవగాహన కల్పించి మంచి పౌరులనుగా తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేనన్నారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సజ్జా హేమలత . బుడా ఛైర్మన్ సలగాల రాజశేఖర్ బాబు, డీఈవో పురుషోత్తం, సమగ్ర శిక్ష అభియాన్ ఏపీసి నాగిరెడ్డి, ఆర్డిఓ పి గ్లోరియా, వివిధ శాఖల అధికారులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## బీచ్ ఫెస్టివల్ ను అంగరంగ వైభవంగా నిర్వహించాలి

బాపట్ల,సెప్టెంబర్ 5,ప్రభాతవార్త:బీచ్ ఫెస్టివల్ ను అంగరంగ వైభవంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. బీచ్ ఫెస్టివల్ నిర్వహణపై అధికారులు, వివిధ సంఘాల ప్రతినిధులతో శుక్రవారం స్థానిక కలెక్టర్ ఛాంబర్ లో ఆయన సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దక్షిణ భారత స్థాయిలో బీచ్ క్రీడా పోటీలు నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈనెల 26, 27, 28 తేదీలలో బీచ్ ఫెస్టివల్ నిర్వహించడం జరుగుతుందన్నారు. వేడుకలకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. ఫెడ్ లైట్ల మధ్య వాలీబాల్, కోకో, బాక్సింగ్, ఫెన్సింగ్ వంటి క్రీడా పోటీలు భారీ స్థాయిలో నిర్వహించాలన్నారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో పండుగలా జరపాలని ఆయన సూచించారు. సూర్యలంక రామాపురంలో ఈ ఉత్సవాలు జరుగుతాయన్నారు. పర్యాటకుల సౌకర్యార్థం 100 ఫుడ్ స్టాల్స్ ఏర్పాటు చేయాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల కొరకు తెలుగు సినీ రంగం నుండి కళాకారులను పిలిపిస్తున్నట్లు చెప్పారు. మధ్యలో కొంత సరదాగా ఉండడానికి జబర్దస్త్ బృందాల ప్రదర్శన ఏర్పాటు చేయాలన్నారు. గొప్ప గాయకులు ఈ పోటీలకు హాజరుకానున్నారన్నారు. సినీ రంగ నటులు, కథానాయకురాలు, ప్రముఖుల సైతం ఈ కార్యక్రమానికి వస్తున్నారని వివరించారు. డాన్సర్లు, మ్యూజికల్ నైట్ ఏర్పాటు చేయాలన్నారు. తీర ప్రాంతంలో బోట్ల ప్రదర్శన, స్పీడ్ బోట్లు, స్పోర్ట్స్ రైడర్స్, గుర్రాలు, ఒంటెలు ప్రదర్శన ఉంచాలన్నారు. వేడుకలకు హాజరయ్యే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. ముఖ్యంగా తాగునీటి సమస్య లేకుండా చూడాలన్నారు. 350 మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేయాలన్నారు. వేలాదిమంది కార్యక్రమానికి హాజరయ్యేలా అన్ని చర్యలు తీసుకోవాలని ఆయన పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి సంయుక్త కలెక్టర్, డి ఆర్ ఓ జి.గంగాధర్ గౌడ్, జిల్లా పర్యటకశాఖ అధికారి నాగిరెడ్డి, ఆర్డీవో గ్లోరియా, మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి, కలెక్టరేట్ ఏవో మల్లికార్జున రావు, తదితరులు పాల్గొన్నారు.



## భక్తిశ్రద్ధలతో మిలాద్-ఉన్-నబి వేడుకలు

పొన్నూరు, సెప్టెంబరు 5,ప్రభాతవార్త: పీరానే పీర్ గౌస్-లే-ఆజం దస్తగీర్ నషాని మార్కెట్ జెండా చెట్టు వద్ద మిలాద్-ఉన్-నబీ వేడుకలను శుక్రవారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దైవ ప్రవక్త మొహమ్మద్(సొ) పుట్టిన రోజును స్మరించుకొంటూ 12రోజులపాటు పీరానే పీర్ గౌస్-లే ఆజమ్ దస్తగీర్ జెండా చెట్టు నిషాన్‌లో వేడుకలు అత్యంత ఘనంగా జరిగాయి. చివరి రోజు పెద్ద ఎత్తున అన్న సంతర్పణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ముజావర్ భక్తుడు మాజీ ఆర్మీ ఉద్యోగి సయ్యద్ జైన్ పర్యవేక్షణలో సభ్యులు పాల్గొని భక్తులకు ఏర్పాట్లు చేశారు.



## కాలువలో కొట్టుకొచ్చిన మృతదేహం

పొన్నూరు, సెప్టెంబరు 5,ప్రభాతవార్త: పట్టణంలోని తుంగభద్ర కాలువలోకి గుర్తు తెలియని యువకుడి మృతదేహం కొట్టుకొచ్చిందని అర్బన్ సిఐ లావూరి వీరానాయక్ తెలిపారు. సుమారు 25సంవత్సరాలు వయసున్న యువడిగా చెప్పారు.యువకుడు గోధుమ రంగు చొక్కా, నలుపు రంగు ప్యాంటు ధరించి ఉన్నాడన్నారు. మృతుడి గురించి ఆచూకి తెలిసినవారు పొన్నూరు అర్బన్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలన్నారు. వివరాలకు సిఐ సెల్‌ఫోన్ నెం:9440796172, పొన్నూరు అర్బన్ స్టేషన్ నెంబరు: 08643-242333 సంప్రదించాలన్నారు.



## పారిశుద్ధ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలి

.స్వర్ణాంధ్ర ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు ఏసుబాబు మాదిగ

గుంటూరు విద్య, ప్రభాతవార్త: గుంటూరు నగరంలో ప్రజా ఆరోగ్య శాఖ అధికారులు మున్సిపల్ అధికారులు పారిశుద్ధం పై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని, వైరల్ జ్వరాలతో గుంటూరు నగరంలోని పలు కాలనీ ల నివాసులు ఇబ్బందులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారని, సత్వరం అధికారులు స్పందించాలని స్వర్ణాంధ్ర ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు ఏసుబాబు మాదిగ కోరారు. ఇటీవల తురకపాలెం గ్రామంలో అనేకమంది అంతుచిక్కని వ్యాధితో మరణిస్తున్న నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యలలో భాగంగా గుంటూరు నగరంలోని పారిశుద్ధ్య పరిస్థితులను చక్క పెట్టాలని ఆయన కోరారు. గుంటూరు నగరంలో పారిశుద్యాన్ని మరింత మెరుగుపరుస్తూ దోమల నియంత్రణ జరిగేలా అధికారులు దృష్టి సారించాలని కోరారు. తురకపాలెం గ్రామం సంఘటనపై అధికారులు తక్షణం స్పందించటం అభినందనీయమని ఏసుబాబు మాదిగ ప్రశంసించారు.

## రూ.16.84.405 విలువ గల సిఎం నగదు చెక్కుల పంపిణీ

బాపట్ల,సెప్టెంబర్ 5,ప్రభాతవార్త: సిఎం సహాయ నిధి పథకం పేదలకు వరం వంటిదని బాపట్ల శాసన సభ్యులు వేగేశ నరేంద్రవర్మ అన్నారు. స్థానిక ఎమ్మెల్యే గారి క్యాంపు కార్యాలయంలో బాపట్ల నియోజకవర్గం బాపట్ల పట్టణంలో అర్హులైన 26 మంది సిఎం సంక్షేమ నిధి పథకం లబ్ధిదారులకు శుక్రవారం నగదు చెక్కులను పంపిణి చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య ఖర్చుల సహాయార్థం ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు సంక్షేమ నిది సీఎం రిలీఫ్ ఫండ్ నుండి వచ్చిన రూ.16లక్షల 84వేల 405 రూపాలయ నగదు చెక్కులను లబ్ధిదారులకు పంపిణి చేయడం జరిగిందన్నారు.సిఎం సహాయనిధి పేదలకు వరం వంటిదన్నారు. పేద ప్రజలకు మేరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి ఈ పథకాన్ని అమలు చేస్తున్నారన్నారు.నగదు చెక్కులను అందించిన లబ్ధిదారులను ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.ఇది ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి సంక్షేమ దృక్పథానికి నిదర్శనమన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రజా సమస్యలు త్వరగతిన పరిష్కరిస్తూ, ప్రజలకు అన్ని విధాలుగా సహాయ సహకారాలను అందిస్తుందన్నారు..కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రజలకు వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా బాధిత కుటుంబాలకు, నిరుపేద కుటుంబాలకు సీయం సహాయ నిధి అందజేసి కూటమి ప్రభుత్వం వారికి ఆపదలో అండగానిలుస్తుందని అన్నారు. వైద్య ఖర్చులు భరించలేని కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మద్దతు ఇవ్వడం ప్రభుత్వ బాధ్యతగా భావిస్తామని,అర్హులైన మధ్యతరగతి పేద కుటుంబాలు సీయం సహాయ నిధి కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. . మరింత మందికి ఈ సహాయం అందేలా కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ,కార్యకర్తలు,లబ్ధిదారులు, తదితరులుపాల్గొన్నారు.




## బాపట్ల పెద పులుగువారిపాలెం కు ఆర్టీసీ బస్సు నడిచేనా?

కర్లపాలెం,సెప్టెంబర్ 5,ప్రభాతవార్త: అయ్యా మాకు బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేసి మా సమస్యను పరిష్కరించండి అంటూ కర్లపాలెం మండలంలోని పలు గ్రామాల ప్రజలు అదికారులను,రాజకీయనాయకులను వేడుకుంటున్నారు.కూటమి ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన మహిళలకు ఉచిత బస్సు( స్త్రీ శక్తి )పథకాన్ని మేము కూడా వినియోగించుకునే విధంగా అవకాశం కల్పించాలంటూ అయా గ్రామాల మహిళలు కూడా వేడుకుంటున్నారు.బాపట్ల నుంచి పెద పులుగువారిపాలెం కు ఆర్టీసీ బస్సుసౌకర్యం గత కరోనా వరకు ఉంది. అ కాలంలో అనివార్య కారణాలవలన బస్సు సౌకార్యాన్ని నిలుపుదల చేశారు. అనంతరం తిరిగి మరలా ప్రారంభం కాలేదు.ఈ మార్గం లో కర్లపాలెం, చింతాయపాలెం,గణపవరం, కట్టావాద మీదగా పెద పులుగువారిపాలెం వెళుతుంది. దాని వలన విద్యార్థులకు, వివిధ రకాల పనుల మీద బాపట్ల వచ్చే వారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ఇప్పటికైనా చింతాయ పాలెం, గణపవరం, కట్టావాద పెద పులుగువారిపాలెం గ్రామాల ప్రజలు స్పందించి అధికారులు, శాసన సభ్యులును కలిసి మాట్లాడితే మేలు జరుగుతుంది. సామాన్యులకు ఉపయోగం ఉంటుంది. అధికారులు ప్రజా ప్రతినిధులు కూడా ఆ విధంగా ఆలోచించి సానుకూలంగా స్పందించి బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేయాలని అని ప్రజలు కోరుతున్నారు.



## దాతృత్వాన్ని చాటుకున్న డిప్యూటీ కలెక్టర్ నాగిరెడ్డి
### సొంత నిధులతో రూ.20వేలతో విద్యార్థులకు భోజనం ప్లేట్లు పంపిణీ

బాపట్ల,సెప్టెంబర్ 5,ప్రభాతవార్త: విది నిర్వహణను అంకిత భావంతో నిర్వహించడంతో పాటు కొంత మంది అదికారులు తమ మానవత్వాన్ని చాటుకుంటారు.అదే బాటలో బాపట్ల సర్వశిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్,డిప్యూటీ కలెక్టర్ నాగిరెడ్డి తమ మానవత్వాన్ని చాటుకున్నారు.ఇటివల కర్లపాలెం మండలం జడ్‌పిహెచ్ఎస్ యాజలి ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ సందర్శించి మధ్యాహ్న భోజనం పథకాన్ని పరిశీలించి విద్యార్థులతో పాటు కలిసి భోజనం చేశారు. అ సమయంలో కలెక్టర్‌తో పాటు గా సర్వశిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ నాగిరెడ్డికూడా విద్యార్థులతో కలిసి బోజనం చేశారు.పాఠశాలలో విద్యార్థులకు భోజనం చేయడానికి కేవలం 70 ప్లేట్లు మాత్రమే ఉండటంతో విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను గమనించి చలించిపోయారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుగుణామణితో మాట్లాడి విద్యార్థుల సమస్యను పరిష్కరించే దిశగా ఆయన తన స్వంత నిధులు రూ.20వేలతో విద్యార్థులకు 250ప్లేట్లను అందించారు..ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం,ఉపాధ్యాయలు,విద్యార్థులు ఆయనకు ప్రత్యేక ధన్యావాదాలు తెలియజేశారు.



## వాహన దారులు ధృవీకరణ పత్రాలు అందుబాటులో ఉంచుకోవాలి

పిట్టలవానిపాలెం,సెప్టెంబర్ 5,ప్రభాతవార్త: వాహనదారులు తమ వాహనాలకు ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరిగా కలిగి ఉండాలని చందోలు ఎస్సై వెంకట శివకుమార్ తెలిపారు. శుక్రవారం రెడ్డిపాలెం టోల్ ప్లాజా సమీపంలో ఎస్ఐ శివకుమార్ వాహనాలు తనిఖీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనాలను నడపాలన్నారు. ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించకూడదన్నారు. ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా ధ్రువీకరణ పత్రాలను కలిగి ఉండాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వాహనదారులు తమ వాహనాలకు సంబంధించి పెండింగ్లో ఉన్న ఈ చలానాలను వెంటనే చెల్లించాలని ఎస్ఐ వాహనదారులకు సూచించారు.




## సహకార సంఘాలలో అక్రమాలపై రాష్ట్రస్థాయిలో కమిటి ఏర్పాటు
### -ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్

పొన్నూరు, సెప్టెంబరు 5,ప్రభాతవార్త: పొన్నూరు నియోజకవర్గంలోని సహకార సంఘాలలో జరిగిన అక్రమాలపై రాష్ట్రస్థాయిలో కమిటీని ఏర్పాటు చేసి దోషులకు శిక్ష పడేలా చర్యలు తీసుకొంటామని ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ అన్నారు. మండల పరిధిలోని పచ్చలతాడిపర్రు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ప్రమాణస్వీకారోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే నరేంద్రకుమార్ మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాల కాలంలో దండమూడి గ్రామంలో ఎన్నో రకాల విధ్వంసాలకు వైకాపా ప్రభుత్వం తెరలేపిందన్నారు. ఒక వినాయక నిమజ్జనం జరపడానికి వీల్లేదు....ఆ గ్రామంలో వైకాపా ప్రభుత్వాన్ని వ్యతిరేకించిన ఎంతో మంది ఎన్నో రకాలుగా కేసులు ఎదుర్కొన్నారన్నారు. బండి కదలాలి చేయాలంటే బెదిరింపులు పోలీసుల నుండి కేసులు పెడతామని, అయినా సరే వాళ్ళ బెదిరింపులకు లొంగకుండా ఎన్నో రకాల సవాళ్ళను జనసైనికులు, టిడిపి కార్యకర్తలు ఎదుర్కొన్నారన్నారు. తేనె పరిశ్రమ మీద ఆధారపడి జీవిస్తున్న ఆ గ్రామంలో ఆర్థికంగా తేనె పరిశ్రమ నుండి ఆదాయం రాకుండా ఆర్థిక మూలాలపై ఏవిధంగా దెబ్బతీశారో అక్కడ వున్న నాయకులకు, మాకు తెలుసన్నారు. ఎన్నికల ముందు బిజెపి, జెఎస్పీ, టిడిపి నాయకులు, కార్యకర్తలు కూటమిగా ఏ విధంగా అయితే ఎన్నికల్లో పనిచేశామో నేడు కూడా అదేవిధంగా ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారి సమస్యలు పరిష్కరించే దిశగా ముందుకు సాగుదామన్నారు. వైకాపా పాలనలో బోగస్ డ్వాక్రా గ్రూపులు ఏర్పాటు చేసి రుణాలు తీసుకున్నారు. సొసైటీలలో రైతుల పేర్ల మీదు రుణాలు తీసుకొని కొన్ని కోట్ల రూపాయలు కొల్లగొట్టారన్నారు. వాటిపై నేడు విచారణ జరుగుతోందన్నారు. అవసరమైతే రాష్ట్రస్థాయిలో విచారణ కమిటిని ఏర్పాటు చేసి దోషులను శిక్షించడం జరుగుతుందన్నారు. పచ్చలతాడిపర్రు గ్రామ సొసైటీ అధ్యక్షులుగా ఎంతో మంది ఉన్నత పదవులను చేపట్టారన్నారు. అదేవిధంగా నేడు ఈ కమిటి సభ్యులు కూడా మరెన్నో ఉన్నత పదవులు చేపట్టాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు ఎమ్మెల్యే ధూళిపాళ్ళ. పచ్చలతాడిపర్రు సొసైటీ అధ్యక్షుడిగా దండమూడి గ్రామానికి చెందిన గంధం సురేంద్ర(జెఎస్పీ), సభ్యులుగా పచ్చలతాడిపర్రు గ్రామానికి చెందిన యంపరాల గోపి(టిడిపి),కట్టెంపూడి గ్రామానికి చెందిన యక్కటి నాగేశ్వరరావు(టిడిపి) నియమితులయ్యారు. నూతన కమిటి అధ్యక్షుడు గంధం సురేంద్ర మాట్లాడుతూ పరపతి సంఘం పరిధిలో ఉన్న రైతులందరికీ ఎటువంటి ఇబ్బందులు లేకుండా సొసైటీ రుణాలు, సకాలంలో ఎరువులు అందిస్తామన్నారు. సొసైటీ ద్వారా రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పనిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బండ్లమూడి బాబూరావు, ఆకుల సాంబశివరావు, పఠాన్ పిరోజ్‌ఖాన్, మాదల వెంకటేశ్వరరావు, పఠాన్ అహమ్మద్‌ఖాన్, యన్నం నాయుడు, దేశంశెట్టి సూర్య, మగ్బుల్‌బేగ్, మొవ్వా వెంకటకృష్ణ తదితరులున్నారు.



## ఉత్తమ ప్రధానోపాధ్యాయుడిగా కాకుమాను లాజర్‌బాబు

పొన్నూరు, సెప్టెంబరు 5,ప్రభాతవార్త: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని నేతాజీనగర్ మునిసిపల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు కాకుమాను లాజర్‌బాబు ఎంపికై జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ హెన్రీ క్రిష్టినా చేతుల మీదుగా అవార్డు అందుకొన్నారు. గుంటూరులో జరిగిన కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి సివి రేణుక, గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు, ఎమ్మెల్యే గల్లా మాధవి, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ చేతుల మీదుగా అవార్డు అందుకొన్నారు. అవార్డు అందుకున్న లాజర్‌బాబును పట్టణానికి చెందిన పలువురు అభినందించారు. చక్కా శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు మురళీ, గౌతమ్, పాఠశాల ఉపాధ్యాయులు, పట్టణ పుర ప్రముఖులు అభినందించారు.



# ‘వీర చంద్ర హాస’ 19న గ్రాండ్ రిలీజ్

కంచి కామాక్షి కోల్‌కతా కాళీ క్రియేషన్స్ బ్యానర్‌పై ఎమ్‌వీ రాధాకృష్ణ తెలుగులో విడుదల చేస్తున్న కన్నడ చిత్రం "వీర చంద్రహాస". మంచి టేస్ట్ ఉన్న ప్రొడ్యూసర్‌గా రాధాకృష్ణకు గుర్తింపు ఉంది. గతంలో శివరాజ్ కుమార్ నటించిన వేద, ప్రజ్వల్ దేవరాజ్ నటించిన 'రాక్షస' చిత్రాలను తెలుగులో రిలీజ్ చేసిన ఆయన. తాజాగా "వీర చంద్రహాస" తెలుగు రైట్స్‌ను దక్కించుకున్నారు. సెప్టెంబర్ 19న ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నట్టు ప్రకటించారు. ఇటీవల ఇండియన్ బాక్సాఫీస్ దగ్గర రికార్డులు సృష్టించి మూడు వందల కోట్లు కలెక్షన్స్ రాబట్టిన "మహావతార్ నరసింహ" తర్వాత హోంబలే ఫిల్మ్స్ సమర్పణలో విడుదల చేస్తున్న "వీర చంద్రహాస" చిత్రంపై అంచనాలు నెలకొన్నాయి. ఆ చిత్రం తరహాలోనే ఇది కూడా ప్రేక్షకుల ఆదరణ పొందుతుందని నిర్మాతలు అన్నారు. కేజీయఫ్, సలార్ లాంటి యాక్షన్ చిత్రాలకు సంగీతం అందించి మ్యూజిక్ డైరెక్టర్‌గా ఒక సంచలనం సృష్టించిన రవి బస్రూర్. వీర చంద్రహాసచిత్రానికి దర్శకత్వం వహించారు. కన్నడ స్టార్ శివరాజ్ కుమార్ కీలక పాత్ర పోషించిన ఈ చిత్రంలో శిథిల్ శెట్టి, నాగశ్రీ జిఎస్, ప్రసన్న శెట్టిగార్ మందార్తి, ఉదయ్ కడబాల్, రవీంద్ర దేవాడిగ, నాగరాజ్ సర్వెగర్, గుణశ్రీ ఎం నాయక్, శ్రీధర్ కాసర్కోడు, శ్వేత అరెహోల్, ప్రజ్వల్ కిన్నాల్ ప్రధాన పాత్రలు పోషించారు. కన్నడ అగ్ర నిర్మాణ సంస్థ హోంబలే ఫిల్మ్స్ సమర్పణలో ఓంకార్ మూవీస్ బ్యానర్‌పై ఎన్ ఎస్ రాజ్‌కుమార్ నిర్మించారు. కన్నడలో విడుదలైన ఈ చిత్రం బ్లాక్ బస్టర్ హిట్ టాక్‌ను సొంతం చేసుకుంది. సందర్భంగా నిర్మాత ఎమ్‌వీ రాధాకృష్ణ మాట్లాడుతూ, కన్నడలో విడుదలైన‘ వీర చంద్రహాస" చిత్రం హిట్ టాక్‌తో పాటు మంచి వసూళ్లను రాబడుతోంది. ఈ మూవీ తెలుగు రైట్స్ దక్కించుకోవడం చాలా సంతోషంగా ఉంది. మంచి కంటెంట్ ఉన్న చిత్రాలను తెలుగు ప్రేక్షకులకు ఎప్పుడూ ఆదరిస్తారు. ఈ చిత్రానికి కూడా తెలుగు ఆడియెన్స్ బ్రహ్మరథం పడతారని ఆశిస్తున్నా. సినిమా సక్సెస్ గ్యారెంటీ అని నమ్ముతున్నా. తనదైన సంగీతంతో అందర్నీ మెప్పించిన రవి బస్రూర్ దర్శకుడిగానూ సత్తా చాటడం సంతోషంగా ఉంది. ఇటీవల విడుదలైన 'మహావతార్ నరసింహ' చిత్రం తరహాలోనే ఈ చిత్రం కూడా ఉండటంతో ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని బలంగా నమ్ముతున్నాం అని అన్నారు. సంగీత దర్శకుడు, దర్శకుడు రవి బస్రూర్ మాట్లాడుతూ. డైరెక్టర్‌గా నేను రూపొందించిన ఈ సినిమాను కన్నడ ప్రేక్షకులు బాగా ఆదరించారు. తెలుగు ఆడియెన్స్‌కు కూడా కచ్చితంగా నచ్చుతుందని భావిస్తున్నా. శివరాజ్‌కుమార్‌తో పాటు ఇందులో నటించిన నటీనటులంతా చాలా బాగా సపోర్ట్ చేశారు.





జగదీష్

## ‘అర్జున్ చక్రవర్తి’ బెస్ట్ సినిమాటో గ్రాఫర్

'అర్జున్ చక్రవర్తి' చిత్రంతో కెమెరా మెన్‌గా జగదీష్ చీకటి పేరు ఎక్కువగా విని పిస్తోంది. విజువల్ ట్రీట్‌గా మూవీని తెరకెక్కించిన జగదీష్ చీకటి పనితనం గురించి ప్రస్తుతం అందరూ మాట్లాడుకుంటున్నారు. 'అర్జున్ చక్రవర్తి' చిత్రానికి గానూ ఎన్నో అంతర్జాతీయ వేడుకల్లో బెస్ట్ సినిమాటో గ్రఫర్‌గా జగదీష్ చీకటి అవార్డుల్ని అందుకున్నారు.'అర్జున్ చక్రవర్తి' ప్రస్తుతం విజయవంతంగా దూసుకుపోతోండటంతో కెమెరామెన్ జగదీష్ చీకటి చెప్పిన సంగతులివే.

**మీ నేపథ్యం ఏంటి? మీ సినీ ప్రయాణం ఎలా మొదలైంది?** నాకు డ్రాయింగ్, ఫోటోగ్రఫీ అంటే చాలా ఇష్టం. ఫోటోగ్రఫీలోనూ మాస్టర్స్ చేశాను.దూరదర్శన్‌లోనూ పని చేశాను. స్టిల్ ఫోటోగ్రఫీలోనూ అవార్డులు వచ్చాయి. ఎన్నో కమర్షియల్ యాడ్స్,ఎన్నో ప్రాజెక్టులను చేశాను. అలా చేస్తున్న సమయంలోనే జత కలిసే మూవీకి అవకాశం వచ్చింది.

**మీఫ్యామిలీ నుంచి ఎలాంటి సపోర్ట్ ఉండేది?**మా నాన్న ఇరిగేషన్ డిపార్ట్మెంట్‌లో ఉద్యోగం చేస్తారు. నాకు ఎప్పుడూ కూడా ఫుల్ సపోర్ట్ ఇస్తుండేవారు. నచ్చిన పని ఏదైనా సరే చేయమని, అనేవారు. .అప్పుడు కూడా నాకు ఫుల్ సపోర్ట్ ఇచ్చారు.

**అర్జున్ చక్రవర్తి విషయంలో మీ వర్క్ ఎక్స్‌పీరియెన్స్ గురించి చెప్పండి.** హాలీవుడ్ స్థాయికి ధీటుగా మనం తీస్తున్నాం. మా అర్జున్ చక్రవర్తి కూడా అదే స్థాయిలో ఉంటుంది. ఆ స్థాయి లుక్ వచ్చేందుకు నేచురల్ లైటింగ్‌లోనే షూటింగ్ చేశాం.

**అర్జున్ చక్రవర్తి షూటింగ్ టైంలో ఎదురైన సవాళ్లు?** మంచు కురిసే ప్రాంతం కదా అని కాశ్మీర్‌కు వెళ్లాం. కానీ మేం వెళ్లినప్పుడు అక్కడ మంచు పడటం లేదు. దీంతో అక్కడే మంచు కురిసే వరకు ఎదురుచూశాం. అలా చివరకు మైనస్ 8 డిగ్రీల వరకు వెళ్లింది.అలా మంచు కురుస్తుంటే స్వర్గమంటే ఇదేనేమో అన్నట్టుగా కనిపించింది. దీంతో మేం అనుకున్న దానికింటే బాగా షూట్ చేశాం.



జాన్వీ కపూర్

# సెన్సార్ పనులు ముగిసిన ‘కిష్కింధపురి’




**టాలీవుడ్ లో** తెరకెక్కుతున్న చిత్రాల్లో ‘కిష్కింధపురి’ కూడా ఒకటి. హారర్ జోనర్ లో వస్తున్న ఈ సినిమాలో బెల్లంకొండ శ్రీనివాస్ హీరోగా నటిస్తున్నాడు. ఇప్పటికే రిలీజ్ అయిన ప్రమోషనల్ కంటెంట్ ఈ సినిమా పై సాలిడ్ అంచనాలు పెంచింది.

ఇక ఇప్పుడు ఈ సినిమా సెన్సార్ పనులు కూడా ముగించుకుంది. ఈ చిత్రానికి సెన్సార్ బోర్డు ఏ సర్టిఫికెట్ జారీ చేసింది. ఈ సినిమాలోని కంటెంట్ కేవలం పెద్ద వారికే అని ఈ సర్టిఫికెట్ ఇష్యూ చేసింది. హారర్ ఎలిమెంట్స్ వల్ల ఈ నిర్ణయం తీసుకున్నట్లు చిత్ర యూనిట్ చెబుతోంది.

అయితే, ఈ సినిమా లో ఒక్క కట్ కూడా లేకుండా సెన్సార్ ఈ నిర్ణయం తీసుకోవడం తో చిత్ర యూనిట్ హర్షం వ్యక్తం చేస్తోంది. అనుపమ పరమేశ్వరన్ హీరోయిన్ గా నటిస్తున్న ఈ సినిమాని కౌశిక్ పెగళ్లపాటి డైరెక్ట్ చేస్తున్నాడు. సెప్టెంబర్ 12న ఈ సినిమా గ్రాండ్ రిలీజ్ కి రెడీ అయింది.

# ఓ.. చెలియా’ చిత్రం నుండి.. నువ్వే చెప్పు చిరుగాలి పాట విడుదల

**ఎస్ఆర్ఎస్ మూవీ క్రియేషన్స్**, ఇందిరా దేవీ ప్రొడక్షన్స్ బ్యానర్‌ల మీద రూపాశ్రీ కొపురు నిర్మిస్తున్న చిత్రం ఓ.. చెలియా. ఈ మూవీకి కథ, కథనం, దర్శకత్వ బాధ్యతల్ని ఎం. నాగ రాజశేఖర్ రెడ్డి నిర్వర్తిస్తున్నారు. నాగ ప్రణవ్, కావేరి కర్ణిక, ఆద్య రెడ్డి ప్రధాన పాత్రలో నటించిన ఈ మూవీకి సంబంధించిన ప్రమోషన్స్‌ను ప్రారంభించారు. రాకింగ్ స్టార్ మంచు మనోజ్ చేతుల మీదఓ.. చెలియా నుంచి ఫస్ట్ సింగిల్‌ను రిలీజ్ చేయించారు.

నువ్వే చెప్పు చిరుగాలి అంటూ సాగే ఈ పాటను మంచు మనోజ్ విడుదల చేశారు. పాటను రిలీజ్ చేసిన అనంతరం చిత్ర యూనిట్‌కి మంచు మనోజ్ అభినందనలు తెలియజేశారు. ఈ పాటను సాయి చరణ్ ఆలపించగా.. ఎంఎం కుమార్ బాణీని అందించారు. ఇక సుధీర్ బగడి రాసిన సాహిత్యం ఆకట్టుకునేలా ఉంది. లిరికల్ వీడియోని చూస్తుంటే మంచి ప్రేమ కథా చిత్రాన్ని అందించబోతోన్నట్టుగా కనిపిస్తోంది. ఇక హీరో హీరోయిన్ల కెమిస్ట్రీ చాలా ఫ్రెష్‌గా, ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందించేలా ఉంది. ఈ మూవీకి సురేష్ బాలా కెమెరామెన్‌గా, ఉపేంద్ర ఎడిటర్‌గా పని చేస్తున్నారు. త్వరలోనే ఈ మూవీకి సంబంధించిన రిలీజ్ డేట్‌ను ప్రకటించబోతోన్నారు.



# ‘ టన్నెల్’ ట్రైలర్ విడుదల



అథర్వా మురళీ క్రైమ్, సస్పెన్స్, థ్రిల్లర్ జానర్‌ను ఎంచుకున్నాడటే బ్లాక్ బస్టర్ పక్కా అన్నట్టే. ప్రస్తుతం అథర్వా యాక్షన్ ప్యాక్డ్ థ్రిల్లర్ జానర్‌లో‘ టన్నెల్’ అనే మూవీని చేశారు. రవీంద్ర మాధవ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో లావణ్య త్రిపాఠి కథానాయికగా నటించారు. అశ్విన్ కాకుమాను విలన్ పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రం సెప్టెంబర్ 12న థియేటర్లలోకి రానుంది. ఈ మూవీని తెలుగులోకి ఎ.రాజు నాయక్ లచ్చురామ్ ప్రొడక్షన్స్ ద్వారా విడుదల చేస్తున్నారు. తాజాగా ట్రైలర్ విడుదల చేసి అంచనాలు పెంచేశారు. 'యూనిఫామ్ వేసుకున్న తరువాత అందరూ ఫ్యామిలీనే' అని ట్రైలర్ లో హీరో చెప్పిన డైలాగ్ చూస్తే టన్నెల్ సినిమా ఎలా ఉంటుందో అర్థం అవుతుంది. ఇక ఇందులో సస్పెన్స్ థ్రిల్లర్ యాక్షన్‌కి ఎంత ఇంపార్టెన్స్ ఉందో లవ్ ట్రాక్ కి కూడా అంతే ప్రాధాన్యం ఉందని తెలుస్తోంది. లావణ్య త్రిపాఠి, అథర్వ కాంబో అందరినీ అలరించేలా ఉంది. గ్రిప్పింగ్, అదిరిపోయే యాక్షన్ సీక్వెన్స్‌లతో ట్రైలర్‌ను కట్ చేశారు. జస్టిన్ ప్రభాకరన్ ఈ మూవీకి సంగీతాన్ని అందించారు. శక్తి శరవణన్ సినిమాటోగ్రాఫర్‌గా పని చేశారు. కలైవానన్ ఈ సినిమాకు ఎడిటర్. తెలుగు వెర్షన్ ప్రమోషన్లు త్వరలో ప్రారంభం కానున్నాయి. అథర్వా మురళీ తెలుగు ప్రమోషన్స్‌లో సందడి చేసేందుకు సిద్ధంగా ఉన్నారు.

# ‘రీ ర్యాంప్’ నుంచి స్పెషల్ పోస్టర్

సక్సెస్ ఫుల్ హీరో కిరణ్ అబ్బవరం “ రీర్యాంప్ సినిమా నుంచి ‘ఓనమ్’ పండుగ శుభాకాంక్షలతో స్పెషల్ పోస్టర్ విడుదల, దీపావళి సందర్భంగా అక్టోబర్ 18న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు వస్తున్న మూవీ సక్సెస్ ఫుల్ హీరో కిరణ్ అబ్బవరం నటిస్తున్న కొత్త సినిమా “ రీర్యాంప్”. ఈ సినిమాను ప్రముఖ నిర్మాణ సంస్థ హాస్య మూవీస్, రుద్రాంశ్ సెల్యులాయిడ్ బ్యానర్‌ల మీద సక్సెస్ ఫుల్ ప్రొడ్యూసర్ రాజేష్ దండ, శివ బొమ్మకు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. యుక్తి తరేజా హీరోయిన్‌గా నటిస్తోంది. “రీర్యాంప్” సినిమాకు జైన్స్ నాని దర్శకత్వం వహిస్తున్నారు. ఈ మూవీ దీపావళి పండుగ సందర్భంగా అక్టోబర్ 18న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది.ఈ రోజు ‘ఓనమ్’ పండుగ సందర్భంగా “ రీర్యాంప్” సినిమా నుంచి విశెస్ చెబుతూ స్పెషల్ పోస్టర్ రిలీజ్ చేశారు. కేరళ నేపథ్యంగా జరిగే కథను “ రీర్యాంప్” మూవీలో సరికొత్తగా చూపించబోతున్నారు. ఓనమ్ పండుగ సెలబ్రేషన్స్‌తో సాగే పాటను కూడా ఈ మూవీలో ప్రత్యేకంగా చిత్రీకరించారు. ప్రస్తుతం ఈ సినిమా మ్యూజిక్ ప్రమోషన్స్ సక్సెస్‌ఫుల్ గా జరుగుతున్నాయి. ఈ నెల 9న “రీర్యాంప్” సినిమా నుంచి మ్యాజికల్ లవ్ మెలొడీ సాంగ్ ‘కలలే కలలే’ విడుదల చేయబోతున్నారు.నటీనటులు: కిరణ్ అబ్బవరం, యుక్తి తరేజా, నరేష్,సాయి కుమార్,వెన్నెలకిషోర్ తదితరులు.రచన, దర్శకత్వం: జైన్స్ నాని.



# ‘ది గేమ్ :యు నెవర్ ప్లే ఎలోన్’ అక్టోబర్ నెట్‌ఫ్లిక్స్‌లో రిలీజ్



శ్రద్ధా శ్రీనాథ్, రాజేష్ ఎం. సెల్వా గ్రిప్పింగ్ థ్రిల్లర్ ‘ది గేమ్: యు నెవర్ ప్లే ఎలోన్ ” అక్టోబర్ 2న నెట్‌ఫ్లిక్స్‌లో రిలీజ్ శ్రద్ధా శ్రీనాథ్ లీడ్ రోల్ లో నెట్‌ఫ్లిక్స్, అప్లాజ్ ఎంటర్‌టైన్‌మెంట్ కలసి చేస్తున్న న్యూ థ్రిల్లర్ “ది గేమ్: యూ నెవర్ ప్లే ఎలోన్” అక్టోబర్ 2న నెట్‌ఫ్లిక్స్‌లో రిలీజ్ కానుంది. బ్లాక్ వారంట్ తర్వాత నెట్‌ఫ్లిక్స్, అప్లాజ్ ఎంటర్‌టైన్‌మెంట్ కలయికలో వస్తున్న ఈ ప్రాజెక్ట్‌ని రాజేష్ ఎం. సెల్వా డైరెక్ట్ చేస్తున్నారు.

లీడ్ రోల్‌లో శ్రద్ధా శ్రీనాథ్ నటిస్తుండగా, సంతోష్ ప్రతాప్, చందినీ, శ్యామహరిని, బాలహసన్, సుబాష్ సెల్వం, వివియా సంతోష్, ధీరజ్, హెమా ముఖ్య పాత్రల్లో కనిపించనున్నారు. స్ట్రాంగ్ స్టోరీటెల్లింగ్‌తో పాటు టైమ్‌లి థీమ్స్‌ని మిక్స్ చేస్తూ ఆడియన్స్‌కి డిఫరెంట్ ఎక్స్ పీరియన్స్ ఇవ్వనుంది నెట్‌ఫ్లిక్స్ ఇండియా కంటెంట్ వైస్ ప్రెసిడెంట్ మోనికా షెర్గిల్ మాట్లాడుతూ.. ‘ది గేమ్’ మా ఈ ఏడాది ఫస్ట్ తమిళ సిరీస్. సరికొత్త స్టోరీని తీసుకొస్తున్నాం. ఒక ఫీమేల్ గేమ్ డెవలపర్‌పై జరిగే కోఆర్డినేటెడ్ అటాక్ వెనక వాళ్లను ట్రాక్ చేసే ఆమె జర్నీని ఈ థ్రిల్లర్ గా ప్రజెంట్ చేస్తునాం. అప్లాజ్ తో మా కలయికలో ఇప్పటికే బ్లాక్ వారంట్ వచ్చింది. ఇప్పుడు ఈ సిరీస్ కూడా చాలా రెలివెంట్‌గా ఉంటుంది. అప్లాజ్ ఎంటర్‌టైన్‌మెంట్ ఎండీ సమీర్ నాయర్ మాట్లాడుతూ, ది గేమ్ అనేది డిజిటల్ యుగం రియాలిటీలను చూపించే టైమ్‌లి స్టోరీ. రాజేష్ సెల్వా స్టైల్‌తో స్ట్రాంగ్ స్టోర్బీటెల్లింగ్ తో ఆడియన్స్‌కి చాలా కనెక్ట్ అవుతుంది.డైరెక్టర్ రాజేష్ ఎం. సెల్వా మాట్లాడుతూ.. ది గేమ్ కేవలం థ్రిల్లర్ మాత్రమే కాదు, మనం ఉన్న రియల్ వరల్డ్‌కి అద్దం పడుతుంది. ఇది పీపుల్, వాళ్ల ఛాయిస్‌లు, బలహీనతలు, నిజం - అబద్ధం మధ్య సన్నని లైన్ గురించిన కథ. నెట్‌ఫ్లిక్స్, అప్లాజ్ ఎంటర్‌టైన్‌మెంట్ కలయిక వలన మాకు క్రియేటివ్‌గా కొత్త ఎక్స్‌పెరిమెంట్స్ చేసే లిబర్టీ దొరికింది. థ్రిల్లర్ సస్పెన్స్‌తో పాటు, ఫ్యామిలీ కాంఫ్లిక్ట్ కి సంబంధించిన ఎమోషన్స్‌ని కూడా కలిపి చూపించే ఈ సిరీస్ ఆడియన్స్‌కి సరికొత్త అనుభూతిని అందించబోతోంది.

# ఎన్డీయే కూటమిలో తేలని 'సర్దుబాట్లు'

## ఎక్కువ సీట్లు పట్టుబడుతున్న మిత్రపక్షాలు



**పాట్నా, సెప్టెంబరు 5:** ఈ ఏడాది చివరిలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న క్రమంలో బీహార్ ఎన్డీఏ కూటమిలో సీట్ల లొల్లి ప్రారంభమైంది. 2020 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అధిక సీట్లు (80) గెల్చుకున్నప్పటికీ, జేడీ(యూ) అధ్యక్షుడు నితీశ్ కుమార్ ముఖ్యమంత్రిగా కొనసాగుతున్నారు. ప్రస్తుతం ఆ రాష్ట్రంలో ఎన్డీఏ కూటమిలో ఇంతవరకు చిన్న భాగస్వామిగా ఉన్న చిరాగ్ పాశ్వాన్‌కు చెందిన లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్), జితన్ రామ్ మాంఝీ హిందుస్తానీ అవామ్ మోర్చా (సెక్యులర్) పార్టీలు ఇకపై కేవలం సహకారం అందించే పాత్రకే పరిమితం కారాదని భావిస్తున్నాయి. ప్రస్తుతం ఈ పార్టీలు ఎక్కువ సీట్లను కోరుతున్నాయి. దీంతో ఎన్డీఏలో మనలం మొదలైంది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఐదు సీట్లను గెల్చుకున్న చిరాగ్ పాశ్వాన్ అసెంబ్లీ ఎన్నికల్లో 40 సీట్లు కావాలని డిమాండ్ చేసే అవకాశం ఉందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. ఒక వేళ అన్ని సీట్లు తమకు ఇవ్వకపోతే మొత్తం 243 అసెంబ్లీ సీట్లలో తమ పార్టీ సొంతంగా పోటీ చేస్తుందని చిరాగ్ పాశ్వాన్ హెచ్చరిస్తున్నారు. పలు అంశాల్లో పార్టీ సొంత వైఖరిని వెల్లడించారు. నరేంద్ర మోదీ ప్రధానిగా కొనసాగినంత కాలం తమ మద్దతు తప్పనిసరి అని ఆయన స్పష్టం చేస్తున్నారు. కాగా, స్థానికంగా తమకు ఎక్కువ మద్దతు ఉన్న గయా, ఔరంగాబాద్‌ల్లోని అన్ని సీట్లను తమకే కేటాయించాలని మరో సంకీర్ణ పార్టీ హెచ్ఏఎం చీఫ్ జితన్ రామ్ మాంఝీ డిమాండ్ చేస్తున్నారు. ఈ ఎన్నికల్లో ఆయన 20 సీట్లు అడుగుతున్నారు. తమ పార్టీ మద్దతు లేకుండా ఎన్డీఏ విజయం సాధించలేదని ఆయన ప్రకటించారు. ప్రస్తుతం తమ కూటమిలోని పార్టీలు విడిపోకుండా చూడాల్సిన బాధ్యత ఎన్డీఏకు నేతృత్వం వహిస్తున్న బీజేపీపై ఉంది. ఆ పార్టీల డిమాండ్లను సమన్వయంతో పరిష్కరించకపోతే అవి విడిగా పోటీచేసే ప్రమాదం ఉంది. దీంతో కూటమికి అసెంబ్లీ ఎన్నికల్లో గట్టి దెబ్బ తగిలి విజయావకాశాలు గణనీయంగా తగ్గిపోయే అవకాశం ఉంది. బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించి అధికారాన్ని చేపట్టాలని మరోవైపు మహాఘట్ బంధన్ ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఈ కూటమిలో కాంగ్రెస్, ఆర్జేడీతో పాటు సీపీఐ, సీపీఎం, సీపీఐఎంఎల్ పార్టీలు భాగస్వాములుగా ఉన్నాయి. ఈ కూటమి ఎక్కువగా యువత, తమ సంప్రదాయ ముస్లింయాదవ్ ఓట్ల బ్యాంక్‌పై ఆధారపడింది. ఈ ఎన్నికల్లో తమ కూటమి పార్టీలను సమన్వయం చేయడంలో ఎన్డీఏ విఫలమైతే అది మహాఘట్ బంధన్ కూటమికే పూర్తి లాభం చేకూరుస్తుంది. ఇప్పటికే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్‌లు రాష్ట్రంలో 'ఓటర్ రైట్స్ మార్చ్' ద్వారా పాదయాత్ర జరిపి తమ కూటమికి అనుకూల వాతావరణం సృష్టించే ప్రయత్నం చేశారు. వచ్చే ఏడాది తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న తరుణంలో కీలక రాజకీయ పరిణామం చోటు చేసుకుంది. అమ్మ మక్కల్ మున్నేట్ర కళగం(ఏఎంఎంకే) నేత దినకరన్ ఎన్డీయే కూటమి నుంచి వైదొలుగుతున్నట్లు ప్రకటించారు. మాజీ సీఎం పన్నీర్ సెల్వం కూటమిని వీడిన కొద్ది వారాలకే దినకరన్ తన నిర్ణయాన్ని ప్రకటించారు. కడలూరులో దినకరన్ విలేకరులతో మాట్లాడుతూ ఏఐఏడీఎంకే ప్రధాన కార్యదర్శి పళనిస్వామిపై పరోక్షంగా విరుచుకుపడ్డారు. ద్రోహాన్ని తన పార్టీ భరించలేదని తెలిపారు. కూటమిలో పెరుగుతున్న విభేదాలను పరిష్కరించడంలో బీజేపీ కేంద్ర నాయకత్వం విఫలమైందని చెప్పారు.



# ఏడు కాదు మూడు యుద్ధాలను ఆపా!

## యుద్ధ విరమణ వ్యాఖ్యలపై అమెరికా అధ్యక్షుడు యూటర్న్

**వాషింగ్టన్, సెప్టెంబరు 5:** తనను తాను గొప్ప శాంతి దూతగా అభివర్ణించుకునే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, తన పాత వ్యాఖ్యలను తానే సవరించుకున్నారు. తాను ఏడు దేశాల మధ్య యుద్ధాలను ఆపానని గతంలో పదేపదే చెప్పుకున్న ఆయన, తాజాగా ఆ సంఖ్యను మూడుకు తగ్గించారు. వైట్‌హౌస్‌లో టెక్నాలజీ సంస్థల అధినేతలకు ఇచ్చిన విందు సందర్భంగా ట్రంప్ ఈ కొత్త ప్రకటన చేశారు. వైట్‌హౌస్‌లో టెక్ కంపెనీల సీఈవోలతో సమావేశమైన అనంతరం ట్రంప్ విలేకరులతో మాట్లాడారు. ఈ క్రమంలో ఓ జర్నలిస్టు రష్యా ఉక్రెయిన్ యుద్ధాన్ని ఎలా ముగిస్తారని ప్రశ్నించారు. దీనికి బదులిస్తూ, మీకు తెలుసా? నేను ఇప్పటివరకు మూడు యుద్ధాలను ఆపానని ట్రంప్ పేర్కొన్నారు. మూడు దశాబ్దాలుగా ఘర్షణ పడుతున్న దేశాల మధ్య తాను శాంతిని నెలకొల్పానని, అది అసాధ్యమని చాలామంది చెప్పినా తాను చేసి చూపించానని అన్నారు. అయితే, ఆ మూడు యుద్ధాలు ఏవనే విషయాన్ని మాత్రం ఆయన స్పష్టం చేయలేదు. ప్రస్తుతం రష్యా ఉక్రెయిన్ యుద్ధం క్లిష్టంగా మారినప్పటికీ, దాన్ని కూడా తాను కచ్చితంగా ఆపుతానని ధీమా వ్యక్తం చేశారు. థాయ్‌లాండ్ కంబోడియా, ఇజ్రాయెల్ఇరాన్, ఇజ్రాయెల్ హమాస్, రువాండాడెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో, సెర్బియాకొసావో, ఈజిప్ట్ఇథియోపియా, ఇండియాపాకిస్థాన్ మధ్య ట్రంప్ యుద్ధాలు ఆపినట్టు వైట్ హౌస్ గతంలో ప్రకటించిన సంగతి తెలిసిందే. పాకిస్థాన్ లాంటి దేశాలు ఆయనను నోబెల్ శాంతి బహుమతికి కూడా నామినేట్ చేశారు. ఇక, భారత్‌పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలను కూడా తానే తగ్గించానని గతంలో ట్రంప్ పలుమార్లు వ్యాఖ్యానించారు. అయితే, భారత ప్రభుత్వం ఎప్పటికప్పుడు ఈ వ్యాఖ్యలను ఖండిస్తూ వచ్చింది. ఇరు దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందంలో మూడో దేశం ప్రమేయం లేదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా స్పష్టం చేశారు. ఇప్పుడు ట్రంప్ తన పాత లెక్కను మార్చి, ఏడు నుంచి మూడుకు తగ్గించడం చర్చనీయాంశంగా మారింది.



# భర్తకంటే భార్యకు ఆదాయం ఎక్కువ ఉంటే భరణం అవసరంలేదు

## చెన్నై హైకోర్టు సంచలన తీర్పు

**చెన్నై, సెప్టెంబరు 5:** భార్యాభర్తల మధ్య భరణం చెల్లింపు కేసులకు సంబంధించి మద్రాస్ హైకోర్టు కీలక తీర్పును వెలువరించింది. భార్యకు భర్తకన్నా ఎక్కువ ఆదాయం, ఆస్తులు ఉన్నప్పుడు ఆమెకు భరణం చెల్లించాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. చెన్నైకి చెందిన వైద్య దంపతుల కేసు విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేసింది. దిగువ కోర్టు ఇచ్చిన ఆదేశాలను రద్దు చేస్తూ సంచలన తీర్పు ఇచ్చింది. చెన్నైలో వైద్యులుగా పనిచేస్తున్న భార్యాభర్తలు విభేదాల కారణంగా విడిపోయారు. విడాకుల కోసం చెన్నై ఫ్యామిలీ కోర్టును ఆశ్రయించారు. ఈ కేసును విచారించిన ఫ్యామిలీ కోర్టు భార్యకు నెలకు రూ.30,000 చొప్పున భరణంగా చెల్లించాలని భర్తను ఆదేశించింది. ఈ తీర్పును సవాలు చేస్తూ సదరు వైద్యుడు మద్రాస్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ బాలాజీ ధర్మాసనం విచారణ చేపట్టింది. విచారణలో భాగంగా తన భార్యకు ఇప్పటికే గణనీయమైన ఆస్తులు ఉన్నాయని, ఆమె సొంతంగా ఒక స్కానింగ్ సెంటర్ నడుపుతూ అధిక ఆదాయం సంపాదిస్తోందని పిటిషనర్ కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. దీనికి సంబంధించిన ఆధారాలను, పత్రాలను కూడా సమర్పించారు. వాదనలు విన్న న్యాయస్థానం, భార్య ఆర్థికంగా ఉన్నత స్థాయిలో ఉన్నప్పుడు భర్త నుంచి భరణం ఆశించడం సరికాదని అభిప్రాయపడింది. అదే సమయంలో, వారి కుమారుడు నీట్ పరీక్షకు సిద్ధమవుతున్నాడని, అతని చదువుకు అయ్యే ఖర్చు రూ.2.77 లక్షలను తాను భరించేందుకు సిద్ధంగా ఉన్నానని పిటిషనర్ కోర్టుకు తెలిపారు. ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు, కుమారుడి చదువు ఖర్చుల విషయంలో జోక్యం చేసుకోబోమని పేర్కొంది. భార్యకు భరణం చెల్లించాలంటూ ఫ్యామిలీ కోర్టు జారీ చేసిన ఉత్తర్వులను పూర్తిగా రద్దు చేస్తూ తీర్పు వెలువరించింది.

# మౌంట్ రష్మోర్‌పై ట్రంప్ శిలా ముఖచిత్రం

## అమెరికా అధ్యక్షుడి మదిలో మెదిలిన మరో కోరిక



**వాషింగ్టన్, సెప్టెంబరు 5:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన చిరకాల కోరికను మరోసారి బలంగా బయటపెట్టారు. అమెరికా చరిత్రలో నిలిచిపోయిన నలుగురు గొప్ప అధ్యక్షుల ముఖచిత్రాలతో ఉన్న మౌంట్ రష్మోర్‌పై తన ముఖాన్ని కూడా చూడాలని ఆయన ఆకాంక్షిస్తున్నారు. ఈ మేరకు, ఆ అధ్యక్షుల ముఖాల పక్కనే తన ముఖం ఉన్నట్లుగా రూపొందించిన ఒక ఏఐ వీడియోను ఆయన తాజాగాట్రూత్ ఖాతాలో పంచుకున్నారు. ఇది ప్రస్తుతం అమెరికాలో కొత్త చర్చకు దారితీసింది. దక్షిణ డకోటాలోని బ్లాక్ హిల్స్‌లో ఉన్న మౌంట్ రష్మోర్ ఒక జాతీయ స్మారక చిహ్నం. ఇక్కడి భారీ గ్రానైట్ పర్వతంపై అమెరికా జాతి నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన మాజీ అధ్యక్షులు జార్జ్ వాషింగ్టన్, థామస్ జెఫర్సన్, థియోడర్ రూజ్‌వెల్ట్, అబ్రహం లింకన్‌ల 60 అడుగుల ముఖ శిల్పాలు చెక్కారు. ఏటా లక్షలాది మంది పర్యాటకులు దీనిని సందర్శిస్తుంటారు. ఈ దిగ్గజాల సరసన తన శిల్పం కూడా ఉండాలనేది ట్రంప్ కోరిక. ఈ ఏడాది ఫిబ్రవరిలో కాంగ్రెస్ సభ్యురాలు అన్నా పౌలినా లూనా ట్రంప్ ముఖాన్ని అక్కడ చేర్చాలంటూ ప్రతిపాదన కూడా తీసుకువచ్చారు. అయితే, ట్రంప్ ఆశలకు అధికారులు, నిపుణులు బ్రేకులు వేస్తున్నారు. ఆ పర్వతంపై ఐదో ముఖాన్ని చెక్కడం ఆచరణ సాధ్యం కాదని స్పష్టం చేస్తున్నారు. మౌంట్ రష్మోర్ నిర్వహణ చూసే నేషనల్ పార్క్ సర్వీస్ కూడా ఇదే విషయాన్ని తేల్చి చెప్పింది. ఆ పర్వతంపై కొత్తగా శిల్పాన్ని చెక్కేందుకు సురక్షితమైన, స్థిరమైన ప్రదేశం లేదని అధికారులు పేర్కొన్నారు. ఇప్పటికే ఉన్న శిల్పాల కారణంగా పర్వతంపై మరిన్ని చెక్కడాలు ప్రమాదకరమని వారు విశ్లేషిస్తున్నారు. గతంలో జాన్ ఎఫ్. కెన్నడీ, రోనాల్డ్ రీగన్, బరాక్ ఒబామా వంటి అధ్యక్షుల ముఖాలు కూడా మౌంట్ రష్మోర్‌పై చేర్చేందుకు ప్రస్తావనకు వచ్చినా, అవేవీ కార్యరూపం దాల్చలేదు. ఇప్పుడు ట్రంప్ విషయంలో కూడా సాంకేతిక కారణాల వల్ల ఆయన కోరిక నెరవేరడం కష్టమేనని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# ఆ ఫోటోచూస్తే ప్రతి అమెరికన్‌కు వణుకే...

## పుతిన్, జిన్‌పింగ్, మోడీ ఒకే ఫొటోపై ఎనలిస్టు వ్యాఖ్యలు



**న్యూయార్క్, సెప్టెంబరు 5:** చైనాలో ఇటీవల జరిగిన షాంఘై కో ఆపరేషన్ సదస్సుకు సంబంధించిన ఓ ఫొటో ప్రతీ అమెరికన్ వెన్నులో వణుకుపుట్టించేలా ఉందని అమెరికా రాజకీయ విశ్లేషకుడు వాన్ జోన్స్ పేర్కొన్నారు. ప్రపంచంపై ఆసియా ఆధిపత్యం చెలాయించ నుందని చెప్పేందుకు ఇది సంకేతంలా కనిపిస్తోందన్నారు. షాంఘై సదస్సులో భారత ప్రధాని నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, చైనా ప్రెసిడెంట్ జిన్ పింగ్ నవ్వుతూ మాట్లాడుకోవడం మీడియా కెమెరాలు బంధించాయి. ఈ ముగ్గురు నేతలూ నవ్వుతూ చేతిలో చేయి వేసుకుని మాట్లాడుకోవడం అమెరికన్లను వణికించేలా ఉందని వాన్ జోన్స్ వ్యాఖ్యానించారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సుంకాల బాధిత దేశాధినేతలు ఒకే వేదికపై నవ్వులు పంచుకుని, పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకుంటున్న ఫోటోలు పాశ్చాత్య మీడియా దృష్టిని ఆకర్షించాయి. దీనిపై వాన్ జోన్స్ మాట్లాడుతూ "ఈ రోజును చరిత్రాత్మ కంగా, అతిపెద్ద మలుపుగా గుర్తుంచుకుంటాం" ఎందుకంటే, అమెరికా సుంకాల బాధిత దేశాల్లో మూడు కీలక దేశాల అధినేతలు నవ్వుతూ మాట్లాడుకోవడం వారి మధ్య మైత్రి బలపడుతోందనేందుకు సంకేతం. ఇది అమెరికాకు మంచిది కాదు. ఈ సమావేశం 'నూతన ప్రపంచవ్యవస్థ' కు సంకేతం. ఒకప్పుడు ఇలా అమెరికా, చైనా, రష్యా మాత్రమే ఉండేవి. ఇప్పుడు మనం అందులో లేము అందరూ మనకు వ్యతిరేకంగా ఉన్నారు" అని ఆయన అన్నారు. పాశ్చాత్య మీడియాలో ఈ ఫొటో సంచలనంగా మారింది. అమెరికా వ్యతిరేక వర్గంగా ముద్రపడిన నాలుగు దేశాలు ఇరాన్, ఉత్తర కొరియా, చైనా, రష్యాల మొదటి సమావేశంగా విశ్లేషకులు అభిప్రాయపడినట్టు వాషింగ్టన్ పోస్ట్ పేర్కొంది. 'ఈ ఫొటో జిన్‌పింగ్, పుతిన్ మధ్య ఉన్న స్నేహం అమెరికాను సవాలు చేసేలా ఉంది. సుంకాలతో ట్రంప్ భారత్‌ను దూరం చేసుకోగా భారత దేశం చైనాకు దగ్గరవుతోందని అమెరికా పత్రికలు విశ్లేషించాయి.

# ఇసుకతవ్వకాలపై డిప్యూటీ సిఎం, ఐపిఎస్ మధ్య వాగ్వాదం

## వైరల్ అయిన విడియోతో పవార్‌పై నెటిజన్ల విమర్శలు



**ముంబయి, సెప్టెంబరు 5:** ఇసుక అక్రమ తవ్వకాలను అడ్డుకోవడానికి వెళ్లిన ఓ ఐపీఎస్ అధికారిణికి ఏకంగా ఉపముఖ్యమంత్రి ఫోన్ చేయడం మహారాష్ట్రలో సంచలనంగా మారింది. అక్రమార్కులపై చర్యలు వద్దని ఫోన్‌లో ఉప ముఖ్యమంత్రి ఆదేశించడంతో ఇదే విషయాన్ని వీడియో కాల్‌లో చెప్పాలని సదరు ఐపీఎస్ అధికారిణి కోరారు. దీంతో ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. సోలాపూర్ జిల్లాలోని కర్మలా తాలూకాలోని కుద్దు గ్రామంలో అక్రమ ఇసుక తవ్వకాలు జరుపుతున్నారని సబ్‌డివిజనల్ పోలీసు అధికారిణి, ఐపీఎస్ అంజనా కృష్ణకు ఫిర్యాదులు అందాయి. దీంతో సిబ్బందితో కలిసి అక్కడికి వెళ్లిన అంజనా కృష్ణ ఇసుక అక్రమ తవ్వకాలను అడ్డుకున్నారు. ఈ క్రమంలో కొందరు గ్రామస్థులు, స్థానిక ఎన్సీపీ కార్యకర్తలు అధికారులతో ఘర్షణకు దిగారు. వారిలో ఒకరు తమ పార్టీ అధినేత, మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్‌కు ఫోన్ చేసి ఐపీఎస్ అంజనాకృష్ణకు ఇచ్చారు. ఫోన్‌లో ఇసుక తవ్వకాలకు వ్యతిరేకంగా చర్యలు తీసుకోవడం ఆపాలని పవార్ ఆమెను ఆదేశించారు. అయితే, తాను ఫోన్‌లో మాట్లాడుతున్నది ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ తోనేనని రుజువు చేసుకోవాలని, తనకు వీడియోకాల్ చేయాలని అంజనీకృష్ణ కోరారు. దీంతో ఆగ్రహంచెందిన అజిత్ పవార్ 'నన్నే వీడియో కాల్ చేయమంటావా నీకు ఎంత ధైర్యం?. మీపై చర్యలు తీసుకుంటా. నన్ను చూడాలనుకుంటున్నారుగా నాకు వీడియో కాల్ చేయండి' అంటూ నెంబర్ చెప్పి ఫోన్ పెట్టేశారు. దీంతో పవార్‌కు ఐపీఎస్ అధికారిణి అంజనా కృష్ణ వీడియో కాల్ చేశారు. ఈ సందర్భంగా తక్షణమే చర్యలు ఆపేయాలంటూ పవార్ ఆదేశించారు. కాగా, ఈ వీడియో వైరల్‌గా మారడంతో అజిత్ పవార్‌పై నెటిజన్లు మండిపడుతున్నారు. ఐపీఎస్ అధికారిణి విధులకు అడ్డుపడ్డారని, అక్రమార్కులపై చర్యలు తీసుకోకుండా అడ్డుకున్నారని విమర్శిస్తున్నారు. ఈ విమర్శలపై ఎన్సీపీ నేత సునీల్ తట్కరే స్పందిస్తూ పవార్ వ్యాఖ్యలను తప్పుగా అర్థం చేసుకున్నారని వివరణ ఇచ్చారు. కార్యకర్తలను శాంతింపజేసేందుకు ఐపీఎస్ అధికారిణిని అజిత్ మందలించి ఉండవచ్చని అన్నారు. చట్టవిరుద్ధ కార్యకలాపాలకు అజిత్ పవార్ మద్దతివ్వరని స్పష్టం చేశారు. ఈ వీడియోపై మాట్లాడేందుకు ఐపీఎస్ అధికారిణి అంజనా కృష్ణ నిరాకరించారు.

# సంక్షిప్తంగా..

## యుఎస్ మాజీ అధ్యక్షుడు జోబైడెన్‌కు తలపై గాయం!



**వాషింగ్టన్, సెప్టెంబరు5:** అమెరికా మాజీ అధ్య క్షుడు జో బైడెన్ ఆరోగ్య పరిస్థితిపై మరోసారి తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. ఇటీవల ఆయన తలపై ఒక గాయంతో, మునుపటి కంటే నీరసంగా, బడలికతో కనిపిస్తున్న వీడియోలు సోషల్ మీడియాలో కలకలం రేపుతున్నాయి. ఈ వీడియోలు చూసిన నెటిజన్లు, రాజకీయ విశ్లే షకులు ఆయన ఆరోగ్యస్థితి గురించి రకరకాల ఊహాగానాలు చేస్తున్నారు. జాతీయ మీడియా కథనాల ప్రకారం, బైడెన్‌కు ఇటీవలే చర్మ క్యాన్సర్‌కు సంబంధించిన శస్త్రచికిత్స జరిగింది. ఈ ఆపరేషన్ కారణంగానే ఆయన తలపై గాయం ఏర్పడిందని తెలుస్తోంది. తాజాగా బయటకు వచ్చిన వీడియోలలో బైడెన్ చాలా అలసి పోయినట్లు, బలహీనంగా కనిపించడం తో ఆయన ఆరోగ్యం చుట్టూ జరుగు తున్న చర్చ మరింత ఊపందుకుంది. 82 యేళ్ల జో బైడెన్ ఆరోగ్యంపై చర్చ జరగడం ఇది మొదటిసారేమీ కాదు. గతంలో కూడా ఆయనకు చర్మ క్యాన్సర్‌కు సంబంధించి చిన్నపాటి చికిత్సలు జరిగినట్లు వైద్య నివేదికలు వెల్లడించాయి. అయితే, తాజా శస్త్రచికిత్స తీవ్రత, ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిపై పూర్తి వివరాలు ఇంకా తెలియరాలేదు.

## ట్రంప్ వైట్‌హౌస్ విందుకు హాజరుకాని మస్క్..




**వాషింగ్టన్, సెప్టెంబరు 5:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గురువారం టెక్ దిగ్గజాలతో సమావేశమైన విషయం విదితమే. ఈ సమావేశానికి ట్రంప్ మాజీ సహచరుడు, స్పేస్ ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్ హాజరు కాలేదు. అయితే తాను హాజరు కాకపోవడంపై మస్క్ తాజాగా స్పందించారు. ఆ సమావేశానికి ప్రెసిడెంట్ ట్రంప్ యంత్రాంగం నుంచి తనకు ఆహ్వానం అందిందని, అనివార్య కారణాల వల్ల తాను వెళ్ల లేకపోయానని వివరణ ఇచ్చారు. తనకు బదు లుగా తన కంపెనీ నుంచి ఓ ప్రతినిధిని పంపిం చానని మస్క్ తెలిపారు. ట్రంప్ సమావేశంపై ఆంగ్లమీడియా సంస్థ ఓ కథనం ప్రసారం చేస్తూ ఈ మీటింగ్‌కు ట్రంప్ యంత్రాంగం ఎలాన్ మస్క్‌కు ఆహ్వానం పంపలేదని పేర్కొంది. ఆహ్వానితుల జాబితాలో మస్క్ పేరు లేదని తెలిపింది. మస్క్ తాజా వివరణ నేపథ్యంలో టెస్లా, స్పేస్ ఎక్స్ కంపెనీల తరఫున ఎవరైనా హాజరై ఉండొచ్చని పేర్కొంది. అయితే, మస్క్ ప్రతినిధి హాజరుపై అటు ట్రంప్ యంత్రాంగం కానీ, ఇటు మీడియా సంస్థలు కానీ ఎలాంటి నిర్ధారణ ప్రకటన చేయకపోవడం గమనార్హం.

# ముంబయి మహానగరానికి మానవబాంబుల ముప్పు

## 14మంది ఉగ్రవాదులున్నారంటూ ఇమెయిల్ హెచ్చరికలు




**ముంబై, సెప్టెంబరు 5:** ముంబైకి బాంబు బెదిరింపులు రావడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ట్రాఫిక్ పోలీస్ వాట్సాప్ నెంబర్‌కు ఈ బెదిరింపులు వచ్చాయి. 34 వాహనాల్లో 400 కిలోల ఆర్డీఎక్స్‌తో మానవబాంబులు నగరంలోకి ప్రవేశించాయని, నగరం మొత్తాన్ని పేలుళ్లతో కుదిపేయనున్నామని పేర్కొంటూ బెదిరింపు సందేశాలు వచ్చినట్టు పోలీసులు తెలిపారు. లష్కర్ ఏ జిహాదీ అనే ఖాతా నుంచి ఈ బెదిరింపు వచ్చిందని, 14 మంది పాక్ ఉగ్రవాదులు ఇప్పటికే భారత్‌లోకి చొరబడినట్టు కూడా అందులో పేర్కొన్నారని వివరించారు. కాగా, బెదిరింపు సమాచారంతో ముంబై పోలీసులు హైఅలర్ట్ ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా పోలీసు బలగాలను అప్రమత్తం చేశారు. అన్ని కోణాల నుంచి విచారణ జరుపుతున్నారు. నగరంలోని కీలక ప్రాంతాల్లో తనిఖీలు ముమ్మరం చేశారు. బాంబు నిర్వీర్య బృందాలు, డాగ్ స్క్వాడ్‌లను మోహరించారు. అనుమానాస్పద వాహనాలను గుర్తిస్తే తమకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు పోలీసులు విజ్ఞప్తి చేశారు. మరో ఘటనలో, మహారాష్ట్రలోని థానే జిల్లాలో బాంబు బెదిరింపు చేసిన 43 ఏళ్ల వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసారు. నిందితుడిని రూపేల్ మధుకర్‌గా గుర్తించినట్టు గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపారు. కల్వ రైల్వే స్టేషన్‌లో బాంబు పెట్టినట్టు ఆదివారం మధ్యాహ్నం 4 గంటలకు ఇతని నుంచి పోలీస్ హెల్ప్‌లైన్‌కు సమాచారం వచ్చింది. అయితే ఈ బెదిరింపు ఉత్తదే అని తేలింది. గత నెలలో గిర్‌గావ్‌లోని ఇస్కాన్ ఆలయానికి కూడా ఇలాంటి బాంబు బెదిరింపే వచ్చింది. ఆలయం ఆవరణలో బాంబులు పెట్టినట్టు టెంపుల్ ఆఫీస్ ఈమెయిల్ ఐడీకి మెసేజ్ వచ్చింది. ఆలయ నిర్వాహకులు పోలీసులను అప్రమత్తం చేయడంతో బాంబు డిటెక్షన్ అండ్ డిస్పోజల్ స్క్వాడ్ అర్ధరాత్రి సోదాలు జరిపింది. అయితే పేలుడు పదార్థాలు ఏవీ ఆవరణలో కనబడకపోవడంతో ఉత్తుత్తి బెదిరింపుగా తేలింది. గత మేలో కూడా మహారాష్ట్ర సెక్రటేరియట్‌కు బాంబు బెదిరింపు వచ్చింది. 48 గంటల్లో పేలుతుందంటూ హెచ్చరికలు రావడంతో గాలింపు చర్యలు చేపట్టగా ఎలాంటి అనుమానాస్పద వస్తువు కనిపించలేదు. ఇటీవల కాలంలో నకిలీ బెదిరింపు కాల్స్ ఎక్కువవుతున్నాయని పోలీసులు చెబుతున్నారు. స్కూళ్లు, విమానాశ్రయాలు, బహిరంగ ప్రదేశాల్లో బాంబులు పెట్టినట్టు మెయిల్స్ వస్తున్నాయి. అయితే ఈ బెదిరింపులు ఉత్తవే అని తేలుతున్నాయి. గత మేలో ముంబై ఛత్రపతి శివాజీ మహరాజ్ అంతర్జాతీయ విమానాశ్రయం, తాజ్ మహల్ ప్యాలెస్ హోటల్‌కు సైతం బాంబు బెదిరింపు మెయిల్స్ వచ్చాయి.



# సైనిక దళాలకు హైపర్ సోనిక్ క్షిపణులు, అణుశక్తి యుద్ధ నౌకలు


**న్యూఢిల్లీ, సెప్టెంబరు 5:** పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ తర్వాత సైనిక దళాలకు అత్యాధునిక ఆయుధాలను అందించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన ప్రణాళికను మోడీ సర్కార్ ఆవిష్కరించింది. దాదాపు 15 ఏళ్ల వ్యవధిలో ఈ లక్ష్యాలను పూర్తి చేసేలా రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేసింది. ఇందుకోసం భారీ మొత్తంలో వెచ్చించేందుకు సిద్ధమైంది. కనీసం 500కు తగ్గకుండా హైపర్‌సోనిక్ క్షిపణులను దళాలకు ఇవ్వాలని నిర్ణయించింది. ఈ విజన్ డాక్యుమెంట్ ప్రకారం పాత టి-72 యుద్ధట్యాంక్‌లను 1800 అత్యాధునిక ఫ్యూచర్ ట్యాంక్‌లతో భర్తీ చేయనున్నారు. మరో 400 తేలికపాటి ట్యాంక్‌లను దళాలకు అందించనున్నారు. ట్యాంక్‌పై నుంచి ప్రయోగించే 50,000 యాంటీ గైడెడ్ మిస్సైల్స్, 6,00,000 శతఘ్ని గుండ్లు, మానవ రహిత విమానాలను సమకూర్చుకోనుంది. వీటితో పాటు 700 రోబోటిక్ కౌంటర్ ఐఇడి సిస్టమ్‌లను రంగంలోకి దించాలని నిర్ణయించింది. ఇక నౌకాదళంకోసం సరికొత్త ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్, 10అత్యాధునిక ఫ్రిగెట్‌లు, 7 అడ్వాన్స్‌డ్ కార్వెట్టీలు, 4 ల్యాండ్ డాక్ ప్లాట్‌ఫారమ్స్, హెలికాప్టర్‌లకు ప్లాన్ చేస్తోంది. వీటితోపాటు అణుశక్తితో నడిచే యుద్ధనౌకలు, ఎలక్ట్రోమాగ్నెట్ ఎయిర్‌క్రాఫ్ట్ లాంచ్ సిస్టమ్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

## షిర్డీ సాయినాథునికి కోటిన్నర విలువైన కానుక




**ముంబయి, సెప్టెంబరు 5:** మహారాష్ట్రలోని షిర్డీ సాయిబాబా ఆలయానికి దుబాయ్‌కి చెందిన భక్తుడు రూ.1.58 కోట్ల విలువైన కానుకలను సమర్పిం చాడు. 1 కిలో 623 గ్రాముల బంగారంతో రూపొందించిన 'ఓం సాయి రామ్' అనే అక్షరాలను శిర్డీ ఆలయానికి విరాళంగా ఇచ్చాడు. అయితే తన వివరాలు బహిర్గతం చేయవద్దని సాయిబాబా సంస్థాను కోరినట్లు తెలుస్తోంది. దుబాయ్‌కి చెందిన భక్తుడి కుటుంబం ప్రతినెల షిరిడీ సాయినాథుడి దర్శనంచేసుకుని రూ. లక్ష విరాళంగా ఇస్తారని దేవాలయ అధి కారులు పేర్కొన్నారు. గురువారం మరో సారి షిరిడీని సందర్శించిన భక్తుడు కోటి న్నరవిలువైన బంగారు అక్షరాలను బహూకరించి నట్లు తెలిపారు. ఆలయంలోని రెండు ప్రధానద్వారాలకు వీటిని అమర్చినట్లు తెలిపారు.

# ఉక్రెయిన్‌కు సహకరించే వారే లక్ష్యం: పుతిన్



**మాస్కో, సెప్టెంబరు 5:** ఉక్రెయిన్‌కు మద్దతుగా ఆ దేశంలో తమ దళాలను మోహరించే ఏ దేశాలనైనా తమ సైన్యం లక్ష్యంగా చేసుకుంటుందని రష్యా అధ్యక్షుడు పుతిన్ హెచ్చరించారు. ఉక్రెయిన్‌తో యుద్ధం జరుగుతున్న సమయంలో తమకు వ్యతిరేకంగా నిలిచే దేశాలను చట్టబద్ధమైన లక్ష్యాలుగా చేసుకునే అధికారం తమకు ఉంటుందన్నారు. ఇటువంటి బలగాల మోహరింపు దీర్ఘకాలిక శాంతికి అనుకూలంగా ఉండదని అభిప్రాయం వ్యక్తం చేశారు. పశ్చిమ దేశాలతో ఉక్రెయిన్‌కు ఉన్న సన్నిహిత సైనిక సంబంధాలు ఇరుదేశాల మధ్య సంఘర్షణకు మూలకారణమని వ్యాఖ్యానించారు. ఇరు దేశాల మధయయ శాంతి చర్చలు ఫలించి యుద్ధం ఆగిపోతే, ఉక్రెయిన్‌కు మద్దతుగా ఆ దేశంలో ఇతర దళాలను మోహరించాల్సిన అవసరం ఏముంటుందని పుతిన్ ప్రశ్నించారు. దీర్ఘకాలిక శాంతికి దారితీసే నిర్ణయాలు తీసుకుంటే.. అసలు ఉక్రెయిన్‌లో ఇతర దళాలు మోహరించాల్సిన అవసరమే ఉండదన్నారు. తాము చేసుకున్న ఒప్పందానికి రష్యా కట్టుబడి ఉంటుందని తెలిపారు. 26 ఐరోపా దేశాల నేతలు గురు వారం పారిస్‌లో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీతో సమావేశమైన నేపథ్యంలో పుతిన్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

## థాయ్‌లాండ్ కొత్త ప్రధానిగా అనుతిన్ చార్న్‌విరకూల్



**బ్యాంకాక్, సెప్టెంబరు 5:** థాయ్‌లాండ్ తదుపరి ప్రధానిగా అనుతిన్ చార్న్ విరాకుల్‌ను అక్కడి పార్లమెంట్ ఎన్నుకుంది. మాజీ ప్రధాని పేటోం గ్టార్న్ షినవత్రను అక్కడి రాజ్యాంగ న్యాయ స్థానం పదవి నుంచి తొలగించిన నేపథ్యంలో కొత్త ప్రధాని ఎన్నిక అనివార్యమైన విషయం తెలిసిందే. భూమ్‌జైతై పార్టీకి చెందిన అనుతిన్.. షినవత్ర నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వంలో పనిచేశారు. గత రెండేళ్లలోనే థాయ్‌లాండ్‌కు మూడో ప్రధాని రావడం గమనార్హం. కంబోడియా సెనేట్ అధ్యక్షుడు హన్‌సేన్‌తో థాయ్‌లాండ్ ప్రధాని షినవత్ర ఫోనులో మాట్లాడడం సం చలనం రేపింది. ఇరు దేశాల మధ్య సరిహద్దు వివాదాలు తీవ్రంగా ఉన్న సమయంలో పొరుగుదేశం నేతతో కీలక విషయాలు పంచుకున్న తీరు వివాదాస్పదమైంది.

06-09pg6exHMNWJQEP 10_06-09pg6exHMNWJQEP.qxd 9/6/2025 12:37 AM Page 1



# రెడ్ బుక్ రాజ్యాంగంతో కక్షపూరిత రాజకీయాలు

## అరెస్టు చేసి రోజులు గడుస్తున్నా కేసు ట్రయిల్ ఎక్కడ? : మాజీ స్పీకర్ తమ్మినేని, మార్గాని



**ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా బ్యూరో సెప్టెంబర్ 5** (ప్రభాతవార్త): చంద్రబాబు ప్రభుత్వంలో రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం పేరిట కక్షపూరిత రాజకీయాలు చేస్తున్నారని మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, మాజీ ఎంపీ, వైస్సార్ సిపి రాష్ట్ర అధికార ప్రతినిధి మార్గాని భరత్ రామ్ లు విమర్శించారు. సెంట్రల్ జైలులో రిమాండ్ లో ఉన్న ఎంపీ మిథున్ రెడ్డిని కలవడానికి వచ్చిన ఆంధ్ర ప్రదేశ్ శాసనసభ మాజీ స్పీకర్ తమ్మినేని సీతారామ్, కర్ణాటకకు చెందిన శాసనసభ్యులు ఎన్.ఆర్ విశ్వనాథన్, సి. విష్ణు రెడ్డి లతో కల్సి సెంట్రల్ జైలు బయట మీడియాతో మాట్లాడారు. విపక్షంలో ఉన్నపుడు ప్రస్తుత లోకేష్ రెడ్ బుక్ రాజ్యాంగం అంటూ రాష్ట్రంలో తిరిగారని, అధికారంలోకి వచ్చాక అంబేద్కర్ రాజ్యాంగాన్ని పక్కనపెట్టి రెడ్ బుక్ రాజ్యాంగాన్ని ఏవిధంగా నడుపుతున్నారో అందరూ చూస్తున్నారని అన్నారు. మిథున్ రెడ్డిని అరెస్టు చేసి సుమారు 45రోజులు, ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్ రెడ్డిలను అరెస్టు చేసి వందరోజులు, చెవిరెడ్డి భాస్కర రెడ్డిని అరెస్టు చేసి 80రోజులు అయిందని ప్రస్తావించారు. అసలు ఈ కేసులు ఎప్పుడు ట్రయిల్ చేసారని వారు ప్రశ్నించారు. మనీ ట్రయిల్ ఎలా జరిగింది, ఎక్కడ జరిగింది అనేది ఏది తేల్చకుండా కేవలం జైలులో పెట్టాలనే ఉద్దేశ్యంతోనే కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని భరత్ విమర్శించారు. చంద్రబాబు కంటే ఎక్కువ రోజులు మిదున్ రెడ్డిని జైలులో పెడితే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మీద కక్ష తీర్చుకున్నట్లు అవుతుందన్న భావన కన్పిస్తోందని ఆయన వాపోయారు. రేపొద్దున మా ప్రభుత్వం వచ్చాక, దీనిపై పూర్తిస్థాయి విచారణ ఉంటుందని, చేసిన వ్యవహారాలకు శిక్షార్హులు అవుతారఅన్నారు. రైతులకు యూరియా అందించే విధానంపై సోషల్ మీడియాలో పోస్టులు పెడితే, నాన్ బెయిల్ బుల్ సెక్షన్లతో అరెస్టు చేయడం దారుణమని విమర్శించారు. ప్రజాస్వామ్యంలో ఎల్లకాలం చంద్రబాబు ప్రభుత్వం ఉండదని గుర్తుపెట్టుకోవాలన్నారు.

తప్పులకు మూల్యం చెల్లించక తప్పదని స్పష్టంచేసారు.

# దుర్గమ్మ ఆలయంలో మంచినీటి ప్లాంట్ ఏర్పాటు



ఇన్‌కంటాక్స్ కమీషనర్‌కు దుర్గమ్మవారి జ్ఞాపిక అందిస్తున్న ఇఓ

**ఇంద్రకీలాద్రి, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త** దుర్గమ్మ ఆలయంలో రు.30లక్షల విలువైన రెండు మంచినీటి ప్లాంట్లను ఇఓ వికె శీనా నాయక్ దంపతులు శుక్రవారం ప్రారంభించారు. దివిస్ ల్యాబొరెటరీస్ సహకారంతో ఈ ప్లాంట్లను ఒకటి అద్దాల మండపం సమీపాన, మరోటి కొత్త పూజా మండపాల వద్ద ఏర్పాటు చేశామన్నారు. దివిస్ ల్యాబ్ వారికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మొత్తం రు.80లక్షలతో ఐదు ప్లాంట్లు ఏర్పాటు చేయడానికి దివిస్ లాబోరేటరీస్ వారు ముందుకొచ్చి, గతంలో రెండు ప్లాంట్లను పూర్తిచేసి భక్తులకు అందుబాటులో వుంచారన్నారు. మరో ప్లాంట్‌ను త్వరలో ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, వైదిక కమిటీ, దివిస్ లేబ్స్ ప్రతినిథులు బి కిషోర్ కుమార్, సిహెచ్ శ్రీనివాసులు, ఎస్ సాయి కృష్ణ తదితరులు పాల్గొన్నారు. దుర్గమ్మ ఆలయంలో జరుగుతున్న దసరా ఉత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లను ఇఓ వికె శీనా నాయక్ శుక్రవారం పరిశీలించారు. హైవే రోడ్డు వద్ద కొత్తగా ఖాళీ చేసిన స్థలంలో నిర్మాణంలో వున్న భవనంలో సమాచార కేంద్రం, వృద్దులకు విశ్రాంతి మందిరం ఏర్పాటు చేయాలన్నారు. అక్కడినుండి వృద్దులను దుర్గమ్మ ఆలయానికి బ్యాటరీ వాహనాల ద్వారా తీసుకురావాలన్నారు. అన్నదాన భవనం, లడ్డూపోటు లను ఇఓ పరిశీలించి, ప్రసాదం నాణ్యత, పంపిణీ లో పూర్తి జాగ్రత్తలు తీసుకోవాలని ఎఇఓ వాసుకు ఆదేశాలిచ్చారు. కొత్త భవనాల్లో అన్నదానం, ప్రసాదం పోటు లలో మురుగునీటి వ్యవస్తను పరిశీలించారు. పరిశుభ్రతలో లోపం వుండరాదన్నారు. కనకదుర్గానగర్లో ప్రసాద విక్రయ కేంద్రాలను పరిశీలించి భక్తులకు అసౌకర్యం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కొత్త బిల్డింగ్‌లో అన్నదానం ఏర్పాట్లు త్వరగా పూర్తి చేయాలని అన్నదాన విభాగ ఏఇఓ బివి రెడ్డికి ఆదేశాలిచ్చారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. దివ్యాంగులకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఇఓతో పాటు ఇంజనీర్2 పి రాంబాబు, ఇతర డిఇ, ఏఇ, అదికారులు పాల్గొన్నారు. దుర్గమ్మవారిని ఏపి, తెలంగాణ ఇన్‌కంటాక్స్ కమీషనర్ ఎం అనిల్ కుమార్ శుక్రవారం దర్శించుకున్నారు. ఆయనకు ఇఓ వికె శీనా నాయక్ శ్రీ అమ్మవారి ప్రసాదాలు, శేషవస్త్రం, మెమొంటోలు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనం పలికారు.



# జీవితమంతా నా గురువు సిఎం చంద్రబాబు :మంత్రి నారా లోకేష్

**విజయవాడ,సెప్టెంబరు5,ప్రభాతవార్తప్రతినిధి:** జీవితమంతా తనకు గురువు అని సీఎం చంద్రబాబు అని మంత్రి నారా లోకేష్ తెలిపారు. సీఎం చంద్రబాబు చేసిన తొలి సంతకం మెగా డీఎస్సీ అని ఆయన గుర్తు చేశారు. విజయవాడలోని ఏ1 కన్వెన్షన్ హాల్‌లో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో ముఖ్యఅతిగా ఆయన పాల్గొన్నారు. టీచర్ల అందరిని చూసినప్పుడు స్కూల్ డేస్ గుర్తుకు వస్తున్నాయని పేర్కొన్నారు. తనది బ్యాక్ బెంచ్.. గోడ బ్యాచ్ అయినా తాను స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీకి వెళ్లానని.. చిన్ననాటి మధుర జ్ఞాపకాలను లోకేశ్ గుర్తుకు తెచ్చుకున్నారు. ఇంటర్ మీడియట్‌కు వచ్చినప్పుడు మంత్రి నారాయణ తనకు బ్రిడ్జి కోర్సు నేర్పించారని మంత్రి లోకేశ్ తెలిపారు. రాజ్‌రెడ్డి తనను గైడ్ చేశారని చెప్పారు. ఫీల్డ్‌లో మంచిగా పనిచేస్తున్న ఉపాధ్యాయులతో వారానికి ఒకరితో కుర్చోని మాట్లాడినట్లు పేర్కొన్నారు. ప్రైవేటు స్కూల్ లలో బ్యాగులు, పుస్తకాలకు డబ్బులు ఖర్చు చేయాలని అన్నారు. అదే ప్రభుత్వ పాఠశాలలో అన్ని ప్రభుత్వమే అందిస్తుందని స్పష్టం చేశారు. కొన్ని పాఠశాలల్లో అడ్మిషన్లు అయిపోయాయి.. అనే బోర్డులు కనిపించాయని హర్షం వ్యక్తం చేశారు. పిల్లలు ఎక్కడ వెనుకబడి ఉన్నారో తెలుసుకునేలా రిపోర్టు కార్డు రూపొందించి ఇచ్చామని వివరించారు. మంత్రిత్వ శాఖల విషయంలో విద్యాశాఖ వద్దు.. అని ఐటీ, ఇండస్ట్రీస్, ఎనర్జీ వంటివి తీసుకోవాలని సూచించారని పేర్కొన్నారు. కానీ తను విద్యా శాఖ కావాలని తీసుకున్నట్లు చెప్పుకొచ్చారు. ఉపాధ్యాయ సంఘాలతో అనేకమార్లు కూర్చుని సంస్కరణలు తెచ్చామని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. ఇక రాబోయే నాలుగు సంవత్సరాలు సంస్కరణలు ఉండవని స్పష్టం చేశారు. లీప్ మోడల్‌ను ఖచ్చితంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. ప్రైమరీ స్కూళ్లలో 33 శాతం వన్ క్లాస్ వన్ టీచర్ అమలు చేస్తున్నట్లు తెలిపారు.

# వైభవోపేతంగా మొహమ్మద్ ప్రవక్త 1500ల వసంతోత్సవం

## - ఆనందోత్సాహాలతో మిలాద్ ఉన్ నబీ వేడుకలు

**గుంతకల్లు రైల్వే, సెప్టెంబరు 5,ప్రభాతవార్త** మహమ్మద్ ప్రవక్త 1500ల జయంతి ఉత్సవం, మిలాద్ ఉన్ నబీ వేడుకలు ఆనందోత్సాహాలతో, అంరగంగ వైభవంగా ఘనంగా జరిగాయి. గుంతకల్లు రైల్వే ప్రాంతాల్లోని మిస్కినాబాద్, రైల్వే స్టేషన్ రోడ్డులోని జామియా మసీదులతో పాటు రైల్వే కుటుంబాలు అధికంగా ఉండే ప్రాంతాలలో గురువారం సంధ్యా సమయం నుండి శుక్రవారం సాయంత్రం సంధ్యా సమయం వరకు ముస్లింలు మిలాద్ ఉన్ నబీ వేడుకల్లో అత్యంత ప్రధానమైన, కీలకమైన మహమ్మద్ ప్రవక్త పవిత్ర కేశాన్ని ముస్లింలు భక్తిశ్రద్ధలతో ఆనందోత్సహాలతో తిలకించారు. ఈ సందర్భంగా ఆయా మసీదులలో ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. స్థానిక మిస్కినాబాద్‌లోని హజరత్ సయ్యద్ గులాం షా ఖాద్రి బాబా దర్గా షరీఫ్ నుంచి ప్రధాన మార్గాల మీదుగా హజరత్ సయ్యద్ అలీ అక్బర్ ఉరఫ్ మస్తాన్‌వలీ బాబా దర్గా షరీఫ్ వరకు వేలాది మందితో భారీగా ప్రదర్శన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పవిత్రమైన మక్కా, కాబతుల్లా, మదీనా, అజ్మీర్ దర్గా షరీఫ్ తదితర నమూనాలతో రూపొందించిన ప్రదర్శనలు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి. పట్టణ ఖాజీలు రజాక్ ఖాద్రీ అబ్దుల్ సత్తార్ లతీఫీ, అంజుమన్ ఏ ఇస్లామియా కమిటీ అధ్యక్షులు సయ్యద్ జాఫర్, కమిటీ సభ్యులు, ముస్లిం మతపెద్దలు అధిక సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మసీదులను, ప్రధాన రోడ్లను విద్యుత్ దీపాలతో వివిధ రకాల నమూనాలతో ఆకర్షణీయంగా అలంకరించారు. కులమతాలకు అతీతంగా సోదరభావంతో ఒకరినొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా డిఎస్‌పి శ్రీనివాసులు ఆద్వర్యంలో గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

# ఎపి, తెలంగాణలో మారుతి సుజుకి కొత్త ఎస్‌వియు విక్టోరియస్ ఆవిష్కరణ



**హైదరాబాద్, సెప్టెంబరు 5 ప్రభాతవార్త** :మారుతి సుజుకి ఇండియా లిమిటెడ్ (ఎంఎస్ఐఎల్) తన కొత్త ఎస్‌యువి విక్టోరియస్‌ను విడుదల చేసింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రాంతాల కోసం హైదరాబాద్‌లోని ఒకహోటల్‌లో గ్రాండ్ రీజినల్ అన్‌వీలింగ్ చేసింది. ఈ కార్యక్రమానికి ప్రముఖ కార్పొరేట్ సంస్థల నేతలు, ఫైనాన్షియర్లు, లీజింగ్ భాగస్వాములు, అలాగే డీలర్ ప్రతినిధులు హాజరయ్యారు. అందరి సమక్షంలో ఈ కార్యక్రమం గాట్ ఇట్ ఆల్ ఎస్‌యువిగా నిలిచే కొత్త విక్టోరియస్ ఆవిష్కరణ జరిగింది. కార్పొరేట్స్, ఫైనాన్షియర్లు, డీలర్ భాగస్వాములకు ప్రత్యేక ప్రదర్శన చేశారు. విక్టోరియస్ కోసం ఏపి, తెలంగాణ మార్కెట్లలో ఉన్న భారీ ఆసక్తి ఉత్సాహం ప్రతిబింబించిన సందర్భంగా నిలువనుంది. భారతదేశంలో ఎస్‌యువి అనుభవాన్ని కొత్త స్థాయికి తీసుకెళ్లడానికి విక్టోరియస్ ప్రత్యేకంగా రూపుదిద్దుకుంది. 8స్పీకర్ ప్రీమియం ఇన్ఫినిటీ బై హమాన్ సరౌండ్ సౌండ్ సిస్టమ్ తో డాల్బీ ఆల్టోమోనస్ 5.1 థియేటర్ ఆన్ వీల్స్ అనుభవం, 10.1 స్మార్ట్ ప్లే ప్రొ ఎక్స్ టచ్ స్క్రీన్, ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టం, జెశ్చర్ కంట్రోల్ పవర్డ్ టెయిల్‌గేట్, 64కలర్ అంబియెంట్ లైటింగ్ - అదనపు సౌకర్యంగా ఉంది.

అధునాతన సేఫ్టీ ఫీచర్లు - లెవెల్ 2 ఏడిఏఎస్, 6 ఎయిర్‌బ్యాగ్‌లు, హెచ్‌డీ 360 వ్యూ కెమెరా బహుళ పవర్‌ట్రైన్ ఆప్షన్లు - స్ట్రాంగ్ హైబ్రిడ్ ఈవి నిజు మోడ్‌తో, పెట్రోల, ఎస్ సిఎన్‌జి టెక్నాలజీతో అందుబాటులో ఉండనుంది.

# వరుస సెలవులతో భారీగా పెరిగిన భక్తులు

## - వెంకన్న దర్శనానికి 26గంటలు

**తిరుమల,సెప్టెంబర్ 5ప్రభాతవార్తప్రతినిధి:** దసరా సెలవులకు ముందే వరుసగా మూడురోజులు సెలవులు రావడం...వారాంతం కావడంతో శుక్రవారం ఉదయానికే తిరుమల భక్తజనసంద్రంగా మారింది. గోవిందుని దర్శనానికి భక్తులు భారీగా చేరుకుంటున్నారు. ఉదయానికి వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లలోని అన్ని కంపార్టుమెంట్లు నిండిపోయి భక్తులు వెలుపల రెండు కిలోమీటర్లు క్యూలైన్లలో బారులుతీరారు. దీంతో స్వామివారి సర్వదర్శనానికి 26గంటలు సమయం పైగానే పడుతోంది. టైమ్‌స్లాట్ టోకెన్ భక్తులకు 10గంటలు దర్శనం సమయం, ప్రత్యేక ప్రవేశ దర్శనానికి ఎనిమిదిగంటలపైగానే భక్తులు నిరీక్షిస్తున్నారు. శుక్రవారం సాయంత్రం వరకు 43వేలమంది భక్తులకు మహాలఘు దర్శనం చేయించారు. మరో 20వేలమంది భక్తులు అర్ధరాత్రివరకు దర్శనం చేసుకునే వీలుందని టిటిడి వర్గాలు తెలిపాయి.

# కాఫీ రైతుల సహకారంతో కాఫీ బెర్రీ బోరర్‌నిర్మూలించవచ్చు

**కాఫీ బెర్రీ బోరర్ గుర్తించిన వెంటనే అరికట్టే దిశగా చర్యలు చేపట్టాలిడ్వామా ప్రాజెక్ట్ అధికారి డా. విద్యాసాగర్**

పాడేరు / అరుకువేలి, సెప్టెంబర్ 05: కాఫీ రైతుల సహకారంతో కాఫీ బెర్రీ బోరర్ నిర్మూలించవచ్చు, కాఫీ బెర్రీ బోరర్ గుర్తించిన వెంటనే అరికట్టే దిశగా చర్యలు చేపట్టాలని డ్వామా ప్రాజెక్ట్ అధికారి డా. విద్యాసాగర్ అన్నారు. డ్వామా ప్రాజెక్టు అధికారి శుక్రవారం అరకువ్యాలీ మండలం పాకనకుడ్డి గ్రామంలో కాఫీ బెర్రీ బోరర్ సోకి నష్టపోయిన కాఫీ రైతులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రాజెక్టు అధికారి మాట్లాడుతూ చినలబుడు గ్రామపంచాయతీ పకనకుడి 29 ఎకరాలు, మలివలస 29 ఎకరాలు, మలసింగారం 07 ఎకరాలు, చినలబుడు 05 ఎకరాలు, తురాయికీయిడ 02 ఎకరాలకు సోకినట్లు గుర్తించడం జరిగిందన్నారు. కాఫీ బెర్రీ బోరర్ గుర్తించిన వెంటనే అరికట్టే దిశగా చర్యలు చేపట్టడం జరుగుతుందని, కాఫీ బెర్రీ బోరర్ సోకిన ప్రాంతం నుండి ఎంత వరకు ఇన్ఫెక్షన్ ఏరియా గుర్తించి జోన్ ల వారిగా రెడ్, ఎల్లో, బ్లూ ఫ్లాగ్స్ ఏర్పాటు చేసి జోన్ ల వారిగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. కాఫీ ఫీల్డ్ ఫంక్షనరీ సూచనల మేరకు కాఫీ బోర్డు కెజి కాఫీ కి రూ.50/ నష్టపరిహారం ఇవ్వడం జరుగుతుందని, అలాగే పూడ్చిపెట్టే ఖర్చు మరియు ఇతర ప్రయోజనాల కోసం ఎకరానికి రూ.5,000/ చెల్లించడం జరుగుతుందన్నారు. కాఫీ తోటకి పట్టిన పురుగుని నాశనం చేయాలన్నారు. లేకపోతే కాఫీ ఉత్పత్తి తగ్గుతుందన్నారు. కాఫీ పంటలో వచ్చిన పంటను తీసి వేడినీటిలో ఉడకబెట్టి దానిని మట్టిఖిలో పూడ్చాలన్నారు. లేకపోతే ఆ పురుగు విస్తరించి మరింత నష్టాన్ని కలిగిస్తుందన్నారు. నష్టపోయిన రైతులు ఎవరూ కలత చెందవద్దని నష్టపరివారం ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో కాఫీ బోర్డు సహాయసంచాలకులు బొంజుబాబు, జిల్లా వ్యవసాయాధికారి ఎస్ బి ఎస్ నందా సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది ఉన్నారు.

# ఆరోగ్యశ్రీ పథకంతో దేశానికే రోల్ మోడల్‌గా నిలిచిన వైఎస్ఆర్

## - బిపిపి విధానంలో మెడికల్ కళాశాల ప్రైవేటీకరణ దుర్మార్గం : వైసిపి జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి




విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న వైసిపి జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి

**అనంతపురం, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త బ్యూరో** ఆరోగ్యశ్రీ పథకాన్ని దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి తీసుకొచ్చి దేశానికే రోల్ మోడల్‌గా పథకాన్ని అందించారని వైఎస్ఆర్‌సిపి అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. జిల్లా వైసిపి కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. పేదలకు కార్పోరేట్ వైద్యాన్ని చేరువ చేయడానికి డా.వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ఆరోగ్యశ్రీ పథకాన్ని తీసుకొస్తే ఆయన తనయుడు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక ఆ పథకానికి మెరుగులు దిద్దడమే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా వైద్య విద్యకు పెద్ద పీట వేస్తూ 17 మెడికల్ కళాశాలల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారన్నారు. వైసిపి హయాంలోనే ఐదు కళాశాలలను ప్రారంబించి 750 ఎంబిబిఎస్ సీట్లను అందుబాటులోకి తెచ్చారన్నారు. అయితే ప్రైవేట్ మెడికల్ కళాశాలలను తమ అనునాయిలకు కట్టబెట్టేందుకు క్యాబినెట్‌లో 10 మెడికల్ కళాశాలలను ప్రైవేట్ పరం చేయడానికిఇ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం దారుణమన్నారు. చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చిన ప్రతిసారి ప్రైవేట్ పరానికే ప్రాధాన్యత ఇస్తుంటారని విమర్శించారు. మెడికల్ క ళాశాలను ప్రైవేట్ పరం చేస్తే పేద, మధ్య తరగతి విద్యార్థులకు తీరని నష్టం వాటిల్లుతుందన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం తమ నిర్ణయాన్ని మార్చుకోవాలని లేని పక్షంలో ప్రజా సంఘాలు, ఇతర పార్టీలతోకలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. అదే విధంగా రైతుల విషయంలో సైతం చంద్రబాబు ప్రభుత్వం దుర్మార్గ కరంగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. గత ఏడాది ఖరీఫ్, రబి సీజన్‌లలో అతివృష్టి, అనావృష్టితో పంటలు దెబ్బతిన్నా ఇన్సురెన్స్, ఇన్‌పుట్ సబ్సిడి అందించలేదని విమర్శించారు. కూటమి పాలనలో రైతుల పరిస్థితి దయనీయంగా తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల సంక్షేమం గురించి ఆలోచించే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. కూటమి ప్రభుత్వంలో విత్తనం నుంచి ఎరువుల వరకు రైతులు ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తోందని విమర్శించారు. రైతాంగ సమస్యలపై ప్రతిపక్షాలు ప్రశ్నించినా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టినా, పత్రికల్లో కథనాలు వచ్చినా ముఖ్యమంత్రి స్థాయిలో ఉండి బెదిరిస్తారా అని ఆయన ప్రశ్నించారు. యూరియాను డిస్ట్రిబ్యూటర్లే అధికారులు, ప్రజా ప్రతినిధుల అండతో బ్లాక్ మార్కెట్‌కు తరలించారని విమర్శించారు. నేడు చిన్న వ్యాపారులపై విజిలెన్స్ అధికారులు దాడులు చేస్తున్నారని బ్లాక్ మార్కెట్‌కు తరలించిన డిస్ట్రిబ్యూటర్లపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఆయన ప్రశ్నించారు. అన్నదాత పట్ల ప్రకృతి చిన్న చూపు చూస్తే ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తోందని ఆయన విమర్శించారు. హెచ్‌ఎల్‌సికి నీరు వస్తున్నా నార్త్, సౌత్ కెనాల్‌కు నీరు విడుదల చేయడం లేదని ఆయన విమర్శించారు. తక్షణమే నీరు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అన్నదాతల పట్ల కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న వ్యతిరేక విధానాలపై వైఎస్ఆర్‌సి ఆధ్వర్యంలో అన్ని రెవెన్యూ డవిజన్ కేంద్రాలలో 9వ తేది ర్యాలీలు చేపట్టి ఆర్డిఓలకు వినతిపత్రాలు అందించడం జరుగుతుందన్నారు.

అనంతరం నగరంలో జిల్లా పరిషత్ కార్యాలయం వద్ద నుంచి ఆర్డిఓ కార్యాలయం వరకు ర్యాలీని కొనసాగించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమానికి పెద్ద ఎత్తున రైతులు తరలి రావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఆలమూరు శ్రీనివాస్‌రెడ్డిఉన్నారు.

# కేంద్ర మంత్రి అమిత్‌షాకు ఆర్డిటి విషయంలో వినతిపత్రం సమర్పించిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపిలు



**అనంతపురం, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త బ్యూరో** కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్‌టిఎ ప్రభుత్వానికి తెలుగు దేశం పార్టీ మద్దతు ఉందా లేదా అన్నది అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. దేశ ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వంలో భారతీయ జనతా పార్టీకి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంలో కీలకంగా ఉన్న తెలుగుదేశం పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తోంది. బిజెపికి, తెలుగుదేశం పార్టీకి కొండంత అండగా నిలబడుతోంది ఈ నేపథ్యంలో కరువులకు నిలయమై అత్యంత వెనుకబడిన ప్రాంతంగా గుర్తింపుబడిన అనంతపురం జిల్లాలో దశాబ్దాల కాలం నుంచి ఎన్నో సేవలు అందిస్తున్న ప్రముఖ స్వచ్ఛంద సంస్థ రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ (ఆర్డిటి)కి ఎఫ్‌సిఆర్‌ఏ అనుమతులు ఇచ్చే విషయంలో కేంద్ర ప్రభుత్వం జాప్యం చేస్తున్నా రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఎందుకు మిన్నకుండి పోయింది..? నెల రోజుల క్రితం ఢిల్లీకి వెళ్లి ఉమ్మడి అనంతపురం జిల్లా ఎమ్మెల్యేలు, ఎంపిలు కేంద్రాన్ని మొరపెట్టుకున్నా.. కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షాను కలిసినా ఇంతవరకు అతీగతి కనిపించడం లేదు. వారం రోజుల్లోపు తగిన చర్యలు తీసుకుంటామని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా హామీ ఇచ్చారని ఆగస్టు మొదటి వారంలో ఢిల్లీకి వెళ్లిన ఎమ్మెల్యేలు, ఎంపిలు చెబుతూ వచ్చారు. ఇంత వరకు ఆర్డిటికి ఎఫ్‌సిఆర్‌ఏ అనుమతులు ఇచ్చే విషయంలో కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతులు రాకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఆర్డిటికి ఎఫ్‌సిఆర్‌ఏ అనుమతులు వస్తాయా లేదా రాబోయే కాలంలో ఆర్డిటి తన కార్యకలాపాలను శ్రీలంక, తదితర దేశాలకు తరలి పోవాల్సిందేనా అని జిల్లా ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలోకి వచ్చి ఏడాది కాలం పూర్తి అయిన సందర్భంగా అనంతపురం నగరంలో రాష్ట్ర స్థాయి బహిరంగ సభను లక్షలాది మందితో నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. టిడిపి, జనసేన, బిజెపి నేతలు గత వారం రోజులుగా అనంతపురంలోనే తిష్ట వేసి బహిరంగ సభను విజయవంతం చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, యువనేత నారాలోకేష్ లాంటి అతిరథ మహారథులు ఈ బహిరంగ సభలో ముఖ్య అతిథులుగా పాల్గొననున్నారు. అన్ని రాజకీయ పార్టీల నుంచి ముఖ్య ప్రతినిధులు పాల్గొంటున్నారు. ఈ సభలో సూపర్‌సిక్స్ హామీలకు సంబంధించి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేశామని ప్రజలకు చాటి చెప్పేందుకు కూటమి ప్రభుత్వం అనంతపురం బహిరంగ సభ వేదిక ద్వారా ప్రజలకు వివరించబోతోంది. ఈ నేపథ్యంలో నాలుగైదు దశాబ్దాల కాలం నుంచి ఉమ్మడి అనంతపురం జిల్లాలో ప్రముఖ స్వచ్ఛంద సంస్థ రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్(ఆర్డిటి) ఎన్నో అభివృద్ది కార్యక్రమాలు, సామాజిక సేవా కార్యక్రమాలు చేసిందని, ప్రస్తుతం ఎఫ్‌సిఆర్‌ఏ అనుమతులను నిలుపుదల చేయడం వల్ల విదేశాల నుంచి ప్రతియేటా వచ్చే 350 నుంచి 500 కోట్ల రూపాయలు నిధులు ఆగిపోయాయని, కూటమి ప్రభుత్వం చొరవతో కేంద్రంపై ఒత్తిడి తెచ్చి కొత్తగా ఎఫ్‌సిఆర్‌ఏ అనుమతులను ఇప్పించామని అనంతపురంలో ఈ నెల 10వ తేదిన జరిగే బహిరంగ సభలో కూటమి ప్రభుత్వ ముఖ్యులు ప్రకటించబోతున్నారా లేదా అన్నది చర్చనీయాంశంగా మారింది. ఆర్డిటికి ఎఫ్‌సిఆర్‌ఏ అనుమతులను నిలుపుదల చేసిన నేపథ్యంలో కొత్తగా ఎఫ్‌సిఆర్‌ఏ లైసెన్సుల కోసం దరఖాస్తు చేసుకునే విధంగా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావడం ఒక ఎత్తు అయితే, ఉమ్మడి అనంతపురం జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎంపిలు చొరవ తీసుకుని, కేంద్ర హోం శాఖ మంత్రి.

# కవిత విషయంలో ఆచితూచి అడుగులేస్తున్న బిఆర్ఎస్ అధినాయకత్వం

## ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కెసిఆర్ గణపతి హోమం కెసిఆర్ మా బాస్ : మాజీమంత్రి హరీశ్‌రావు

**హైదరాబాద్, సెప్టెంబరు 5,ప్రభాతవార్త:** భారత రాష్ట్రసమితి (బిఆర్ఎస్) నుంచి ఎమ్మెల్సీ కవితను సస్పెండ్ చేశాక కూడా బిఆర్ఎస్ నాయకత్వంపై విమర్శల దాడులు కొనసాగిస్తున్నప్పటికీ బిఆర్ఎస్ అధినేత కెసిఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, మాజీమంత్రి హరీశ్‌రావు, మాజీఎంపి సంతోష్‌రావు ఎలాంటి ప్రతి విమ ర్శలు చేయకుండా ఆచితూచి అడుగులు వేస్తున్నారు. లండన్ పర్యటనలో ఉన్న హరీశ్‌రావును.. కవిత వివాదాస్పద వ్యాఖ్యలపై స్పందించాలని కోరినా ఆయన నిరాకరించారు. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తన ట్విట్టర్ హ్యాండిల్ నుంచి కారు గుర్తును, కెసిఆర్ పక్కన తాను కూర్చొని ఉన్న ఫొటోను తొలగించారు. బయోలో ఇంతకు ముందు ఎమ్మెల్సీ ఉండగా దానిని సైతం తొలగించారు. మాజీ ఎంపి తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలుగా మాత్రమే పెట్టుకొన్నారు. కెసిఆర్ కుటుంబం మౌనంగా ఉన్నప్పటికి బిఆర్ఎస్ సీనియర్ నాయకులు మాజీ మంత్రులు మీడియా సమావేశం వేదికగా కవిత వైఖరిని తప్పుపడుతున్నారు. ఇరువైపులా సోషల్ మీడియా బృందాలు ఆసక్తికరమైన పోస్టులు చేస్తూ బిఆర్ఎస్ రాజకీయాలపై ఉత్కంఠత కలిగిస్తున్నారు. కవిత తన కూతురు పుట్టిరోజు సందర్భంగా ఇంట్లోనే పూజలు చేసి కేక్ కట్‌చేశారు. ఆనవాయితీగా జూబ్లిహిల్స్ పెద్దమ్మగుడిలో పూజలు నిర్వహించాల్సి ఉండగా ఈ యేడు గుడికి పోనట్లు తెలిసింది. మరోవైపు మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ ఎర్రవెల్లిలోని తన వ్యవసాయక్షేత్రంలో గణపతిహోమం చేశారు. గత ఐదురోజులుగా బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిరామరావు, మాజీ మంత్రలు ప్రశాంత్‌రెడ్డి, జగదీష్‌రెడ్డి ఇతర నాయకులు అక్కడే ఉన్నారు. తెలంగాణజాగృతి నాయకులు కూడా కవితను విబేధిస్తూ విమర్శలు చేస్తున్నారు.

కోరుట్ల మాజీ ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు ఏకంగా ప్రెస్‌మీట్‌లో కవితకు మతిభ్రమించిందని ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం లండన్‌లో పర్యటిస్తున్న హరీష్‌రావు అక్కడి బిఆర్ఎస్ నేతలతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడుతూ బిఆర్ఎస్‌కు ఆటుపోట్లు కొత్తేమి కాదన్నారు. కేసులకు భయపడని చరిత్ర గులాబి శ్రేణులదని, బిఆర్ఎస్‌కు ఎప్పటికైనా సుప్రీం కెసిఆర్ అని తెలిపారు. పార్టీలో సొంత నిర్ణయాలు ఉండవని కలిసికట్టుగానే నిర్ణయాలు తీసుకొని పనిచేయడం ప్రజాసేవచేడం కెసిఆర్ తమకు నేర్పారని ఆయనతెలిపారు. రేవంత్ ప్రభుత్వం ఎంక్వైరీలతో డైవర్షన్ రాజకీయాలతో పాలనను గాలికి వదిలేసిందని అన్నారు. హరీష్‌రావు కాళేశ్వరంలో అవినీతికి పాల్పడ్డారని తమ కుటుంబాన్ని చీల్చడానికి కుట్రలు చేశారని ఆరోపించడంతోపాటు ఫ్లైట్‌లో రేవంత్ కాళ్లు హరీష్ పట్టుకొన్నారని కవిత చేసిన వ్యాఖ్యలకు మీడియా ప్రశ్నించినా ఆయన ఇండియాకు వెళ్లాక మాట్లాడుతానని చెప్పారు. ఆయన వ్యక్తిగత సిబ్బంది కూడా తరువాత మాట్లా డుతారని మీడియాను బుజ్జగించారు. శనివారం హైదరాబాద్‌కు రాగానే నేరుగా ఎర్ర వెల్లి ఫామ్‌హౌజ్‌కు వెళ్లి కెసిఆర్‌తో సమావేశం కాబోతుండటంతో ఉత్కంఠత నెల కొంది. కాళేశ్వరం మూడు పిల్లర్లు కుంగితే రాద్దాంతం చేస్తున్నారని ప్రభుత్వంపై ఆయన లండన్‌లో విరుచుకుపడ్డారు. ఏడాదిన్నర నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేయడం లేదని, హైడ్రా వల్ల నగరంతోపాటు శివారు ప్రాంతాల్లో రియల్‌ఎస్టేట్ కుప్ప కూలిందని అన్నారు. తెలంగాణకు ఎన్నారైలు పెట్టుబడి పెట్టేందుకు వెనుకాడు తున్నారని ఆయన ఆవేదన చెందారు. తెలంగాణలో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా బిఆర్ఎస్ ప్రభుత్వం వస్తుందని రాసిపెట్టుకోండని కామెంట్ చేశారు. రేవంత్‌రెడ్డి పాలన చూశాక ప్రజలకు కెసిఆర్ విలువ ఏంటో తెలిసిందని అన్నారు. రాష్ట్రంలో అవినీతి విచ్చలవిడిగా రాజ్యమేలుతోందని తెలంగాణలో కాంగ్రెస్ వెనుకబడి పోతున్నదని ఆయన వ్యాఖ్యానించారు.

# కన్ఫర్మ్‌డ్ ఐఎఎస్‌లుగా సీనియర్ అధికారులు

## కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదన

**హైదరాబాద్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** వివిధ శాఖల్లో పనిచేస్తున్న పలువురు పలువురు సీనియర్ అధికారులను కన్ఫర్మ్‌డ్ ఐఎఎస్‌లుగా పదోన్నతి కల్పించేందుకు తెలంగాణ సర్కార్ నిర్ణయించింది. ఈ మేరకు దీనికి సంబంధించిన ప్రతిపాదనలను కేంద్రానికి సమర్పించింది. రాష్ట్రంలోని ఒకే సారి 21 మంది సీనియర్ అధికారులు స్టేట్ సర్వీసు కేడర్, నాన్ స్టేట్ సర్వీసు కేడర్‌కు కన్ఫర్డ్ ఐఎఎస్‌లుగా పదోన్నతి కల్పించేందుకు కసరత్తు పూర్తి చేసిన ప్రభుత్వం ఈ జాబితాను కేంద్రం అనుమతికి పంపించింది. రాష్ట్రంలో 2022 సంవత్సరానికి సంబంధించి 14 పోస్టులు, 2023 సంవత్సరానికి మూడు పోస్టులు, 2024 సంవత్సరానికి నాలుగు కన్ఫర్డ్ ఐఎఎస్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటి కోసం ఒక్కో పోస్టుకు ముగ్గురి పేర్ల చొప్పున కేంద్రంలోని డిపార్ట్మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రెనింగ్ (డీవోపీటీ)కి రాష్ట్ర ప్రభుత్వం పంపింది. గతంలో కన్ఫర్డ్ ఐఎఎస్ ఎంపికకు యూపీఎస్సీ అధికారులు డీవోపీటీ పంపించిన జాబితాతో ఇంటర్వ్యూలు చేసి ఎంపిక చేసే వారు. కానీ ఈ సంవత్సరం నుంచి ఇంటర్వ్యూల విధానాన్ని ఎత్తివేశారు. దీంతో డీవోపీటీకి పంపించిన మూడు పేర్లలో ఒక్కో పోస్టుకు ఒకరిని ఎంపిక చేస్తారు. సర్వీసు రిజిష్టర్, వారి ఉద్యోగ జీవితంలో సాధించిన విజయాలు, ఆరోపణలు, ఫిర్యాదుల తదితర వాటన్నింటినీ పరిగణలోకి తీసుకుని కన్ఫర్డ్ ఐఎఎస్‌లకు ఎంపిక చేయనుంది.

# యూరియా అదనపు సేల్‌కౌంటర్లు

## వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా యూరియా సరఫరా, వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో రైతు వేదికల వద్ద అదనపు యూరియా సేల్ కౌంటర్లను ఏర్పాటు చేయాలని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటనలో మండలానికి ఒకటి లేదా రెండు సహకార సంఘాలు మాత్రమే ఉన్న ప్రాంతాల్లో రైతు వేదికలను వాడుకొని గ్రామాల వారీగా, పాస్ పుస్తకాల ఆధారంగా ఒక రోజు ముందుగానే టోకెన్లు జారీచేసి ఎరువులు అందించాలన్నారు. ఈ పంపిణీ ప్రక్రియలో ఎక్కడా అవకతవకలు జరగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. పోలీస్, విజిలెన్స్‌తో కూడిన పర్యవేక్షణతో ఎక్కడా బ్లాక్ మార్కెటింగ్ జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. వానాకాలం సాగు విస్తారంగా సాగుతున్న ప్రస్తుత సమయంలో రైతులు యూరియా ఎరువుల కొరతను ఎదుర్కొంటున్నారని, వచ్చే 20 రోజుల్లో 2 లక్షల మెట్రిక్ టన్నులు సరఫరా చేయాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. దీనిపై కేంద్రం వెంటనే స్పందించి రాష్ట్రానికి అవసరమైన యూరియా కేటాయించేందుకు అంగీకరించిందని పేర్కొన్నారు. దేశీయ తయారీ యూనిట్ల నుండి కూడా అదనంగా 30 వేల టన్నుల యూరియాను రాష్ట్రానికి కేటాయించడానికి కేంద్రం అంగీకరించినట్లు తెలిపారు. వచ్చే 3,4 రోజుల్లో రామగుండం యూనిట్ తిరిగి కార్యకలాపాలు ప్రారంభించేలా చర్యలు చేపడతామని కేంద్రం హామీ ఇచ్చిందన్నారు. ఈ రోజు రాష్ట్రానికి 11,181 టన్నుల యూరియా చేరిందని, రేపు మరో 9,039 టన్నులు రానుందని చెప్పారు. ఈ నెలలో నాలుగు రోజుల్లోనే రాష్ట్రానికి 28 వేల టన్నుల యూరియా సరఫరా అయిందని ఆయన వివరించారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో 8,20,112 టన్నుల యూరియా విక్రయాలు జరిగాయని తెలిపారు.



# ఎపి, తెలంగాణలో మారుతి సుజుకి కొత్త ఎస్‌వియు విక్టోరియస్ ఆవిష్కరణ

**హైదరాబాద్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** మారుతి సుజుకి ఇండియా లిమిటెడ్ (ఎంఎస్ఐఎల్) తన కొత్త ఎస్‌యువి విక్టోరియస్‌ను విడుదల చేసింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రాంతాల కోసం హైదరాబాద్‌లోని ఒకహోటల్‌లో గ్రాండ్ రీజినల్ అన్ వీలింగ్ చేసింది. ఈ కార్యక్రమానికి ప్రముఖ కార్పొరేట్ సంస్థల నేతలు, ఫైనాన్షియర్లు, లీజింగ్ భాగస్వాములు, అలాగే డీలర్ ప్రతినిధులు హాజరయ్యారు. అందరి సమక్షంలో ఈ కార్యక్రమం గాట్ ఇట్ ఆల్ ఎస్‌యువిగా నిలిచే కొత్త విక్టోరియస్ ఆవిష్కరణ జరిగింది. కార్పొరేట్స్, ఫైనాన్షియర్లు, డీలర్ భాగస్వాములకు ప్రత్యేక ప్రదర్శన చేశారు. విక్టోరియస్ కోసం ఏపి, తెలంగాణ మార్కెట్లలో ఉన్న భారీ ఆసక్తి ఉత్సాహం ప్రతిబింబించిన సందర్భంగా నిలువనుంది.

భారతదేశంలో ఎస్‌యువి అనుభవాన్ని కొత్త స్థాయికి తీసుకెళ్లడానికి విక్టోరియస్ ప్రత్యేకంగా రూపుదిద్దుకుంది. 8స్పీకర్ ప్రీమియం ఇన్ఫినిటీ బై హమాన్ సరౌండ్ సౌండ్ సిస్టమ్ తో డాల్బీ ఆల్టోమోనస్ 5.1 థియేటర్ ఆన్ వీల్స్ అనుభవం, 10.1 స్మార్ట్ ప్లే ప్రొ ఎక్స్ టచ్ స్క్రీన్, ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టం, జెశ్చర్ కంట్రోల్ పవర్డ్ టెయిల్‌గేట్, 64కలర్ అంబియెంట్ లైటింగ్ - అదనపు సౌకర్యంగా ఉంది. అధునాతన సేఫ్టీ ఫీచర్లు - లెవెల్ 2 ఏడిఏఎస్, 6 ఎయిర్‌బ్యాగ్‌లు, హెచ్‌డీ 360 వ్యూ కెమెరా బహుళ పవర్‌ట్రైన్ ఆప్షన్లు - స్ట్రాంగ్ హైబ్రిడ్ ఈవి నిజు మోడ్‌తో, పెట్రోల, ఎస్ సిఎన్‌జి టెక్నాలజీతో అందుబాటులో ఉండనుంది.

# ధన, ధాన్య కృషి యోజనపై ఆశలు

## రాష్ట్రంలోని 5 జిల్లాల్లో అమలుకు యత్నం

## ఇప్పటికే కేంద్రానికి సర్కార్ ప్రతిపాదన

**హైదరాబాద్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** కేంద్రం తాజాగా ప్రకటించిన ప్రధాన మంత్రి ధనధాన్య కృషి యోజన పథకాన్ని తెలంగాణలో అమలు చేయడంపై రాష్ట్ర సర్కార్ ఆశలు పెట్టుకుంది. రాష్ట్రంలోని ఐదు జిల్లాలను ఈ పథకంలో చేర్చేలా వ్యవసాయ శాఖ ప్రయత్నాలు చేస్తోంది. దీనికి సంబంధించి ఇప్పటికే రాష్ట్ర సర్కార్ కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను కలిసి వినతిపత్రం సమర్పించింది. రాష్ట్రంలోని నారాయణపేట, ములుగు, ఆసిఫాబాద్, సంగారెడ్డి, కొత్తగూడెం జిల్లాలను చేర్పించేందుకు తీవ్ర యత్నాలు జరుగుతున్నాయి. కాగా దేశ వ్యాప్తంగా వ్యవసాయపరంగా వెనుకబడిన 100 జిల్లాల్లో రైతులకు చేయూతనిచ్చి దిగుబడులు పెంచడానికి కేంద్రం ప్రధానమంత్రి ధనధాన్య కృషి యోజన పథకాన్ని కేంద్రం తాజాగా ప్రకటించింది. కేంద్రంలోని 11 మంత్రిత్వ శాఖల్లో అమల్లో ఉన్న 36 పథకాలను సమ్మిళితం చేసి ఈ పథకాన్ని అమలు చేయనుంది. రూ.24వేల కోట్ల బడ్జెట్‌తో ఈ పథకాన్ని కేంద్రం ప్రారంభించింది. దీనికింద 1.7కోట్ల మంది రైతులకు ప్రయోజనం కల్పించేందుకు లక్ష్యంగా నిర్ణయించింది. పంటల మార్పిడి, సాగునీటి సౌకర్యాల కల్పన, నిల్వ సామర్థ్యం పెంపు, విలువ జోడింపు ద్వారా వ్యవసాయ ఉత్పాదకతను పెంచడం దీని ప్రధాన లక్ష్యం. ఈ నేపథ్యంలో పూర్తిగా వర్షాలపై ఆధారపడిన తెలంగాణలోని ఐదు జిల్లాలను చేర్చాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి విజ్ఞప్తి చేసింది. ఈ జిల్లాల్లో పంటల ఉత్పాదకత చాలా తక్కువగా ఉంటోంది. వీటిని ధనధాన్య యోజనలో చేర్చితే ఆ జిల్లాల రైతులకు వ్యవసాయం గిట్టుబాటుగా మారుతుందని సర్కార్ చెబుతోంది.

# రైతుల కోసం వాట్సాప్ ఛానల్

## అందుబాటులోకి తెచ్చిన రాష్ట్ర వ్యవసాయ శాఖ

**హైదరాబాద్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** వ్యవసాయ సమాచారం నిమిత్తం రైతుల కోసం రాష్ట్ర వ్యవసాయ శాఖ కొత్తగా వాట్సాప్ ఛానెల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. దీని ద్వారా ఎప్పటికప్పుడు తెలంగాణ రైతాంగానికి కీలకమైన సమాచారం, సలహాలు, సూచనలను వ్యవసాయ శాఖ అందిస్తోంది. ప్రధానంగా వాతావరణ హెచ్చరికలు, పంటల వివరాలు, పురుగు మందులు, ఎరువుల వివరాలు సులువుగా రైతాంగానికి సమాచారం తెలియజేస్తున్నారు. ఈ వాట్సాప్ఛానెల్ ఎలా వినియోగించుకోవాలి అనే విషయాన్ని తెలియజేడానికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ)తో కూడిన వీడియోను కూడా సృష్టించింది. రైతులకు సాగు చేస్తున్న ఆయా పంటలకు తెగుళ్ళ పడితే ఎలాంటి మందులు చల్లాలి, ఏం చేయాలి అనే విషయాలను ఆ శాఖ సమాచారం ఇస్తుంది. రాష్ట్రంలో ప్రధాన పంటగా ఉన్న వరిలో పాముపొడ తెగులు, ఆకు ముడత నివారణ కోసం శాస్త్రవేత్తల సూచనల మేరకు చేపట్టాల్సిన చర్యలు వివరంగా ఇందులో పేర్కొంది. ఇక కంది, మొక్కజొన్నల్లో కాండం తొలుచు పురుగు కోసం వాడాల్సిన పురుగు మందులు, పత్తిలో జింక్ లోపం సవరణ, పచ్చదోమ నివారణ వంటి వాటికి ఎలాంటి చర్యలు చేపట్టాలి, ఉద్యాన వన పంటల విషయంలో సూక్ష్మ, సమస్యలు ఎదురైతే రైతులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి అనే అంశాలను అందిస్తుంది. మధ్య మధ్యలో రైతులకు వ్యవసాయానికి సంబంధించి క్విజ్ పోటీలను సైతం ఈ వాట్సాప్ ఛానెల్ లో నిర్వహిస్తున్నారు. రైతు బీమా కు సంబంధించిన సమాచారం, ప్రభుత్వ పథకాలు, సబ్సిడీ వివరాలు, పంటల సంరక్షణ సీజనల్ సూచనలు, ఆయా పంటలకు కీటక నియంత్రణ మార్గదర్శకాలు, మార్కెట్ ధరలు, శిక్షణ కార్యక్రమాల అప్ డేట్లు ఇలా అన్ని వివరాలు అరచేతిలో వున్న సెల్ ఫోన్ ద్వారా తెలుసుకోవచ్చని వ్యవసాయ శాఖ డైరెక్టర్ బి.గోపి తెలిపారు.

# విద్యాసంస్థలను తీర్చిదిద్దడం ప్రభుత్వ ప్రాధాన్యత

## బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు



గురువారం టీచర్స్‌డే సందర్భంగా ట్యాంక్‌బండ్ వద్ద డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న రాంచందర్‌రావు తదితరులు

**హైదరాబాద్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** విద్యా సంస్థలను అభివృద్ధి దిశగా తీర్చిదిద్దడం ప్రభుత్వ ప్రాధాన్యత కల్పించాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు అన్నారు. గురువారం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ 138వ జయంతి (ఉపాధ్యాయ దినోత్సవం) వేడుకల సందర్భంగా, ట్యాంక్‌బండ్ వద్ద ఆయన విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాం చందర్‌రావు మీడియాతో మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెచ్చిన మహనీయుడు, దేశ రెండో రాష్ట్రపతి, భారత రత్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరిం చుకుని ఉపాధ్యాయ దినోత్స వాన్ని జరుపు కుంటున్నాం అన్నారు. భారతదేశ నిర్మాణంలో, అలాగే విద్యావ్యవస్థలో అనేక మార్పులకు కారణమైన సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినం సందర్భంగా ఉపాధ్యాయులను గౌర వించుకోవాలన్నారు. కానీ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ఉపాధ్యా యులకు, విద్యారంగానికి తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. కనీసం వారి సమస్యలను, ఘోషను ప్రభుత్వం పట్టించుకోవాలని, ఇప్పటికీ ప్రభుత్వ ఉపాధ్యాయులు, టీచర్లకు సకాలంలో జీతాలు రావడం లేదని, రిటైర్డ్ టీచర్లు, ఉద్యోగులకు పెన్షన్ల విషయంలో కూడా రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. సమాజంలో భావితరాలను తీర్చిదిద్దే ఉపాధ్యాయులను గౌరవించడం ప్రతిఒక్కరి ధర్మం అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికైనా విశ్వవిద్యాలయాల ప్రగతికి, విద్యా వ్యవస్థ బలోపేతానికి చర్యలు తీసుకోవాలన్నారు. విశ్వవిద్యాలయాలకు వెయ్యి కోట్లు ఇస్తామని కేవలం ప్రకటనలు గుప్పించడం కాదు, ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు సకాలంలో జీతాలు చెల్లించాలన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల సమస్యలకు చెక్

## ఫొటోల కష్టాలకు తెర.. ఒక్క క్లిక్‌తో యాప్‌లో అప్‌లోడ్

**హైదరాబాద్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రభుత్వం కొత్త సౌకర్యం కల్పించింది. ఇకపై అధికారులు ఫొటోలు తీయకుండానే, లబ్ధిదారులే యాప్ ద్వారా ఇళ్ల చిత్రాలు అప్లోడ్ చేసే అవకాశాన్ని కల్పించారు. ఆ ఫొటోల ఆధారంగా బిల్లులు విడుదల చేస్తారు. ఈ విధానం వల్ల ఆలస్యం తగ్గి, లబ్ధిదారులకు సకాలంలో ఆర్థిక సహాయం అందుతుంది. ఈ పథకం ద్వారా లబ్ధిదారులకు దశలవారీగా నిధులు అందనున్న విషయం తెలిసిందే. ఈ కొత్త పద్ధతి పారదర్శకతను పెంచడమే కాకుండా, గ్రామీణ కుటుంబాల భాగస్వామ్యాన్ని కూడా పెంచుతుంది. తెలంగాణలో గృహ నిర్మాణ పథకాలలో ప్రధానమైనది ఇందిరమ్మ ఇళ్ల పథకం. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు గృహ భద్రత కల్పిం చాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశ పెట్టింది. గతంలో లబ్ధిదారులు ఇళ్లు నిర్మించిన తర్వాత బిల్లులు రావడంలో ఆలస్యం ఎదుర్కొనడం సాధారణమైంది. దీనికి కారణం అధికారులు స్వయంగా స్థలానికి వెళ్లి ఇళ్ల ఫొటోలు తీసి నివేదిక పంపడంలో ఆలస్యం కావడంతో ఇప్పుడు ఆ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ వీపీ గౌతం ప్రకటన ప్రకారం.. ఇకపై లబ్ధిదారులే తమ ఇందిరమ్మ ఇళ్ల ఫొటోలు నేరుగా ప్రత్యేక యాప్‌లో అప్లోడ్ చేసే సౌకర్యం పొందనున్నారు. ఆ ఫొటోలు ఆధారంగా వెంటనే బిల్లులు విడుదల చేయబడతాయి. దీంతో ఎవరూ అధికారులపై ఆధారపడాల్సిన అవసరం ఉండదు. సమయానికి సాయం అందు తుంది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మందికి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు జరిగాయి. ఈ పథకం దశలవారీగా అమలు అవుతోంది. మొదటి దశలో ముగ్గులు పోసి.. బేస్ మట్టం వరకు లేపిన తర్వాత డబ్బులు జమ చేస్తారు. ఆ తర్వాత గోడలు కట్టిన తర్వాత ఫొటోలు పంపితే మొదటి వాయిదా వస్తుంది. మూడో దశలో పైకప్పు పూర్తయిన తర్వాత మరో విడత విడుదల అవుతుంది. చివరగా ఇంటి పనులు ముగిసిన తర్వాత తుది బిల్లు వస్తుంది. ఈ విధానంతో లబ్ధిదారులకు పారదర్శకతతో పాటు వేగవంతమైన ఆర్థిక సహాయం లభిస్తుంది. ఈ నిర్ణయం సొంత ఇంటి కలను నిజం చేసుకోవాలనుకునే వేలాది కుటుంబాలకు ఉపశమనం కలిగిస్తుంది. అయితే అధికారులు ఫొటోలు తీసేందుకు వెళ్లకపోవడం.. దీంతో బిల్లులు ఆలస్యం వంటి సమస్యలు ఏర్పడుతున్నాయి.

ఇక వీటిని చెక్ పడనుంది. గ్రామీణ ప్రాంతాల్లో స్మార్ట్‌ఫోన్ ఉపయోగం పెరుగు తున్నందున, చాలామంది లబ్ధిదారులు ఈ కొత్త సదుపాయాన్ని సులభంగా వినియోగించగలరని అధికారులు అంచనా వేస్తున్నారు. పేద కుటుంబాల గౌరవాన్ని, భవిష్యత్తును కాపాడే ప్రయ త్నంలో భాగంగా దీనిని తీసుకొచ్చారు. తమ ఇంటిని తాము ఫొటో తీసి అప్లోడ్ చేయడం ద్వారా లబ్ధిదారులు ప్రభుత్వ పథకంలో భాగస్వామ్యులవుతారు. తద్వారా ఇందిరమ్మ ఇళ్ల పథకం మరింత పారదర్శకతతో ముందుకు సాగనుంది.

# కెసిఆర్ లేకుంటే బిఆర్ఎస్ ఉండదు: ఎంపి అసదుద్దీన్ ఒవైసి

**హైదరాబాద్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** బిఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు లేకుంటే ఆ పార్టీ మనుగడలో ఉండదని మజ్లీస్ పార్టీ అధ్యక్షుడు, లోక్‌సభ సభ్యుడు అసదుద్దీన్ ఒవైసీ సంచలన వ్యాఖ్య చేశారు. శుక్రవారం అసద్ తనను కలిసిన విలేకరులతో మాట్లాడుతూ కెసిఆర్ అంటే తనకు గౌరవం ఉందన్నారు. కెసిఆర్ అంటేనే బిఆర్ఎస్, బిఆర్ఎస్ అంటేనే కెసిఆర్ అని ఆయన తెలిపారు. కెసిఆర్ లేకపోతే బిఆర్ఎస్ ఉండదని ఆయన చెప్పారు. అంతకుముందు అసద్ మహారాష్ట్ర కార్యవర్గంతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ముంబయి, పుణే, నాగ్‌పూర్, ఔరంగాబాద్,నాసిక్, ఔరంగాబాద్, పర్బనీ మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు పార్టీని మరింత బలో పేతం చేసుకునే అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా అసదుద్దీన్ ఒవైసీ మాట్లాడుతూ దళితులు, మైనారిటీల సమస్యలపై పోరాటం ఉధృతం చేయాలని కార్యవర్గానికి పిలుపునిచ్చారు. ఎన్నికల్లో పోటీ చేసేందుకు అభ్యర్థుల ఎంపిక విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని, నిజాయితీపరులను ఎంపిక చేయాలని, ఎన్నికైన తర్వాత పార్టీ ఫిరాయించని వారిని గుర్తించాలని ఆయన సూచించారు.

# న్యాక్ ట్రైనర్ స్నేహలతకు రాష్ట్రపతి నుంచి అవార్డు

## అభినందించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్‌ను అత్యుత్తమ స్కిల్ డెవలప్‌మెంట్ వేదికగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి, న్యాక్ వైస్ చైర్మన్ కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి చేస్తున్న కృషికి ఫలితం దక్కుతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు విద్యార్థుల్లో స్కిల్ డెవల్మపెంట్ పెంపొందించాలనే లక్ష్యంతో ఇప్పటికే ప్రజా ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా స్కిల్ డెవలప్‌పెంట్ సెంటర్స్ ఏర్పాటు చేస్తున్నది. అందులో భాగంగా హైదరాబాద్ వేదికగా, జిల్లాల్లో న్యాక్ ద్వారా శిక్షణ ఇవ్వడమే కాకుండా100 శాతం ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ఎన్ ఎసి వైస్ ఛైర్మన్,మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. ఉత్తమ ఫలితాలు రాబట్టేందుకు మంత్రి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించారు. ఈ నేపథ్యంలోనే టీచర్స్ డే పురస్కరించుకొని న్యాక్ ట్రైనర్ స్నేహలతకు రాష్ట్ర పతి చేతుల మీదుగా జాతీయ అవార్డు రావడం పట్ల మంత్రి తన హర్షం వ్యక్తం చేశారు.

మినిస్ట్రీ ఆఫ్ స్కిల్ డెవలప్మెంట్ ఎంటర్ ప్రెన్యూర్షిప్ విభాగంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గారి చేతుల మీదుగా శుక్రవారం ఢిల్లీలో జాతీయ ఉత్తమ టీచర్స్ అవార్డు అందుకున్న న్యాక్ ట్రైనర్ స్నేహలతకు ఫోన్ చేసి మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. ఆమె న్యాక్ ద్వారా నిరుద్యోగ యువతలో నైపుణ్యం పెంపొందించేందుకు ఉమ్మడి వరంగల్ జిల్లా, కరీంనగర్, జగిత్యాల పట్టణాల్లో నిరుద్యోగ యువతకు సర్టిఫికెట్ కోర్సులు, ఉద్యోగ అవకాశాలు కల్పించే వృత్తివిద్యా కోర్సులను అందిస్తూ, ఉత్తమ బోధన అందించేందుకు చేసిన కృషికి గుర్తింపుగా ఈ అవార్డు దక్కిందని కొనియాడారు.

దేశవ్యాప్తంగా 13 మంది ఈ వార్డుకు ఎంపికైతే తెలంగాణ నుండి న్యాక్ ఇన్‌స్ట్రక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న హన్మకొండకు చెందిన నక్క స్నేహలతకు అవార్డు రావడం తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణం అన్నారు. నైపుణ్యాలకు ఉత్తమ వేదికగా నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్ ను బలోపేతం చేస్తున్నామని పేర్కొన్న మంత్రి, ప్రతిష్టాత్మక జాతీయ అవార్డు దక్కడంతో న్యాక్ ఫ్యాకల్టీ,సిబ్బందిలో మరింత ఉత్సాహాన్ని నింపిందన్నారు. స్నేహలతను ప్రోత్సహించిన న్యాక్ డైరెక్టర్ శాంతి శ్రీ ని మంత్రి ఈ సందర్భంగా అభినందించారు. రాష్ట్ర పతి చేతుల మీదుగా అవార్డు అందుకున్న స్నేహలతకు న్యాక్ డైరెక్టర్ జనరల్(డీజీ), ప్రభుత్వ స్పెషల్ సిఎస్ వికాస్ రాజ్

# మంత్రి సీతక్కతో నీట్ క్వాలిఫైడ్ విద్యార్థులు, తల్లిదండ్రుల భేటీ

**హైదరాబాద్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** ప్రజాభవన్‌లో శుక్రవారం మంత్రి సీతక్కను నీట్ క్వాలిఫైడ్ విద్యార్థులు వారి తల్లిదండ్రులు కలిశారు. నీట్ పరీక్షలో మంచి ర్యాంకు సాధించినా సుప్రీంకోర్టు తీర్పు కారణంగా కౌన్సిలింగ్ కు హాజరు కాలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ బిడ్డలు మైనప్పటికీ కేవలం ఇంటర్మీడియట్ పొరుగు రాష్ట్రాల్లో చదవడం వల్ల తమ నష్ట పోతు న్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు తీర్పుతో పొరుగు రాష్ట్రంలో చదవడంతో 45 మంది నీట్ విద్యార్థులు నష్టపోతున్నట్లు వారు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. క్వాలిఫైడ్ అయిన నీట్ విద్యార్థుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని మంత్రి సీతక్క వారికి హామీ ఇచ్చారు. మంత్రి తమ సమస్యలను సానుకూల దృక్పథంతో పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో వారు కృతజ్ఞతలు తెలిపారు.

## పోచారం శ్రీనివాస్‌రెడ్డి బాన్సువాడలో

# ఓడిపోవడం ఖాయం

## బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

**హైదరాబాద్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** తెలంగాణలో రాబోయే ఆరు నెలల్లో ఉప ఎన్నికలు వస్తాయని బాన్సువాడలో పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఓడిపోవడం ఖాయమని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల రామారావు జోస్యం చెప్పారు.ఎర్రవల్లిలోని కేసీఆర్ నివాసంలో బాన్సువాడ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నేతలు, వందలాది కార్యకర్తలు శుక్రవారం బిఆర్ఎస్ పార్టీలో చేరారు. స్పీకర్ నిర్ణయం తీసుకోకపోతే మరోసారి సుప్రీంకోర్టుకు వెళ్తామని, పోచారం ఎమ్మెల్యే పదవి పోయే వరకు న్యాయపోరాటం కొనసాగిస్తామని కేటీఆర్ తెలిపారు. ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ భారతదేశంలోనే నంబర్ వన్ రాష్ట్రాన్ని బంగారు పళ్లెంలో పెట్టి కాంగ్రెస్ చేతిలో పెట్టామని కానీ ఇచ్చిన హామీలను అమలు చేయడంలోనూ, గతంలో ఉన్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయడంలోనూ ప్రస్తుత ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని కేటీఆర్ ఎద్దేవా చేశారు. దీనికి బాధ్యత వహిస్తూ ముఖ్యమంత్రి ప్రజలకు క్షమాపణ చెప్పాలని, తమకు పరిపాలన చేతకావడం లేదని, అన్ని కార్యక్రమాలను అమలు చేయలేమని నేరుగా చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన కేవలం 21 నెలల్లోనే ప్రజల నుంచి సంపూర్ణ వ్యతిరేకతను మూటగట్టుకుందని విమర్శించారు. హామీల వైఫల్యం, నమ్మకద్రోహం ఒక కారణం అయితే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాటల తీరు, వ్యవహార శైలి మరో ప్రధాన కారణమని ఆయన పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి పరిపాలనపై దృష్టి పెట్టకుండా ప్రతిక్షణం కెసిఆర్ పేరు తలుచుకుంటూ అడ్డగోలు మాటలు మాట్లాడుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వాన్ని నడపడం చేతగాక, గత ప్రభుత్వం అప్పులు చేసిందని కాంగ్రెస్ అబద్ధాలు చెబుతోందని మండిపడ్డారు. గత ప్రభుత్వం కేవలం రూ. 2.80 లక్షల కోట్ల అప్పు మాత్రమే చేసిందని పార్లమెంట్ సాక్షిగా కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసిందని తెలిపారు. అయితే, ఈ 21 నెలల కాలంలోనే రేవంత్ రెడ్డి ప్రభుత్వం రూ. 2.20 లక్షల కోట్ల పైగా అప్పులు చేసిందని, ఆ అప్పుతో ఏ ఒక్క సంక్షేమ పథకం లేదా అభివృద్ధి కార్యక్రమం చేపట్టలేదని విమర్శించారు. గత ప్రభుత్వం సంవత్సరానికి రూ. 20 వేల కోట్ల అప్పు చేస్తే, ఈ ప్రభుత్వం నెలకు రూ. 20 వేల కోట్ల అప్పు చేస్తోందని ఆరోపించారు.

యూరియా సంక్షోభంపై రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు అనుమానాలకు దారితీస్తోందని కెటిఆర్ అన్నారు. పంటల కొనుగోళ్లకు, ఆ తర్వాత వాటికి ఇవ్వాల్సిన బోనస్‌ను ఎగగొట్టాలనే ఉద్దేశంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే యూరియా సరఫరా చేయడం లేదని ప్రజలు భావిస్తున్నారని ఆయన తెలిపారు. వ్యవసాయ రంగం, రైతుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇంత దుర్మార్గమైన ఆలోచన ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎర్రవెల్లిలోని కెసిఆర్ నివాసంలో జరిగిన చేరికల కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నేతలు, వందలాది కార్యకర్తలు భారత రాష్ట్ర సమితిలో చేరారు. వీరిలో ఎంపిటిసి ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు యలమంచిలి శ్రీనివాస్, మాజీ ఎంపీపీ కోటగిరి వల్లేపల్లి శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీ బాన్సువాడ నార్ల రత్న కుమార్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ బొట్టె గజేందర్, మాజీ సర్పంచులు పద్మ మొగులయ్య, బంజా గంగారాం, కురలేపు నగేష్, మాజీ కోఆప్షన్ హకీమ్ తదితరులు ఉన్నారు.

# ఖేలో ఇండియా గేమ్స్ తెలంగాణలో నిర్వహించండి

## కేంద్రమంత్రికి రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి వాకిటి శ్రీహరి విజ్ఞప్తి

**హైదరాబాద్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** ఖేలో ఇండియా గేమ్స్‌ను తెలంగాణలో నిర్వహించాలని కేంద్ర క్రీడా శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండ వీయను కోరినట్లు రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకాటి శ్రీహరి శుక్రవారం ఢిల్లీలో తెలిపారు. గతంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా తెలంగాణలో ఖేలో ఇండియా గేమ్స్ నిర్వహించాలని కేంద్రాన్ని కోరినట్లు మంత్రి చెప్పారు. తెలంగాణలోని వివిధ జిల్లాల్లో ఉన్న స్పోర్ట్స్ స్కూల్స్‌కి ఆర్థికంగా సహాయం చేయాలని, క్రీడా ప్రాంగణాల అభివృద్ధి, మౌలిక సదుపాయాలతోపాటు ఆర్థిక సహకారం కూడా అందించాలని కేంద్రమంత్రిని కోరినట్లు తెలిపారు. త్వరలోనే మూడు రోజుల పాటు తెలంగాణలో పర్యటిస్తామని కేంద్ర మంత్రి చెప్పినట్లు మంత్రి వాకాటి శ్రీహరి తెలిపారు.

# ప్రభుత్వ అసమర్థతను కప్పిపుచ్చుకోవడానికి కేంద్రంపై నెపం సరికాదు

## బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థతలను కప్పిపుచ్చుకోడానికి కేంద్రాన్ని, బిజెపిని నిందించడం సరైనది కాదని, కేంద్ర ప్రభుత్వం రైతుల, వ్యవసాయ రంగానికి నిరంతరం మద్దతు ఇస్తుందని బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. తెలంగాణలో ప్రభుత్వం ఉందా? ఉందంటే, కాంగ్రెస్ ప్రభుత్వానికి సమన్వయం ఉందా అనే సందేహం ప్రజల్లో ఉందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి మాట్లాడుతూ యూరియా కొరత లేదని, సమస్య కేవలం పంపిణీలోనే ఉందని చెబుతున్నారు.కానీ పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ యూరియా కొరత ఉందని, దానికి కేంద్రమే బాధ్యత అని అబద్ధాలు ప్రచారం చేస్తున్నారు. మహేశ్ కుమార్ గౌడ్‌కి వాస్తవ పరిస్థితి తెలుసుకోవడానికి ప్రయత్నం చేయడంలేదా? లేక కేవలం కమ్యూనికేషన్‌లో లోపమేనా అని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రంలో అక్టోబర్ 31 వరకు అవసరాల మేరకు 9.3 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అందించింది, 2.8 లక్షల మెట్రిక్ టన్నులు బఫర్ స్టాక్‌లో ఉన్నాయన్నారు. ఈ విషయం రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించిందన్నారు. మరి ఎరువుల కొరత ఇంకెక్కడిది?జులైలోనే 20శాతం మేర ఎక్కువ యూరియాను రాష్ట్రానికి కేంద్రం పంపించింది. టిపిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ కేంద్రాన్ని బదనాం చేసే ప్రయత్నం చేస్తూ, అసలు లోపాన్ని బయటపెట్టడం లేదన్నారు. ఆదిలాబాద్, మహబూబ్ నగర్, వికారాబాద్‌లో ఎరువుల లారీలు పట్టు బడినట్లు, ఎరువుల దుకాణాలు మూసివేసినట్లు వార్తలు వస్తున్నాయి.ఇక్కడ బ్లాక్ మార్కెటింగ్, పంపిణీ లోపాలు ఎక్కడ జరిగాయి అనే విషయం పరిశీలించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఓఆర్ఆర్‌పై సిట్ విచారణ చేపడతామని చెప్పింది. కానీ ఇప్పటివరకు ఏ విచారణ జరగడం లేదు. ఇందులో ఏమైంది, ఎక్కడ ఎంత డబ్బు ముట్టిందనే అనుమానాలు ప్రజల్లో కలుగుతున్నాయి. గత బిఆర్ఎస్ సర్కారు కమీషన్లు తీసుకొని కాంట్రాక్టర్లకు అమ్మేసింది. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం దానిపై విచారణ చేయకుండా నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం త్వరలో రివ్యూ జరపకపోతే ప్రజల ఆగ్రహానికి భాధ్యత వహించాల్సి వస్తుంది. అవినీతికి నిదర్శనంగా ఓఆర్ఆర్ మారింది. నరేంద్ర మోడీ ప్రభుత్వం వాహనదారులపై



భారం తగ్గిస్తుంటే.. కాంగ్రెస్ సర్కారు అసమర్థతతో భారం పెరుగుతోంది. కేంద్రం జాతీయ రహదారులపై టోల్ ఛార్జీలను తగ్గించడంలో కీలక నిర్ణయం తీసుకుంది. అదే విధానాన్ని ఓఆర్ఆర్‌పై కూడా అమలు చేయాలని డిమాండ్ చేశారు.

MN 12 VJA_06-09pg10.qxd 9/5/2025 10:58 PM Page 1



# ఆసియా కప్‌లో.. భారత్‌దే ఆధిపత్యం

## టైటిల్ అందించిన కెప్టెన్లు


సునీల్ గవాస్కర్


దిలీప్ వెంగసర్కర్


అజారుద్దీన్


ఎంఎస్ ధోనీ



రోహిత్ శర్మ

**న్యూఢిల్లీ:** ఆసియా కప్ ప్రారంభమైనప్పటి నుంచి భారత జట్టుదే ఎక్కువ ఆధిపత్యం. ఇప్పటివరకు జరిగిన 16 ఎడిషన్లలో భారత్ అత్యధికంగా 8 సార్లు టైటిల్ గెలుచుకుంది. ప్రతి టైమ్ లైన్‌లో ప్రతి కెప్టెన్ తనదైన శైలితో జట్టుని గెలిపించడం భారత క్రికెట్ చరిత్రలో ఒక ప్రత్యేక అధ్యాయం. అలా ఆసియా కప్‌లో ఇప్పటివరకు భారత్‌కు 5 కెప్టెన్లు టైటిల్ అందించారు. 1984లో జరిగిన తొలి ఆసియా కప్‌లో భారత్‌కు సునీల్ గావస్కర్ నాయకత్వం వహించాడు. అప్పట్లో కేవలం మూడు జట్లే భారత్, పాకిస్థాన్, శ్రీలంక పాల్గొన్నాయి. గావస్కర్ కెప్టెన్సీలో భారత్ పాకిస్థాన్‌పై 54 పరుగుల తేడాతో టైటిల్‌ను కైవసం చేసుకుంది. మొదటి కెప్టెన్‌గా ఆసియా కప్ ట్రోఫీని లిఫ్ట్ చేసిన గర్వకారణం ఆయనకే దక్కింది. అలాగే 1988 ఆసియా కప్‌లో భారత్ రెండోసారి విజేతగా నిలిచింది.

ఈసారి దిలీప్ వెంగసర్కర్ కెప్టెన్సీ వహించారు. శ్రీలంక, పాకిస్థాన్‌వంటి జట్లతో పోటీపడుతూ జట్టుని సమర్థవంతంగా నడిపించాడు. ఇక 1990/91, 1995లో భారత్ 2 సార్లు ఆసియా కప్ గెలుచుకుంది. ఈ రెండు విజయాలకు కెప్టెన్‌గా అజారుద్దీన్ ఉన్నారు. ప్రత్యేకంగా 1995లో జరిగిన ఫైనల్లో ఆయన 90 పరుగులు నాటౌట్‌గా చేసి జట్టుని విజేతగా నిలిపారు. భారత క్రికెట్‌లో మోస్ట్ సక్సెస్ ఫుల్ కెప్టెన్లలో ధోనీ ఒకడు. 2010లో శ్రీలంకపై భారత్ విజయం సాధించి ఆసియా కప్ ట్రోఫీని గెలుచుకుంది. ఆ తర్వాత 2016లో జరిగిన ఫైనల్లో బంగ్లాదేశ్‌పై గెలిచి మరోసారి టైటిల్‌ను కైవసం చేసుకుంది. ఈసారి మ్యాచ్ టి20 ఫార్మాట్‌లో జరిగింది. అందుకే ధోనీ ఒడిఐ, టి20 రెండు ఫార్మాట్లలో ఆసియా కప్ గెలిపించిన ఏకైక భారతకెప్టెన్‌గా చరిత్రలో నిలిచాడు. కాగా 2018లో బంగ్లాదేశ్‌పై ఉత్కంఠ భరితమైనఫైనల్లో భారత్‌గెలిచి టైటిల్ సాధించింది. ఆ సమయంలో కెప్టెన్‌గా రోహిత్ శర్మ జట్టుని ముందుండినడిపాడు. 2023లో శ్రీలంకపై ఫైనల్లో విజయం సాధించినప్పుడు మాత్రం పూర్తి అధికారిక కెప్టెన్‌గా ట్రోఫీ లిఫ్ట్ చేశారు. ఆ ఫైనల్లో భారత్ అద్భుత ప్రదర్శనతో శ్రీలంకని కేవలం 50 పరుగులకే ఆలౌట్ చేసింది. ఈ స్వల్పలక్ష్యాన్ని టీమ్ ఇండియా 6.1ఓవర్లలో లక్ష్యాన్ని ఛేధించింది. ఇది ఆసియా కప్ చరిత్రలోనే ఒక రికార్డు విజయంగా నిలిచింది.



# మహిళల హాకీ ఆసియా కప్.. భారత్ చేతిలో థాయిలాండ్ చిత్తు

**న్యూఢిల్లీ:** మహిళల హాకీ ఆసియా కప్-2025, ప్రారంభ మ్యాచ్‌లో భారత మహిళలు థాయిలాండ్‌పై ఆధిపత్యం సంపాదించారు. చైనాలో శుక్రవారం జరిగిన ఈ తొలి మ్యాచ్‌లో భారత్ థాయిలాండ్‌ను 11-0 తేడాతో ఓడించింది. బ్యూటీ డంగ్ డంగ్, ఉదిత చెరో రెండు గోల్స్ చేశారు. పూల్ బి మ్యాచ్‌లో భారత్ తరఫున ముంతాజ్ ఖాన్ (7 నిముషం, 49 నిముషం), ఉదిత (30, 52), బ్యూటీ డంగ్ డంగ్ (45, 54) రెండేసి గోల్స్ చేయగా, సంగీతా కుమారి (10), నవనీత్ కౌర్ (16వ నిముషం), లాల్‌రెమ్సియామి (18), షర్మిలా దేవి (57)తో పాటు డిదాసో (57) స్కోర్ చేశారు. తొలి క్వార్టర్‌లో ముంతాజ్ ఖాన్ (7), సంగీతా కుమారి (10) చేసిన 2 ఫీల్డ్ గోల్స్‌తో భారత్ ఆరంభంలోనే తమ ఆధిపత్యాన్ని చాటుకుంది. 2వ క్వార్టర్‌లో భారత్ తన దాడి తీవ్రతను మరింత పెంచుకుని మరో 3 గోల్స్‌తో తమ ప్రయోజనాన్ని విస్తరించుకుంది. అనుభవజ్ఞులైన ఫార్వర్డ్ నవనీత్ కౌర్ (16) మరియు మిడ్‌ఫీల్డర్ లాల్రెమ్సియామి (18) వరుసగా 2 ఫీల్డ్ గోల్స్ చేశారు. ఆ తర్వాత ఉదిత (30) పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మార్చి మొదటి అర్ధభాగాన్ని బలంగా ముగించారు. రెండవ అర్ధభాగం కూడా ఇదే ధోరణిని అనుసరించింది. భారత్ థాయిలాండ్ సర్కిల్‌లో నిరంతరం దాడులకు పాల్పడి మూడవ క్వార్టర్‌లో 4 పెనాల్టీ కార్నర్‌లను గెలుచుకుంది. దీని ద్వారా బ్యూటీ డంగ్ డంగ్ (45) 45వ నిమిషంలో తన మొదటి గోల్ చేసింది. మ్యాచ్ చివరి క్వార్టర్‌లో భారత్ వరుసగా 5 గోల్స్ చేసి తొలి మ్యాచ్‌లో భారీ విజయాన్ని నమోదుచేసింది. ముంతాజ్ ఖాన్ (49), ఉదిత (52), షర్మిలా దేవి (57) పెనాల్టీ కార్నర్‌ల ద్వారా గోల్స్ చేయగా, బ్యూటీ డంగ్ డంగ్ (54) మరియు రుతుజా దాదాసో పిసల్ (60) తమ జట్టు తరపున ఫీల్డ్ గోల్స్‌చేశారు. భారత్ తదుపరి మ్యాచ్‌లో ఈ నెల 6, శనివారం జపాన్‌తో తలపడుతుంది.

# పసికూనపై పాక్ ప్రతాపం.. యుఎఇపై 31 పరుగుల తేడాతో గెలుపు



**న్యూఢిల్లీ:** ముక్కోణపు టీ20 సిరీస్‌లో పాకిస్థాన్ ఫైనల్‌కు చేరింది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యుఎఇ)తో షార్జా వేదికగా జరిగిన మ్యాచ్‌లో పాకిస్థాన్ 31 పరుగుల తేడాతో గెలుపొందింది. దీంతో ఈ ట్రై సిరీస్‌లో పాక్‌కు ఇది మూడో విజయం. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ ఎంచుకున్న పాకిస్థాన్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లు నష్టానికి 171 పరుగులు చేసింది. ఓపెనర్లు షాహిబ్‌జాదా ఫర్హాన్ (16), నయిమ్ ఆయుబ్ (11) విఫలం కాగా, వన్‌డౌన్ బ్యాటర్ జమాన్ అద్భుత అర్ధ శతకంతో ఇన్నింగ్స్ చక్కదిద్దాడు. ఈ ఎడమచేతి వాటం బ్యాటర్ 44 బంతులు ఎదుర్కొని 10 ఫోర్లు, 2 సిక్సర్ల సాయంతో 77 పరుగులతో ఆఖరి వరకూ అజేయంగా నిలిచాడు. ఫఖర్ జమాన్‌కు తోడుగా మహ్మద్ నవాజ్ (27 బంతుల్లో 37 నాటౌట్) వేగంగా ఆడాడు. దీంతో పాక్ మెరుగైన స్కోరు సాధించగలిగింది. యుఏఈ బౌలర్లలో హైదర్ అలీ 2 వికెట్లు తీయగా, జునైద్ సిద్దిఖీ, మహ్మద్ రోషిద్ ఖాన్, ధ్రువ్ పరాశర్ ఒక్కో వికెట్ దక్కించుకున్నారు. ఇక పాక్ విధించిన 171 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో యూఏఈకి ఆదిలోనే దెబ్బ తగిలింది. కెప్టెన్, ఓపెనర్ మహ్మద్ వసీం (19)ను అబ్రార్ అహ్మద్ స్వల్ప స్కోరుకే పెవిలియన్‌కు పంపించాడు. అయితే మరో ఓపెనర్ అలిశాన్ షరాఫూ మాత్రం హాఫ్ సెంచరీతో రాణించాడు. 51 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్సర్ల సాయంతో 68 పరుగులు సాధించాడు. కానీ పాక్ బౌలర్ల విజృంభణతో మిగిలిన బ్యాటర్లంతా పెవిలియన్‌కు క్యూ కట్టడంతో షరాఫూ అర్ధ శతకం వృధా అయింది. ఎథాన్ డిసౌజా (9), ఆసిఫ్ ఖాన్ (7), రాహుల్ చోప్రా (0), హర్షిత్ కౌశిక్ (3), జునైద్ సిద్ధిఖీ ఇలా వచ్చి అలా వెళ్లగా ధ్రువ్ పరాశర్ (18 నాటౌట్), హైదర్ అలీ (12 రనౌట్) డబుల్ డిజిట్ స్కోరు చేయగలిగారు. ఈ క్రమంలో నిర్ణీత 20 ఓవర్ల ఆట పూర్తయ్యేసరికి యూఏఈ 7 వికెట్లు నష్టానికి 140 పరుగులు చేయగలిగింది.



# యుఎస్ ఓపెన్ సెమీఫైనల్ మహిళల సింగిల్స్.. ఫైనల్‌కు సబలెంకా

## పెగులా సంచలన ఓటమి

**న్యూఢిల్లీ:** ఉత్కంఠభరితమైన మూడు సెట్ల సెమీఫైనల్లో టాప్ సీడ్, డిఫెండింగ్ ఓపెన్ ఛాంపియన్ అరినా సబలెంకా 4-6, 6-3, 6-4 తేడాతో నాల్గవ సీడ్ జెస్సికా పెగులాను ఓడించి ఫైనల్‌కు చేరుకుంది. ఆర్థర్ ఆషే స్టేడియంలో శుక్రవారం జరిగిన టోర్నీలో సబలెంకాకు ఇది వరుసగా ఐదవ యుఎస్ ఓపెన్ సెమీఫైనల్. ఇది సబలెంకాకు ఏడవ గ్రాండ్ స్లామ్ ఫైనల్ అవుతుంది. పెగులా ప్రారంభంలోనే పూర్తి ప్రయోజనాన్ని పొందింది. ప్రారంభ సెట్‌ను ఆడి సబలెంకాను సమతుల్యత నుండి దూరంగా ఉంచింది. ఆమె తనను తాను మూడు అనవసర తప్పిదాలకు మాత్రమే పరిమితం చేసుకుంది. ఆస్ట్రేలియన్ ఓపెన్ మరియు రోలాండ్ గారోస్ ఫైనల్స్, అలాగే వింబుల్డన్ సెమీస్ రెండింటిలోనూ విఫలమైన 27 ఏళ్ల సబలెంకా, రెండవ సెట్‌లో మళ్ళీ మొదటి స్థానంలో నిలిచింది, ఈసారి ప్రారంభంలో 3-0 ఆధిక్యం కోసం పటిష్టం చేసింది, మూడో సెట్‌ను 30-40తో ప్రారంభించడంలో సహాయపడుతూ, పెగులా ఫోర్‌హ్యాండ్‌ను బేస్‌లైన్ దాటి పంపింది. ముఖ్యంగా తొమ్మిది నిమిషాల పాటు కొనసాగిన ఆరో గేమ్‌లో అమెరికన్ సబలెంకా సర్వీస్‌పై ఒత్తిడి తెస్తూనే ఉంటుంది. కానీ 30 ఏళ్ల పెనుగులా ఏడు బ్రేక్ అవకాశాలలో రెండింటిని మాత్రమే గోల్‌గా మార్చగలిగింది. మ్యాచ్ కోసం 5-4, 40-30తో సర్వ్ చేస్తూ, సబలెంకా నెట్‌లోకి కొట్టి పెగులా మరో మ్యాచ్ పాయింట్‌ను సేవ్ చేయగలిగింది. కానీ మూడవదాన్ని సేవ్ చేయలేకపోయింది, రెండు గంటల ఐదు నిమిషాల్లో పడిపోయింది.

# యుఎస్ ఓపెన్‌లో యుకీ భాంబ్రీ జోడీ ఓటమి



**న్యూఢిల్లీ:** ఓటమితో యుకీ భాంబ్రీ జోడీ యుఎస్ ఓపెన్-2025 టోర్నీ కలల పరుగు ముగిసింది. యుఎస్ ఓపెన్ పురుషుల డబుల్స్ సెమీఫైనల్లో భారత్‌కు చెందిన యుకీ భాంబ్రీ-న్యూజిలాండ్‌కు చెందిన మైఖేల్ వీనస్ జోడీ బ్రిటిష్ ద్వయం జో సాలిస్‌బరీ-నీల్ స్కుప్స్కి చేతిలో ఓడిపోయారు. బ్రిటిష్ ద్వయంతో జరిగిన ఉత్కంఠభరితమైన సెమీఫైనల్లో 7-6(72), 6-7(58), 4-6 తేడాతో భాంబ్రీ-వీనస్ జంట ఓడిపోయారు. లూయిస్ ఆర్మ్‌స్ట్రాంగ్ స్టేడియంలో శుక్రవారం జరిగిన ఈ పోటీ, కనీసం మొదటి సెట్ టైబ్రేక్ ప్రారంభమయ్యే వరకు హోరాహోరీగా సాగింది. ఆ తర్వాత, భాంబ్రి-వీనస్ 7-6(2)తో మొదటి ఫ్రేమ్‌ను కైవసం చేసుకోవడానికి కేవలం 2 పాయింట్లు మాత్రమే వదులుకున్నారు. రెండవ సెట్‌లో, భాంబ్రి-వీనస్ మొదటి గేమ్‌లో తమ ప్రత్యర్థుల సర్వీస్‌ను బ్రేక్ చేయడం ద్వారా నియంత్రణ సాధించారు. భాంబ్రి-వీనస్ కూడా సర్వీస్‌ను వదులుకునే వరకు, ఆటలో ఎదురుదెబ్బ తప్పదని అనిపించింది. ఆ తర్వాత మరికొన్ని గట్టి, ఉత్కంఠభరితమైన ఆటలు జరిగాయి, ఫలితంగా మరో టైబ్రేక్ వచ్చింది. ఈసారి, టైబ్రేక్ మరియు సెట్ 7-6 (5)తో బ్రిటిష్ వారికి దక్కింది. మూడవ సెట్‌లో, సాలిస్‌బరీ-స్కుప్స్కి అకస్మాత్తుగా ఆధిపత్యం చెలాయించారు. ముఖ్యంగా నెట్ వద్ద. 5-3తో ఆధిక్యంలో, బ్రిటిష్ 3 మ్యాచ్ పాయింట్లను సంపాదించారు. వాటిలో మూడింటినీ వారు వృధా చేశారు. కానీ సాలిస్‌బరీ-స్కుప్స్కి 6-4తో నిర్ణయాత్మక సెట్‌ను గెలుచుకున్నారు.

# రూ.855కోట్లకు ఛార్టర్డ్ స్పీడ్ ఐపిఒ

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 5:** ఛార్టర్డ్ స్పీడ్ సంస్థ రూ.855 కోట్ల ఐపిఒకోసం సెబీవద్ద డిఆర్‌హెచ్‌పి దాఖలుచేసింది. ఈక్విటీద్వారా 655 కోట్లు, ఆఫర్‌ఫర్‌సేల్ ద్వారా 200 కోట్లు సమీకరించేందుకు నిర్ణయించింది.ప్రమోటర్లు పంకజ్ గాంధీ, అల్కా పంకజ్ గాంధీలకు ఉన్న వాటాలను ఆఫర్‌ఫర్‌సేల్‌ద్వారా విక్రయిస్తారు. ఈ నిధుల్లో రూ.97 కోట్లు విద్యుత్ బస్సుల్లో పెట్టుబడులుపెడుతుంది. మరో 396.4 కోట్లు రుణాలచెల్లింపులకు వినియోగిస్తుంది. ఇతర మొత్తాన్ని సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగిస్తామని తెలిపింది. కంపెనీ ప్రిఐపిఒ ప్లేస్‌మెంట్‌కింద రూ.131కోట్లకు నిధులు సమీకరించాలనినిర్ణయించింది. అహ్మదాబాద్‌కేంద్రంగా ఉన్న ఛార్టర్డ్ స్పీడ్ 2007నుంచి అమలులో ఉంది. 2018లో పబ్లిక్ లిమిటెడ్ కంపెనీగా కన్వర్ట్ అయింది.

భారత్‌లోని ప్యాసింజర్ రవాణా సంస్థల్లో ఒక లీడింగ్ సంస్థగా కొనసాగుతోంది. ఈ యేడాది జూన్‌నాటికి కంపెనీ రెండువేల బస్సులను 500 నగరాల్లో నడిపింది. 3.5 లక్షలమంది ప్రయాణీకులను ప్రతినిత్యం తమ బస్సుల్లో చేరవేస్తున్నట్లు తెలిపింది. గుజరాత్, ఒడిశా,మధ్యప్రదేశ్; రాజస్థాన్,అ స్సాం రాష్ట్రాల్లో అంతర్‌రాష్ట్ర సర్వీసులు కూడా నడుపుతోంది. ఆపరేషన్స్‌తో రాబడులు 666.7 కోట్లు ఉండగా 2023లో 332 కోట్లు వచ్చాయి. తొలిత్రైమాసికంలో నికరలాభం 70 కోట్లుగా కంపెనీ ప్రకటించింది. మొత్తం




945 విద్యుత్ బస్సులు అనుబంధ సంస్థలద్వారా నడుపుతోంది. ఇష్యూకు మోతీలాల్ ఓస్వాల్ ఇన్వెస్ట్‌మెంట్ సలహాదారులుగాను, ఎస్‌బిఐ కేపిటల్ మార్కెట్లు బుక్‌రన్నింగ్ లీడ్‌మేనేజర్లుగా ఉన్నారు.

# సెన్సెక్స్,నిఫ్టీలకు ఎఫ్ఎంసిజి, ఐటి రంగాల షాక్!



**ముంబయి, సెప్టెంబరు 6:** ఎఫ్ఎంసిజి, ఐటి రంగాల్లో ట్రేడర్లు లాభాల స్వీకరణకు మొగ్గుచూపించడంతో మార్కెట్లు లాభనష్టాల్లో ఊగిసలాడాయి. జిఎస్‌టి 2.0 వచ్చినా లాభాలు ఒక్కరోజుకే పరిమితం అయ్యాయి. నిఫ్టీ 24,621.60 పాయింట్లవద్దనే నిలిచిపోయింది. ఇక బిఎస్‌సి సెన్సెక్స్ 7.25 పాయింట్లు క్షీణించి 80,710.76 పాయింట్లవద్ద ట్రేడింగ్ నిలిపివస్తే నిఫ్టీ 50 సూచీ కేవలం 6.70 పాయింట్లు మాత్రమే లాభపడింది. ఐటిసి 2.01శాతం, టిసిఎస్ 1.53శాతం, ఇన్ఫోసిస్ 1.29శాతం చొప్పున అమ్మకాలు సాగడంతో క్షీణించాయి. ఇక బిఎస్‌ఇ మిడ్‌క్యాప్‌సూచీ 0.10శాతం క్షీణిస్తే స్మాల్‌క్యాప్‌సూచీ 0.09శాతం పెరిగాయి. మార్కెట్లపరంగా 2134 కంపెనీల షేర్లు పెరిగితే 1957 కంపెనీలషేర్లు క్షీణించాయి. 181 షేర్లు స్థిరంగా కొనసాగాయి. భారత్‌పదేళ్ల బెంచ్‌మార్క్ బాండ్లు 0.46శాతం క్షీణించి 6.461శాతానికి చేరింది. విదేశీ కరెన్సీ మార్కెట్‌పరంగా రూపాయి మారకం విలువలు క్షీణించాయి. 88.25 వద్ద కొనసాగి చివరకు 88.12 వద్ద ముగిసింది.ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్లు అక్టోబరు 3వ తేదీనాటికి 0.33శాతం పెరిగి 106,770వద్ద ముగిసాయి. అమెరికా బాండ్లుకూడా 0.48శాతం క్షీణించి 4.156 కూపన్‌రేట్‌తో నడిచాయి. ఇక ప్రపంచ మార్కెట్లపరంగా యూరోపియన్ మార్కెట్లు శుక్రవారం భారీగానే ముగిసాయి. అమెరికా జాబ్ రిపోర్టుపై ఇన్వెస్టర్లు ఎదురుచూసారు. అలాగే రానునన ఫెడ్‌రిజర్వు వడ్డీరేట్లకోతలపైనా ఆసక్తిచూపించారు. జపాన్ నిక్కీ సేర్లు ఒత్తిడికి లోనయ్యాయి. అమెరికా ట్యారిఫ్‌లే ఇందుకు కారణం. ఇక స్టాక్స్‌పరంగా ఓలా ఎలక్ట్రిక్ 7.25శాతం, ప్రోస్టార్మ్ ఇన్ఫోసిస్టమ్స్ 9.79శాతం, ట్రాన్స్‌వరల్డ్ షిప్పింగ్‌లైన్స్ 8.15శాతం చొప్పున పెరిగాయి. అలాగే పిఎన్‌సి ఇన్‌ఫ్రాటెక్ 2.35శాతం, ఇండోటెక్ ట్రాన్స్‌షార్మర్స్ 2.35శాతం, పెరిగితే జైడస్ లైఫ్‌సైన్సెస్ 0.21శాతం క్షీణించాయి.

# స్పైస్‌జెట్‌కు రూ.238 కోట్ల నష్టం




**ముంబయి, సెప్టెంబరు 5:** ప్రైవేటురంగంలోని స్పైస్‌జెట్ జూన్‌త్రైమాసికంలో రూ.238 కోట్ల నష్టం చవిచూసింది. ఇదే కాలంలో గత ఏడాది 150 కోట్ల లాభాలను చవిచూసిన సంస్థ ఈ సారిమాత్రం నష్టాలు నమోదుచేసింది. ట్రావెల్ డిమాండ్ మందగించడం, కొన్ని రూట్లలో మరింతగా సర్వీసులు నిలిపి వేయడంకూడా ఇందుకు కారణం అయింది. దీనికితోడు ఆపరేషన్ సింధూర్‌తో రూట్లు అన్ని నిలిచిపోయాయి. దీనితో ఆపరేషన్‌కూడా సంస్థ నష్టాలకు కొంత కారణం అయింది. అలాగే పాక్‌గగనతలం మూసివేయడం కూడా ఒక కారణంగా చెపుతున్నారు. కొన్ని విమాన సర్వీసులు సర్వీసుకు గ్రౌండ్ అవడం, కొన్నింటికి లీజు వివాదాలు, ఆర్థిక ఒత్తిళ్లు కూడా పనితీరుపై ప్రభావంచూపించాయి. ఆపరేషన్స్ ద్వారా రాబడులు 35శాతంతగ్గాయి. 1695 కోట్ల నుంచి 1106 కోట్లకు పడిపోయాయి. ఇబిఐడిటిఎ కూడా 402 కోట్లనుంచి 18 కోట్లకు పడిపోయింది. సంస్థ ఛైర్మన్ అజయ్‌సింగ్ మాట్లాడుతూ అనుకోని తీవ్రస్థాయి సవాళ్లు రావడంతో సంస్థకు కొంతమేర రికవరీ కష్టం అయిందని, రానున్న కాలంలో అన్నింటినీ అధిగమిస్తామని వెల్లడించారు. జూన్‌త్రైమాసికంలో సంస్థ సంపద మొత్తం 446 కోట్లుపెరిగింది. గత ఏడాది 2398 కోట్ల లోటునుంచి ఈసారి కొంతమేర సంపదను పెంచుకోగలిగింది.

జీఎస్టీ హేతుబద్ధీకరణతో

వాణిజ్యం

# ప్రభుత్వ రాబడుల లోటు తక్కువే!


## ఎస్‌బిఐ రీసెర్చి నివేదిక వెల్లడి

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 5:** దేశంలో వస్తు, సేవల పన్ను (జిఎస్టీ) విధానంలో చేపట్టిన సంస్కరణల వల్ల ప్రభుత్వ ఖజానాపై పడే భారం చాలా స్వల్పమేనని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) తన తాజా పరిశోధన నివేదికలో వెల్లడించింది. జిఎస్టీ మండలి తీసుకున్న రేట్ల హేతుబద్ధీకరణ నిర్ణయం వల్ల ప్రభుత్వానికి ఏటా కేవలం రూ. 3,700 కోట్ల మేరకు ఆదాయం తగ్గుతుందని అంచనా వేసింది. ఈ మొత్తం చాలా తక్కువ కావడంతో ద్రవ్య లోటుపై ఎలాంటి ప్రభావం ఉండబోదని స్పష్టం చేసింది. 56వ జిఎస్టీ మండలి సమావేశంలో జిఎస్టీ శ్లాబులు ఇకపై రెండే ఉంటాయని చెప్పిన సంగతి తెలిసిందే. వాటిని ఈనెల 22వ తేదీనుంచే అమలుకు తెస్తామని కూడా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. ఇప్పటివరకు ఉన్న 5%, 12%,18%, 28%అనే నాలుగు అంచెల పన్ను విధానాన్ని రద్దు చేశారు. దీని స్థానంలో 5%, 18% అనే రెండు శ్లాబులతో పాటు కొన్ని ఎంపిక చేసిన వస్తు, సేవలపై 40%డీమెరిట్ రేటును ప్రవేశపెట్టారు. ఈ మార్పుల వల్ల ప్రభుత్వానికి ఏటా రూ. 48,000 కోట్ల నష్టం వస్తుందని ప్రభుత్వం అంచనా వేయగా, ఎస్బీఐ అంచనా దీనికి పూర్తి భిన్నంగా ఉండటం గమనార్హం. ఈ సంస్కరణల వల్ల వినియోగం పెరిగి ఆర్థిక వృద్ధికి దోహదపడుతుందని నివేదిక పేర్కొంది. ముఖ్యంగా, సామాన్యులకు ఇది ఎంతో ఊరటనిచ్చే అంశమని తెలిపింది. దాదాపు 295 నిత్యావసర వస్తువులపై పన్ను రేటును 12%నుంచి 5% లేదా సున్నా శాతానికి తగ్గించడంతో రిటైల్ ద్రవ్యోల్బణం గణనీయంగా తగ్గుతుందని అంచనా వేసింది. దీనివల్ల ఈ ఆర్థిక సంవత్సరంలో వినియోగదారుల ధరల సూచీ (సిపిఐ) ద్రవ్యోల్బణం 25 నుంచి 30 బేసిస్ పాయింట్ల వరకు తగ్గే అవకాశం ఉందని తెలిపింది. 2026-27 నాటికి ద్రవ్యోల్బణం మొత్తం మీద 65 నుంచి 75 బేసిస్ పాయింట్ల మేర తగ్గుముఖం పడుతుందని వివరించింది. ఈ సంస్కరణల ఫలితంగా జీఎస్టీ సగటు భారిత రేటు కూడా గణనీయంగా తగ్గనుంది. 2017లో జీఎస్టీని ప్రవేశపెట్టినప్పుడు 14.4%గా ఉన్న ఈ రేటు, తాజా మార్పులతో 9.5 శాతానికి దిగి వస్తుందని ఎస్బీఐ నివేదిక పేర్కొంది. అంతేకాకుండా, వ్యయాలు తగ్గడం వల్ల బ్యాంకింగ్ రంగానికి కూడా ఈ సంస్కరణలు సానుకూల ఫలితాలనిస్తాయని అభిప్రాయపడింది.




# భారత్‌లో తొలి టెస్లాకారు కొనుగోలుచేసిన మహారాష్ట్ర మంత్రి

**ముంబయి, సెప్టెంబరు 5:** ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌కు చెందిన లగ్జరీ ఎలక్ట్రిక్ కార్ల తయారీ దిగ్గజం టెస్లా అధికారికంగా భారత విపణిలోకి అడుగుపెట్టిన విషయం తెలిసిందే. ఈ ఏడాది జులై 15న ఆర్థిక రాజధాని ముంబైలో తొలి షోరూంను ప్రారంభించింది. ఆ తర్వాత ఢిల్లీలో రెండో షోరూంను కూడా లాంఛ్ చేసింది. భారత విపణిలోకి అడుగుపెట్టిన తర్వాత టెస్లా తాజాగా తన తొలి కారును కస్టమర్‌కు డెలివరీ చేసింది. తెలుపు రంగు టెస్లా 'వై మోడల్' కారును మహారాష్ట్ర రవాణా శాఖ మంత్రి ప్రతాప్ సర్‌నాయక్ కొనుగోలు చేశారు. ముంబై బాంద్రా కుర్లా కాంప్లెక్స్‌లోని టెస్లా ఎక్స్‌పీరియన్స్ సెంటర్ నుంచి తొలి కారును ఇవాళ మంత్రికి సంస్థ ప్రతినిధులు డెలివరీ చేశారు. కారు తాళాలను అందజేశారు. ఈ సందర్భంగా దేశంలోనే తొలి టెస్లా కారును కొనుగోలు చేయడం పట్ల మంత్రి ప్రతాప్ సర్‌నాయక్ సంతోషం వ్యక్తం చేశారు. విద్యుత్ వాహనాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలనే ఉద్దేశంతోనే తాను ఈ కారును కొనుగోలు చేసినట్లు మంత్రి వెల్లడించారు ప్రస్తుతం ఎలక్ట్రిక్ కార్లలో అత్యధిక అమ్మకాలతో రికార్డు నెలకొల్పిన 'వై' మోడల్ కార్లను భారత వినియోగదారులకు అందుబాటులోకి తెచ్చింది టెస్లా. రియర్‌వీల్ డ్రైవ్, లాంగ్‌రేంజ్ వేరియంట్ కార్లను అమ్మకానికి ఉంచింది. ఇక ధర విషయానికొస్తే రియర్‌వీల్ డ్రైవ్ (ఆర్‌డబ్ల్యూడీ) వేరియంట్ ధర రూ. 59.89 లక్షలు, లాంగ్‌రేంజ్ ఆర్‌డబ్ల్యూడీ వేరియంట్ ధరను రూ. 67.89 లక్షలుగా నిర్ణయించింది. వీటి 'ఆన్ రోడ్' ధరల్ని పరిశీలిస్తే ఆర్‌డబ్ల్యుడి వెర్షన్ ఆన్‌రోడ్ ధర రూ. 61.07 లక్షలుకాగా, లాంగ్‌రేంజ్ వెర్షన్ ఆన్‌రోడ్ ధర రూ. 69.15 లక్షలుగా ఉంది. టెస్లా అధికారిక వెబ్‌సైట్ ప్రకారం, ఇందులో 18 శాతం జిఎస్టీతో సహా రూ. 50,000 అడ్మినిస్ట్రేషన్, సర్వీస్ ఫీజు కూడా ఉంటుంది. అయితే, భారత్‌లో సగటు ఎలక్ట్రిక్ కారు ధర రూ.22 లక్షలు ఉంది. టెస్లా మోడల్ వై ధర దాదాపు రూ.60 లక్షల వరకు ఉంది. మరోవైపు ఎన్నో అంచనాలతో భారత మార్కెట్‌లోకి అడుగుపెట్టిన ఈ సంస్థకు నిరాశే ఎదురైంది. ఆశించిన స్థాయిలో బుకింగ్స్ జరగలేదని సమాచారం. జులై నుంచి ఇప్పటి వరకూ మొత్తం 600 బుకింగ్స్ మాత్రమే వచ్చాయి. కంపెనీ అంచనాల కంటే ఇవి చాలా తక్కువ. ఎందుకంటే టెస్లా ప్రపంచ వ్యాప్తంగా కేవలం నాలుగు గంటల్లోనే ఈ సంఖ్య కార్లను విక్రయిస్తుంది. దీంతో భారత్‌లో టెస్లాకు అనుకున్నంత స్పందన రాలేదని కంపెనీకి చెందిన కీలక వ్యక్తులను ఊటంకిస్తూ ఆంగ్లమీడియా వెల్లడించింది. టెస్లాకు బ్రాండ్ పేరు ఉన్నప్పటికీ ఎక్కువ ధర కారణంగా భారత్ ఈవీ మార్కెట్‌లో పెద్దగా ప్రభావం చూపలేకపోతోందన్నది మార్కెట్ టాక్.




Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No. 64861/96 , Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14